# శ్రీబృందావన మహిమామృతము

## ప్రథమ భాగము





శ్రీ రాధాదేవి



శ్రీ ప్రబోధానంద సరస్వతీపాదులు



శ్రీ రాధికా ప్రసాద్ మహారాజ్

# శ్రీబృందావన మహిమామృతము

ప్రథమ భాగము

మూలము

**శ్రీప్రబోధానంద సరస్వతీపాదులు**

అనువాదము

**రసమణి**

ప్రకాశకులు

**శ్రీరాధా మహలక్ష్మి ఆశ్రమం**

శ్రీ బృందావన ధామం, మధురజిల్లా

ఉత్తరప్రదేశ్

సర్వస్వామ్య సంకలితము

ప్రథమ ముద్రణ **జులై, 2020**

ప్రతులు : 100

**వెల : అమూల్యము**

ప్రతులకు

**1) శ్రీరాధాకృష్ణ మందిరము**
5/5 అరండల్‌పేట,
గుంటూరు – 522 002
ఫోన్ : 0863–2233933

**2) శ్రీరాధా మహాలక్ష్మి ఆశ్రమ్**
బడేకుంజ్, గోపేశ్వర్ ఆలయ వీధి,
బృందావన్ (**U.P.**) – 281 121
ఫోన్ : 0565–2442583

ముద్రణ : **సుదర్శన్ ప్రింటర్స్,** 17/2, అరండల్‌పేట, గుంటూరు.
ఫోన్ : 2246245

డి.టి.పి. : **శ్రీవల్లి గ్రాఫిక్స్,** గుంటూరు. సెల్ : 9966043946.

శ్రీరాధే

# విషయ సూచిక


| | | |
|---|---|---|
| | అమ్మమాట | v |
| | ముందుమాట | vii |
| 1. | మొదటి శతకము | 1 – 38 |
| 2. | రెండవ శతకము | 39 – 75 |
| 3. | మూడవ శతకము | 76 – 118 |
| 4. | నాల్గవ శతకము | 119 – 160 |
| 5. | ఐదవ శతకము | 161 – 197 |



శ్రీరాధే

# అమ్మమాట

**5.5.2020,**

**గుంటూరు ఆశ్రమం.**

పరమపూజ్యులైన నాన్నగారి దివ్యప్రేమ ఆశీస్సులతో వారు మనకు అందించిన రాధాకృష్ణప్రేమరసము, బృందావన రసము, బృందావన మహిమామృత రసము, అమ్మ సఖియల యొక్క సేవారసము! బృందావన రసిక మహాత్ములు అనుభవం పొందిన ఆ దివ్యమాధుర్య రసమును గురుదేవులైన నాన్నగారు అందించారు. మన పూర్వజన్మ సుకృతం వలన అది లభించింది. దానిని సాధనా రూపంలో, చింతనా రూపంలో, సేవా రూపంలో భావపరంగా చేసుకోవటం మన ధర్మం!

శ్రీబృందావన మహిమామృత గ్రంథము అత్యున్నతమైనది! శ్రీప్రబోధానంద సరస్వతీపాదులవారు తాము అద్వైతమైనా తమ గురుదేవులైన శ్రీచైతన్యప్రభువుల కృపవలన రాధాకృష్ణ రసానుభూతి, బృందావన మహిమానుభూతి, సఖియల సేవానుభూతి ఆయన పొంది; ఆ రసాన్నంతటినీ ఈ బృందావన మహిమామృతంలో నింపివేశారు. దివ్యమైన బృందావనము మూడు భావాలతో కూడి ఉన్నది. నిమిత్తముగా చేసికొన్న భౌమ్య బృందావనము – అక్కడ నివసిస్తూ, అక్కడ సంచరిస్తూ, అక్కడ ధ్యాన చింతన చేస్తూ; మనోబృందావనము యొక్క అనుభవం పొంది, ఆపై భావ బృందావనములోని మధురతమమైన రాధాకృష్ణుల దివ్యప్రేమ రసానుభూతిని ఆయన పొందారు.

భగవంతుడు నిరాకార స్వరూపం అయినా భక్తుని ప్రేమరస విరహమును తాను సహింపలేక, ఆ భగవద్విరహ దుఃఖము యొక్క రసానుకూలమును, ఆ మధురమైన భావరసలీలను భక్తునికి అనుభవం ఇస్తాడు. బృందావనములోని దివ్యవృక్షాలు, నదులు, తటాకములు, పక్షులు, జడమైన వస్తువులన్నింటిలోనూ దానిని ఆయన ప్రకాశింపజేశారు. అలాంటి దివ్యమైన బృందావన మహిమను స్వామి ప్రబోధానంద సరస్వతి ఎంత అనుభవ పూర్వకముగా వర్ణించి చెప్పినా ఆయనకు తృప్తి తీరటం లేదు. ఆ రాధాగోవిందుల మధుర రస అనుభూతి అలాంటిది! ఎలాంటి క్రూరకర్మ చేసిన జీవుడికి కూడా ఆధామంలో నివసించాలని చిన్న కోరిక ఉన్నా చాలు కనికరిస్తుందిట! బృందావనం అలాంటి దివ్యధామం! ఆ ధామ మహిమను వర్ణించటానికి శక్యంకాదు. అదే మన గురుదేవులు 'శ్రీశ్యామసుందరుల శ్రీచరణ కమలములు సంచరించు దివ్యబృందావన మహిమ ఆది శేషునికైన వర్ణింపతరమా' అని వ్రాశారు.

గురుకృప వలన రసమణి తన శాయశక్తుల కృషి చేసి, శరీర పరిస్థితి కూడ లెక్కచేయక, అమ్మ అనుగ్రహముతో ఈ పవిత్రమైన మహాగ్రంథాన్ని అనువదించి మొదటి భాగం మనందరికీ అందజేయటం జరిగింది. గురువు, అమ్మ రసమణికి దివ్యవిశేషకృపను కలిగించాలని ప్రార్థిస్తున్నాను.

**శ్రీరాధాసఖీచరణ కమల రేణువు**

రాపాక మహాలక్ష్మీదేవి

శ్రీరాధే

# ముందుమాట

"వృందాటవీ న హి కవీశ్వర కావ్యకోటి
సంభావ్యమానగుణరత్నగణచ్ఛటైకా
ఏతామపార రసఖానిమశేషఖాని సంరుధ్యమిత్ర
మతిమధ్య వసీయ యాహి" - 1-35

శ్రేష్ఠులైన కవీశ్వరులు కోటికోటి కావ్యరచనల ద్వారా కూడ శ్రీబృందావన గుణరత్నమణులలోని ఒక్క కాంతిరేఖనైన వర్ణింపజాలరు. మిత్రమా! సమస్త ఇంద్రియవృత్తులను నిరోధించి, అపారరసనిధియైన బృందావనానికి స్థిరచిత్తముతోవెళ్లు!

శ్రీబృందావన మహిమను, గరిమను తనివితీర ఆస్వాదిస్తూ శ్రీప్రబోధానంద సరస్వతీ పాదులు "శ్రీబృందావన మహిమామృతము" అనే శతక గ్రంథంలో శ్రీబృందావన సర్వోపరిస్థానాన్ని, మహోన్నత మాధుర్యాన్ని అందించారు. అద్వైత సన్యాసియైన ఆ మహనీయుడు చైతన్యమహాప్రభు కృపచేత శ్రీరాధాకృష్ణుల ప్రేమరసాన్ని, బృందావన మాధుర్యాన్ని తనివితీర గ్రోలుతూ నూరుశతకాలలో ఆ ధారను ప్రవహింపజేశారు. గురుకృపకు సాధ్యం కానిది ఏముంటుంది ? 'ప్రకాశానంద' అనే ఆ అద్వైత సన్యాసికి శ్రీచైతన్యప్రభువు 'ప్రబోధానంద సరస్వతి' అనే దీక్షానామం ఇచ్చి అనుగ్రహించారు.

'శ్రీబృందావనం అచింత్య మహిమ కలది. అచట సమ్మార్జనం చేత ముక్తి కూడ దూరంగా నెట్టివేయబడుతుంది. ఆ ధామాన్ని సేవింపగోరిన అష్టసిద్ధులు వినయంగా ప్రార్థించటానికి కూడ భయభీతం ఔతాయి.

ఆ నామాన్ని విన్నంత మాత్రం చేత మాయ దూరం అవటమో, నాశనమైపోవటమో జరుగుతుంది. అట్టి మహిమకల శ్రీబృందావనాన్ని దేహాన్ని త్యజించు వరకు ఆశ్రయించు' (3-44) అంటూ శ్రీసరస్వతీపాదులు బృందావన మహిమను చాటుతూ, సందేశం ఇచ్చారు.

**"బృందావనమహిమ వర్ణింప తరమా**
**అదిశేషునికైన కీర్తింపవశమా**
**శ్రీశ్యామసుందరుల శ్రీచరణ పద్మములు**
**నిత్యసంచారము చేయుచునున్న । దివ్య!"**

శ్రీశ్యామా శ్యాములు నిత్యసంచారం చేస్తున్న దివ్య బృందావన మహిమ వర్ణనాతీతమని శ్రీరాధికాప్రసాద్ మహరాజ్ చాటి చెప్పారు. వేయి నాల్కలు ఉన్న ఆదిశేషునికి కూడ శ్రీధామ మహిమను కీర్తించటం సాధ్యం కాదట! అట్టి బృందావనానికి అధీశ్వరి - బృందావనేశ్వరి శ్రీరాధ! ఆ శ్రీరాధకు అంతరంగ ఏకాంత సఖి శ్రీరాధికా ప్రసాదులు. ఆ రసికాచార్యుడిని రసయోగిగ, రసిక శిరోమణిగ, రాధాసఖిగ గుర్తించి గౌరవించింది శ్రీబృందావనం! ఈ విధంగా బృందావనానికి, బృందావనేశ్వరికి, రాధాసఖికి అవినాభావ సంబంధం ఏర్పడటం ప్రకటితం అయింది.

అంతటి శ్రీరాధికాప్రసాదులను రసగురుదేవులుగ పొందిన అదృష్టయోగం చేత 'బృందావనం, బృందావనం' అని పలుకగల భాగ్యం లభించింది. శ్రీగురుదేవుల అనుగ్రహం వలన శ్రీరాధాజీని గూర్చి, ఆ తల్లికి రెండవ రూపమైన బృందావనాన్ని గూర్చి మహాత్ములు వ్రాసిన గ్రంథాలు చదివే అవకాశం వచ్చింది. శ్రీరాధికాప్రసాదులు "బృందావనేశ్వరి శ్రీరాధాదేవి" అనే పేరుతో అష్టదళ పద్మముగ ఎనిమిది భాగాల గ్రంథాన్ని

రచిస్తున్న సమయంలో వారి శ్రీచరణ సన్నిధిలో ఉండి ఆస్వాదించే మహద్భాగ్యం కలిగింది. ఆయా కారణాల వలననే శ్రీగురు ప్రసాదంగా లభించిన ప్రస్తుత గ్రంథ పరిచయం జీవితాన్ని ధన్యం చేసింది.

“బృందావనం పరిత్యజ్య పాదమేకం న గచ్ఛతి” అను శ్రీకృష్ణుని వాగ్దానం సత్యమని అనుక్షణం బృందావనంలో ఋజువు ఔతున్నది. అన్నిటికన్నను గొప్ప విషయం నేటికీ అక్కడ ప్రకటితం ఔతున్న శ్రీరాధాకృష్ణుల ప్రత్యక్ష లీలలు! జీవుని పరమావధి మోక్షం కాదు, గోలోకం కూడ కాదు. అతని పరమావధి రాధాజీ స్వామినిగా ఉండు నిత్యరాసలో చేరటమే! శ్రీబృందావనాన్ని నిత్యనివాసంగా చేసుకొని, శ్రీరాధాభావధ్యానయోగాన్ని అనుష్ఠించటమే అందుకు సాధన!

అట్టి దివ్యబృందావన మహిమను శ్రీప్రబోధానంద సరస్వతీపాదులు “బృందావన మహిమామృతము” అనే పేరుతో నూరు శతకముల గ్రంథంగా భక్తజనులకు అందించారు. కాలాంతరంలో ఎన్నో శతకాలు లుప్తమైపోగా, 17 శతకాలు మాత్రమే లభించాయి. అదే ఒక గొప్ప నిధి! ఆ నిధిని మన గురుదేవుల దయతో అనువదించుకొని, అందరమూ బృందావన మహిమామృతాన్ని ఆస్వాదించాలని ఆకాంక్ష! శ్రీయుగళ లీలలకు అనుకూలంగా సంకోచ, వ్యాకోచాలను పొందుతూ; రసార్ద్రమైన శ్రీలీలలన్నిటికీ వేదికయైన శ్రీబృందావనం శ్రీప్రబోధానందులకు అనేకానేక రూపాలుగా దర్శనం ఇచ్చింది. పులకితులైన ఆ మహాత్ముడు అనేకానేక విధాలుగా శ్రీధామాన్ని వర్ణించారు, స్తుతించారు. గ్రంథంలో అక్కడక్కడ ఛందోభంగం జరగటం కన్పిస్తున్నది. కాలగమనంలో శతకాలకు శతకాలే లుప్తమైపోగా, లభించిన వానిలో కూడ అక్షరాలు కొన్ని నశించిపోయి ఉండవచ్చు. పరిష్కర్తలు గ్రంథాన్ని యథాతథంగా అందించి ఉండవచ్చు.

శ్రీహితాచార్యులు, శ్రీహరిదాస్‌జీ మహరాజ్ మున్నగు రసికాచార్యుల వలెనే శ్రీసరస్వతీపాదులు కూడ శ్రీబృందావనాన్ని, శ్రీయుగళాన్ని మహాజ్యోతి స్వరూపంగా దర్శించారు. 'చిరకాల పర్యంతం ఉపనిషద్వాక్యాల తాత్పర్యాన్ని వివేచించినా అణుమాత్రపు మాధుర్యం కూడా లభించదు. కాని బృందావనంలో నివసించినంతమాత్రం చేత ఆ మాధుర్యసాగరాన్ని ఆస్వాదించగలము' (1-22); 'శ్రీబృందావనవాసుల చరణ రజాన్ని సర్వాంగాలకు పూసుకొని, ఉజ్వలతమమైన బృందావనమే సర్వోపరి అని గ్రహించి, శ్రీబృందావన మాధుర్యంలో మునుగు' (2-27) వంటి మహావాక్యాల ద్వారా శ్రీప్రబోధానందులు శ్రీబృందావన మహిమ వేదాతీతమని చాటి చెప్పారు.

సంస్కృత శ్లోకములలో సందేహ నివృత్తికి శ్రీమతి స్వరాజ్యలక్ష్మి సహకరించారు. ఆమెపై నిరంతరం గురుకృప వర్షించాలని కోరుకుంటున్నాను.

మనకు లభించిన "శ్రీబృందావన మహిమామృతము" అనే సంస్కృత గ్రంథంలో 17 శతకాలు ఉన్నాయి. అందులో మొదటి అయిదు శతకాలలోని శ్లోకాలు, వాటికి తెలుగు అనువాదం మొదటి భాగంగా వెలువడుతున్నది. శ్రీనాన్నగారు, శ్రీఅంజనీ అమ్మ ఆశీస్సుల వల్లనే ఇది సాధ్యపడింది. శ్రీగురు కృపతో మిగిలిన భాగాలు కూడా త్వరలోనే రావాలని ఆశిస్తున్నాను.

**"భావతీవ్రత మించి పోవగ పల్కుపల్కున రాధయై**
**రావలీసుకుమారిరావె వరాల తల్లివి రాగదే**
**నీవులేకమనంగజాలనె నీదు ధ్యానమె ధ్యేయమన్**
**భావుకున్ రసయోగధీవరు భావరంజితు గొల్తునే"**

**సదా శ్రీరాధాసఖీ చరణకమల సన్నిధిలో**

**రసమణి**

# మొదటి శతకము

శ్రీరాధామురలీమనోహర పదాంభోజం సదా భావయన్
శ్రీచైతన్యమహాప్రభోః పదరజః స్వాత్మానమేవార్పయన్
శ్రీమద్భాగవతోత్తమాన్ గుణనిధీనత్యాదరాదానమన్
శ్రీవృందావన దివ్యవైభవమహం స్తోతుం ముదా ప్రారభే 1

శ్రీరాధా మాధవుల చరణారవిందములను సదా స్మరిస్తూ, శ్రీకృష్ణచైతన్య ప్రభు చరణరజమునకు ఆత్మ సమర్పణము చేసికొని, కల్యాణగుణనిధులైన భక్తవరుల చరణసన్నిధికి పునఃపునః ఆదర పూర్వకంగా నమస్కరిస్తూ, శ్రీబృందావన దివ్యవైభవాన్ని ఆనంద పూర్వకంగా స్తుతింపనారంభిస్తున్నాను.

ఈశోఽపి యస్య మహిమామృతవారిరాశేః
పారం ప్రయాతుమనలం బత తత్ర కేఽన్యే
కింత్వల్పమప్యహమతి ప్రణయాద్విగాహ్య
స్యాం ధన్యధన్య ఇతి మే సముపక్రమోఽయమ్ 2

శ్రీబృందావన మహిమామృతం అనే సముద్రం యొక్క పారాన్ని తెలిసికొనటానికి స్వయంగా ఈశ్వరుడు కూడా సమర్థుడు కాడు. ఇక ఈ పనిని చేయటానికి ఎవరు సాహసించగలరు ? ఐనప్పటికీ నేను అత్యంత ప్రీతి పూర్వకంగా ఈ సముద్రంలో కించిన్మాత్రంగా అవగాహనం చేసినా (మునిగినా) ధన్యాతి ధన్యుడిని ఔతాను కదా! ఈ కారణం చేతనే ఇట్టి ప్రయత్నం చేస్తున్నాను.

శ్రీమద్బృందాటవి! మమ హృది స్ఫోరయాత్మ స్వరూపమ్
అత్యాశ్చర్యం ప్రకృతి పరమానంద విద్యారహస్యమ్
పూర్ణబ్రహ్మామృతమపి హ్రియా వాఽభిధాతుం న నేతి
బ్రూయుర్యత్రోపనిషద ఇహాత్రత్య వార్తా కుతస్స్యాత్ 3

హే శ్రీమద్బృందావనమా! అత్యాశ్చర్యజనకము, స్వాభావికము, పరమానంద విద్యారహస్యయుక్తమునైన నీ స్వరూపాన్ని నా హృదయంలో స్ఫురింపజేయుము. పూర్ణబ్రహ్మామృతాన్ని వర్ణించటానికే సాధ్యం కాక సిగ్గిలి ఉపనిషత్తు 'నేతి, నేతి' అంటూ ఉంటుంది. ఇక శ్రీబృందావనమహిమను ఏమని వర్ణించగలదు!

**రాధాకృష్ణ విలాసపూర్ణ సుచమత్కారం మహామాధురీ**
**సారస్ఫార చమత్కృతిం హరి రసోత్కర్షస్య కాష్ఠాం పరమ్**
**దివ్యం స్వాద్యరసైక రమ్య సుభగాశేషం న శేషాదిభిః**
**సేశైర్గమ్య గుణౌఘ పారమనిశం సంస్తౌమి వృందావనమ్ 4**

శ్రీబృందావనం శ్రీరాధాకృష్ణుల విలాససౌభాగ్యం చేత చమత్కార పూర్ణమై ఉంటుంది. మహామాధుర్యసారం అవటం వలన ఆధామం అత్యంత విస్మయకరమై ఉంటుంది. శ్రీహరి యొక్క శృంగార రస పరాకాష్ఠను ప్రతిపాదించునదియై; అప్రాకృతము, ఆస్వాదనీయమునైన ఉజ్వలరస సౌభాగ్య ఆధిక్యం చేత శ్రీధామం గౌరవింపబడుతూ ఉంటుంది. ఈశ్వరుడు మొదలుకొని శేషాది దేవతాగణ పర్యంతం గుణరాశియైన బృందావనాన్ని వర్ణించటంలో పారమునెరుగరు. అట్టి శ్రీబృందావనమును నిరంతరము స్తుతించుచున్నాను.

**ప్రేమౌత్క్యేన విచింత్యతాం విలుఠనైః సర్వాంగమాయోజ్యతామ్**
**దేహస్యాస్య సమర్పణేన సుదృఢప్రేమా సమాస్థీయతామ్**
**రాధాజా నిరుపాస్యతాం స్థిర చరప్రాణీహ సంతోష్యతామ్**
**శ్రీవృందావనమేవ సర్వపరమం సర్వాత్మనా శ్రీయతామ్ 5**

ప్రేమోత్కంఠతతో (బృందావనమును) చింతన చేస్తూ, ఆ నేలపై ఉండుటకు సర్వాంగాలను నియోగిస్తూ, ఈ భౌతిక దేహాన్ని సమర్పించుటకు సుదృఢప్రేమతో ఉండి, శ్రీరాధాకృష్ణులను ఉపాసిస్తూ, బృందావనంలోని స్థావర జంగమ

ప్రాణులనన్నిటిని సంతృప్తిపరుస్తూ జీవించు. ఈ ప్రకారంగా సర్వశ్రేష్ఠమైన శ్రీబృందావనాన్ని త్రికరణ శుద్ధిగా ఆశ్రయించు.

**వేదాంతాః ప్రతిపాదయంతి ముఖతో నోచేత్తతః కిం మమ**
**మన్యంతే న చ శాస్త్రగర్తపతితా దుస్తర్కిణః కిం తతః**
**నోచేత్ భాగవతానుభూతిపదవీం యాతస్తతః కిం మమ**
**స్వాత్మా వజ్రసహస్రవిద్ధి ఇవ న స్పందేత్ వృందావనాత్ 6**

శ్రీబృందావన మహిమను వేదవేదాంగాలు ప్రతిపాదించినా, ప్రతిపాదించకపోయినా నాకేమిటి ? శాస్త్రాలు అనే గుంటలలోపడి కుతర్కం చేసేవారు బృందావనాన్ని గౌరవించకపోయినా నాకు కలిగే హాని ఏమున్నది ? ఈ శ్రీధామ మాహాత్మ్యం భగవత్ భక్తులకు అనుభవగోచరం కాకపోతే మాత్రం నాకేమిటి ? కాని నా శరీరం సహస్ర వజ్రాలతో ఛేదింపబడినా కూడ శ్రీబృందావనం నుండి కించిన్మాత్రమైనా ఆవలకు వెళ్లను.

**ప్రోదంచత్పిక పంచమం ప్రవిలసద్వంశీసుసంగీతకమ్**
**శాఖాఖండ శిఖండి తాండవకలం ప్రోల్లాసి వల్లీద్రుమమ్**
**భ్రాజన్మంజు నికుంజకమ్ ఖగకులైశ్చిత్రం విచిత్రం మృగై**
**ర్నానాదివ్యసరః సరిత్ గిరివరం ధ్యాయామి వృందావనమ్ 7**

శ్రీధామంలో కోకిలలు ఉదాత్తమైన పంచమ స్వరంలో కూజితం చేస్తున్నాయి. మోహనమైన వంశీగానంతో పాటు సుమధుర సంగీతం శ్రుతిగోచరం ఔతున్నది. వృక్షశాఖలపై మయూరాలు చేస్తున్న తాండవ నృత్యంతోపాటు అస్ఫుటమధురధ్వని వినవస్తున్నది. లతలు, వృక్షాలు ఉల్లాసంతో కానవస్తున్నాయి. మంజులమైన కుంజ, నికుంజలతో ప్రకృతి అంతా శోభిస్తున్నది. నానావిధాలైన పక్షిసమూహాలు, పశువులు విహరిస్తున్నాయి. అనేకములైన సరస్సులు, నదులు పర్వతాకీర్ణములై ప్రవహిస్తున్నాయి. అట్టి శ్రీబృందావన ధామమును ధ్యానిస్తున్నాను.

**స్థూలం సూక్ష్మం కారణం బ్రహ్మతుర్యం**
**శ్రీవైకుంఠ ద్వారకా జన్మభూమిః**
**కృష్ణస్యాథో గోష్ఠవృందావనం తత్**
**గోప్యాక్రీడం ధామ వృందావనాంతః 8**

స్థూలం, సూక్ష్మం, కారణం, బ్రహ్మతుర్యం, వైకుంఠం, ద్వారక, జన్మస్థలియైన మధుర, శ్రీకృష్ణుని గోచారణ స్థలియైన శ్రీబృందావనం, ఇంకా బృందావనాంతర్గతమై గోపికలతో క్రీడించిన క్రీడాభూమి!

అనగా అవి అన్నీ ఉత్తరోత్తర (ఒకదానికంటె మరొకటి) శ్రేష్ఠములని భావము!

**అత్యాశ్చర్యా సర్వతోస్మాత్ విచిత్రా శ్రీమద్రాధా కుంజవాటీ చకాస్తి**
**ఆద్యోభావో యో విశుద్ధోఽతి పూర్ణస్తద్రూపా సా తాదృశోన్మాది సర్వా 9**

అత్యంత ఆశ్చర్యజనకము, పరిదృశ్యమాన జగత్తునకు అతీతమునైన రాధాజీయొక్క సుందర కుంజవాటి శోభించుచున్నది. అచటి ఆద్యాభావము (శృంగార రసము) విశుద్ధము, పూర్ణతమము! రాధాజీ యొక్క కుంజవాటి కూడ ఆ స్వరూపమే! అంతేకాదు, అచటి సమస్త ఉపకరణములును ఆ భావము వలె రసోన్మాదమును కలిగించగలవు.

**తత్రైవావిర్భావ యద్రూప శోభా వైదగ్ధ్యాఽనురాగాద్భుతౌఘౌ**
**నిత్యాభంగ ప్రోన్మదానంగ రంగౌ రాధాకృష్ణౌ ఖేలతః స్వాలిజుష్టౌ 10**

అచట రూపశోభలోను, విదగ్ధతతోను ఒప్పుచు, అద్భుతమైన పరస్పరానురాగసాగరులై; నిత్యము, అభంగము, ఉన్మాదకారియైన అనంగకేళిని ఆవిర్భవింపజేస్తున్న శ్రీరాధాకృష్ణులు తమ సఖియలతో కలసి లీలను ప్రకటిస్తున్నారు.

**అత్యుత్కృష్టే సకలవిధయా శ్రీల వృందావనేఽస్మిన్**

**దోషాన్ దృష్ట్వాన్నిజ హతదృశా వాస్తవాన్ యే వదంతి**

**తాదృక్ మూఢా హరిహరి! మమ ప్రాణబాధేఽప్యదృశ్యాః**

**సంభావ్యా వా కథమపి నహి ప్రాయ సర్వస్య హాస్యాః 11**

అన్ని విధాలుగా సర్వోత్కృష్టమైన ఈ బృందావనంలో దురదృష్టవశాత్తు గమనించిన దోషాలను లోకులు సత్యంగా భావించి అభివర్ణిస్తూ ఉంటారు. ఓహో! అటువంటి మూర్ఖులను నా ప్రాణసంకట స్థితిలో కూడ చూడను. ఏదో ఒక సందర్భంలో వారు అందరి ముందు పరిహాసాస్పదులు కాకపోవుదురా!

**బ్రహ్మానందమవాప్య తీవ్రతపసా సమ్యక్ ప్రసాద్యేశ్వరమ్**

**గోరూపాః సకలా ఇహోపనిషదః కృష్ణే రమంతే వ్రజే**

**వృందారణ్యతృణం తు దివ్యరసదం నిత్యం చరంత్యోఽనిశమ్**

**రాధాకృష్ణ పదాంబుజోత్తమ రసాస్వాదేన పూర్ణాః స్థితాః 12**

ఉపనిషత్సమూహం బ్రహ్మానందాన్ని పొంది కూడా, తీవ్రమైన తపస్సు ద్వారా భగవంతుని సమ్యక్ స్వరూపాన్ని ఆరాధించింది. శ్రీకృష్ణుని భూమియైన వ్రజంలో ధేనురూపాన్ని ధరించి ఆనందాన్ని పొందింది. ఆ వేదాలు దివ్యరసదానకారియైన బృందావన తృణభక్షణం చేస్తూ, రాత్రింబవళ్లు శ్రీరాధాకృష్ణుల చరణకమల రసాస్వాదనం చేయటం వలన పరిపూర్ణమైన తృప్తిని పొందాయి.

**శ్రీవృందావనవాసిని స్థిరచరే దోషాన్ మమ శ్రావయేత్**

**యోఽసౌ కిం శతధా ఛినత్తి న హి మాం శస్త్రైరథాస్త్రైః శితైః**

**సర్వాధీశితురేవ జీవనవనే యో ద్వేషమాత్రం చరేత్**

**ఏకస్యాపి తృణస్య ఘోరనరకాత్తం కః కదా వోద్ధరేత్ 13**

శ్రీబృందావనవాసియైన స్థావర జంగమాలలో ఏ ఒక్కదానియందైనా దోషం ఉన్నట్లు నా చెవిని పడితే ఎందుకు ఇంకా నా శరీరం శస్త్రాస్త్రాలతో శతథాతూట్లు పడటంలేదు ? (అనగా అట్టి మాట వినటం శరీరం తూట్లుపడినంత బాధను కలిగిస్తున్నది అని భావం). సర్వాధీశ్వర, ప్రాణసమాన, ప్రియబృందావనంలోని ఒక్క తృణం పట్ల ద్వేషాచరణం చేసినా, అట్టి వానిని ఘోరనరకం నుండి ఎవరైనా ఉద్ధరిస్తారా!

**శ్రీవృందారణ్య శోభామృతలహరి సమాలోకతో విహ్వాలా మే**
**దృష్టిర్వోభోతు వృందావనమహిమ సుధావారిధౌ మజ్జతాత్ధీః**
**శ్రీవృందారణ్య భూమౌ లుఠతు మమ తనుర్విహ్వాలానందపూరైః**
**శ్రీవృందారణ్య సత్వేష్వహహ తత ఇతో దండవన్ మే నతిఃస్తాత్ 14**

శ్రీబృందావన శోభామృత తరంగాలను చూస్తూ, చూస్తూ నా దృష్టి విహ్వాలం ఔతున్నది. శ్రీబృందావన మహిమ అనెడు అమృతసాగరంలో నా బుద్ధి మునుకలు వేస్తున్నది. సాంద్రానంద ప్రవాహంలో తేలియాడుతూ నా శరీరం బృందావన భూమిపై వాలిపోతున్నది. ఆహా! బృందావనంలో నివసిస్తున్న సమస్త జీవుల చరణాలకు దండవత్ ప్రణామం చేస్తున్నాను.

**యత్ర క్రీడంతి కృష్ణప్రియసఖి సుబలాద్యద్భుతాభీరబాలా**
**మోదంతే యత్ర రాధా రతిమయ లలితాద్యుజ్వల శ్రీకిశోర్యః**
**ఆశ్చర్యానంగరంగైరహహా! నిశి దివా ఖేలనాసక్త రాధా**
**కృష్ణా రత్యేకతృష్ణౌ మమ సముదయతాం శ్రీలవృందావనం తత్ 15**

అచట శ్రీకృష్ణుని ప్రియ సఖాగణమైన సుబలాది అద్భుత గోపబాలకులు క్రీడిస్తున్నారు. శ్రీరాధవంటి ప్రీతిమూర్తులైన, ఉజ్వల రసవిశిష్టలైన లలితాది కిశోరీ బృందములు ఆనందిస్తున్నారు. రాత్రింబవళ్లు ఆశ్చర్యకరమైన అనంగక్రీడ

యందలి రతియే ఏకమాత్ర తృష్ణగా కలిగిన శ్రీరాధాకృష్ణులు ఈ బృందావనాన్ని నా హృదయంలో ప్రకాశింపజేతురుగాక!

**స్వచ్ఛం స్వచ్ఛందమేవాస్త్యతి మధుర రసాన్నిర్ఝరాదంబు పాతుమ్**
**భోక్తుం స్వాదూని కామం సకలతరుతలే శీర్ణపర్ణాణి సంతి**
**కామం నిఃశీతవాతం విమల గిరిగుహాద్యస్తి నిర్భాతి వస్తుమ్**
**శ్రీవృందారణ్యమేతత్తదపి యది జిహాసామి హాహా హతోఽస్మి 16**

స్వచ్ఛందంగా (ఇష్టంగా) త్రాగటానికి జలప్రవాహముల స్వచ్ఛము, అతి మధుర రసవిశిష్టమునైన జలములు ఉన్నాయి. యథేచ్ఛగా భుజించటానికి అన్ని వృక్షాల క్రింద రాలిన ఆకులు ఉన్నాయి. ఇష్టానుసారంగా ఉండటానికి చలి నుండి కాపాడే వెచ్చనిగుహలు ఉన్నాయి. అట్టి శ్రీబృందావనం అన్ని విధాలుగా నివసింపయోగ్యమైన ప్రదేశం! హా! అట్లయ్యు దీనిని త్యజిస్తే నాకన్నను అత్యంత దురదృష్టవంతుడు ఉంటాడా!

**మహాప్రేమాంభోధేర్యదనుపమ సారం యదమలమ్**
**హరి ప్రేమాంభోధేర్మధుర మధురం ద్వీపవలయమ్**
**మునీంద్రాణాం వృందైః కలిత రస వృందావనమహో**
**తదేతద్దేహాంతావధి సమధివాసం దిశతు మే 17**

శ్రీబృందావనం మహాప్రేమసాగరమునకు అనుపమానమైన, విమలమైన సారవస్తువు! అది శ్రీహరి యొక్క ప్రేమ సింధువునకు మధురమైన ద్వీప వలయము వంటిది. శ్రేష్ఠులైన మునిజనులు ఆస్వాదిస్తున్న రసమునకు ఆధారస్వరూపం! ఆ బృందావనం మృత్యుపర్యంతము నాకు నివసించుటకు తగిన విధముగా ఆశ్రయమిచ్చునుగాక!

**వాపీకూప తటాక కోటిభిరహో దివ్యామృతాభిర్యుతమ్**
**దివ్యోద్యత్ఫల పుష్పవాటిక మనంతాశ్చర్య వల్లీద్రుమమ్**
**దివ్యానంతపతన్ మృగం వనభువాం శోభాభిరత్యద్భుతమ్**
**దివ్యానేక నికుంజమంజులతరం ధ్యాయామి వృందావనమ్ 18**

దివ్యజలములతో నిండియున్న కోటికోటి సరోవరములు, బావులు, చెరువులతో కూడియున్నదియు; దివ్యఫలపుష్పవాటికలతో శోభించుచున్నదియు; అనంతములైన చమత్కారములతోడి వృక్షలతలతో నిండియున్నదియు; ఇటునటు పరుగులు తీయుచున్న దివ్యపశువులను కలిగియున్నదియు; వనభూముల విచిత్రశోభతో ప్రకాశించుచున్నదియు; అగణితములైన దివ్యమనోహర నికుంజములతో శోభించుచున్నదియునైన శ్రీబృందావనమును ధ్యానించుచున్నాను.

**శ్రీరాధికా మదనమోహన కేళికుంజ**
**పుంజైర్వృతం ద్రుమలతాఘన రత్నభూమి**
**ఆనందమత్తమృగ పక్షికులాకులం**
**శ్రీవృందావనం హరతి కస్య హఠాన్నచేతః 19**

శ్రీరాధామోహనుల కేళికుంజలతో చుట్టివేయబడిన ద్రుమలతలతోడి రత్నభూమియు, ఆనందంతో మత్తిల్లిన పశుపక్ష్యాదులతో ఆకులమైనదియునైన ఈ బృందావనం ఎవరి హృదయాన్ని బలీయంగా హరించదు ? (అనగా ఆశోభ ఎవరి హృదయాన్ని అయినా హరిస్తుంది అని భావము).

**కస్యాపి దివ్యరతి మన్మథ కోటి రూప**
**ధామద్వయస్య కనకాసిత రత్నభాసః**
**అత్యద్భుతైర్మదనకేళి విలాస వృందైః**
**వృందావనం మధురిమాంబుధిమగ్నమీక్షే 20**

కోటికోటి రతీమన్మథుల కాంతిరూపమును పోలిన శ్రీయుగళము యొక్క అనిర్వచనీయమైన స్వర్ణనీలజ్యోతితో ప్రకాశిస్తూ, అద్భుతమైన రసకేళీవిలాస మాధుర్య సాగరములో నిమగ్నమైయుండు బృందావనాన్ని దర్శింపవలెనని కోరుకుంటున్నాను.

**గాఢాసక్తిమతామపీహ విషయేష్వత్యంత నిర్వేదతో**
**దృక్పాతేఽప్య సహిష్ణుతాతి శయినాం యోగే సముద్యోగినామ్**
**బ్రహ్మానంద రసైకలీన మనసాం గోవింద పాదాంబుజ**
**ద్వంద్వావిష్టధియాం చ మోహనమిదం వృందావనం స్వైర్గుణైః 21**

ఈ జగత్తులో విషయాసక్తులైనవారి మనసులను, విషయాదులపై దృష్టిని ప్రసరించటం కూడా సహించలేని పరమవైరాగ్యపూర్ణులైన వారి మనసులను, యోగమార్గంలో వర్తించువారి మనసులను, కేవలం బ్రహ్మానందరసంలో మగ్నులైన వారి మనసులను, ఇంకను శ్రీగోవిందుని చరణారవిందములపైననే ఆకర్షితులై యుండు భక్తజనుల మనసులను కూడ శ్రీబృందావనం తన గుణమణులతో మోహితం చేస్తూ ఉంటుంది.

**చిరాదుపనిషత్ గిరామతి విచార్య తాత్పర్యకమ్**
**న లబ్ధుమిహ శక్యతే యమను మాధురీమప్యహో**
**తమప్యనుభవేన్మహా రసనిధిం యదావాసత**
**స్తదేవ పరమం మమ స్ఫురతు ధామ వృందావనమ్ 22**

ఓహో! చిరకాల పర్యంతం ఉపనిషద్వాక్యాల తాత్పర్యాన్ని ఆలోచించినా (చర్చించినా) అణు మాత్రపు మాధుర్యం కూడా లభించదు. కాని బృందావనంలో నివసించినంత మాత్రం చేత ఆ మాధుర్యసాగరాన్ని ఆస్వాదించగలము. అట్టి సర్వోత్కృష్టమైన శ్రీబృందావనం నా మనసులో స్ఫురించునుగాక!

**సోఢ్వా పాదప్రహారానపి చ శతశతం ధిక్కృతీనాంచ కోటీః**
**క్షుత్తృట్ శీతాది బాధాశతమపి సతతం ధైర్యమాలంబ్య సోఢ్వా**
**ముంచన్ శోకాశ్రుధారామతికరుణగిరా రాధికా కృష్ణనామా**
**న్యుద్గాయన్ కర్హి వృందావనమతివికలోఽ కించనః సంచరామి 23**

శతాధిక పాదప్రహారాలను (తన్నులు తినటం), కోటికోటి ధిక్కారాలను కూడ సహిస్తూ; ధైర్యంగా ఆకలి, తృష్ణ, శీతోష్ణాదికము వలన ఎదురయ్యే వందలాది విఘ్నబాధలను భరిస్తూ; శోకాశ్రుధారలతో శ్రీరాధాకృష్ణుల నామావళిని అత్యంత దీనంగా ఉచ్చైస్వరంతో ఎప్పుడు గానం చేస్తాను ? అత్యంత వ్యాకులమైన మనసుతో ఉన్నప్పటికీ చెదరక ఎప్పుడు శ్రీబృందావనంలో సంచరిస్తాను ?

(అనగా ఎన్ని అవమానాలు, బాధలు, విఘ్నాలు ఎదురైనా సహిస్తూ; శ్రీరాధాకృష్ణుల నామాన్ని ప్రేమపూర్వకంగా స్మరిస్తూ బృందావనంలోనే జీవించాలి అని అర్థం).

**అద్య శ్వో వా యాస్యతీదం కుదేహం సర్వేభోగా యాంతి తత్ర స్థితేఽపి**
**తస్మాత్ సౌఖ్యాభాస ఉచ్చైర్విభాతి నిత్యానందే నంద వృందావనాంతః 24**

నేడో, రేపో ఈ కుత్సితశరీరం రాలిపోతుంది. ఒకవేళ శరీరం ఉన్నప్పటికీ అనతికాలంలోనే సమస్తభోగాలు సమాప్తం ఔతాయి. కనుక ప్రాకృతిక వస్తువులయందు సుఖం యొక్క ఆభాస (సుఖం ఉన్నట్లు కన్పించటం) మాత్రమే ఉన్నదని స్పష్టం ఔతున్నది. అందువలన నిత్యానందదాయినియైన శ్రీబృందావనంలోనే ఆనందం పొందండి!

**కిం నో భూపైః కిం ను దేవాదిభిర్వా స్వాప్నైశ్వర్యోత్ఫుల్లితైః కించ ముక్తైః**
**శూన్యాలంబైర్వైష్ణవైర్వాపి కిం నః శ్రీమత్ వృందాకాననైకాంత భాజామ్ 25**

ఏకాంతభావంతో శ్రీబృందావనాన్ని ఆశ్రయించిన మాకు రాజులతో ఏమి ప్రయోజనం ? దేవతలతో ఏమి పని ? స్వప్నంలో కనిపించే ఐశ్వర్యంతో సమానమైన

ఐశ్వర్యాన్ని చూచి ఆనందాన్ని పొందే ముక్తజనాలతో మాకు ప్రయోజనం ఏమిటి ? వైకుంఠప్రాప్తిని లక్ష్యంగా పెట్టుకున్న వైష్ణవులతో కూడ మాకు ఏమి పని ?

అనగా రాజులు, దేవతలు, అశాశ్వతమైన ఐశ్వర్యం, ముక్త జనులు, వైకుంఠ ప్రాప్తి – ఈ అన్నిటికన్నను ఏకాంత భావంతో బృందావనాన్ని ఆశ్రయించటం సర్వశ్రేష్ఠం అని భావం!

**శం సర్వేషామప్రయాసేన దాత్రీ ద్విత్రైకాంతి ప్రేమమాత్రైక పాత్రీ**
**ఆనందాత్మాశేష సత్వా నిధాత్రీ శ్రీవృందాటవ్యస్తుమేఽంధస్యధాత్రీ 26**

అనాయాసంగా అందరికీ సుఖప్రదానం చేసేది, ఒకరిద్దరు ఏకాంత ఆంతరంగికులకు ఏకాంత ప్రేమను అనుగ్రహించేది, సమస్త జీవులకు ఆనందాన్ని ప్రసాదించేది అయిన శ్రీబృందావనం నావంటి అంధులను పాలించు ప్రేమభూమి!

**వేణుం యత్ర క్వణయతి ముదా నీపమూలావలంబీ**
**సమ్వీత శ్రీకనకవసనః శీతకాళిందితీరే**
**పశ్యన్ రాధావదనకమలం కోఽపి దివ్యః కిశోరః**
**శ్యామః కామప్రకృతిరిహ మే ప్రేమ వృందావనేఽస్తు 27**

చల్లని యమునాతీరంలో నీపవృక్షాన్ని ఆనుకొని, పీతాంబరధారియైన ఒకానొక దివ్యకిశోరుడు, శ్యామలాంగుడు, రసవిశిష్టుడు శ్రీరాధావదనకమలాన్ని దర్శిస్తూ ఆనందపూర్ణుడై వేణుగానం చేస్తూ ఉంటాడు. ఆ బృందావనమే నాకు ప్రియమైనది!

**తైస్తైః కిం నః పరమపరమానంద సామ్రాజ్యభోగైః**
**కింవా యోగైః పరమపదకృతైః కిం పరైర్వాఽభియోగైః**
**వాసేనైవ ప్రసభమఖిలానంద సారాతిసారమ్**
**వృందారణ్యే మధురమురళీ నాదమాకర్ణయిష్యే 28**

అత్యంతం పరమానందాన్ని ఇచ్చే సమస్త సామ్రాజ్య భోగాలతో మాకు ఏమి పని ? స్వర్గప్రాప్తికై చేసే యోగాదికంతో లాభం ఏమిటి ? అన్యాన్య విషయాలయందు అభినివేశం ఉండటం వలన ఫలం ఏమిటి ? ఎందుకంటె శ్రీబృందావనంలో నివసిస్తే సమస్తమైన ఆనందానికి పరమసారమైన మధుర మురళీనాదం హఠాత్తుగా చెవికి వినబడుతుంది కదా!

**శ్రీవస్త్రాభరణాదిభిః కరపదాద్యుత్కర్త దాహాదిభిః**
**నిందా సంస్తవ కోటిభిర్బహు విభూత్యత్యంత దైన్యాదిభిః**
**జీవన్నేవ మృతో యథా న వికృతిం ప్రాప్తః కథంచిత్ క్వచిత్**
**శ్రీవృందావనమాశ్రయే ప్రియమహానందైక కందం పరమ్ 29**

ఉత్తమోత్తమమైన వస్త్రభూషణాదికం లభించినా; కాలుచేతులు కోతలవలన, కాలిపోవటం వలన బాధపడుతున్నా; కోటికోటి నిందలు, ప్రశంసలు ఎదురైనా; అత్యంత సంపద, లేదా దీనత్వం ప్రాప్తించినా జీవన్మృతుని (జీవించి ఉండి కూడ మరణించినవాని) వలె ఎప్పుడు ఏ విధమైన వికారాన్ని పొందక పరమప్రియ మహానంద బీజ స్వరూపమైన శ్రీబృందావనాన్నే ఆశ్రయిస్తాను.

**దుఃఖాన్యేవ సుఖాని విద్ధ్యపయశో జానీహ కీర్తిం పరామ్**
**మన్యేథా అధమైశ్చ దుష్కృతిభవాన్ సమ్మానవత్ సత్తమైః**
**దైన్యాన్యేవ మహావిభూతిమతిసల్లాభానలాభాన్ సదా**
**పాపాన్యేవ చ పుణ్యమస్తి యది తే వృందావనం జీవనమ్ 30**

నీవు బృందావనంలో జీవిస్తున్నట్లయితే దుఃఖాలను సుఖసమూహాలుగాను, అపయశస్సును పరమకీర్తివలెను, అధమ పురుషులు చేసిన ఘోరఅవమానాన్ని కూడ సాధు పురుషులు చేసిన సన్మానంగాను, మహాదరిద్రాన్ని గొప్ప సంపదవలెను, అత్యుత్తమమైన లౌకిక లాభాలను మహానాశనంగాను, పాపసమూహాలను పుణ్యస్వరూపంగాను భావించు!

(అనగా జీవితంలో ఎటువంటి పరిస్థితులు ఎదురైనా చలింపక, బృందావనంలో జీవించగలిగిన మహాభాగ్యాన్ని ఆనందించాలి అని భావం. బృందావనవాసికి ఇట్టి లక్షణాలు ఉండాలి)!

**త్యక్త్వా సంగం దూరతః స్త్రీపిశాచ్యాః సర్వాశానాం మూలముధృత్య సమ్యక్**
**దైవాల్లబ్ధేనైవ నిర్వాహ్య దేహం శ్రీమద్బృందాకాననే జోషమాస్స్వ 31**

పిశాచం వంటి స్త్రీసంగాన్ని త్యజించి, సమస్త ఆశలను సమ్యక్ ప్రకారంగా మూలంతో సహా తొలగించి; కేవలం దైవలబ్ధమైన వస్తువుల ద్వారా దేహయాత్రను చేస్తూ శ్రీబృందావనంలో ప్రీతిపూర్వకంగా నివసించు!

**న కురు న వద కించిత్ విస్మరాశేషదృశ్యమ్**
**స్మర మిథునమహస్తత్ గౌరనీలం స్మరార్తమ్**
**బహుజన సమవాయాత్ దూరముద్విజ్య యాహి**
**ప్రియ! నివసతు దివ్య శ్రీల వృందావనాంతః 32**

నీకు కర్తవ్యంకాని, వక్తవ్యం (మాటాడతగినది) కాని ఏదీ లేదు. దృశ్యమానమైన సమస్త వస్తువులను మరచిపో! రసాతురమైన గౌరనీల (శ్యామాశ్యాముల) యుగళాన్ని స్మరించు. ఎక్కడ లౌకిక వ్యక్తులు ఉంటారో ఆ ప్రదేశం నుండి ఉద్విగ్నచిత్తుడవై వెళ్లిపో! ఓ ప్రియతమా! అప్రాకృతికమైన శ్రీబృందావనంలో జీవించు!

**కరనిహిత కపోలో నిత్యమశ్రూణి ముంచన్**
**పరిహృత జనసంగోఽరోచ్యమానానుయానః**
**ప్రతిపద బహులార్త్యా రాధికాకృష్ణ దాస్యే**
**వసతి పరమధన్యః కోఽపి వృందావనేఽస్మిన్ 33**

నిరంతరం చెక్కిట చేయిచేర్చి, కన్నీటి ధారలలో దోగుతూ, సేవకజన రహితంగా ఉండి; ప్రతిక్షణమూ వ్యాకులతతో శ్రీరాధాకృష్ణుల దాస్యరసంలో నిమగ్నమై శ్రీబృందావనంలో నివసించు వ్యక్తియే పరమధన్యుడు!

**అసులభమిహ లోకే లబ్ధుమిచ్ఛస్యయత్నాది**
**యది విపులధన స్త్రీ పుత్రగేహోత్తమాది**
**కరనిపతితముక్తిం కృష్ణభక్తించ కాంక్షస్యధివస**
**పరధామ్నై వాద్య వృందావనాఖ్యమ్ 34**

దుర్లభమైన అపారసంపద, స్త్రీ, పుత్రులు, ఉత్తమోత్తమమైన గృహాదికం ఇవన్నీ సంసారంలో అనాయాసంగా పొందగోరుతున్నావా; కరతలామలకంగా ముక్తిని, కృష్ణభక్తిని పొందాలని ఆకాంక్షిస్తున్నావా - అయితే ఇప్పుడే నీవు బృందావనం అనే పరమధామంలో నివసించు!

అంటే బృందావనం ఇవ్వలేనిదంటూ ఏదీలేదని భావం!

**వృందాటవీ న హి కవీశ్వర కావ్యకోటి**
**సంభావ్యమానగుణరత్న గణచ్ఛటైకా**
**ఏతామపార రసఖానిమశేషఖాని**
**సంరుధ్యమిత్ర మతిమధ్య వసీయ యాహి 35**

శ్రేష్ఠులైన కవీశ్వరులు కోటికోటి కావ్యరచనల ద్వారా కూడ శ్రీబృందావనం యొక్క గుణరత్నమణుల ఒక్క కాంతి రేఖనైనా వర్ణింపజాలరు. ఓ మిత్రమా! సమస్త ఇంద్రియాల వృత్తులను నిరోధించి; అపార రసనిధియైన వృందావనానికి స్థిరచిత్తంతో వెళ్లు!

**వృందాటవీ జయతి కామగవీ సురద్రు**
**చింతామణీనగణితానపి తుచ్ఛయంతీ**
**శ్రీశంకర ద్రుహిణ ముఖ్య సురేంద్రబృంద**
**దుర్జేయ దివ్యమహిమైక రజః కణేన 36**

లక్ష్మీదేవి, శంకరుడు, బ్రహ్మ మొదలైన శ్రేష్ఠ సురగణాలు ఎవరి అప్రాకృతిక మహిమను లేశమైనా తెలుసుకొనలేరో; ఎవరి రజోకణాన్ని పొందిన మాత్రం చేత అసంఖ్యాకమైన కామధేనువులు, కల్పవృక్షాలు, చింతామణులు కూడ తుచ్ఛం అనిపిస్తాయో అట్టి శ్రీబృందావనానికి జయమగునుగాక!

**వృందాటవీ యది రవీందుహుతాశా విద్యుత్కోటి**
**ప్రభావిభవకారీ మహాప్రభాఢ్యా**
**ఆత్మప్రభా సకృదపి ప్రతిభాతి చిత్తే విత్తైషణాది**
**న హి తస్య మనస్యుదేతి 37**

కోటి కోటి సూర్య, చంద్ర, అగ్ని, విద్యుత్తుల కాంతిని బృందావనం పరాజితం చేస్తుంది. మహాకాంతిమతి, స్వప్రకాశం కలది అయిన ఆ ధామం ఎవరి మనసులో ఒక్కసారైనా ప్రకాశిస్తుందో అట్టివాని మనసులో ధనం, భార్యాబిడ్డలు, ప్రతిష్ఠ మొదలైన విషయవాసనలకు స్థానం ఉండదు.

**శ్రీరాధికా మురళిమోహన కేళికుంజపుంజేన**
**మంజులతరా రససింధుదోగ్ధ్రీ**
**స్వానంద చిన్మయ మహాద్భుత సత్వబృంద**
**వృందాటవీ మమ సబీజమఘం నిహంతు 38**

శ్రీరాధా మాధవుల కేళీ కుంజలచే మంజులమై, రససాగరానికి ఉత్పత్తి స్థానమై; స్వానంద చిన్మయ, రసపూర్ణమైన ప్రాణులచే సేవింపబడుతున్న శ్రీబృందావనం వాసనలతో సహా నా పాపాలను నశింపజేయునుగాక!

**వృందాటవీ సహజవీత సమస్తదోషా**
**దోషాకరానపి గుణాకరతాం నయంతీ**
**పోషాయ మే సకలధర్మ బహిష్కృతస్య శోషాయ**
**దుస్తర మహాఘచయస్య భూయాత్ 39**

శ్రీబృందావనం జీవుల సమస్త దోషాలను సహజంగా నశింపజేస్తుంది, సమస్తదోషయుక్తులైన దుష్టజనులను కూడ గుణ భూషితులను చేస్తుంది. అట్టి బృందావనం ధర్మహీనుడనైన నన్ను స్వీకరించి, సహింపరాని నా మహాపాపాలను వినష్టం చేయునుగాక! ఇదే నా ప్రార్థన!

**వృందాటవీ బహుభవీయ సుపుణ్య పుంజా**
**న్నేత్రాతిథిర్భవతి యస్య మహా మహిమ్నః**
**తస్యేశ్వరః సకలకర్మమృషాకరోతి బ్రహ్మాదయస్తమతి**
**భక్తియుతాః స్తువంతి 40**

బహుజన్మల పుణ్యఫలంగా శ్రీబృందావనం మహాపురుషులకు దృష్టి గోచరం ఔతుంది. వారి సంచిత, ఆగామి కర్మలనన్నింటినీ భగవంతుడు నశింపజేస్తాడు. బ్రహ్మాది దేవతలు అట్టి పుణ్యపురుషులను భక్తితో స్తుతిస్తారు.

**వృందావనే సకల పావన పావనేఽస్మిన్ సర్వోత్తమోత్తమ చరస్థిర సత్వజాతే**
**శ్రీరాధికా రమణ భక్తిరసైక కోషే తోషేణ నిత్యపరమేణ కదా వసామి 41**

పవిత్రతకు పవిత్రతను చేకూర్చునట్టిది, సర్వోత్తమమైన స్థావర జంగమములచే సేవింపబడునది, శ్రీరాధారమణుని పట్ల భక్తిరసాన్ని పెంపొందింపజేసే ఏకమాత్ర ఆధారమైనట్టిది అయిన శ్రీబృందావనంలో నేను ఎప్పుడు నిరంతరం పరమానంద పూర్వకంగా వసిస్తాను ?

**వృందావనే సకల పావన పావనేఽస్మిన్**
**సర్వోజ్వలోజ్వలదుదార మతిః సదాఽస్తే**
**సర్వోత్తమోత్తమ మహామహిమన్యనంతే**
**సర్వాద్భుతాద్భుత మహారసరాజధామ్ని 42**

శ్రీబృందావనం సర్వపావన పావనము, సర్వోత్తమోత్తమము, మహా మహిమాన్వితము, సర్వచమత్కార చమత్కారియైన మహారసము (శృంగార రసము)నకు రాజధాని! ఈ ధామంలో ఉజ్వల రసమూర్తి, ఉదారమతి అయిన శ్రీశ్యామసుందరుడు సదా విరాజమానుడై ఉంటాడు.

**వృందావనే స్థిర చరాఖిల సత్వవృందానందాంబుధి**
**స్నపన దివ్య మహాప్రభావో**
**భావేన కేనాచిదిహామృతి యే వసంతి తే సంతి**
**సర్వపరవైష్ణవ లోకమూర్ధ్ని 43**

స్థావర, జంగమాదిగాకల సమస్త జీవులను ఆనంద సముద్రంలో తేలియాడించునది; దివ్యప్రభావశాలి అయిన శ్రీబృందావనంలో మృత్యుపర్యంతం భావపూర్వకంగా ఎవరు నివసిస్తారో అతడే సర్వశ్రేష్ఠులైన వైష్ణవుల యందు ముకుటమణివంటివాడు!

**వృందాటవీ విమల చిద్ఘన సత్వవృందా**
**వృందారక ప్రవరబృంద మునీంద్ర వంద్యా**
**నింద్యానపి స్వకృపయాఽద్భుత వైభవేన**
**మాదృక్ పశూన్ స్వచరణానుచరీ కరోతు 44**

శ్రీబృందావనంలో నివసించువారందరు పావనమైన చిన్మయ శరీరాలను పొందుతారు. సర్వశ్రేష్ఠులు, పూజ్యులు అయిన మునీంద్రులు ఈ ధామమహిమను స్తుతిస్తూ ఉంటారు. నేను నిందింప తగిన పశువువంటివాడినైనప్పటికీ శ్రీబృందావనం తన కృపను, అద్భుత విభూతిని ప్రసరింపజేసి; నన్ను తన శ్రీచరణాల చెంత దాసిగా స్వీకరించునుగాక! ఇదే నా ప్రార్థన!

**శాఖీంద్రైః కోటికల్పద్రుమ పరమమహావైభవైః సాత్వత శ్రు**
**త్యుద్గానోన్మత్త కీర ప్రముఖ ఖగకులైః కృష్ణరంగైః కురంగైః**
**దివ్యైర్వాపీ తడాగైరమృతమయ సరః సత్సరిద్రత్నశైలైః**
**కుంజైరానంద పుంజైరివ కలయ మహామంజు వృందావనం భోః 45**

శ్రీబృందావనం కోటి కల్పవృక్షాల మహావిభూతితో సంపన్నమైన వృక్షరాజములతో శోభిస్తున్నది. వైష్ణవులు ఉచ్చైస్వరంతో గానం చేస్తున్న వేదమంత్రాలతో ఉన్మత్తమైన శారికాది పక్షి సమూహం, శ్రీకృష్ణునకు ఆనందాన్ని ఇచ్చే హరిణములు అక్కడ విహరిస్తున్నాయి. దివ్యాతి దివ్యమైన కూపముల (బావుల)తోను, తటాకములతోను, అమృతమయమైన సరోవరాలతోను, నదులతోను, మణిమయములైన పర్వతాలతోను అలంకృతమైన ఆ బృందావన మహామనోహరశోభ! ఆహా! దర్శించండి!

**విశ్వైశ్వర్య మహాచమత్కృతిరియం కిం భాతి సర్వేశితు**
**ర్బ్రహ్మానంద సుధాంబుధేరనవధేః కింవాద్భుతోఽయం రసః**
**కింవా దివ్యసుకల్ప పాదప వనశ్రేణీ సుబీజం పరమ్**
**కృష్ణప్రేమ సుతాద్భుతా పరిణతిర్బృందాటవీ కిం న్వియమ్. 46**

శ్రీబృందావనం సర్వేశ్వరుని ఐశ్వర్యసమూహాల మహా చమత్కారకారియైన నేర్పరితనపు విశేషమా! లేదా; ఎల్లలు లేని బ్రహ్మానందసుధా సముద్రపు అద్భుతము, అనిర్వచనీయము అయిన రసవిశేషమా! లేక; దివ్యాతి దివ్యమైన ఉత్తమోత్తమ కల్పవృక్షాలతో కూడిన వనరాజు యొక్క సర్వశ్రేష్ఠ బీజవిశేషమా! లేదా శ్రీబృందావనం శ్రీకృష్ణప్రేమకు ప్రశంసనీయమైన ఒక అద్భుత పరిణతియా!

(ఈ అన్నింటికి నిలయము బృందావనమని భావం.)

**శ్రీకృష్ణైకాంతభావం క్వ ను సకల జనోఽ వశ్యమాప్నోత్యయత్నాత్**
**కృష్ణస్యాశ్చర్య సీమా పరమ భగవతః కుత్ర లీలార్థమూర్తిః**
**కుత్రత్యా కృష్ణపాదాంబుజ భజన మహానంద సామ్రాజ్యకాష్ఠా**
**భ్రాతర్వక్ష్యే రహస్యం శృణు సకలమిదం శ్రీల వృందావనేఽత్ర 47**

జీవులందరికీ అనాయాసంగా శ్రీకృష్ణునియందు ఏకాంతభావం నిశ్చయంగా ఎక్కడ లభిస్తుంది ? శ్రీకృష్ణభగవానుని ఆశ్చర్యకరమైన లీలాస్వరూపం ఎక్కడ దర్శనీయం ఔతుంది ? శ్రీకృష్ణుని పదపద్మభజన వలన కలిగే మహానందం యొక్క పరాకాష్ఠ స్థితి ఎక్కడ దొరుకుతుంది ? సోదరా! ఆ రహస్యమయ కథను చెప్తున్నాను విను! ఈ బృందావనంలో మాత్రమే అవి అన్నీ లభిస్తాయి!

**భ్రాతస్తిష్ఠ తలే తలే విటపినాం గ్రామేషు భిక్షామట**
**స్వచ్ఛందం పిబ యామునం జలమలం చీరైః సుకంథాం కురు**
**సమ్మానం కలయాతి ఘోరగరలం నీచాపమానం సుధామ్**
**శ్రీరాధామురలీధరౌ భజ రసాత్ వృందావనం మా త్యజ 48**

సోదరా! వృక్షాల నీడలో నివసించు, గ్రామ గ్రామాలలో భిక్షాటనం చేయి, యథేచ్ఛగా యమునా జలాలను పానం చేయి, ముక్కలుగా చింపి యోగికి అనువైన సాధువస్త్రాలను ఏర్పరచుకో! సన్మానాన్ని ఘోర విషంగాను, నీచమైన అవమానాన్ని అమృతంగాను భావించు. ప్రేమతో శ్రీరాధా కృష్ణులను భజించు. శ్రీబృందావనాన్ని విడువకు!

**కృష్ణానందరసాంబుధేః పరతరం సారం విచిత్రోజ్వలా**
**కారం పారగతైరపి శ్రుతిశిరోవృందస్య నేక్ష్యం మనాక్**
**శ్రీవృందావిపినం సుదుర్లభతరం ప్రత్యాశమాసాద్య భోః**
**క్షుద్రాశా కు పిశాచికా వశగతో బంభ్రమ్యసే కిం బహిః 49**

శ్రేష్ఠములైన వేదములనెరిగిన శిరోమణులు కూడ కృష్ణానందరససాగర ఉజ్వల సారాన్ని కించిన్మాత్రమైనా తెలిసికొనలేరు. సోదరా! సుదుర్లభమైన అట్టి బృందావనానికి వచ్చి కూడ క్షుద్రవాసనారూపమైన కుత్సిత పిశాచానికి వశమై బహిర్ముఖుడవై ఎందుకు అటు ఇటు తిరుగుతావు ?

**భ్రాతస్తే కిము నిశ్చయేన విదితః స్వస్యాంతకాలః కిము**
**త్వం జానాసి మహామనుం బలవతో మృత్యోర్గతిస్తంభనే**
**మృత్యుస్తత్ కరణం ప్రతీక్షత ఇతి త్వం వేత్సి కిం వా యతో**
**బారం బారమశంక ఏవ చలసే వృందావనాదన్యతః 50**

అరే తమ్ముడా! నీ మృత్యువు నిశ్చయంగా ఎప్పుడు వస్తుందో నీవు ఎరుగుదువా! బలీయమైన మృత్యుగతిని ఆపటానికి నీకు ఏమైన మహామంత్రం తెలుసునా! నీ పనులు పూర్తి అయేటంతవరకు మృత్యువు వేచిఉంటుందని అనుకుంటున్నావా! మరి, మాటిమాటికి నిశ్శంకగా బృందావనం నుండి అన్యత్ర ఎందుకు వెళ్తున్నావు ?

**వృందారణ్యమనన్య భక్తిరసదం గోవిందపాదాంబుజ**
**ద్వంద్వే మందధియో విదంతి న హి తద్వాసంచ నాశాసతే**
**సాంద్రానంద రసాంబుధిర్నిరవధిర్యత్రావిరస్తి ధ్రువమ్**
**నో మజ్జంతి కుబుద్ధయో బత సముద్విగ్నాః సుదుఃఖైరపి 51**

శ్రీబృందావనం గోవిందుని పదపద్మములయందు అనన్యమైన భక్తిరసాన్ని ప్రదానం చేస్తుంది. మందబుద్ధికలవారికి అది తెలియకపోవటంచేత బృందావనంలో నివసించాలి అనే ఆశ కూడా వారికి కలుగదు. శ్రీధామంలో సాంద్రానంద రససాగరం నిశ్చయంగా ఆవిర్భవించి ఉన్నది. హా! ఇది తెలియని మూర్ఖులు అనేక దుఃఖాలచేత వ్యాకులురై కూడ ఆ రస సముద్రంలో తేలియాడాలని కోరుకొనరు.

**న వేదాజ్ఞా భంగే కురు భయమయే నాపి వచనమ్**

**గురూణాం మన్యేథాః ప్రవిశ న హి లోకవ్యవహృతౌ**

**కుటుంబాద్యే దీనే ద్రవ న కృపయా నో భవ సితోఽ**

**సకృత్ స్నేహైర్బృందావనమను హఠాన్నిఃసర సఖే 52**

ఓ సఖుడా! వేదాజ్ఞను మీరటానికి భయపడకు. తలిదండ్రులు, గురుజనులునైన వారిమాటలను పట్టించుకొనవద్దు. లోకవ్యవహారాన్ని గురించి వద్దు. దీనులైన కుటుంబ సభ్యుల పట్ల కరుణతో కరిగిపోవద్దు. ప్రేమతో నిండిపోయి మాటిమాటికి సంసారంలో కూరుకొనిపోవద్దు. శ్రీబృందావనానికి పరుగున వెళ్లిపో!

బృందావనానికి అంకితమై, అక్కడే నివసించటం పై చెప్పిన అన్నిటికన్న శ్రేష్ఠతమమని భావము!

**యత్రాభంగ స్మర విలసితైః క్రీడతో దంపతీ తౌ**

**గౌరశ్యామౌ ప్రతిపద మహాశ్చర్య సౌందర్యరాశీ**

**సాంద్రానందోన్మద రస మహాసింధు సమ్మజ్జితాలీవృందౌ**

**వృందావనమిదమహో దుర్భగా నాశ్రయంతే 53**

గౌరశ్యామాంగులైన శ్రీయుగళ కిశోరులు నిరంతరం ప్రేమవిలాస క్రీడా పరాయణులై ప్రతిక్షణం మహాశ్చర్యమయ, లావణ్యపూర్ణ సౌందర్యాన్ని విస్తరింప జేస్తున్నారు. వారు సాంద్ర ఆనందోన్మదమైన రసమహాసాగరంలో సఖీబృందాలను ముంచెత్తివేస్తూ ఉంటారు. అట్టి బృందావనాన్ని, అయ్యో! దౌర్భాగ్యులు మాత్రమే ఆశ్రయింపకుందురు.

**రాధానాగర కేళిసాగర నిమగ్నాలీదృశాం యత్సుఖమ్**

**నో తల్లేశలవాయతే భగవతః సర్వోఽపి సౌఖ్యోత్సవః**

**తత్రాశా యది కస్య చిన్నిరుపమాం ప్రాప్తస్య భాగ్యశ్రియమ్**

**తద్బృందావన నామ్నిధామ్ని పరమే స్వీయం వపుర్న్యస్యతు 54**

శ్రీరాధామాధవుల కేళీ సముద్రంలో నిమగ్నమైన సఖీమణులకన్నులు అత్యంత సుఖాన్ని పొందుతూ ఉంటాయి. భగవంతుని తాలూకు సమస్తమైన సుఖోత్సవం కూడా ఈ సుఖంలోని లవలేశానికి కూడ సాటిరాదు. అనుపమానమైన భాగ్యలక్ష్మిచేత వరింపబడిన ఏ వ్యక్తి అయినా ఆ సుఖాన్ని పొందాలనే ఆశతో ఉన్నట్లు అయితే శ్రీబృందావన పరమధామంలో శరీరాన్ని త్యజించాలి!

బృందావనంలో మరణించటం మహాభాగ్యం! ఆ భాగ్యాన్ని పొందిన అదృష్టవంతుడు శ్రీరాధాకృష్ణుల దయకు పాత్రుడు ఔతాడని భావం!

**రాధాకేళి మృగస్య కస్యచిదహో శ్యామస్య యూనో నవ**
**స్యాభీరీగణ కాంక్షమాణ కరుణాదృష్టేః స్మరోన్మాదినీ**
**సర్వామ్నాయ దురూహ కృష్ణరస సర్వస్వైక సంధారిణీ**
**శ్రీవృందావిపినాభిధా విజయతే కందర్పకేళిస్థలీ 55**

ఓహో! గోపీమణులందరు ఎవరి కృపాదృష్టికై ప్రార్థిస్తూ ఉంటారో ఆ శ్రీరాధ యొక్క కేళీవిలాసం శ్యామలాంగుడైన ఒకానొక నవయువకుడిని ప్రేమోన్మత్తునిగ చేస్తున్నది. సమస్త వేదాలలోను సంగుప్తంగా ఉన్న కృష్ణరస సర్వస్వమైన శ్రీరాధ సమ్యక్ప్రకారంగా అట విహరిస్తున్నది. బృందావనము అను పేరుగల ఆ ప్రేమవిలాస స్థలికి జయమగునుగాక!

**మహారంకత్వే వా పరమ విభవే వా బహుతరే**
**సుఖే వా దుఃఖే వా యశసి బహులేఽథాప్యశసి**
**మణౌ వా లోష్టే వా సుహృది పరమే విద్విషతి వా**
**సమా దృష్టిర్నిత్యం మమ భవతు వృందావనజుషః 56**

మహాదరిద్ర స్థితిలోనైనా, పరమవైభవంలోనైనా; గొప్పసుఖాలలోనైనా, అతిదుఃఖంలోనైనా; కీర్తినిపొందినా, అపకీర్తిని పొందినా; విలువైన మణులను పొందినా, మట్టిని పొందినా; మిత్రులయందైనా, శత్రువులయందైనా బృందావనవాసినైన నాకు సమదృష్టియే ఉండునుగాక!

**ఆశ్చర్యం ధామ బృందావనమిద మహాశ్చర్యమత్రాపి రాధా**
**కృష్ణాఖ్యం గౌరనీల ద్వయ మధురమహస్తత్పదాంభోరుహే చ**
**ఆశ్చర్యః శుద్ధభావః పరమపదమథారుహ్యా తన్నిష్ఠ ఏవా**
**శ్చర్యః కశ్చిన్మహాత్మా పరమ సువిరలస్తద్విదాశ్చర్య ఏవ 57**

ఈ శ్రీధామ బృందావనం ఆశ్చర్యకరమైనది. ఆహా! ఇక్కడ విరాజమానమై ఉన్న శ్రీరాధాకృష్ణులు అనెడు గౌరనీల వర్ణయుగళం కూడ ఆశ్చర్యకరమే! ఆ మధుర మూర్తుల చరణ కమలముల పట్ల వెలుగుతూ ఉండే శుద్ధభావం కూడ ఆశ్చర్యకరమే! మరొక ఆశ్చర్యకరమైన విషయం – పరమపదమైన బృందావనానికి వచ్చి, దాని యందు నిష్ఠను కలిగి, శ్రీధామం యొక్క సమస్త తత్వాన్ని ఎరిగిన ఒకానొక మహాత్ముడు ఉండటం కూడ ఆశ్చర్యమే!

అనగా అట్టి మహాత్ములు అరుదుగా ఉంటారని భావం!

**సఖే! న జనరంజనం కురు కదింద్రియాణాం సదా**
**విధేహి బహుగంజనం ప్రణయభంజనం సర్వతః**
**హఠం న కురు బంధనే సుత కళత్ర మిత్రాదికే**
**వపుర్యయ సమీహయా నివస వత్స వృందావనే 58**

ఓ సఖా! లోకుల ప్రసన్నత్వం కోసం ప్రయత్నించకు. నిరంతరం అందరి పట్ల ప్రీతిని వదలిపెట్టు. ఆ ప్రకారంగా శోభావిహీనమైన ఇంద్రియాలను దండించు. పుత్ర, కళత్ర, మిత్రుల బంధంపట్ల హఠంవద్దు. వత్సా! శరీరం ఉన్నంత వరకు ప్రతిజ్ఞా పూర్వకంగా బృందావనంలోనే వసించు.

**రాధామాధవయోర్యశాంసి సతతం గాయంస్తథా కర్ణయన్**
**తజ్జీవేషు చ వర్ణయన్ సమరసైః సంభూయ సంతర్కయన్**
**కుంజం కుంజమనారతం బహు పరిష్కుర్వన్మహా భావతో**
**దేహాదౌ కృతహేలనో దయిత హే వృందాటవీమావస 59**

ఓ ప్రియతమా! నిరంతరం శ్రీరాధా మాధవుల యశోగానం చేస్తూ, వింటూ; శ్రీరాధాగోవిందుల భక్తుల చెంత ఆ వర్ణన చేస్తూ; రసిక మహాత్ముల సాంగత్యంలో ఇష్టాగోష్ఠి చేస్తూ; నిరంతరం కుంజనికుంజలను మళ్లీమళ్లీ శుభ్రపరుస్తూ; దేహం పట్ల నిరభిమానివై, అత్యంత ప్రేమతో బృందావనంలో నివసించు!

**ముక్తిశ్రీభిః స కలితపదో నారకం యాతి ధావన్**
**లబ్ధ్వా చింతామణిమథ మహావారిధౌ నిక్షిపేత్ సః**
**కృత్వా వశ్యం సకల భగవచ్ఛేఖరం శ్వాధమః స్యాత్**
**యో దుర్బుద్ధి స్త్యజతి సహసా ప్రాప్య వృందావనం తత్ 60**

దుర్బుద్ధియైన ఏ వ్యక్తి బృందావనానికి వచ్చి కూడ తొందరపాటుతనంతో దానిని త్యజించి అన్యత్ర వెళ్లిపోతాడో, ముక్తిపదాన్ని పొంది కూడ నరకం వైపు పరుగుతీస్తాడో, చేతిలో ఉన్న చింతామణిని మహాసముద్రంలోకి విసరివేస్తాడో అట్టివాడు భగవంతుడిని పొంది కూడ కుక్కకంటె అధముడు!

**సేవా వృందావనస్థ స్థిర చర నికరేష్వస్తు మే హంత కేవా**
**దేవా బ్రహ్మాదయః స్యుస్తత ఉరుమహితా వల్లభా యే వ్రజేందోః**
**ఏతే హ్యద్వైత సచ్చిద్రసఘన వపుషో దూరదూరాతిదూర**
**స్ఫూర్జన్మాహాత్మ్య వృందా బృహదుపనిషదానందజానంద కందాః 61**

శ్రీబృందావనము నందలి స్థావర, జంగమముల సేవాభాగ్యము నాకు లభించునుగాక! ఓహో! అవి గోకుల చంద్రుడైన శ్రీకృష్ణునకు ప్రియమైనవి, బ్రహ్మాది దేవతలకన్న అధికంగా పూజింపతగినవి. అవి శ్రీకృష్ణునికి ప్రియమైన అద్వయ సచ్చిదానంద ఘనమూర్తులు! వాని మహిమ దూరాతి దూరము! అనగా మానవబుద్ధికి అగోచరము! అతిప్రాచీనమైన ఉపనిషత్తులకు కూడ ఆనందప్రదానము చేయగలిగి, మహానంద రాశియైన ఆ స్థావర జంగమములు ఉపనిషత్తులకు కూడ మూల బీజ స్వరూపములై ఉన్నవి.

**నాహం వేద్మి కిమేతదద్భుతతమం వస్తు త్రయీ మస్తకైః**
**స్తవ్యం ప్రీతిభరేణ గోకులపతిర్యన్నిత్యమాసేవతే**
**కందం ప్రేమరహస్య కిం మధురిమోత్కర్షాంత్య సీమ్నోఽద్భుత**
**సాంద్రానంద రసస్య వా పరిణతిర్వృందావనం పావనమ్ 62**

వేదరాశి నతమస్తకమై నమస్కరిస్తున్న ఆ వస్తువు ఎటువంటి అద్భుత తమమో నేనెరుగను. గోకులపతియైన శ్రీకృష్ణుడు ప్రీతిపూర్వకంగా నిరంతరం దానిని సేవిస్తున్నాడు. అట్టి పరమ పవిత్రమైన శ్రీబృందావనము ప్రేమరసానికి మూల బీజమా! లేక అత్యంత మాధుర్యానికి చరమసీమయైన అద్భుతగాఢ ఆనందరసము యొక్క పరిణామమా!

**లోకాః స్వచ్ఛందనిందాం విదధతి యది మే కిం తతో దీనదీనమ్**
**సర్వంచేత్ స్యాత్ కుటుంబం కిమివ మమ తతో దుర్దశాః స్యుస్తతః కిమ్**
**సేవాధీశస్య న స్యాత్ యది కిమివ తతః శ్రీల వృందావనేఽహమ్**
**స్థాస్యామ్యాస్థాయ ధైర్యం మమ నిజపరమాభీష్ట సిద్ధిర్భవిత్రీ 63**

లోకులు యథేచ్ఛగా నన్ను నిందిస్తే నిందించనీ, నాకు హాని ఏమున్నది ? నా కుటుంబం అంతా అత్యంత దరిద్రస్థితిలో ఉన్నా నాకు కలవరం ఎందుకు ? నేను అతిదుర్దశలో ఉంటే మాత్రం ఏమిటి ? ఒకవేళ భగవంతుని సేవ దొరకకపోయినా నాకు హాని ఏమున్నది ? నేను మాత్రం శ్రీబృందావనంలో ధైర్య పూర్వకంగా నివసిస్తాను. తప్పకుండ నాకు పరమాభీష్టమైన వస్తువు లభిస్తుంది.

**కంథా కౌపీనవాసాస్తరుతల పతితైః క్లప్తవృత్తిః ఫలాద్యైః**
**కుర్వన్నవ్యర్థవార్తాం కథమపి న వృథా చేష్టయా కాలయాపీ**
**త్యక్త్వా సర్వాభిమానం ప్రతిగృహమటనం తుచ్ఛభైక్ష్యాయ కుర్వన్**
**వృందారణ్యే నివత్స్యామ్యనిశమనుసరన్ రాధికైకాత్మలోకాన్ 64**

కౌపీన వస్త్రధారణ చేసి, వృక్షాల కిందరాలిపడిన ఫలాలతో జీవికను నడుపుకుంటూ, అవసరమైన మాటలే మాటాడుతూ, వ్యర్థాలాపాలు చేయకుండ, అభిమానాన్ని త్యజించి ఇంటింటికి తిరిగి భిక్షాటన చేస్తూ జీవిస్తాను. శ్రీరాధా ప్రియభక్తులను అనుసరిస్తూ నేను నిరంతరం శ్రీబృందావనంలోనే నివసింతునుగాక!

**స్త్రీమాత్రే మాతృబుద్ధిః స్థిరచర నిఖిల ప్రాణిషూపాస్యబుద్ధిః**
**బాహ్యేశేషార్థ లాభేష్వపి హృదయ ముఖమ్లాని కృద్ధాని బుద్ధిః**
**దేహ స్త్రీ విత్త పుత్రాదిషు న హి మమ ధీర్మిత్రబుద్ధిః స్వశత్రు**
**ష్వాపీడాయాం సమంతాత్ సుఖమతిరమితానంద వృందావనేస్తు 65**

నాకు స్త్రీలయందు మాతృబుద్ధి, స్థావర జంగమాత్మకమైన సమస్త ప్రాణుల యందు ఉపాస్యబుద్ధి కలుగునుగాక! సమస్తమైన లౌకిక సంపదలయందు కూడ నా హృదయము, ముఖము మ్లానమై హాని బుద్ధి కలుగునుగాక! (అనగా వాటియందు అయిష్టం కలుగవలెనని భావం). నా శరీరం పట్ల, భార్య, పుత్ర, ధనాదుల యందు మమతాబుద్ధి లేకుండునుగాక! నాకు అత్యంత కష్టం కలిగించే శత్రువుల యందు కూడ మిత్రబుద్ధి ఉండునుగాక! ఈ విధంగా నిరంతరం సుఖమగ్నచిత్తుడనై అమితానంద సీమయైన శ్రీబృందావనంలో నివసింతునుగాక!

**తిక్తీభూతా విముక్తిర్విషమ నిరయవద్భాతి సర్వేంద్రియార్థః**
**సర్వేభోగా భవంతి ప్రబల గరల వహ్న్యాద్భటజ్వాల కల్పాః**
**కీటప్రాయాః సమస్తప్రవర సురగణాః సిద్ధయశ్చేంద్రజాల**
**ప్రాయాః సంస్వాద్య వృందావన రసిక రసం మాద్యతే మేఽద్య హృద్యమ్ 66**

ముక్తి కషాయంవలెను, సర్వేంద్రియాల పట్ల లాలస నరక సమానంగాను తోస్తున్నది. సమస్త భోగాలు ప్రబలమైన విషంగాను, అగ్నిజ్వాలతో సమానంగాను తోస్తున్నవి. శ్రేష్ఠులైన దేవతలు కీటక ప్రాయంగాను, అణిమాది అష్టసిద్ధులు ఇంద్రజాలంగాను అనిపిస్తున్నవి. ఎందుకంటె నేడు నా హృదయం శ్రీబృందావన రసికుడైన శ్యామసుందర రసాన్ని ఆస్వాదిస్తూ మత్తిల్లి ఉన్నది.

**త్యక్త్వా వృందావనమిదమహో చేద్బహిర్యాసి నూనమ్**
**క్షిప్త్వా కల్పద్రుమవరవనం హంత శాఖోటమేషి**
**హిత్వా వృందావన రసకథామన్యవార్తా రుచిశ్చేత్**
**జ్ఞాతం క్షిప్త్వా పరమమమృతం భోక్తుమిచ్ఛుః శ్వవిష్ఠామ్ 67**

ఈ బృందావనాన్ని విడచి నీవు అన్యత్ర వెళ్లదలిస్తే అయ్యో, నిజంగా కల్ప వృక్షాలతో కూడిన శ్రేష్ఠవనాన్ని విడచి అడవిలోకి వెళ్లినట్లే! బృందావన రసకథను విడచి అన్యవార్తలను ఇష్టపడుతూ ఉంటే, ఉత్తమోత్తమమైన అమృతాన్ని వదలి కుక్క చేసే భోజనం పట్ల ఇష్టం చూపినట్లే అని తెలుసుకో!

**పాపాత్మా పుణ్యవాన్ వా ప్రసరదపయశాః కీర్తిమాన్ వా మహా దు**
**ష్ప్రాపగ్రాసోఽథ సమ్రాడసమ జడమతిః సర్వవిద్యానిధిర్వా**
**యః కోఽపి స్యాః సఖే నో గణయ కథమపీక్షస్వ వృందావనం త**
**చ్ఛింధి ఛింధి స్వపాశాన్ గురునిగమగిరా స్వీయమోహైక సిద్ధాన్ 68**

సఖా! పాపియైనా, పుణ్యాత్ముడైనా; అపకీర్తి కలవాడైనా, కీర్తిమంతుడైనా; మహాదరిద్రుడైనా, మహారాజైనా; జడమతి అయినా, విద్యావిశారదుడైనా – నీవు వారిలో ఏ ఒక్కడివి అయినా, కాకపోయినా వాటిని లెక్కచేయకు. నీవు ఎలా ఉన్నా బృందావనాన్ని దర్శించుకో! గురువు ఆజ్ఞ ప్రకారం, శాస్త్రాల ఆజ్ఞానుసారం నీ మోహానికి మూలమైన బంధనాలను విచ్ఛేదం చేసుకో!

**నాహంతా మమతే వృథా కురు సఖే! దేహాలయ స్త్ర్యాదికే**
**ఛిత్వా దుర్జర శృంఖలం గురుగిరా తే మోహమాత్రోదితమ్**
**వృందారణ్యముపేత్య శీఘ్రమఖిలానందైక సామ్రాజ్యసత్**
**కందం కందఫలాధి వృత్తిరనిశం తన్నాథలీలాం స్మర 69**

ఓ సఖా! దేహం, గృహం, స్త్రీ మొదలైన వానిలో వ్యర్థంగా ఉన్న 'నేను, నాది' అనే బుద్ధి వదలిపెట్టు. మోహం వలన ఉత్పన్నమయ్యే ఈ పాశాలను గురువచనంతో ఛేదించు. సమస్త సామ్రాజ్య సుఖాలకు బీజస్వరూపమైన

శ్రీబృందావనానికి వెంటనే చేరుకో! కందమూల ఫలాలతో జీవితాన్ని నడుపుకుంటూ, శ్రీబృందావన చంద్రుని లీలలను నిరంతరం స్మరించుకుంటూ ఉండు.

**న కురు న కురు మిథ్యా దేహగేహాద్యపేక్షాం**
**మృతిమఖిల పుమర్థభ్రంశికాం విద్ధి మూర్ధ్ని**
**చల చల సుహృదద్యోవాభిముఖ్యేన వజ్రాదపి**
**చ హృది కఠోరః శ్రీల వృందావనస్య 70**

మిథ్య అయినటువంటి దేహ, గృహాదులను ఎన్నడు అపేక్షించకు. సమస్త పురుషార్థాలను నాశనం చేసే మృత్యువు శిరసుపై వేలాడుతున్నదని గ్రహించు. మిత్రమా! వజ్రం కంటె కఠినమైన మనసుతో ఇప్పుడే బృందావనానికి వెళ్లు! వెళ్లు!

**అద్యైవ మూర్ఖ! చల సర్వమిదం విహాయ**
**వృందావనాయ సకలార్థ సురద్రుమాయ**
**శ్రీరాధికా సురతనాథ విశుద్ధభావసత్రాయ**
**మైవ కురు కృత్య సమాప్త్యపేక్షామ్ 71**

మూర్ఖుడా! ఇప్పుడే సమస్త విషయాదులను త్యజించు. సమస్త వాంఛాకల్పతరువైన, శ్రీరాధామాధవుల విశుద్ధ భావాన్ని సులభంగా ప్రాప్తింపజేయగల శ్రీబృందావనానికి వెళ్లు. ఆరంభించిన పనులు పూర్తి కావాలి అని అపేక్షించకు.

**సాధో శక్నోషి నో చేత్ సకలమపి హఠాత్ స్వప్నకల్పం విహాతుమ్**
**తర్హిత్వం ధ్యాయ వృందావనమనిశమథోపాస్య వృందావనేஉసౌ**
**తన్నామాన్యేవ నిత్యం జప సతతమథో తత్కథాం సంశృణుష్వ**
**శ్రీమద్బృందావనస్థానథ పరిచర భో భోజనాచ్ఛాదనాద్యైః 72**

ఓ సాధు పురుషా! ఒకవేళ నీవు స్వకల్పితమైన ఈ విషయాలనన్నిటినీ హఠాత్తుగా వదలివేయలేకపోయినా; శ్రీబృందావన యుగళ కిశోరులను ఉపాసిస్తూ, నిరంతరం బృందావనాన్ని ధ్యానిస్తూ ఉండు. ప్రతిక్షణం వారి నామాన్ని జపిస్తూ,

నిరంతరం వారి లీలలను వింటూ, బృందావన వాసులకు భోజన వస్త్రాదులను ఏర్పాటుచేస్తూ వారిని సేవించు!

**వస్తుః కోటిగుణం శ్రుతం సుకృతం వాసోన్నవాసాదిభిః**
**తీర్థే వాసయితుః స్వయం హి తరతి ద్వౌ తౌ స యత్తారయేత్**
**ప్రేమానంద రసాత్మధామని పరే వృందావనే వాసక**
**స్త్వాశ్చర్యాం వృషభానుజా ప్రియరతిం ప్రాప్నోత్యనాయాసతః 73**

ఎవరికైనా అన్నవస్త్రాలను ఇచ్చి, బృందావనంలో నివసించే ఏర్పాటు చేసిన వ్యక్తి బృందావనంలో నివసించే వానికన్న కోటింతలు అధిక పుణ్యాన్ని పొందుతాడు. ఎందుకంటె అక్కడ నివసించేవాడు కేవలం తాను మాత్రమే ఉద్ధరింపబడుతాడు. మరి, ఇంకొకరికి నివాసం కల్పించినవాడు తాను, నివాసం కల్పించబడిన వ్యక్తి ఇద్దరూ ఉద్ధరింపబడుతారు. శ్రేష్ఠమైన, ప్రేమానంద రసస్వరూపమైన శ్రీమద్బృందావనంలో మరొకరికి నివాసం ఏర్పాటు చేసిన వ్యక్తి కిశోరీ కిశోరుల ప్రీతిని అనాయాసంగా పొందుతాడు.

**నిష్కించనాన్ కృష్ణరసే నిమగ్నాన్ మహానిరీహాన్ జనసంగ భీతాన్**
**వృందావనస్థాన్ వసనాశనాద్యైర్యః సేవతేఽసౌ వశయేత్తదీశౌ 74**

నిష్కించనులు, కృష్ణరసమగ్నచిత్తులు, వాసనారహితులు, ఏకాంతవాసంపై ప్రియత్వంతో ఉన్నవారు, శ్రీబృందావనంలో నివసించే వారు అయిన మహాత్ములను వస్త్రభోజనాదికాన్ని ఇచ్చిసేవించే వ్యక్తి శ్రీయుగళకిశోరులను కూడ వశీకృతం చేసుకొనగలడు.

**వృందారణ్యమనన్యభావ మధురాకారే హితో రాధికా**
**కృష్ణక్రీడిత రంజిత ప్రవిలసత్కుంజావలీ మంజులమ్**
**యోఽన్యత్రాపి కృతస్థితిర్విధివశాచ్ఛేచన్ సదా చింతయే**
**న్నిత్యం తన్మిలనం విచింతయదహం తద్ధామ యుగ్మం భజే 75**

ఒక వ్యక్తి దురదృష్టవశాత్తు బృందావనం కాక అన్యప్రదేశంలో దుఃఖంతో జీవిస్తున్నా, అనన్య భావంతో మధురాకృతియైన శ్రీబృందావనం పట్ల లాలాయితుడై (తీవ్రకాంక్షతో); శ్రీరాధాకృష్ణుల క్రీడామయ, రమణీయ, విలాసమయ కుంజలతో శోభిస్తున్న శ్రీబృందావనాన్ని నిరంతరం చింతన చేస్తూ ఏ రసిక శ్రీయుగళాన్ని కలసికొనటానికి నిరంతరం తపిస్తూ ఉంటాడో అ జ్యోతిర్మయ శ్రీయుగళాన్నే భజిస్తాను.

**రాజ్యం నిష్కంటకమపి పరిత్యజ్య దివ్యాశ్చ రామాః**
**కామాన్ సర్వానపి చ విహితాంస్తిక్తతిక్తాన్ విదంతః**
**హిత్వా విద్యా కుల ధన జనాద్యాభిమానం ప్రవిష్టా**
**యే శ్రీవృందావిపినమపునర్నిర్గమాస్తాన్ నమామః 76**

నిష్కంటకమైన రాజ్యాన్ని, దివ్యమైన రమణీమణులను త్యజించి; వివిధములైన విహిత వాసనలను దుఃఖమయములని తెలిసికొని; విద్య, కుల, ధన, పరివారాదికము పట్ల అభిమానాన్ని త్యజించి ఎవరు శ్రీబృందావనానికి వచ్చి, తిరిగి వెనుకకు వెళ్లరో వారికి నమస్కరిస్తున్నాము.

**రాధాకృష్ణౌ పరమమృణినౌ కుర్వతః సర్వతః శ్రీ**
**విష్ణోర్ధామ్నః స్ఫురదతిమహానంద వృందావనస్థాన్**
**జంతూన్ హంతుం విరచిత కృతీనప్యురుప్రేమభాజో**
**దానైర్మానైరహహ భజతో ధన్యధన్యాన్ నమామః 77**

శ్రీవిష్ణుదేవుని సమస్త ధామములకన్నను శ్రీబృందావనం అధిక స్ఫూర్తిమయమైన మహానందకరస్థలి! ఆధామంలోని సమస్త జీవులు తమను వధించిన వారి పట్ల కూడ దాతృత్వాన్ని, గౌరవాన్ని చూపిస్తూ సేవిస్తాయి. వారు శ్రీరాధాకృష్ణులను ఋణగ్రస్తులను చేస్తారు. శ్రీయుగళానికి ప్రేమభాజనులైన ఆ ధన్యాతిధన్యులకు నమస్కారం!

**మరిష్యసి కదా సఖే! త్వమితి కిం విజానాసి కిమ్**
**శిశోః సుతఋణస్య వా న ఖలు మృత్యురాకస్మికః**
**తదద్య నిరవద్యధీర వపురింద్రియాసక్తికో**
**న కించన విచారయ ద్రుతముపైహి వృందావనమ్ 78**

సఖా! మృత్యువు ఎప్పుడు వస్తుందో నీవు ఎరుగుదువా ? బాలురకు, నవయువకులకు కూడ అకస్మాత్తుగా మృత్యువు సంభవించటం లేదా! కనుక అనింద్యమైన బుద్ధితో, ఇంద్రియాదుల పట్ల ఆసక్తిని వదలి, ఏ విచారమూ లేకుండ ఇప్పుడే వెంటనే శ్రీబృందావనానికి వెళ్లు!

**శుద్ధామాద్యరతిం సమస్త భగవద్రత్యుచ్ఛ్రిత శ్రీమతీమ్**
**త్వం చేత్ కాంక్షసి మాధురీభర ధురీణానంద సందోహినీమ్**
**ధర్మజ్ఞాన విరక్తి భక్తిపదవీం తత్సాధ్యమప్యస్పృశన్**
**దుర్భేద్యం సహసా విభిద్య నిగడం సన్యస్య వృందావనే 79**

సమస్తములైన భగవద్రతి విశేషాలకన్నను ఉన్నత శ్రీయుక్తమై, మాధుర్య రసశ్రేష్ఠమై, ఆనందపూర్వకమైన విశుద్ధ ఆద్యారతి (మధురరతి)ని నీవు పొంద గోరుతున్నావా! అయితే ధర్మ, జ్ఞాన, వైరాగ్యాది భక్తిరూప సాధనసాధ్యాలను వదలి; దుర్భేద్యమైన బంధాలను బలవంతంగా వదిలించుకొని, సన్యాస వ్రతాన్ని స్వీకరించి నిరంతరం బృందావనంలో నివసించు!

**మహాభాగ్యైః ప్రాప్తం వపురిదమిహాకర్ణి మహిమాఽ**
**ద్భుతో వృందాటవ్యాః కలితమఖిలం స్వప్న సదృశమ్**
**శుభాయామాశ్వాసో నహి నహి మతౌ నాపి వపుషి**
**క్షణేఽస్మిన్నేవ త్వం తదభిచల వృందావన వనమ్ 80**

మహాభాగ్యవశం చేత ఈ మానవ శరీరం లభించింది. మహాభాగ్యవశం చేతనే శ్రీబృందావనం యొక్క అద్భుత మహిమను కూడ విన్నావు. ఈ కనిపిస్తున్న

దంతా స్వప్న సదృశం (కల వంటిది) అనేది కూడ భాగ్యవశంచేతనే తెలుస్తున్నది. ఈ మంచిబుద్ధి ఇప్పుడు ఉన్నది, రేపు ఉంటుందో ఉండదో! ఈ శరీరాన్ని కూడ నమ్మటానికి వీలులేదు. కనుక ఈ క్షణమే శ్రీబృందావనానికి బయలుదేరు!

**భ్రాతర్యర్హి నిమీలితాఽసి నయనే తత్ర క్వ కాంతాత్మజ**
**భ్రాతృ స్వాప్త సుహృద్గణాః క్వ చ గుణాః కుత్ర ప్రతిష్ఠాదయః**
**కుత్రాహం కృతయః ప్రభుత్వ ధన విద్యాదైస్తతః సర్వత**
**స్త్వం నిర్విద్య సవిద్య కిం ను న చలస్యద్యైవ వృందావనమ్ ? 81**

సోదరా! కళ్లు మూసిన (మరణించిన) తరువాత నీ భార్యా బిడ్డలు, సోదరులు, విశ్వాసపాత్రులైన మిత్రులు వీరందరు ఎక్కడ ? నీ గుణం, నీ ప్రతిష్ఠ ఇవన్నీ ఎక్కడికి పోతున్నాయి ? నీ అధికారం, ధనం, విద్యాహంకారం ఇవన్నీ ఎక్కడ ? కనుక ఓ విజ్ఞుడా! అన్నిటియందు విరక్తినిపొంది, నీవు ఇప్పుడే శ్రీబృందావనానికి ఎందుకు వెళ్లకూడదు ?

**రుదదపి పితృమాతృ బంధుపుత్రాదికమపహాయ నిశమ్య నార్హదుక్తీః**
**హృది పరమ కఠోరతాం దధానో ద్రుతమవలోకయ కృష్ణకేళికుంజమ్ 82**

(నీవు బృందావనానికి వెళ్తుంటే (ప్రేమచే) నీ తలిదండ్రులు, పుత్రులు, బంధువులు రోదించవచ్చు, అయినా వదలిపెట్టు. పూజ్యులైన వారి మాటలను కూడ వినవద్దు. హృదయాన్ని కఠోరంగా చేసుకొని, వెంటనే కృష్ణకేళీస్థలియైన బృందావనాన్ని దర్శించు!

**రతి రతిపతి కోటిసుందరం తత్ప్రముషిత కోటిరమా రమాపతిశ్రీ**
**కనక మరకతాభమూర్తి వృందావిపిన విహారిమహోద్వయం భజామి 83**

కోటికోటి రతీమన్మథుల కంటె అధిక సౌందర్యమూర్తి, కోటికోటి లక్ష్మీనారాయణుల శోభను తిరస్కరించునది, స్వర్ణనీలమణికాంతులతో ప్రకాశిస్తున్న

మూర్తిధారి, శ్రీబృందావన విహారి అయిన ఆజ్యోతిర్మయ శ్రీయుగళ కిశోరులను నేను భజిస్తున్నాను.

**తదఖిల భగవత్స్వరూప రూపామృత రసతోఽత్యతి మాధురీ ధురీణమ్**
**కువలయ కమనీయ ధామ రాధాపదరస పూర్ణవనే భ్రమత్ భజామః 84**

సమస్త భగవత్ స్వరూపాల యొక్క రూపామృత రసం కంటె అత్యంత మాధుర్యమయమైనది శ్రీరాధాపదకమల రసం! ఆ రసస్పర్శచేత పరిపూర్ణమైన వనంలో పరిభ్రమిస్తున్న ఆ ప్రసిద్ధ నీలికమలం వంటి శ్యామలాంగుడిని మేము స్మరిస్తున్నాము.

**అలక్ష్యాః శ్రీలక్ష్మ్యా అపి చ భగవత్యా భగవతః**
**యదా వక్షస్థాయా మధురమధురాః కేచన రసాః**
**అహో! యత్ దాసీభిః సతతమనుభూయంత ఉరుభిః**
**ప్రకారైస్తాం రాధాం భజ దయిత! వృందావన వనే 85**

భగవతియైన లక్ష్మీదేవి భగవంతుని వక్షస్థల నివాసిని అయికూడ, ఒకానొక మధురతమ (శ్రీరాధా) రసాన్ని ఆస్వాదించలేకపోతున్నది. ఆహా! ఎవరి దాసీమణులు కూడ అనేక విధాలుగా ఆరసాన్ని నిరంతరం ఆస్వాదిస్తున్నారో, ప్రియతముడా! శ్రీబృందావనంలో వసిస్తూ, ఆ శ్రీరాధాజీని భజించు!

**విషయ విషకృమీణాం బోధమాత్రాత్మభాజాం స**
**సమయ సభయ సర్వేషైక భక్త్యాశ్రితానామ్**
**న నిజరుచికరం వర్త్మోత్సృజంతః స్థితాః స్మో**
**వయమమల సుఖౌఘస్యంది వృందావనాశాః 86**

విషయరూప విషం పట్ల ఆసక్తితో ఉన్నవారు, కేవలం బోధలకే పరిమితమైన ఆత్మవాదులు, వృద్ధాప్యంలో మృత్యుభయంతో భగవంతుడిని భజించేవారు –

అట్టి వారి మార్గం మాకు రుచికరంకాదు. (మాకు నచ్చదు). కనుక అటువంటి వాటిని త్యజించి, నిర్మల సుఖాన్ని ప్రసాదించే శ్రీబృందావనంపట్ల ఆశతో ఉన్నాము.

**ఉన్మత్త ప్రాయవాచః పరిముషిత ధియో మాయయాఽనర్థబీజమ్**
**స్వార్థం మత్వాఽకృతార్థా అథ న సుఖ వివేకాదయోఽగ్రాహ్యా వాచః**
**స్వీయాః సర్వే జిఘాంస్తంత్యహహ బహుమృషా స్నేహపాశైర్నిబధ్య**
**శ్రీవృందారణ్య! యా యామహమహిత సమాజాత్కదా నిస్సృతస్త్వామ్ 87**

బంధువుల, మిత్రుల మాటలు ఉన్మత్తప్రలాపముల వలె ఉన్నాయి. వారి బుద్ధి మాయామోహితమై నశించింది. దుఃఖాది అనర్థాలకు మూలమైనదాని విషయంలో కూడ స్వార్థంతో కృతార్థతను పొందజూస్తున్నారు. వాస్తవమైన సుఖ, వివేకాదుల గూర్చిన ఉపదేశాన్ని వారు గ్రహించటం లేదు. ఆహా! నా స్వజనులు అత్యంత అసత్యమైన స్నేహపాశాలతో బంధించి, నన్ను అంతమొందించాలను కుంటున్నారు. హే శ్రీబృందావనమా! ఎప్పుడు నేను ఈ అనిష్టకారియైన సమాజం నుండి విడుదల పొంది, నీ ఆశ్రయాన్ని పొందుతాను ?

**గృహాంధకూపే పతితః కదా మాముద్ధృత్య మూఢం కృపయాస్వయైవ**
**కామాదికాలాహి గణైర్నిగీర్ణం మాతేవ వృందాటవి! నేష్యసేఽంకమ్ 88**

నేను గృహ (సంసార) రూపమైన చీకటి కూపంలో పడి కొట్టుకుంటున్నాను. కఠోరమైన కామాదికాలసర్పం చేత పీడితుడినై ఉన్నాను. మూర్ఖుడిని! హే బృందావనమా! ఎప్పుడు నన్ను దయతో ఉద్ధరిస్తావు ? తల్లి వలె నీ ఒడిలోకి ఎప్పుడు తీసుకుంటావు ?

**నిష్కించనో నిత్యవివిక్తసేవీ వృందావనే దైవతవృంద వంద్యే**
**శ్రీరాధికామాధవ నామధామద్వయం కదా భావభరేణ సేవే 89**

నిష్కించనుడినై, ఏకాంతవాసినై; దేవతాగణముల చేతకూడ నమస్కరింప బడుతున్న ఈ బృందావనంలో శ్రీరాధామాధవ యుగళాన్ని ఎప్పుడు నేను భావపూర్వకంగా సేవిస్తాను ?

**నిజ సర్వనాశకరమాత్మ సుహృత్సుత**
**దార మిత్ర పరివారగణమ్**
**పరివంచ్య కర్హి దృఢబుద్ధిరహం**
**ప్రపలాయ్య యామి హరికేళివనమ్ 90**

నన్ను సర్వనాశనం చేసే బంధు, కళత్ర, పుత్ర, మిత్రాది పరివారాన్ని వంచించి; దృఢబుద్ధితో శ్రీహరి కేళీవనమైన బృందావనానికి పరుగున వచ్చి, ఎప్పుడు అక్కడ ఆశ్రయాన్ని పొందుతాను ?

**జన్మాన్యసంఖ్యాని గతాని మే వృథా**
**వ్యగ్రాత్మనో దేహగృహాదికేహయా**
**అద్యాపి ముహ్యామ్యపి బుద్ధిమానహం**
**తవైవ వృందాటవి! నామ మే గతిః 91**

దేహ, గృహాది బంధాలతో వ్యగ్రచిత్తుడినై అనేకజన్మలను వృథా చేసుకున్నాను. హా! బుద్ధి తెలిసికూడ ఇప్పటికీ మోహవశుడినై ఉన్నాను. హే బృందావనమా! నాకు నీ నామమే ఏకమాత్రగతి!

**ఋణగ్రసతో యాయాం కథమహహ వృందావనమహమ్**
**త్యజేయం వా వృద్ధావగతి పితరౌ దార శిశుకాన్**
**కథం వా మజ్జీవాన్ బత పరిహరేయం నిజజనాన్**
**సతాంశ్లాఘ్యో భూత్వేత్యఫల కలనో ముహ్యతి కుధీః 92**

'అయ్యో! ఋణగ్రస్తుడినై ఏవిధంగా బృందావనానికి వెళ్లగలను ? నేను తప్ప వేరుగతిలేని తలిదండ్రులను, భార్యాబిడ్డలను ఎలా వదలివేయగలను ? నాయందే ప్రాణం పెట్టుకున్న నా పరివారాన్ని ఎలా త్యజించగలను!' అని ఈ ప్రకారంగా నిష్ఫలమైన ఆలోచనలు చేస్తూ; సజ్జనుల ప్రశంసలు పొందుతూ కుబుద్ధులు మోహితులు ఔతూ ఉంటారు.

**జానన్నప్యమృతం విహాయ గరలం భుంజే స్వయం బంధమ**
**ప్యార్తివ్రాత నిబంధనం దృఢతరం కుర్వే సుదృక్ స్వంధవత్**
**శ్రీవృందాటవి! మాతరేకమిహ మజ్జీవాతురస్తి స్వయమ్**
**యత్వం స్నేహమయీ వికృష్య జనతాం స్వాంకం సమానేష్యసి 93**

అమృతం తెలిసికూడా దానిని వదలి, నేను స్వయంగా విషపానం చేస్తున్నాను. చక్కని నేత్రాలు ఉండికూడ అంధునివలె దుఃఖాలకు కారణమైన బంధనాలను మరింత దృఢతరం చేసుకుంటున్నాను. అమ్మా బృందావనమా! నా ఏకమాత్ర జీవితాశయాన్ని చూచి, స్నేహమయివై బంధుజన సంబంధాల నుండి విడిపించి, నీ ఒడిలోకి చేర్చుకో!

**రాధాకృష్ణ రహస్యదాస్యరస ఏవేష్టః పుమర్థో మమ**
**త్యక్త్వా సర్వమహం కదాపి నియతం వత్స్యామి వృందావనే**
**ఇత్థం స్యాదపి వాచి యస్య పరమాసక్తస్య గేహాదికే**
**నాసక్తావపి సక్తతా పరిహృతౌ తం పాతి వృందాటవీ 94**

'శ్రీరాధాకృష్ణుల ఏకాంత దాస్యరసమే నేను కోరుకునే పురుషార్థం! నేను ఎప్పుడు సమస్తాన్ని త్యజించి, నిరంతరం బృందావనంలోనే నివసిస్తాను' అనుకుంటూ; గృహాది విషయాల పట్ల ఉన్న పరమాసక్తిని త్యజించటంలో అసమర్థుడై ఈ విధంగా కేవలం మాటలతో ఎవరు ఘోషిస్తూ ఉంటారో అట్టివాని రక్షణను బృందావనం చూసుకుంటుంది.

**సంక్రాంతం నిజకాంతి మండలముదీక్ష్యోరః స్థలే తర్కయ**
**న్నీలాం కంచులికాం పరామపనయాశక్తయా ప్రియే విస్మితే**
**యాతాయా నవకేలికుంజశయనం శ్రీరాధికాయాః పరీ**
**హాసాః సంతు ముదే మమాతిహసితాలీభిర్బహిస్తద్రసాః 95**

నవకేళి కుంజశయ్యపై విరాజమానయైన శ్రీరాధా వక్షస్థలంలో ప్రతిబింబిస్తున్న నిజకాంతిమండలాన్ని శ్రీకృష్ణుడు చూచాడు. అది ఒక నీలికంచుకము అనే భ్రాంతితో ఆ నీలికాంతిని తొలగించటానికి శ్యామసుందరుడు చేస్తున్న వ్యర్థ ప్రయత్నాన్ని చూచి కుంజద్వారం చెంత నిలచి ఉన్న సఖీమణులు రసపూర్ణమైన పరిహాస వాక్యాలు పలుకుతున్నారు. ఆ ప్రయత్నం, ఆ రసపూర్ణ వాక్యాలు నాకు అత్యంత ఆనందాన్ని కలిగిస్తున్నాయి.

**కదాచిత్ శ్రీరాధా చరణకమల ద్వంద్వ పతితమ్**
**కదాచిత్ శ్రీరాధాముఖకమల మాధ్వీరస పిబమ్**
**కదాచిత్ శ్రీరాధా కుచకమల కోషద్వయ రతమ్**
**విలోకే తం కృష్ణ భ్రమరమధి వృందావనమహమ్ 96**

శ్రీరాధా చరణ కమల సన్నిధిలో ఎప్పుడు వాలిపోతాను ? ఎప్పుడు శ్రీరాధాముఖకమల మధురరసాన్ని పానం చేసి ఉన్మత్తతను పొందుతాను ? ఎప్పుడు నేను శ్రీరాధా కుచకమల మగ్నమై ఉన్న కృష్ణభ్రమరాన్ని బృందావనంలో దర్శించుకుంటాను ?

**నిర్విద్య కృత్యాద్యఖిలాత్ కదాహం ఛిత్వా సమస్తాశ్చ జగత్యపేక్షాః**
**ప్రవిశ్య వృందావనమత్యసంగస్తదీశ వార్తాభిరహాని నేష్యే 97**

సమస్త కర్తవ్యాల నుండి వైరాగ్యాన్ని పొంది, జగత్తులోని సకల వాంఛలను వదలివేసి ఎప్పుడు నేను నిస్సంగభావంతో శ్రీబృందావనంలో ప్రవేశిస్తాను ? ఎప్పుడు నేను బృందావనేశ్వరులైన శ్రీరాధాకృష్ణుల లీలాశ్రవణ, కీర్తనాదులతో జీవితం గడుపుతాను ?

**కదా శ్రీమద్బృందావనమిహ మృషా స్నేహనిగడమ్**
**సముచ్ఛిద్య స్వానాం శరణముపయాస్యామి వికలః**
**క్వచిత్ స్వాంతః శల్యోద్ధరణ మభిపశ్యన్నహి మనా**
**గపి శ్రౌతే వర్త్మన్యఖిల విదుషామనుమతే 98**

అసత్య స్నేహపాశాలైన సమస్త బాంధవ్యాలను వదలి, విద్వజ్జనులు ఆమోదించిన వైదిక మార్గాలు అనే హృదయ శల్య బాధను తొలగించుకొనే ఆశ కానరాక ఉన్నాను. వ్యాకుల చిత్తంతో ఎప్పుడు నేను శ్రీబృందావనాన్ని శరణు చెందుతాను ?

**వృందావనేశైక పదస్పృహోఽపి మహత్తమానాం శ్రుతభాషితోఽపి**
**విదన్నపి స్వార్థవిధాతి సర్వం హా! ధిఙ్! న వృందావనాశ్రయామి 99**

శ్రీబృందావన చంద్రుని చరణ కమలాల పట్ల స్పృహను కలిగి (తెలిసి) ఉండికూడ, మహత్పురుషుల మాటలను వినికూడ, సమస్తమూ నశించిపోయేదే అని తెలిసి కూడ శ్రీబృందావనాన్ని ఆశ్రయించకుండ జీవిస్తున్నాను. హా! హా! నన్ను నేనే తిరస్కరించుకుంటున్నాను.

**సకృదపి యది దృష్టా హంత! వృందాటవి త్వమ్**
**సకృదపి యది రాధాకృష్ణ నామాభ్యధాయి**
**సకృదపి యది భక్త్యా సన్నతస్త్వత్ ప్రపన్నే**
**ధ్రువమహహ తదా మామంబ నోపేక్షతాసి 100**

హేమాతా బృందవనమా! జీవితంలో ఒక్కసారి అయినా నిన్ను దర్శించుకోవాలి, ఒక్కసారి అయినా శ్రీ రాధాకృష్ణ నామాన్ని ఉచ్చరించాలి, ఒక్కసారి అయినా నిన్ను శరణు చెందిన నీభక్తులకు భక్తిపూర్వకంగా నమస్కరించాలి! అలా చేస్తే నువ్వు నన్ను నిశ్చయంగా ఉపేక్షింపలేవు! (అనగా ఆదరిస్తుంది అని భావం)!

# రెండవ శతకము

**వృందారణ్యే వరం స్యాం కృమిరపి పరతో నో చిదానందదేహో**
**రంకోఽపి స్యామతుల్యః పరమిహ న పరత్రాద్భుతానంత భూతిః**
**శూన్యోఽపి స్యామిహ శ్రీహరిభజన లవేనాతి తుచ్ఛార్థమాత్రే**
**లుబ్ధో నాన్యత్ర గోపీజనరమణ పదాంభోజ దీక్షా సుఖేఽపి 1**

శ్రీబృందావనంలో క్రిమిగా ఉండటమైనా నాకు ఇష్టమే, కాని అన్యత్ర (బృందావనం కాని ప్రదేశం) చిదానందదేహంతో ఉండాలని కూడ కోరుకోను. బృందావనంలో అత్యంత దరిద్రంతో ఉండటానికైనా ఇష్టపడతానుకాని, అన్యత్ర అనంత ఐశ్వర్యం ఉన్నా నాకు అక్కరలేదు. శ్రీహరినామ భజన లేశమైనా లేకుండ, తుచ్ఛవిషయలోలుడినై ఉన్నా వ్రజంలోనే నివసిస్తాను. కాని శ్రీగోపీరమణుని పదపద్మ దీక్షాసుఖం లభించే ప్రదేశం అయినా సరే, అన్యత్ర మాత్రం వెళ్లను.

**దివ్యానేక విచిత్ర పుష్పఫలవద్వల్లీ తరుణాం తతి**
**ర్దివ్యానేక మయూర కోకిల శుకాద్యానందమాద్యత్ ఖగః**
**దివ్యానేక సరః సరిద్గిరివరః ప్రత్యగ్రకుంజావలీ**
**దివ్యా కాంచనరత్నభూమిరపి మాం వృందావనే మోహయత్ 2**

శ్రీబృందావనంలో దివ్యాతిదివ్య విచిత్ర పుష్పాలు, ఫలభరితములైన వృక్షాలు, లతాసమూహాలు ఉన్నాయి. దివ్యాతి దివ్యములైన మయూర, కోకిల, శుకాది పక్షులు చేస్తున్న ఆనందోన్మత్త ధ్వని వినవస్తూ ఉంటుంది. దివ్యములైన సరోవరాలు, నదులు, పర్వతాలతో శోభిస్తున్న నిత్యనూతన కుంజనికుంజలు ఉన్నాయి. బృందావనం దివ్యస్వర్ణమయమైన రత్నభూమి! దానియందు నేను మోహితుడినై ఉన్నాను.

**భువః స్వచ్ఛాశ్చింతామణిభిరతి చిత్రైర్విరచితా**
**శ్చిదానందాభాసః ఫలకుసుమపూర్ణ ద్రుమలతాః**
**ఖగశ్రేణీః సామస్వర కలకలాశ్చిద్రససరిత్**
**సరాంసి శ్రీవృందావనమను మనో మే విమృశతు 3**

శ్రీబృందావనంలోని స్వచ్ఛ, విచిత్ర చింతామణులతో రచితమైన భూమిని; చిన్మయానందాన్ని విస్తరింపజేసే ఫలపుష్పభరితములైన ద్రుమలతలను; సామవేదస్వరగానంవలె అవ్యక్తమధుర ధ్వనితో కలకలారావం చేస్తున్న పక్షి సమూహాలను; చిన్మయము, రసభరితము అయిన నదులను, జలాశయాలను మనసులో స్మరిస్తున్నాను.

**మరకతమయ పత్రైర్వీరపుష్పైః సుముక్తా**
**నికరకలికయాఢ్యైః కౌరవిందప్రవాలైః**
**బహువిధ రసపూర్ణైః పద్మరాగైః ఫలాఢ్యై**
**రవిరళ మధువర్షైర్నీల రత్నాలిమాలైః 4**

శ్రీబృందావనంలో పత్రాలు (ఆకులు) మరకతమణిమయములై ఉన్నాయి. పుష్పసమూహాలు వజ్రసదృశములై ఉన్నాయి. మొగ్గలు సుందరమైన ముత్యాలవలె ఉన్నాయి. మొలకలు కురువిందమణులవలె, బహువిధ రసపూర్ణములైన ఫలాలు పద్మరాగమణులవలె ప్రకాశిస్తున్నాయి. ఏకధారగా మకరంద (తేనె) వర్షాన్ని కురిపిస్తున్న నీలరత్నాలవంటి భ్రమరాలతో పరివేష్టితమైన వృక్షాలతో బృందావనం శోభిస్తున్నది.

**అగణిత రవికోటి ప్రస్ఫురద్దివ్యభాతిః**
**సకృదపి హృదిభాతైః శీతలానంద వృష్ట్యా**
**ప్రశమిత భవతాపైర్దుర్లభార్థాన్ దుహద్భిః**
**పరమరుచిర హైమాసంఖ్యవృక్షైః పరీతమ్ 5**

శ్రీబృందావనం కోటికోటి సూర్యప్రభలతో సమానంగా ప్రకాశిస్తున్న పరమ రమణీయ స్వర్ణమయ వృక్షాలతో పరిపూర్ణమై ఉన్నది. అక్కడి సమస్త వృక్షాలు ఒక్కసారి హృదయంలో స్ఫురిస్తే చాలు; శీతలానంద ధారలతో సంసార తాపాలను శమింపజేసి, దుర్లభమైన పురుషార్థాన్ని (మోక్షాన్ని) అనుగ్రహిస్తాయి.

**వృందాటవ్యామగణిత చిదానంద చంద్రోజ్జ్వలాయామ్**
**సాంద్రప్రేమామృత రసపరిస్పందనైః శీతలాయామ్**
**కూజన్మత్త ద్విజకుల వృతానల్పకల్పద్రుమాయామ్**
**రాధాకృష్ణావచల విహృతౌ కస్య నో యాతి చేతః 6**

బృందావనం అసంఖ్యాకమైన చిదానంద చంద్ర చంద్రికలతో ప్రకాశిస్తూ ఉంటుంది. సాంద్రప్రేమామృత రసతరంగాలతో శీతలమై, పక్షిసమూహాల ధ్వనులతో శబ్దిస్తూ ఉంటుంది. అనేక కల్పవృక్షాలతో శోభిస్తున్న అట్టి శ్రీబృందావనంలో నిరంతరం విహరిస్తూ ఉండే శ్రీరాధాకృష్ణుల వైపుకి ఎవరి మనసు పరుగులు తీయకుండ ఉండగలదు!

**స్వపర సకల వస్తూన్యత్ర సూర్యేందుకోటి**
**ఛ్ఛవి సువిమల సచ్చిత్ విగ్రహే సద్గుణౌఘే**
**బహిరగత దృగంతర్ధైర్యమాలంబ్య నిత్య**
**స్మృతిరధివస వృందారణ్యమన్యానపేక్షః 7**

బృందావనంలోని సమస్తములైన స్వీయ, ఇతర వస్తువులు కోటికోటి సూర్యచంద్రుల కాంతితో కూడి ఉంటాయి. అంతా నిర్మలమైన చిన్మయమూర్తియై, ఉత్తమ గుణాలతో పరిపూర్ణమై ఉంటుంది. ఇచటి స్థితినంతటిని నిత్యం స్మరిస్తూ, బాహ్యావిషయాలపై దృష్టిని పోనివ్వక; ధైర్యపూర్వకంగా నిరపేక్షతతో శ్రీబృందావనంలో నివసించు!

**దేహేఽస్మిన్నతికుత్సితే త్యజ వృథాఽధ్యాసం యతః సంస్మృతి**
**ర్ఘోరా చింతయ చిద్ఘనం నిజవపుః సర్వంచ వృందావనే**
**ఘోరాః సంతు విపత్తికోటయ ఇహ త్వం యాహి నో విక్రియా**
**మారబ్ధక్షయమావసైతదథ తన్నాథౌ సదా ఖేలయ 8**

ఈ ఘోరసంసారం కారణంగా నీకు వచ్చిన ఈ కుత్సిత శరీరంపై కల అహం, మమతలను త్యజించు. నీ నిజదేహము, బృందావనంలోని సమస్తమూ చిద్ఘనమని గ్రహించు. ఇక్కడ కోటికోటి ఘోరవిపత్తులు ఎదురైనా చలించకు. నీ ప్రారబ్ధ కర్మ నశించిపోయే వరకు శ్రీబృందావనంలోనే జీవిస్తూ నిత్యం శ్రీయుగళ కిశోరుల లీలాచింతనం చేస్తూ ఉండు!

**దివ్యస్వర్ణ సునీల రత్నసుభగం లీలా సనాలారుణాం**
**భోజ శ్రీమురళీధరం పృథులసద్వేణీ సుబర్హోజ్జ్వలమ్**
**సంవీతోజ్జ్వల శోణ పీతవసనం కందర్పలీలామయమ్**
**శ్రీవృందావన కుంజ ఏవ కిమపి జ్యోతిర్ద్వయం సేవ్యతామ్ 9**

అనంగకేళీ విలోలమైన ఒకానొక అనిర్వచనీయ జ్యోతిర్మయ యుగళాన్ని బృందావన కుంజలలోనే సేవించు! అందులో ఒకరు దివ్యస్వర్ణ వర్ణంతోను, మరొకరు సుందర ఇంద్రనీలమణి వర్ణంతోను శోభిస్తూ ఉంటారు. ఒకరి చేతిలో నీలిమా యుక్తమైన అరుణవర్ణపద్మం, రెండవవారి చేతిలో మోహన మురళి విరాజిల్లుతూ ఉంటాయి. ఒకరి శిరస్సు విశాలకేశరాశితోను, మరొకరి శిరస్సు మయూర ఫింఛంతోను శోభిస్తూ ఉంటాయి. ఒకరు ఉజ్జ్వలమైన ఎర్రని వస్త్రాలను ధరించి ఉండగా, రెండవవారు సుందర పీతాంబరధారియై ఉంటారు. (శ్రీరాధాకృష్ణుల వర్ణన)!

**రాధాకృష్ణౌ పరమ కుతుకాద్యల్లతా పాదపానామ్**
**చిత్వా పుష్పాదికమురువిధం శ్లాఘమానౌ జుషాతే**
**స్నానాద్యం యత్సరసి కురుతః ఖేలతో యత్ఖగాద్యైః**
**వృందారణ్యం పరమపరమం తన్న సేవేత కో క్వా ? 10**

పరమ కుతూహలంతో శ్రీరాధాకృష్ణులు బృందావనంలోని లతాదుల నుండి అనేకములైన పుష్పాలను సేకరించి, ప్రశంసా పూర్వకంగా తమ సేవలో వినియోగించుకుంటారు. అక్కడి సరోవరాలలో వారు స్నానాదికాలను చేసి, పక్షి సమూహాలతో ఆడుతూ ఉంటారు. అటువంటి సర్వసుందర బృందావనాన్ని సేవించటం ఎవరికి మాత్రం ఉచితం కాదు! (అంటే అట్టి బృందావనాన్ని సేవించటమే అందరికీ ఉచితం అని భావం).

**ఆబాల్యం జలసేచనేన వరణేనావాల నిర్మాణతః**
**స్వేన శ్రీకరపల్లవేన మృదునా శ్రీరాధికా మాధవౌ**
**యాన్ సంవర్ధ్య వివాహ్య నవ్య కుసుమాద్యాలోక్యసన్నర్మభిః**
**మోదేతే సులతా తరూనహహ తాన్ వృందావనీయాన్నమః 11**

బాల్యం నుండి తమ కోమల కరపల్లవాలతో పాదులుచేసి, ఆలంబానాన్ని నిర్మించి, నీటితో తడిపి శ్రీరాధామాధవులు బృందావనంలోని మనోహర వృక్ష లతాదికాన్ని పెంచారు. వృక్ష, లతలకు వివాహం చేసి, వాటికి వికసించిన నవనవ కుసుమాలను చూస్తూ ఇద్దరూ పరిహాస వాక్యాలు పలుకుతూ ఆనందిస్తున్నారు. బృందావనంలోని ఆ వృక్ష, లతలకు మేము నమస్కరిస్తున్నాము.

**ద్రవంతి హరిభావస్తరణ తారణేऽతి క్షమా**
**స్తతో ద్రుమతరుప్రథా వ్రతతయశ్చ కృష్ణవ్రతాః**
**స్ఫురంతి హరిణా ఇహ ప్రకట కృష్ణసార ప్రథా**
**మృగాశ్చ పదమార్గిణః ప్రవిలసంతి వృందావనే 12**

శ్రీబృందావనంలో శ్రీహరిపట్ల కలిగే భావవశం చేత ద్రవీభూతములై 'ద్రుమము'లు (చెట్లు) అన్వర్థనామంతో విరాజిల్లుతున్నాయి. ఇతరులను తరింపజేసే గుణం చేత 'తరు' అనే నామాన్ని యదార్థం చేసుకున్నాయి. లతాదులు కృష్ణ వ్రత ధారణం చేత 'వ్రతతి' అనే పేరును సార్థకం చేసుకున్నాయి. ఇక్కడి హరిణాలు శ్రీకృష్ణునికి కూడ సారాతిసారమైన దానిని (శ్రీరాధ) గ్రహించటం చేత 'కృష్ణసార' నామాన్ని పొందాయి. శ్రీకృష్ణుని చరణచిహ్నాలను అనుసరించటం వలన వాటికి గల 'మృగ' అనే పేరు కూడ సార్థకతను పొందింది.

**అనంతరుచిమత్ స్థలం స్ఫురదనంత వల్లీ ద్రుమమ్**
**మృగద్విజమనంతకం దధదనంత కుంజోజ్జ్వలమ్**
**అనంత సుసరిత్సరోవరమనంత రత్నాచలమ్**
**స్మరామ్యహమనంత తద్ద్వయ రసేన వృందావనమ్ 13**

అనంతములైన మనోహర ప్రదేశములతో కూడి, అనంత వృక్షవల్లరీ సమూహాలతో శోభిస్తూ, అనంత పశుపక్ష్యాదులు చేసే ధ్వనులతో రవళిస్తూ, పరమోజ్జ్వలమైన అనంత కుంజవాటికలతో అలంకృతమై, అనంత మనోహర నదీ సరోవరాలతో కూడి, అనంతములైన రత్నపర్వతాలతో శోభిస్తూ, శ్రీయుగళకిశోరుల రసమయ లీలలకు నిలయమైన శ్రీబృందావనాన్ని నేను స్మరిస్తున్నాను.

**భ్రాతర్భోగాః సుభుక్తాః క ఇహ న భవతా నాపి సంసారమధ్యే**
**విద్యా దానాధ్వరాద్యైః కతి కతి జగతి ఖ్యాతి పూజాద్యలబ్ధాః**
**అద్యాహోరేఽపి యాదృచ్ఛిక ఉరుగుణవానప్యహో సంవృతాత్మా**
**శ్రీమద్బృందావనేఽస్మిన్ సతతమట సఖే సర్వతో ముక్తసంగః 14**

సోదరా! ఈ లోకంలో నీవు ఎన్నెన్ని భోగాలు అనుభవించలేదు! విద్య, దాన, యజ్ఞాదికాల ద్వారా ఖ్యాతిని, పూజ్యతను పొందలేదా! ఇక ఇప్పుడు

లభించిన ఆహారంతో సంతుష్టి చెందుతూ, గుణవంతుడివైనా ఆ గుణాలను దాచి, సర్వసంగపరిత్యాగివై ఈ బృందావనంలో నిరంతరం సంచరించు!

**వృందారణ్యం త్యజేతి ప్రవదతి యది కోఽప్యస్య జిహ్వాం ఛినద్మి**
**శ్రీమద్బృందావనాన్మాం యది నయతి బలాత్కోఽపి తం హన్మ్యవశ్యమ్**
**కామం వేశ్యాముపేయాం న ఖలు పరిణయాయాన్యతో యామి కామమ్**
**చౌర్యం కుర్యాం ధనార్థం న తు చలతి పదం హంత వృందావనాన్మే 15**

ఎవరైనా నన్ను బృందావనాన్ని త్యజించమని చెప్తే, వాని నాలుకను కోసివేస్తాను. ఎవరైనా బలపూర్వకంగా నన్ను బృందావనం నుండి అన్యప్రదేశానికి తీసుకొని వెళ్తే, నేను అతనిని తప్పక చంపేస్తాను. ఇష్టపూర్వకంగా వేశ్యతోడి సంగత్వాన్ని కలిగి ఉన్నప్పటికీ, వివాహం చేసికొనటానికి అన్యత్ర వెళ్లను. ధనం కోసం అవసరమైతే దొంగతనమైనా చేస్తానుకాని, హా! బృందావనాన్ని విడచి ఒక్క అడుగుకూడ బయటకు వెళ్లను.

ఈ గ్రంథంలో అక్కడక్కడ ప్రక్షిప్తాలు ఉన్నాయని అంటారు. అంటే కాలక్రమంలో కొన్ని శ్లోకాలు లుప్తమైపోతే, అనంతరకాలంలో వేరొకరు ఆయా శ్లోకాలను పూరించి ఉండవచ్చు అని అర్థం!

బృందావన మహాత్ములు సుకుమార హృదయులు! నాలుక కోసివేయటం, చంపివేయటం వంటి పరుష పదజాలాన్ని వారు ఉపయోగించి ఉంటారంటే నమ్మశక్యం కాదు. కనుక అక్కడక్కడ కనిపించే ఇటువంటి శ్లోకాలు ప్రక్షిప్తాలై ఉండవచ్చును.

**పరీహాసేఽప్యన్యాప్రియ కథన మూకోఽతి బధిరః**
**పరేషాం దోషాను శ్రుతిమను విలోకేఽంధనయనః**
**శిలావన్నిశ్చేష్టః పరవపుషి బాధాలవవిధౌ**
**కదా వత్స్యామ్యస్మిన్ హరిదయిత వృందావన వనే 16**

పరిహాసానికైనా ఇతరులనుగూర్చి అప్రియాలను చెప్పటంలో మూగవానిగ ఉండు. ఇతరుల దోషాలను వినటంలో చెవిటివాడివైపో! ఇతరుల తప్పులను చూడవలసివచ్చినపుడు అంధునివలె ఉండు. ఇతరుల శరీరాలకు లేశమాత్రపు కష్టం కూడ కలిగించక, శిలవలె నిశ్చేష్టుడివై ఉండు. ఈ ప్రకారంగా నేను ఎప్పుడు హరికి ప్రియమైన బృందావనంలో నివసిస్తానో కదా!

**సోఢ్వాఽపి దుఃఖాని సుదుస్సహాని త్యక్త్వాఽప్యహో జాతికులాదికాని**
**భుక్త్వా శ్వపాకైరపి థుత్కృతాని వృందాటవీవాసమహం కరిష్యే 17**

అతి దుస్సహమైన దుఃఖాలను సహిస్తూనైనా, జాతి కులాదులను త్యజించి అయినా, చండాలుని చేతి ఆహారాన్ని భుజించవలసి వచ్చినా నేను బృందావనంలోనే నివసిస్తాను.

**నాహం గమిష్యామి సతాం సమీపతో నాహం వదిష్యామి నిజం కులాదికం**
**నాహం ముఖం దర్శయితాస్మి కస్యాచిత్ బృందాటవీ వాసకృతేఽతి సాహసీ 18**

సత్పురుషుల నుండి దూరంగా వెళ్లను. నా కులాదిక పరిచయం చేసుకోను. బృందావనవాసిగా ఉంటూ, అతి సాహసినై ఎవరికీ నా ముఖం చూపించను.

**సర్వాభాస జ్యోతిషోఽనంతపారస్యాంతర్జ్యోతి ర్వైష్ణవానంద సాంద్రమ్**
**తస్యాప్యంతర్జ్యోతి రస్య ప్రమేయానందా స్వాదం తత్ర వృందావటీయమ్ 19**

అనంతము, సర్వప్రకాశమునైన బ్రహ్మజ్యోతికి అంతర్ జ్యోతి ఆనంద సాంద్రమైన విష్ణుధామం! దానికన్నను అంతరతరజ్యోతి – అపరిమిత ఆనంద ఆస్వాదనీయమైన వ్రజమండలం! దానికన్నను సారాతిసారమైనది శ్రీబృందావనము!

**కిం క్రీడైవ శరీరిణీ స్మరకలా కిం దేహినీ కిం రతిః**
**స్వాభా మూర్తిమతీ కిమద్భుతమనోజన్మాస్త్ర విద్యైవ వా**
**కిం వా జీవనశక్తిరేవ సతనుః శ్యామస్య న జ్ఞాయతే**
**సా రాధా విజరీహరీతి హరిణా వృందావనేఽహర్నిశమ్ 20**

ఇదియేమి, శరీరాన్ని ధరించిన క్రీడయా! లేక రూపుదాల్చిన స్మరకళయా! మూర్తీభవించిన కాంతివలె వెలుగుతున్న రతీదేవియా! లేక అవతరించిన అద్భుత కామాస్త్ర విద్యా స్వరూపిణియా! లేక దేహాన్ని ధరించిన శ్యామసుందరుని జీవన శక్తియా! ఇది ఏదో కొంచెమైనా తెలియటం లేదు. ఆఁ! అది శ్రీరాధయే, శ్రీహరితో కలసి అహర్నిశలు బృందావనంలో విహరిస్తున్నది.

**సర్వప్రేమ రసైక బీజవిలసత్ విప్రున్మహా మాధురీ**
**పూర్ణస్వర్ణసుగౌరమోహన మహాజ్యోతిః సుధైకాంబుధీన్**
**ఏకైకాంగత ఉన్మద స్మరకలా రంగాన్ దుహంత్యద్భుతాన్**
**వృందాకానన సంప్లవాన్ హృది మమ శ్యామప్రియా ఖేలతు 21**

ప్రేమరసానికి ముఖ్యబీజ రూపమైన, మహామాధుర్య పూర్ణమైన 'గౌరమోహన మహాజ్యోతి' బృందావనాన్ని ప్లావితం చేస్తున్నది. పూర్ణామృత రససాగరమై, ప్రత్యంగం లోను అద్భుత ఉన్మత్త ప్రేమకళ ప్రకాశిస్తూ ఉన్న ఆ శ్రీశ్యామప్రియ నా హృదయంలో విహరించునుగాక!

**లోలద్వేణ్యః పృథుసుజఘనాః క్షామమధ్యాః కిశోరీః**
**సంవీత శ్రీస్తన ముకులయోరుల్లసత్‌హారయష్టీః**
**నానా దివ్యాభరణవసనాః స్నిగ్ధకాశ్మీర గౌరీః**
**వృందాటవ్యాం స్మర రసమయీ రాధికా కింకరీస్తాః 22**

నాట్యమాడుతున్న నీలాల కురులతోను, విశాలమైన జఘనాలతోను, సన్నని నడుముతోను, సుందరమైన వక్షస్థలంపై శోభిస్తున్న హారంతోను; కిశోరావస్థలో, దివ్యాభరణ వస్త్రాలతో అలంకృతులై కాశ్మీరగౌరవర్ణంతో ప్రకాశిస్తున్న రసస్వరూపులైన శ్రీరాధా కింకరీమణులను స్మరింపుము!

**ఆః కీదృక్ పుణ్యరాశేః సుపరిణతిరియం కేయమాశ్చర్యరూపా**

**కారుణ్యౌదార్యలీలా స్ఫురతి భగవతః కో ను లాభోఽద్భుతోఽయమ్ ?**

**యద్వానాశ్చర్యమేతన్నిజ సహజగుణం మోహితశ్రీవిధీశా**

**ద్యత్యుచ్చైర్వస్తు వృందావనమిదమవనౌ యత్ స్వయం ప్రాదురాస్తే 23**

ఆహా! ఇది ఎట్టి పుణ్యరాశి యొక్క పరిణతి ? ఆహా! ఇది భగవంతుని ఆశ్చర్యమయ కరుణ, ఉదారతల లీలలను స్ఫురింపజేస్తున్నదా ఏమి ? ఓహో, ఎట్టి అద్భుత లాభం ? లేదు; ఇందులో ఆశ్చర్యపడవలసిన విషయం ఏమీ లేదు. ఇది అత్యంత ఉత్కృష్టమైన వస్తువు; దీని పట్ల లక్ష్మి, బ్రహ్మ, శివాది దేవగణాలు కూడ మోహితులై ఉంటున్నారు. **భగవంతుని సహజగుణమే బృందావన రూపంగా భూమిపై ఆవిర్భవించింది!**

**రటన్ వృందారణ్యేఽత్యవిరతమటం స్తత్ర పరితో**

**నటన్ గాయన్ ప్రేమ్ణా పులకిత వపుస్తత్ర విలుఠన్**

**త్రుటత్ సర్వగ్రంథిః స్ఫుటదతిరసోపాస్తి పటిమా**

**కదాహం ధన్యానాం ముకుటమణిరేషోఽస్మి భవితా 24**

నిరంతరం గుణవర్ణన చేస్తూ శ్రీబృందావనంలో అటు ఇటు సంచరిస్తూ; నాట్యం, గానం చేస్తూ; ప్రేమతో పులకితుడినై వ్రజరజంపై దొరలుతూ గ్రంథుల నన్నిటిని పోగొట్టుకొని; స్ఫూర్తిని పొంది, అత్యుత్తమ రసమయ ఉపాసనా నైపుణ్యంతో నేను ఎప్పుడు ధన్యాతిధన్యుడను ఔతాను ?

**సౌందర్యాది మహాచమత్కృతినిధీ దివ్యౌ కిశోరౌ మహా**

**గౌరశ్యామ తనుచ్ఛవీ నిశిదివా యత్రైవ విక్రీడతః**

**యత్రైవాఖిల దివ్యకానన గుణోత్కర్షోఽతి కాష్ఠాం గత**

**స్తద్బృందావిపినం కదా ను మధుర ప్రేమానువృత్యా భజే 25**

శ్రీబృందావనంలో సౌందర్యాది కళలతో కూడిన చమత్కార సాగరం వెలుగుతున్నది. గౌరశ్యామ మహాకాంతితో ప్రకాశిస్తున్న శ్రీయుగళకిశోరులు అహర్నిశలు అక్కడ క్రీడిస్తున్నారు. సమస్తములైన అప్రాకృత వనముల గుణమణులు అక్కడ పరాకాష్ఠ స్థితిని పొందుతున్నాయి. అట్టి శ్రీబృందావనంలో ఎప్పుడు నేను మధురప్రేమతో భజన చేస్తాను ?

**అనాదౌ సంసారే కతి నరకభోగా న విహితాః**
**కియంతో బ్రహ్మేంద్రాద్యతుల సుఖభోగాశ్చ న కృతాః**
**తదాస్మిన్నేకస్మిన్ వపుషి సుఖదుఃఖే న గణయన్**
**సదైవ శ్రీవృందావనమఖిల సారం భజ సఖే! 26**

ఓ సఖా! అనాదిగా ఈ లోకంలో ఎన్ని నరక భోగాలు కలుగలేదు ? బ్రహ్మ, ఇంద్రాదుల సుఖభోగాలు ఎన్నెన్ని తిరస్కృతం కాలేదు ? కనుక ఇప్పుడు ఈ శరీరానికి సంబంధించిన సుఖదుఃఖాలను లెక్కింపక; నిరంతరం పరమ పావనమైన, సారాతి సారమైన శ్రీబృందావనంలో నివసించు!

**శ్రీవృందావనవాసి పాదరజసా సర్వాంగమాగుంఠయన్**
**శ్రీవృందావనమేకముజ్జ్వలతమం పశ్యన్ సమస్తోపరి**
**శ్రీవృందావన మాధురీభిరనిశం శ్రీరాధికా కృష్ణయోః**
**అప్యావేశమనుస్మరన్నధివస శ్రీధామ వృందావనమ్ 27**

శ్రీబృందావన వాసుల చరణరజాన్ని సర్వాంగాలకు పూసుకొని, ఉజ్వల తమమైన బృందావనమే సర్వోపరి అని గ్రహించి, శ్రీబృందావన మాధుర్యంలో మునిగి, సదా శ్రీరాధాకృష్ణులను ప్రేమపూర్వకంగా స్మరిస్తూ శ్రీధామ బృందావనంలోనే వసించు!

**వృందాకానన! కాననస్య పరమా శోభా పరాతః పరా**
**నంద త్వద్గుణ వృందమేవ మధురం యేనానిశం గీయతే**
**హా వృందావన! కోటి జీవనమపి త్వత్తోఽతి తుచ్ఛం యది**
**జ్ఞాతం తర్హి కిమస్తి యత్తృణకవచ్ఛక్యేత నోపేక్షితుమ్ 28**

హే బృందావనమా! నీ వనశోభ సర్వోత్కృష్టమై ఉన్నది. హే పరానందమా! నీ మధురగుణాలను అహర్నిశలు గానం చేస్తూ, కోటి జీవనాలు కూడ నీ ముందు తుచ్ఛములని గ్రహించి, లోకంలోని వస్తువులన్నిటినీ తృణప్రాయంగా ఉపేక్షించకుండ ఎవరు ఉండగలరు ? (అంటే తృణప్రాయంగా వదలివేస్తారని భావం!)

**స్వాత్మేశ్వర్యా మమాద్య ప్రణయ రసమహామాధురీ సారమూర్త్యా**
**కోఽపి శ్యామః కిశోరః కనకవరరుచా శ్రీకిశోర్యా కయాపి**
**క్రీడత్యానంద సారాంతిమ పరమ చమత్కార సర్వస్వమూర్తిః**
**నిత్యానంగోత్తరంగైర్యదధి భజ తదేవాద్య వృందావనం భోః 29**

ఆనందసారానికి పరమపరాకాష్ఠయైన, పరమచమత్కారానికి మూర్తిమంతమైన ఒకానొక శ్యామకిశోరుడు నిరంతరం అనంగతరంగాలలో ఉన్మత్తుడై; నిజప్రాణేశ్వరి, ఆద్యప్రేమరస మహామాధుర్యసారమూర్తి, ఒకానొక స్వర్ణకాంతి విశిష్ట స్వరూపిణి అయిన శ్రీకిశోరితో కలసి నిత్యమూ క్రీడిస్తున్నాడు. వారి క్రీడాస్థలియైన ఆ బృందావనాన్ని ఈ క్షణం నుండియే భజించు!

**నవకనక చంపకావలి దలితేందీవర సువృంద నిందిత శ్రీ**
**వృందావన నవకుంజే కిశోరమిథునం తదేవ భజ రసికమ్ 30**

ఒకరి దేహకాంతి స్వర్ణమయమై, చంపకముల కాంతిని తిరస్కరిస్తున్నది. రెండవవారి దేహకాంతి జ్యోతిర్మయమై, వికసించిన నీలికమల శోభను

తిరస్కరిస్తున్నది. శ్రీబృందావన నవనవ కుంజలలో విహరిస్తున్న ఆ రసిక యుగళ కిశోరులను స్మరించు!

**పరిచర చరణ సరోజం తద్గౌరశ్యామ రసిక దంపత్యోః**
**వృందావన నవకుంజావలిషు మహానంగ విహ్వలయోః 31**

శ్రీబృందావన నవకుంజలలో మహానంగ క్రీడలో విహ్వలురైన ఆ గౌరశ్యామ రసికయుగళం యొక్క శ్రీచరణకమలాలను సేవించు.

**అతి కందర్ప రసోన్మదమనిశం వివర్ధ్విష్ణు తన్మిథః ప్రేమ**
**ఘనపులక గౌరలీలాకృతి మిథునం నికుంజమండలే స్మరత 32**

కందర్ప (ప్రేమ) రసంచేత అత్యంత ఉన్మదులైన యుగళ కిశోరుల పరస్పరానురాగం నిత్యం వృద్ధి చెందుతున్నది. పులకరింతలతో శోభిస్తున్న, గౌరనీల కాంతి విశిష్టులైన ఆ నిత్యనూతన జంటను నికుంజమండలంలో స్మరించు.

**పూర్ణ ప్రేమానంద చిచ్చంద్రికాబ్ధేర్మధ్యే ద్వీపం కించిదాశ్చర్య రూపమ్**
**తత్రాశ్చర్యాభాతి వృందావటీయం తత్రాశ్చర్యౌ గౌరనీల కిశోరౌ 33**

పూర్ణ ప్రేమానంద దివ్యజ్యోత్స్నా సాగరంలో ఒక ఆశ్చర్యకరమైన ద్వీపం ఉన్నది. అందులో బృందావనం అనే మరొక ఆశ్చర్యరూపం ఉన్నది. అందులో పరమాశ్చర్య స్వరూపులైన గౌరనీలయుగళ కిశోరులు వెలుగొందుతున్నారు.

**ధన్యో లోకే ముముక్షుర్హరి భజనపరో ధన్యధన్యస్తతోఽసౌ**
**ధన్యో యః కృష్ణపాదాంబుజ రతిపరమో రుక్మిణీశ ప్రియోఽతః**
**యాశోదేయ ప్రియోఽతః సుబల సుహృదతో గోపీకాంత ప్రియోఽతః**
**శ్రీమద్బృందావనేశ్వర్యతి రసవివశారాధకః సర్వమూర్ధ్ని 34**

ఈ పృథివిపై ఉన్న ముముక్షువులు ధన్యులు. హరిభజన పరాయణులు ధన్యాతిధన్యులు. శ్రీకృష్ణచరణకమలాలపై పరమాసక్తి కలవారు వారికన్న

ఉత్కృష్టులు! రుక్మిణీ వల్లభుడైన శ్రీకృష్ణుని భక్తులు మరింత అధికులు! అంతకన్న, యశోదానందనుడైన శ్రీకృష్ణుని భక్తబృందం మరింత ప్రశంసనీయులు. శ్రీకృష్ణుని సఖాగణమైన సుబలాది మిత్రులు అంతకన్న ధన్యులు. వారి కన్న గోపీజనులు ధన్యులు, శ్రీకృష్ణునికి ప్రీతిపాత్రులు! కాని, బృందావనేశ్వరియైన శ్రీరాధాపరమ రసంచేత వివశుడై ఉండే శ్రీకృష్ణుడిని ఆరాధించువాడు వారందరిలోను ముకుటమణి!

**ఏకం సఖ్యాపి నో లక్షితమురసి లసన్నిత్య తాదాత్మ్య కాంతమ్**
**తద్దృశ్యం దూరతోఽన్యత్ వ్రతతి నవగృహేఽన్యత్తు తన్నర్మశర్మ**
**అన్యద్బృందావనాంతర్విహరదథ పరం గోకులే ప్రాప్తయోగమ్**
**విచ్ఛేద్యన్యత్తదేవం లసతి బహువిధం రాధికా కృష్ణరూపమ్ 35**

శ్రీరాధాకృష్ణ రూపం అనేకభావాలతో విలాసపరాయణమై విరాజిల్లుతున్నది. ఒక భావావస్థలో, సఖీమణులకు కూడ అలక్షితమైన భావంతో కాంతాకాంతులు గాఢాలింగన పూర్వకంగా నిత్య తాదాత్మ్య భావంలో ఉంటారు. మరొక అవస్థలో సఖీగణాలకు దూరంగా కనిపిస్తూ, లతానిర్మితమైన నవీన కుంజలో కలసి ఉంటారు. ఇంకొక అవస్థలో, నికుంజమందిరంలో ఇద్దరూ పరిహాస పూర్వకమైన మంగళకర సంభాషణలో నిమగ్నులై ఉంటారు. అన్యావస్థలో బృందావనంలో నిత్యవిహార శీలురై వెలుగొందుతూ ఉంటారు. వేరే అవస్థలో గోకులంలో కలసి మెలసి ఉంటూ, మరొక అవస్థలో వారు విరహదశను పొందుతూ ఉంటారు. అనంతరం సమృద్ధమైన సంయోగానందంలో ఉభయులు కలసి ఉంటారు.

**నిత్యోత్తుంగదనంగరంగ విలసల్లీలా తరంగం సదా**
**రాధామానసదివ్యమీన నిలయం తద్వక్త్రచంద్రశ్రితమ్**
**తత్ కందర్ప సుమందరేణ మథితం సఖ్యక్షిపీయూషదమ్**
**కచించ్ఛ్యామ రసాంబుధిం భజసఖే! వృందాటవీ సీమని 36**

సఖా! బృందావనసీమలోని ఆ అనిర్వచనీయ శ్యామరససాగరాన్ని భజించు! ఆ శ్యామరస సముద్రంలో నిరంతరం అనంగరంగలీలామయమైన ఉత్తుంగ తరంగాలు ప్రకాశితం ఔతూ ఉంటాయి. అందులో శ్రీరాధా మనస్సు అనెడి దివ్యమీనం సదా వసిస్తూ ఉంటుంది. ఆ రససాగరం శ్రీరాధా ముఖ చంద్రునిచూచి ఎగసిపడుతూ ఉంటుంది. శ్రీరాధాప్రేమరూప పర్వతం చేత అది మథింప బడుతూ, సఖియల కన్నులకు అమృతదానం చేస్తూ ఉంటుంది.

**శ్యామప్రాణమృగైక ఖేలన వనశ్రేణీ సదా శ్యామలోత్**
**ఖేలన్మానస మీనదివ్య సరసీ శ్యామాలి సత్పద్మినీ**
**శ్యామానంగ సుతప్తహృచ్ఛిశిరతాకారి స్ఫురచ్చంద్రికా**
**శ్యామానన్య సునాగరేణ విహరత్యేకా మమ స్వామినీ 37**

అది శ్యామసుందరుని ప్రాణరూప మృగమునకు ఏకైక క్రీడాస్థలి! ఉజ్వల రసంలో క్రీడా పరాయణమైన మనోరూప మీనమునకు దివ్యసరోవరం! శ్యామ రూపభ్రమరానికి పద్మము! శ్యాముని ప్రేమతప్త హృదయాన్ని శీతలపరచే ఉజ్వల చంద్రిక! అది నా స్వామినియైన శ్రీరాధయే! ఆ శ్యామాదేవి అనన్య నాగరుడైన శ్యామసుందరునితో కలసి విహరిస్తున్నది.

**శ్రీమద్బృందాకాననే రత్నవల్లీ వృక్షైశ్చిత్రజ్యోతిరానంద పుష్పైః**
**కీర్ణే స్వర్ణస్థల్యుదంచత్ కదంబచ్ఛాయా యాం నశ్చక్షుషీ గౌరనీలే 38**

శ్రీబృందావనం రత్నమయములైన లతలతో, వృక్షాలతో అలంకృతమై విచిత్ర జ్యోత్స్నలను విస్తరింపజేస్తూ, ఆనందమయ పుష్పాలతో వ్యాప్తి చెంది ఉన్నది. అట్టి స్వర్ణమయ ప్రదేశంతో శోభిస్తున్న కదంబ వృక్షఛాయలో విరాజమానులైన గౌరనీల కాంతి స్వరూపులు శ్రీయుగళ కిశోరులే నిరంతరం నానేత్రాలలో వెలుగుతూ ఉంటారు.

**శ్రీవృందాకాననేఽత్యద్భుత కుసుమ లసద్రత్నవల్లీ నికుంజ**
**ప్రాసాదే పుష్పచంద్రాతపచయరుచిరే పుష్పపల్యంకతల్పే**
**రాధాకృష్ణౌ విచిత్ర స్మర సమరకలా ఖేలినౌ వీక్ష్య వీక్ష్యా**
**నందాద్విభ్రామితం తల్లుఠదవనితలే వంద్యతామాలివృందమ్ 39**

శ్రీబృందావనంలో అత్యంత అద్భుతపుష్పాలతో శోభిస్తున్న రత్నమయ లతా నికుంజమందిరం! అందులో పూవులతో అలంకృతమైన మనోహర పుష్పశయ్య! దానిపై విచిత్ర ప్రేమయుద్ధకేళీ పరాయణులైన శ్రీరాధాకృష్ణులను చూచి, చూచి ఆనంద వివశత్వంతో భూమిపై వాలిపోయిన సఖీబృందానికి నమస్కృతులు!

**ప్రేష్ఠ ద్వంద్వ ప్రసాదాభరణ వరసువస్త్రజ్ నవాభీర బాలా**
**మాలాలంకార కస్తూర్యగురు ఘుసృణ సద్గంధ తాంబూల వస్త్రైః**
**వాద్యై సంగీత నృత్యైరనుపమ కలయా లాలయంతీః సతృష్ణా**
**రాధాకృష్ణావఖండ స్వరస విలసితౌ కుంజవీథ్యాముపైమి 40**

ప్రియతమ యుగళ కిశోరులు ప్రసాదించిన ఆభరణాలను, వస్త్ర మాల్యాదులను అలంకరించుకొనిన గోపబాలికలు మాల, అలంకార, కస్తూరి, అగరు, కుంకుమ, సురభిళ తాంబూల, వస్త్రాదికాలను వహించి వచ్చారు. అనుపమానమైన తాళ, వాద్య, నృత్యాదులతో వారు అఖండ, నికుంజ, స్వర విలాసులైన శ్రీరాధాకృష్ణ యుగళాన్ని తృప్తితీరని భావంతో సేవిస్తున్నారు. నేను వారికి శరణాగతి చేస్తున్నాను.

**కాశ్చిచ్చందన ఘర్షిణీః సఘుసృణం కాశ్చిత్ స్రజో గ్రంథతీః**
**కాశ్చిత్కేళి నికుంజ మండనపరాః కాశ్చిద్వహంతీర్జలమ్**
**కాశ్చిద్దివ్య దుకూల కుంచనపరాః సంగృహ్ణతీః కాశ్చనాఽ**
**లంకారం నవమన్నపాన విధిషు వ్యగ్రాశ్చిరం కాశ్చన 41**

కొందరు గోపబాలికలు ఉత్తమకుంకుమయుక్తమైన చందనం తీస్తున్నారు. కొందరు మాలలు కట్టటంలో లగ్నమై ఉన్నారు. మరికొందరు కేళీనికుంజను అలంకరిస్తున్నారు. ఇంక కొందరు జలాన్ని తెస్తున్నారు. కొందరు కొత్తకొత్త అలంకారాలను ఏర్పరుస్తున్నారు. మరికొందరు జాగ్రత్తగా ఆహారపానీయాలను శ్రద్ధతో ఏర్పాటు చేస్తున్నారు.

**తాంబూలోత్తమ వీటికాది కరణే కాశ్చిన్నివిష్టే నవాః**
**కాశ్చిన్నర్తనగీత వాద్యసుకలా సామగ్రి సంపాదికాః**
**స్నానాభ్యంగవిధౌ చ కాశ్చన రతాః సంవీజనాద్యైః సదా**
**కాశ్చిత్ సన్నిధి సేవనాతిముదితాః కాశ్చిత్ సమస్తేక్షికాః 42**

కొందరు గోపికారమణులు ఉత్తమమైన తాంబూల వీటికాదులను ఏర్పరచటంలో నిమగ్నులైనారు. కొందరు నృత్య, గీత, వాద్యాది ఉత్తమోత్తమ కళావిద్యను ప్రదర్శించటానికి కావలసిన వస్తువులను సమకూరుస్తున్నారు. మరికొందరు అభ్యంగన స్నానానికి అవసరమైన సామగ్రిని ఏర్పాటు చేస్తున్నారు. ఇంక కొందరు వింజామరలను చేతపూని శ్రీయుగళ సన్నిధిలో నిలచి, వారి శ్రీఅంగాలను సేవించటంలో అత్యంత ముదితులై ఉన్నారు. మరికొందరు గోపస్త్రీలు అన్ని విషయాలను పర్యవేక్షిస్తున్నారు.

**కాశ్చిత్ స్వప్రియ యుగ్మచేష్టిత దృశః స్తబ్ధాః స్వకృత్యే స్థితాః**
**క్షిప్త్వాఽన్యాలి ప్రవర్తితా దయితయోః కాశ్చిత్ సుఖేలా పరాః**
**ఇత్థం విహ్వల విహ్వలాః ప్రణయతః శ్రీరాధికాకృష్ణయోః**
**దాసీరద్భుతరూపకాంతి వయసో వృందావనేఽన్వీయతామ్ (విశేషకమ్) 43**

కొందరు తమ ప్రియతమ యుగళ కిశోరుల భావమయ క్రీడను చూస్తూ తమ పనులను మరచిపోయారు. మరి యొక గోపిక తనపనిని ఇంకొక సఖికి అప్పగించి, ప్రియతమ యుగళ కిశోరుల సుందర క్రీడలో తాను కూడ పాల్గొన్నది.

ఈ విధంగా శ్రీరాధాకృష్ణుల పట్ల అత్యంత ప్రేమతో విహ్వలురైన అద్భుత రూపకాంతి స్వరూప సఖియలకై శ్రీబృందావనంలో అన్వేషించు!

**ఏకం చిత్రశిఖండ చూడమపరం శ్రీవేణిశోభాద్భుతమ్**
**వక్షశ్చందనచిత్రమేకమపరం చిత్రం స్ఫురత్ కంచుకమ్**
**ఏకం రత్నవిచిత్రపీతవసనం జంఘాంత వస్త్రోపరి**
**భ్రాజద్రత్న సుచిత్ర శోణవసనే నాన్యచ్చ సంశోభితమ్ 44**

ఒకరు అద్భుతమైన మయూర పింఛాన్ని శిరసుపై ధరించారు. రెండవవారు శ్రీకేశరాశితో అద్భుతంగా శోభిస్తున్నారు. ఒకరి వక్షస్థలం చందన చిత్రితమై ఉండగా, రెండవవారి వక్షస్థలంపై విచిత్రమైన కంచుకం శోభిస్తున్నది. ఒకరు పీతాంబరధారి; రెండవవారు క్రిందివరకు విస్తృతమై ఉన్న వస్త్రాన్ని, దానిపై బహురత్నాలను పొదిగిన ఎఱ్ఱని వస్త్రాన్ని ధరించి శోభిస్తున్నారు. (శ్రీరాధాకృష్ణుల వర్ణన).

**ఇత్థం దివ్య విచిత్రవేశ మధురం తద్గౌరనీలం మిథః**
**ప్రేమావేశ హసత్కిశోర మిథునం దిగ్వ్యాపి చిత్రచ్ఛటమ్**
**కాంచీ నూపురనాద రత్నమురళీ గీతేన సమ్మోహయత్**
**శ్రీవృందావన చిద్ఘన స్థిర చరం రంగే మహా శ్రీమతి 45**

గౌరనీల శరీరధారులైన శ్రీయుగళ కిశోరులు ఈ విధంగా దివ్యవిచిత్ర వేష మాధుర్యమూర్తులై, నాలుగు దిక్కులలోను విచిత్రకాంతిని విస్తరింపజేస్తున్నారు. వారు ప్రేమావేశంతో హాసపరిహాసాదులను ప్రకటిస్తున్నారు. మహాసౌందర్యశాలియైన శ్రీబృందావనంలోని స్థావర, జంగమాత్మక వస్తువులనన్నిటిని వడ్డాణ, మంజీర నాదాలతోను, మధుర వంశీగానంతోను సమ్యక్ప్రకారంగా ముగ్ధులను చేస్తూ శ్రీయుగళం విరాజమానులైనారు.

**అన్యాలీముఖ శబ్దకే మణిమయే మీలన్మృదంగ ధ్వనౌ**
**ప్రోత్సార్యైవ ప్రవిష్టవజ్జవనికాముక్తీర్య పుష్పాంజలీమ్**
**అత్యాశ్చర్య సునృత్య హస్తక మహాశ్చర్యాంగ దృగ్భంగిమో**
**త్తుంగానంగ రసోత్సవం భజతి మే ప్రాణద్వయం కః కృతీ (యుగ్మకమ్) 46**

ఆ మణిమయ రంగస్థలిపై సఖీమణుల ముఖతః వెలువడుతున్న శబ్దాలు, మృదంగ ధ్వని వినవస్తూనే తెరను తొలగించి పుష్పాంజలి పూర్వకంగా శ్రీయుగళం ప్రవేశించారు. ఆశ్చర్యజనకములైన నానావిధ హస్తభంగిమలతో నృత్యం చేస్తూ; మహాశ్చర్యమయ అంగ, నేత్రభంగిమలతో మహాప్రేమ రసోత్సవాన్ని ప్రకటిస్తున్న నా ప్రాణప్రియతమ యుగళ కిశోరులను ఒకానొక పుణ్యాత్ముడు మాత్రమే భజించగలడు.

**అనంతరతిమత్ప్రియచ్ఛవి విలాస సమ్మోహనమ్**
**మహారసిక నాగరాద్భుత కిశోరయోస్తద్ద్వయమ్**
**విచిత్ర రతిలీలయా నవనికుంజ పుంజోదరే**
**స్మరామి విహరన్మహాప్రణయ ఘూర్ణితాంగం మిథః 47**

మహారసిక నాగరులు, అద్భుత శ్రీయుగళకిశోరులు అయిన శ్రీ శ్యామా శ్యాములు అనంత రతిశీలురు, మనోహర కాంతి విలాస సమ్మోహనులు! విచిత్ర రతిలీలలతో నిత్యనవీన నికుంజలలో విహారపరాయణులై, మహాప్రీతిరసం చేత ఘూర్ణితులైన శ్రీయుగళాన్ని స్మరిస్తున్నాను.

**కదా కనకచంపకద్యుతి వినిందితేందీవరమ్**
**వరం నవకిశోరయోర్ద్వయమగాధ భావం మిథః**
**పురః స్ఫురతు మన్మథక్షుభిత మూర్తి వృందాటవీమ్**
**మమాధివసతో మహాసరస దివ్యచక్షుర్యుజః 48**

స్వర్ణచంపక, నీలికమల కాంతులను తిరస్కరించు కాంతి స్వరూపులు; మహారస దివ్య నేత్రధారులు అయిన ఆ నవకిశోరయుగళం బృందావన వాసులు! ఒకరిపట్ల ఒకరు అగాధభావయుక్త ప్రేమరస విమోహితులై వారు నా యెదుట ఎప్పుడు స్ఫురిస్తారో కదా! (దర్శనం ఇస్తారో కదా)!

**ప్రేమానందోజ్వల రసమయ జ్యోతిరేకార్ణవాంతః**
**తాదాత్మ్యేన స్ఫురతు బహుధాశ్చర్య వృందావనమ్ మే**
**కుంజే కుంజే మధుర మధురం తత్ర ఖేలత్ కిశోర**
**ద్వంద్వం గౌరాసిత రుచి మనస్తద్రసార్ద్రం క్రియాన్మే 49**

ఒకానొక అనిర్వచనీయ సముద్రాంతర్గతమై; ప్రేమానంద ఉజ్వల రసవిశిష్టము, జ్యోతిర్మయము అయిన శ్రీబృందావనం వెలుగుతున్నది. అట్టి బృందావనం ఆ తాదాత్మ్యభావంతో అనేక ప్రకారాలుగా ప్రకాశిస్తూ నాముందు ప్రకటితమగును గాక! శ్రీబృందావనంలోని ప్రత్యేక కుంజలలో మధురాతి మధుర లీలా విహారులైన గౌరశ్యామ శ్రీయుగళ కిశోరులు నా మనసును రసనిమగ్నమగునట్లు చేయుదురుగాక! ఇదే నా ప్రార్థన!

**దవిష్ఠే యస్తిష్ఠేదతి కుకృతి నిష్ఠః కువిషయే**
**సకృత్ వృందాటవ్యాస్తృణకమపి వందేత సుకృతీ**
**స తత్ప్రాణస్యోచ్ఛృంఖల నిఖిల శక్తేః కరుణయా**
**ధ్రువం దేహస్యాంతే హరిపదమలభ్యంచ లభతే 50**

దూరప్రాంతంలో ఉన్నప్పటికీ, విషయాదులలో దుష్కర్మ పరాయణులై ఉన్నప్పటికీ; ఒక్కసారి అయినా బృందావనంలోని గడ్డిపరకకైనా నమస్కరించి ఉంటే చాలు! ఆ ధన్యుడు బృందావన స్థిరచరాలకు ప్రాణస్వరూపులు, అనంతశక్తి పూర్ణులు అయిన శ్రీరాధాకృష్ణుల దయ వలన మరణానంతరం దుర్లభమైన శ్రీహరి చరణకమల సన్నిధిని పొందుతాడు.

**కుబేరాణాం కోటిర్హసతి ధనసంపత్తిభిరహో**
**తిరస్కుర్యాద్వర్యానపి సురగురూన్ బుద్ధివిభవైః**
**అశోచ్యః స్త్రీ పుత్రాదిభిరసమ ఈడ్యో హరిరసాత్**
**శుక ప్రహ్లాదాద్యై రతికృదిహ వృందావన వనే 51**

శ్రీబృందావనం పట్ల ప్రీతిని కలిగి ఉన్న వ్యక్తి తన ధనసంపత్తిచే కోటికోటి కుబేరులను కూడ పరిహసిస్తాడు. బుద్ధిసంపత్తితో దేవతల గురువైన బృహస్పతిని కూడ తిరస్కరిస్తాడు. అతడు భార్యాబిడ్డలతో ఉన్న సంసారి అయినా వారికై శోకించడు. అతడు శ్రీహరి యొక్క రసపాన విషయంలో శ్రీశుక, ప్రహ్లాదాదులతో కూడ ప్రశంసింపబడుతాడు.

(అంటే బృందావన ప్రీతి ముందు సంపద, జ్ఞానం, ఐహిక సుఖభోగాలు అన్నీ తిరస్కరింపతగినవే అని భావం)!

**త్యక్త్వా సర్వాన్ గృహ ద్వార సకలగుణాలంకృత స్త్రీ సుతాదీన్**
**సర్వత్రాత్యంత సమ్మాననమథ మహతః సత్కులాచారధర్మాన్**
**మాతాపిత్రోర్గురూణామపి చ న హి మనాగాగ్రహైః కోమలాత్మా**
**యో యాయా దేవ వృందావనమయమఖిలైః స్తూయతే ధన్య ధన్యః 52**

గృహాన్ని, గుణవతి అయిన భార్యను, పుత్రులను అందరినీ త్యజించి; గొప్పగొప్ప గౌరవాలకు, గొప్పవి అయిన కులాచార ధర్మాదికాలకు తిలాంజలి ఇచ్చి (విడచిపెట్టి); తలిదండ్రులు, గురుజనుల మాటలకు కొద్దిగా కూడ కరగి పోకుండ శ్రీబృందావనానికి వెళ్లిన వ్యక్తిని లోకులు అందరూ ప్రశంసిస్తారు. అతనికి ధన్యవాదాలు తెలుపుతారు.

**నో శ్రుణ్వన్ నైవ గృహ్ణన్ సకలతనుభృతాం క్వాపి దోషం గుణం వా**
**వృందావనస్థ సత్వాన్యఖిల గురుధియా సంనమన్ దండపాతైః**
**త్యక్తాశేషాభిమానో నిరవధి పరమాకించినః కృష్ణరాధా**
**ప్రేమానందాశ్రు ముంచన్నివసతి సుకృతీ కోఽపి వృందావనాంతః 53**

సమస్త జీవుల దోషాలను, గుణాలను గూర్చి వినక, పట్టించుకొనక; బృందావనంలో వసిస్తున్న సమస్త ప్రాణులయందు గురుబుద్ధితో దండవత్ప్రణామం చేస్తూ; అభిమానాన్ని త్యజించి, నిష్కించనుడై శ్రీరాధాకృష్ణులపై ప్రేమానందంతో అశ్రుపూర్ణుడై ఉండే ఒకానొక పుణ్యాత్ముడు మాత్రమే శ్రీబృందావనంలో నివసించగలడు!

**క్రందన్నార్తస్వరేణ క్షితిషు పరిలుఠన్ సంనమన్ ప్రాణబంధుమ్**
**కుర్వన్ దంతే తృణాన్యాదధదను కరుణాదృష్టయే కాకుకోటీః**
**తిష్ఠన్నేకాంత వృందావిపిన తరుతలే సవ్యపాణౌ కపోలమ్**
**న్యస్యాశ్రుణ్యేవ ముంచన్నయతి దిననిశాం కోఽపి ధన్యోఽత్యనన్యః 54**

ఆర్తస్వరంతో ఆక్రందిస్తూ, భూమిపై పొరలుతూ పొరలుతూ; ప్రాణబంధువైన శ్రీయుగళానికి దండవత్ప్రణామం చేస్తూ; దంతాలమధ్య గడ్డిపరకను పెట్టుకొని శ్యామాశ్యాముల కృపాకటాక్షానికై కోటికోటి దీనవచనాలను పలుకుతూ; బృందావనంలోని చెట్ల క్రింద ఏకాంతవాసం చేస్తూ; చేతిపై చెంపను చేర్చి, అశ్రుపూర్ణుడై రాత్రింబవళ్లు వ్యగ్రతతో ఉండేవాడే అనన్యధన్యుడు!

**ముంచన్ శోకాశ్రుధారాం సతతమరుచిమాన్ గ్రాసమాత్రాగ్రహేఽపి**
**క్షిప్తో బద్ధో హతో వా గిరివదవిచలః సర్వసంగైర్విముక్తః**
**నైష్కించన్యైక కాష్ఠాంగత ఉరుతరయోత్కంఠ్యా చింతయన్ శ్రీ**
**రాధాకృష్ణాంఘ్రి పంకేరుహ దళసుషమాం కోఽపి వృందావనేఽస్తి 55**

నిరంతరం శోకాశ్రుపూర్ణుడై, కొద్ది ఆహారాన్ని కూడ అరుచితో స్వీకరిస్తూ; ఉన్మత్తునివలె, బద్ధునివలె, మరణించినవానివలె, పర్వతాదుల వలె అచలుడై; సర్వసంగ పరిత్యాగియై, పరమ నిష్కించనుడై; అత్యంత ఉత్కంఠతతో శ్రీరాధాకృష్ణుల చరణారవింద శోభను ధ్యానిస్తూ ఉండే ఒకానొక భాగ్యశాలి శ్రీబృందావనంలో విరాజమానుడై ఉన్నాడు.

**మాలాం కంఠేర్పయ సులలితం చందనం సర్వగాత్రే**
**తాంబూలం ప్రాశయ కురు సుఖం సాధు సంబీజనేన**
**వ్యత్యాశ్లేషాత్ సుఖశయితయోర్లాలయన్నంఘ్రిమిత్థమ్**
**రాధాకృష్ణౌ పరిచర రహః కుంజశయ్యాముపేతౌ 56**

శ్రీరాధాకృష్ణులు ఏకాంత కుంజశయ్యపై విరాజమానులై ఉన్నారు. వారి మెడలో సుగంధపూర్ణమైన మాలను సమర్పించు. సర్వాంగాలకు లలితమైన చందన లేపనం చేయి. నోటిలో తాంబూలాన్ని ఉంచి, మృదుమధురమైన వింజామరతో వీస్తూ వారికి సుఖాన్ని కలిగించు. శ్రీయుగళం పరస్పరం గాఢాలింగనంలో సుఖంగా శయనించి ఉన్నప్పుడు వారి శ్రీచరణకమలములను సేవించు! ఈ విధంగా శ్రీయుగళ కిశోరులకు పరిచర్య చేయి!

**రాధాకృష్ణౌ రహసి లతికామందిరేషూపవిష్టౌ**
**రత్యావిష్టౌ రసవశ లసత్ దృష్టి వాగంగచేష్టౌ**
**దృష్ట్వాఽన్యాదృగ్వర విలసితౌ సాధు యాంతీర్వహిస్తా**
**స్తాభ్యామాత్తాః సహసమవనమ్యాః సహీ సౌఖ్యమగ్నాః 57**

శ్రీరాధాకృష్ణులు ఏకాంత లతామందిరంలో విరాజమానులై ఉన్నారు. రత్యావేశంలో రసవశులై ఉండటం చేతి వారి దృష్టి, మాట, చేష్ట అత్యంత శోభస్కరంగా ఉన్నాయి. వారి అత్యంత మనోహర విలాసాన్ని దర్శించి, దృష్టి మరల్చిన సఖియలు వెలుపలకు రానుండగా శ్రీయుగళ కిశోరులు నవ్వుతూ వారిని నిలిపివేశారు. సఖీమణులు లజ్జావశులై, సౌఖ్యరసమగ్నులై శిరసువంచి అట్టే నిలచిపోయారు.

**కిశోర వయసః స్ఫురత్ పురట్ రోచిషో మోహినీః**
**సుచారు కృశమధ్యమాః పృథునితంబ వక్షోరుహాః**
**సురత్న కనకాంచిత స్ఫురిత నాసిక మౌక్తికాః**
**సువేణి పటభూషణాః స్మరత రాధికా కింకరీః 58**

సఖియలు కిశోర వయస్కులు, సుందరమైన స్వర్ణ వర్ణంతో మోహినీ మూర్తులై ఉన్నారు. వారి కటి ప్రాంతం అతిసుందరంగాను, సూక్ష్మంగాను; నితంబములు, వక్షస్థలము విశాలంగాను ఉన్నాయి. నాసికపై స్వర్ణజటితమైన రత్నాలు, ముత్యాలతో కూర్చిన బులాకీ ప్రకాశిస్తున్నది. సుందరమైన కేశరాశితోను, కాంతిమంతమైన వస్త్రధారణతోను వారు వెలుగొందుతున్నారు. ఈ విధంగా శ్రీరాధా సఖీమణులను స్మరించు!

**సురమ్యా దోర్వల్లీ వలయగణ కేయూర రుచిరాః**
**క్వణత్కాంచీ మంజీరక మణి సుతాటంక లలితాః**
**లసద్వేణీ వక్షోరుహ ముకుల హారావలిరుచః**
**స్మరానన్య స్నిగ్ధాః కనకరుచి రాధాంఘ్ర్యనుచరీః 59**

పరమరమణీయమూర్తులైన సఖియలు భుజలతలకు వంకీలను, కంకణాలను ధరించి శోభిస్తున్నారు. ధ్వనిస్తున్న వడ్డాణంతోను, నూపురాలతోను, మణిమయ కర్ణాభరణాలతోను అలంకృతులై ఉన్నారు. సుందరమైన కేశపాశంతోను, వక్షస్థలంపై హారాలతోను మనోహరంగా ఉన్నారు. ప్రేమమయి, స్వర్ణాంగియైన రాధాజీకి దాసీమణులైన అట్టి వారిని స్మరించు!

**అహో వృందారణ్యే సకల పశుపక్షి ద్రుమలతా**
**ద్యనంతైర్లావణ్యైర్మధుర మధురైః కాంచననిభైః**
**మహాప్రేమానందోన్మద సురస నిష్పంద సుభగైః**
**కిశోరం మే సమ్మోహయదహహ సర్వస్వముదితమ్ 60**

ఆహా! బృందావనంలోని సమస్త పశుపక్ష్యాదులను, వృక్షలతాదులను తన స్వర్ణమయమైన మధురమధుర లావణ్యం చేత మహాప్రేమానందోన్మత్తం చేస్తూ రసయుక్తమై, అత్యంత సౌందర్యంతో సమ్మోహితం చేస్తున్న శ్రీరాధాదాసియే నా సర్వస్వం!

**అహో శ్యామం ప్రేమప్రసర వికలం గద్గద గిరా**
**సరోమాంచం సాస్రం సమనునయదాలీః ప్రియతమాః**
**పదం వేణ్యా బద్ధ్వా క్షణమహహ సంప్రేష్యదయితమ్**
**క్వచిత్ వృందారణ్యే జయతి మమ తజ్జీవనమహహ 61**

ఓహో! ప్రబలమైన విరహావస్థలో ఉన్న రాధాజీ ప్రేమాతిశయ కారణంగా వ్యాకులయై, గద్గద కంఠంతో మాటాడుతూ, రోమాంచయై, అశ్రుపూర్ణనయనాలతో ఉన్నది. ఆ దేవి తన ప్రియమైన సఖియలను అనునయ, వినయవాక్యములతో శ్యామసుందరుని చెంతకు పంపించింది. క్షణకాలపు విరహాన్ని కూడ సహింపలేక శ్రీరాధ తన కేశరాశితో పాదాలను బంధించుకున్నది. నా జీవన స్వరూపమైన ఆ రాధాజీ శ్రీబృందావనంలో సర్వోత్కర్షంగా విరాజమానయై ఉన్నది.

**నవోద్యత్ కైశోరం నవనవ మహాప్రేమ వికలమ్**
**నవానంగ క్షోభాత్తరల తరలం నవ్య లలితమ్**
**నవీనాదృష్ట్యంగోక్తిషు మధురభంగీర్దధదహో**
**మహో గౌరశ్యామం స్మరత నవకుంజే తదుభయమ్ 62**

నవకిశోరావస్థను పొంది, నవనవప్రేమకు వశీభూతులై నవకామక్షోభచే చంచలత్వాన్ని పొంది, కోమలత్వంతో; చూపులోను, అంగాలలోను, మాటలోను నూతనమైన రీతితో నవీన కుంజలలో గౌరశ్యామజ్యోతి స్వరూపులై ఉన్న శ్రీయుగళ కిశోరులను స్మరించు!

**మిథో న్యస్తప్రాణం కథమపి న హి స్నాన శయనా౭**
**శనాదౌ విచ్ఛిన్నం గురుభిరనురాగైర్నవ నవైః**
**సదా ఖేలత్ వృందావన నవనికుంజావలిషు తత్**
**భజే గౌరశ్యామం మధుర మధురం ధామయుగళమ్ 63**

ఒకరియందు ఒకరు ప్రాణం నిలుపుకొని; స్నాన, భోజన, శయనాదులలో కూడ సర్వదా ఒక్కటియై; గాఢానురాగవశులై, శ్రీబృందావన నవనవనికుంజలలో నిరంతరం క్రీడాపరాయణులై వెలుగుచుండు మధుర మధుర గౌర, శ్యామ స్వరూపులైన శ్రీయుగళ కిశోరులను భజించు!

**ఉత్తుంగానంగరంగ వ్యతికర రుచిరాభంగ సంగీత రంగైః**
**అంగైస్తారుణ్య భంగీభర మధుర చమత్కారి రోచిస్తరంగైః**
**అత్యంతాన్యోన్యసక్త్యా నిమిషమమిలనాదార్తి మూర్తీ భవంతౌ**
**తౌ వృందారణ్యవీథ్యాం భజ భరితరసౌ దంపతీ గౌరనీలౌ 64**

అత్యధికమైన అనంగ (ప్రేమ) రస కారణంగా శ్రీశ్యామాశ్యాములు పరస్పర మిలనంలో క్రీడిస్తూ ఉంటారు. అవిచ్ఛిన్నంగా నృత్యగీతాదులతో; తరుణ వయస్సులోని మధుర, చమత్కార లావణ్య దీప్తితో పరస్పరం అతిశయ ఆసక్తితో ఉంటారు. ఆ కారణంగా నిమిషమాత్రంగా వియోగం కలిగినా మూర్తీభవించిన ఆర్తితో వ్యగ్రులౌతారు. అట్టి పూర్ణరసస్వరూపులైన గౌరశ్యామ యుగళాన్ని బృందావన వీథులలో భజించు!

**నశ్వర సుత ధన జాయాదిషు హరిమాయా మయేషు న ప్రయాసమ్**
**కురు పురుషార్థ శిరోమణిమాచిను వృందావనే స్వయం పతితమ్ 65**

శ్రీహరి మాయా విశేషం చేత ఏర్పడిన అశాశ్వతమైన భార్యాపుత్ర ధనాదులకై ప్రయాసపడకు. శ్రీబృందావనంలో స్వయంగా ప్రకటితమై ఉన్న పురుషార్థ శిరోమణి (పంచమ పురుషార్థం) అయిన ప్రేమకై యత్నించు!

**వృందావన తరుమూలే కూలే శ్రీమత్కళింద నందిన్యాః**
**భజ రతికేళి సతృష్ణౌ రాధాకృష్ణౌ తదేకభావేన 66**

శ్రీబృందావనంలో శ్రీయమునా నదీ తీరంలో ఉన్న వృక్షచ్ఛాయలో ప్రేమక్రీడా వివశులై తృష్ణతో ఉన్న శ్రీరాధాకృష్ణులను అనన్యభావంతో భజించు!

**వరమిహ వృందారణ్యే సువరాకీ మదనమోహన ద్వారి**
**అపి సరమాపి రమాప్రియ సఖ్యపి నాన్యత్ర నో రమాపి స్యామ్ 67**

శ్రీబృందావనంలో శ్రీమదనమోహనుని ద్వారం చెంత తుచ్ఛమైన కుక్కగానైనా ఉంటాను. కాని అన్యప్రదేశంలో మాత్రం లక్ష్మీదేవికి ప్రియసఖిగానైనా, లేదా సాక్షాత్తు లక్ష్మీదేవిగానైనా ఉండటం ఇష్టంలేదు.

**ప్రత్యంగోచ్ఛలదద్భుత నవకాంచన చంద్రచంద్రికా జలధిః**
**నవకైశోర చమత్కారరూపా వృందావనేశ్వరీ స్ఫురతు 68**

శ్రీరాధా ప్రత్యంగం నుండి ఉజ్వలము, అద్భుతము అయిన నవస్వర్ణ చంద్ర చంద్రికా సింధువు ఎగసిపడుతున్నది. నిత్యకైశోర చమత్కార పూర్ణ అయిన ఆ బృందావనేశ్వరి నా హృదయంలో స్ఫురించునుగాక!

**కుర్వంతి సర్వనాశం ధ్రువమతి మాయామయ ప్రమదాః**
**తచ్ఛబ్దశూన్య వృందారణ్య ప్రదేశే వసేత్తతశ్చతురః 69**

అత్యంత మాయా స్వరూపులైన స్త్రీలు నిశ్చయంగా సర్వనాశనం చేస్తారు. కనుక చతురుడైనవాడు మాయను విస్తరింపజేసే స్త్రీ అనే శబ్దశూన్యమైన బృందావనంలో నివసించటం ఉచితంగా ఉంటుంది.

**ఉత్తీర్య విష్ణుమాయామపి వనితాయామవిశ్వసన్ ప్రాజ్ఞః**
**తద్భయ చకితః సతతం నివసతి వృందావనేఽతి నిర్విణ్ణః 70**

విష్ణుమాయను దాటినప్పటికీ ప్రాజ్ఞుడైనవాడు స్త్రీలను విశ్వసింపక; అత్యంత విరాగియై స్త్రీవలని భయంతో జాగరూకుడై, నిరంతరం శ్రీబృందావనంలో నివసిస్తాడు.

**పరదారవిత్తహారిషు సత్యపదేశే మహాప్రహారిషు చ**

**న హి వృందావనవాసిషు దోషం పశ్యంతి చిద్ఘనేషు ధీరాః 71**

పరస్త్రీ, ధనాదులను అపహరించేవాడు, కపటబుద్ధితో ఇతరులను గాయపరిచేవాడు అయినప్పటికీ ధీరుడైనవాడు చిద్ఘన స్వరూపమైన శ్రీబృందావనంలో నివసించే వారియందు దోషాన్ని చూడడు!

**బృందాకానన! కాఽఽననే సుభగతా న స్తౌతి యత్వాం సదా**

**కిం తత్ దేహమపాస్య గేహమమతాం యన్నత్వయి న్యస్యతే**

**కిం తత్ పౌరుషమౌరసం చ తనయం విక్రీయ న స్థీయతే**

**యేన త్వయ్యథ తత్వవిత్ స ఖలు కో యస్తే తృణం నాశ్రయేత్ 72**

హేబృందావనమా! నిన్ను నిరంతరం స్తుతింపని ముఖ సౌందర్యం ఎందుకు ? గృహ మమతాదులను త్యజించి, నీ రజముపై దొరలని దేహం ఎటువంటిది ? తనకు పుట్టిన పుత్రుడిని అమ్మి అయినా బృందావనవాసం చేయని వాని యొక్క పురుషార్థం ఎందుకు ? బృందావనంలోని గడ్డిపరకనైనా ఆశ్రయింపని వానిని తత్వవేత్త అనుట ఎట్లు ?

**వృందారణ్యమనన్య భావరసికః శ్రీరాధికా నాగరే**

**వైదగ్ధీరససాగరే నవనవానంగైక ఖేలాకరే**

**రాధాయాః క్షణకోప కాతరతరే తత్ భ్రూవిలాసాంకుశాఽ**

**కృష్టాత్మేంద్రియ సర్వగాత్ర ఉరుభిర్విఘ్నైరచాల్యః శ్రయే 73**

శ్రీరాధికా నాగరుడైన శ్యామసుందరుడు వైదగ్ధ్యరస సింధువు, నిత్యనూతన కామరస క్రీడా పరాయణుడు! అట్టి శ్రీకృష్ణుడు రాధాజీ యొక్క కొద్దిపాటి కోపానికి కూడ కాతరుడు ఔతాడు. శ్రీరాధా భ్రూవిలాసం అనెడి అంకుశం చేత ఆతని ఆత్మ, ఇంద్రియాలు, శరీరం అన్నీ ఆకర్షితం ఔతాయి. అట్టి శ్రీరాధా నాగరుడైన

శ్యామసుందరునికి అనన్యభావ రసికుడినై, అనేక విఘ్నములందు కూడ స్థిరచిత్తుడినై శ్రీబృందావనాన్ని ఆశ్రయిస్తున్నాను.

**మదనమోహన వక్త్రసుధాకరే ముదిత గోపవధూ కుముదాకరే**
**సరస రాధికాయా పరిచుంబితే మమ మనో నవకుంజ విలంబితే 74**

నవనికుంజ విలోలుడు, గోపకాంతలు అనెడు కలువలను ఆనందింపజేసేవాడు, శ్రీరాధచే చుంబితుడు అయిన శ్రీమదనమోహనుని ముఖచంద్రుని యందు నా మనసు నిలచియుండునుగాక!

**నిలయనాయ నికుంజకుటీగతాం వరసఖీ నయనేంగితసూచితామ్**
**సుమిలితాం హరిణా స్మర రాధికామను చ తాం పరిరంభిత చుంబితామ్ 75**

దాగికొనుటకై నికుంజ మందిరంలోనికి వెళ్లి, శ్రేష్ఠసఖియైన లలితాజీ చేసిన కనుసైగ ననుసరించి శ్రీరాధ శ్రీకృష్ణుని కలసికొన్నది. అటుపై శ్రీహరిచే ఆలింగన, చుంబనాదికాన్ని పొందిన ఆ శ్రీరాధను స్మరించు!

**మదనకోటి మనోహరమూర్తినా నవలతా భవనోదరవర్తినా**
**ప్రియసఖీమిష నందిత రాధికాం స్మర బలాద్రమితాం ప్రణయాధికామ్ 76**

కోటికోటి మన్మథులను మించిన మనోహరమూర్తియై నవలతా మందిరంలో విరాజిల్లుతున్న శ్రీహరి ప్రియసఖీ నెపంతో అత్యంత ప్రణయవతి, ఆనందపూర్ణ అయిన శ్రీరాధతో ప్రేమపూర్వకంగా రమిస్తున్నాడు. ఆ విధంగా స్మరించు!

**ప్రియతమేన నిజ ప్రియ కింకరీజన సువేషధరేణ పదాంబుజమ్**
**కిమపి లాలయతా రమితాం స్మరామ్యనుచరీం క్షిపతీమథ రాధికామ్ 77**

ప్రియతముడు శ్రీరాధా ప్రియ కింకరీ వేషాన్ని ధరించి, రాధాపద పద్మాలను ఒకానొక అనిర్వచనీయ మధుర భావంతో లాలిస్తూ, రాధాజీని ఆనందింప జేస్తున్నాడు. ఆ సఖిని తర్జనితో బెదిరిస్తున్న రాధాజీని స్మరిస్తున్నాను.

**ఏకాకాంగచ్ఛటాభిర్భరిత దశదిగాభోగమత్యున్మదాఢ్యమ్**
**ప్రేమానందాత్మకాభిర్విద్రుత కనక సూద్భాస్వరాభిః కిశోరమ్**
**తద్వామశ్యామ చంద్రోరసి రసవివశం కేళిసింజానభూషమ్**
**భ్రశ్యద్వాస స్త్రుటత్ స్రక్స్ఫురిత రతిమదాన్ని స్త్రపం కుంజ సీమ్ని 78**

ప్రేమానందాత్మకం, స్వర్ణసదృశం, సుందరం, దేదీప్యమానం అయిన శరీరకాంతులతో శ్రీరాధ దశదిశలను పరిపూర్ణ కాంతితో నింపివేస్తున్నది. అతి ఉన్మాదిని, కిశోరమూర్తి, రసవివశ, భూషణ శోభిత, జ్యోతిర్మయ స్వరూపిణి అయిన రాధాజీ శ్యామచంద్రుని వక్షస్థలిపై ప్రేమరసపూర్ణస్థితిని పొందుతూ వస్త్రమాల్యాది బాహ్యస్థితిగతులను మరచి; నికుంజలో శోభను విస్తరింపజేస్తున్నది.

**కళిందగిరి నందినీ తట కదంబ కుంజోదరే**
**దరేణ నళినాభ్రమాన్మధుకరాదివా ధావతః**
**స కృష్ణ ఇతి కృష్ణ తే శరణమాగతాస్మీతి వాక్**
**ప్రియా సుపరిరంభణాదతి ముమోద దామోదరః 79**

శ్రీయమునా నదీ తీరంలోని కదంబ కుంజవాటికలో పద్మం అనే భ్రమతో (రాధా ముఖ పద్మం) వెంట వెంట భ్రమరాలు తిరుగుతూ ఉంటే; "ఆ కృష్ణ వర్ణ భ్రమరాలు నావైపుకి వస్తున్నాయి. ఓ కృష్ణా! నేను నిన్ను శరణు కోరుతున్నాను" అని పలుకుతున్న ప్రియాజీని దామోదరుడు సుందరమైన ఆలింగనంతో ప్రసన్నురాలిని చేశాడు.

**శ్రీవృందా విపినే మహాపరిమళ ప్రోత్ఫుల్ల మల్లీవనే**
**శ్రీరాధా మురళీధరావతి రసోల్లాసాన్మిథః స్పర్ధతః**
**ఆశీనౌ కుసుమైః పరస్పర వపుర్భూషాం విచిత్రాం ముహుః**
**కుర్వంతౌ రతికౌతుకేన విగమాల్లబ్ధానవస్థాః భజే 80**

శ్రీబృందావనంలో, సుగంధాన్ని విస్తరింపజేస్తూ వికసించిన మల్లికా వనంలో శ్రీరాధా మురళీధరులు అత్యంత రసోల్లాసవశులై పరస్పర స్పర్శను ఆనందిస్తున్నారు. వారు మాటిమాటికి పూవులతో ఒకరికొకరు విచిత్రమైన ఆభరణాలను తయారు చేస్తున్నారు. ప్రేమావేశం చేత వారి వస్త్రాభరణాలు స్థానభ్రష్టత చెందాయి. ఒకానొక వివశస్థితిలో ఉన్న అట్టి శ్రీయుగళ కిశోరులను భజిస్తున్నాను.

**శ్యామానందరసైక సింధు బుడితాం వృందావనాధీశ్వరీమ్**
**తత్ స్వానంద రసాంబుధౌ నిరవధీ మగ్నంచ తం శ్యామలమ్**
**తాదృక్ ప్రాణపరార్ధ వల్లభ యుగక్రీడావలోకోన్మదా**
**నందైకాబ్ధి రస భ్రమత్తనుధియో ధ్యాయామి తాస్తత్పరాః 81**

శ్రీరాధ శ్యామానంద రససాగర మగ్నయై ఉంటుంది, శ్రీశ్యామసుందరుడు ఎల్లలులేని శ్రీరాధా ఆనందరస సముద్రంలో నిమగ్నుడై ఉంటాడు. కోటి ప్రాణాల కన్న అత్యంత ప్రియమైన ఆ శ్రీయుగళ కిశోరుల క్రీడను దర్శిస్తూ ఉన్మత్తులై, ఆనందసాగర రసంలో ఎవరి శరీరం, బుద్ధి ఘూర్ణితం ఔతూ ఉంటాయో రాధాకృష్ణ పరాయణులైన ఆ సఖీమణులను ధ్యానిస్తున్నాను.

**నిమిషే నిమిషే మహాద్భుతాం మదనోన్మాదకతాం వహన్మహః**
**ద్వయమేవ నికుంజ మండలే నవ గౌరాసిత నాగరం భజే 82**

ప్రతి నిమిషం మహాద్భుతమైన ప్రేమోన్మాదాన్ని ప్రకటిస్తూ; నికుంజ మందిరంలో స్థితులై ఉన్న గౌర నీలవర్ణరూపులు, జ్యోతిర్మయులు అయిన నాగరయుగళాన్ని భజిస్తున్నాను.

**సించంతౌ బాలవల్లీ ద్రుమమతి రుచిరం కుత్రచిత్ పాఠయంతౌ**
**శారీ కీరౌ క్వచిత్ క్వాపి చ శిఖిమిథునం తాండవం శిక్షయంతౌ**
**పశ్యంతౌ క్వాప్యపూర్వాగత సదనుచరీ దర్శితం సత్ కలౌఘమ్**
**తౌ శ్రీవృందావనేశౌ మమ మనసి సదా ఖేలతాం దివ్యలీలౌ 83**

శ్రీయుగళం ఒకసారి అత్యంత సుందరమైన చిన్న చిన్న వృక్షలతాదులను నీటితో తడుపుతూ ఉంటారు. ఒకసారి చిలుకలకు, మైనా పిట్టలకు పాఠం నేర్పుతూ ఉంటారు. మరొక మారు నెమళ్ల జంటకు తాండవ, నృత్య శిక్షణ ఇస్తూ ఉంటారు. మరొకచో కొత్తగా వచ్చిన దాసీమణి ప్రదర్శిస్తున్న అత్యంత సుందర కళావిద్యాకౌశలాన్ని దర్శిస్తూ ఉంటారు. ఈ ప్రకారంగా దివ్యలీలా వినోదులైన శ్రీబృందావనేశ్వర శ్రీయుగళ కిశోరులు నా మనసులో నిరంతరం క్రీడిస్తూ ఉందురు గాక!

**నవీన కళికోద్గతిం కుసుమ హాస సంశోభినీమ్**
**నవస్తబక మండితాం నవ మరంద ధారాం లతామ్**
**తమాలతరు సంగతాం సమవలోక్య వృందావనే**
**పతిష్ణుమతి విహ్వలామధృత కాఽపి మే స్వామినీమ్ 84**

శ్రీబృందావనంలో నవలతలకు నవీనమైన మొగ్గలు వెలుగొందుతున్నాయి. అనేకములైన పుష్పాలు వికాసంతో శోభిస్తున్నాయి. అవి పుష్పగుచ్ఛాలతో శోభిస్తూ మకరంద ధారలను స్రవిస్తున్నాయి. ఈ విథంగా లతలు తరుణవృక్షాలను పెనవేసుకొని ఉండటం చూచి అతి విహ్వలచిత్త అయిన నా స్వామిని మూర్ఛిల్లింది. అట్లు నేలపై పడియున్న రాధాజీని ఒకానొక సఖి సేదతీరుస్తున్నది.

**శుద్ధానంద రసైక వారిధి మహావర్తేషు నిత్యం భ్రమ**
**న్నిత్యాశ్చర్య వయో విలాస సుషమా మాధుర్యమున్మీలయత్**
**అత్యానందమదాన్ముహుః పులకితం నృత్యత్ సఖీమండలే**
**శ్రీవృందావన సీమ్ని ధామ యుగళం తద్గౌరనీలం భజే 85**

ఏకైకమైన శుద్ధానంద రససాగరంలోని సుడులలో సదా చరిస్తూ; నిత్య ఆశ్చర్యమయ అవస్థ, విలాస శోభామాధుర్యాదులతో ప్రకాశిస్తూ; ఆనందాధిక్యం

చేత మాటిమాటికి శరీరం పులకిస్తూ ఉండగా శ్రీయుగళం సఖీమండల మధ్యంలో నృత్యం చేస్తున్నారు. శ్రీబృందావనంలో విరాజమానమైన, ఆ గౌరనీల వర్ణ శోభిత శ్రీయుగళ కిశోరులను నేను భజిస్తున్నాను.

**శ్రీరాధాపాదపద్మచ్ఛవి మధురతర ప్రేమ చిజ్జ్యోతిరేకాం**
**భోధేరుద్భూత ఫేనస్తబక మయ తనూః సర్వవైదగ్ధ్య పూర్ణాః**
**కైశోర వ్యంజితాస్త ఘ్ధనరుగపఘన శ్రీచమత్కారభాజో**
**దివ్యాలంకార వస్త్రా అనుసరత సఖే రాధికా కింకరీస్తాః 86**

సఖా! శ్రీరాధా పద పద్మకాంతి యొక్క మధుర ప్రేమ చిద్ఘనజ్యోతి అనెడు సముద్రం నుండి ఉత్పన్నమైన నురుగుతో ఆ దేవి దేహం నిండి ఉన్నది. చతురతా పూర్ణమైన కిశోరావస్థలోని తారుణ్య ప్రకాశంతో సుందర అవయవాలు మరింత సౌందర్యంతోను, చమత్కారంతోను కూడి ఉన్నాయి. దివ్యాలంకారాలతోను, దివ్యవస్త్రాలతోను శోభిస్తున్న శ్రీరాధ యొక్క కింకరీమణులను అనుసరించు!

**భృంగీగుంజరితం పికీకుల కుహూరావం నటత్కేకినామ్**
**కేకాస్తాండ వితాని చాతి లలితాం కాదంబయూనోర్గతిమ్**
**ఆశ్లేషం నవవల్లరీక్షితిరుహాం త్రస్యత్ కురంగేక్షితమ్**
**శ్రీవృందా విపినేఽనుకుర్వదనుయాహ్యాత్మైక బంధుద్వయమ్ 87**

శ్రీబృందావనంలో భ్రమరాలు గుంజారవం చేస్తున్నాయి. కోకిలలు 'కుహుకుహు' అని మధుర ధ్వనిని చేస్తున్నాయి. నృత్య పరాయణమైన మయూరాలు కేకిధ్వని చేస్తూ, తాండవ నృత్యగతిని ప్రదర్శిస్తున్నాయి. కలహంస జంట లలితగతితో నడయాడుతున్నది. నవీనమైన వృక్ష, లతలు ఆలింగన స్థితిలో ఉండగా, హరిణాలు తమ భయాన్ని నయన భంగిమలో చూపిస్తూ చరిస్తున్నాయి. వీనినన్నింటినీ ప్రాణప్రియతమ యుగళ కిశోరులు అనుకరిస్తూ క్రీడిస్తున్నారు. అట్టి యుగళాన్ని అనుసరించు!

**అహో పతితముత్తరోత్తర వివర్ధమాన భ్రమౌ**
**మహారయ మహోజ్జ్వల ప్రణయ వాహినీ స్రోతసి**
**కిశోర మిథునం మిథోఽవశ విచిత్ర కామేహితమ్**
**కరోత్యహహ విస్మయ స్థగితమేవ వృందావనమ్ 88**

ఓహో! మహావేగవతి అయిన మహోజ్వల ప్రణయనదీ ప్రవాహంలో, క్రమక్రమంగా పెరుగుతున్న సుడిలో మునిగితేలుతున్న శ్రీయుగళ కిశోరులు వివశులై విచిత్రమైన ప్రేమచేష్టితాలను ప్రకటిస్తున్నారు. శ్రీబృందావనం (ప్రేరకమై) వారిని విస్మయ విముగ్ధులను చేస్తున్నది.

**క్వ యానం క్వ స్థానం కిమశనమహో కిం ను వసనమ్**
**కిముక్తం కిం భుక్తం కిమివ చ గృహీతం న కిమపి**
**మిథః కామక్రీడారస వివశతామేత్య కలయత్**
**కిశోర ద్వంద్వం తత్పరిచరత వృందావన వనే 89**

శ్రీయుగళ కిశోరులు తాము ఎక్కడికి వెళ్తున్నారో, ప్రదేశం ఏమిటో, భోజనం ఏమిటో, ఏ వస్త్రాలో; ఏమి మాట్లాడుతున్నారో, ఏమి తింటున్నారో, ఏమి తీసుకుంటున్నారో – ఈ అన్నిటిలో దేనిని కూడ లక్షించటం లేదు. కేవలం పరస్పర దివ్యశృంగార క్రీడారసంలో మాత్రమే వివశులై ఉన్నారు. శ్రీబృందావనంలో ఆ విధంగా వివశులై ఉన్న శ్రీయుగళాన్ని సేవించు!

**కేశాన్ బధ్నంతి భూషాం విదధతి వసనం వాసయంత్యాశయంతి**
**వీణావంశాది హస్తే నిదధతి నటనాయాదరాద్వాదయంతే**
**వేశాద్యర్ధి చ కర్తుం కథమపి నితరామాలయః శక్నువంతి**
**శ్రీరాధాకృష్ణయోరున్మద మదనకలోత్కంఠయోః కుంజవీథ్యామ్ 90**

బృందావన కుంజ వీథులలో ఉన్మదమైన ప్రేమ రసకళలో ఉత్కంఠితులై ఉండే శ్రీరాధాకృష్ణులకు సఖీమణులు వివిథములైన పరిచర్యలు చేస్తూ ఉంటారు. విడివడిన వారి కేశాలను ముడివేయటం, భూషణాలను తిరిగి అలంకరించటం, వస్త్రాలను సరిచేయటం వంటి సేవలు చేస్తూ ఉంటారు. వారికి భోజనం చేయించటం, చేతులలో వీణను, వంశీని ఉంచటం, వారి నృత్యాన్ని చూడగోరి వాద్య పరికరాలను శ్రుతి చేయటం వంటివి నిర్వహిస్తూ ఉంటారు. ఏవిథంగానైన శ్రీశ్యామాశ్యాముల వేషభూషాదుల శోభను మరింతగా పెంచటానికి సఖియలు ప్రయత్నిస్తూ ఉంటారు.

**విద్యోతద్బీజ రాజాత్మక విమల మహాజ్యోతిరానంద సాంద్రే**
**శ్రీవృందాకాననేఽత్యద్భుత మధుర మహాభావ సర్వస్వమూర్త్యా**
**ప్రత్యంగోత్సర్పి హైమచ్ఛవి రసజలధి శ్రీకిశోర్యా కయాచిత్**
**కోఽపి శ్యామః కిశోరోఽద్భుత మధుర రసైకాత్మమూర్తిశ్చకాస్తి 91**

శ్రీబృందావనం బీజరాజమైన కామబీజ స్వరూపం, విమలమైన మహాజ్యోతి పూర్ణం, ఆనందఘనరూపం! అందు అత్యంత అద్భుత, మధుర మహాభావ సర్వస్వమూర్తియైన రాధాజీ వెలుగొందుతున్నది. ఆదేవి అంగాంగాల నుండి స్వర్ణకాంతిని విరజిమ్ముతున్న రససాగరం తరంగితం ఔతున్నది. అట్టి అనిర్వచనీయ శ్రీకిశోరితో కలసి ఒకానొక అద్భుత మధుర రసైకమూర్తియైన శ్రీశ్యామకిశోరుడు శోభను పొందుతున్నాడు.

**విమల కలిత బీజ జ్యోతిరేకార్ణవాంతః**
**స్ఫురతి మధురమేతద్ధామ వృందావనాఖ్యమ్**
**తదధినిరవధీనాం మాధురీణాం ధురీణా**
**వనుసర రతిలోలౌ దంపతీ గౌరనీలౌ 92**

విమల కామబీజ జ్యోతిపూర్ణమైన సముద్రగర్భంలో శ్రీబృందావన నామకమైన ధామం విలసిల్లుతున్నది. అందులో ఎల్లలులేని మాధుర్యమూర్తియు, రతిలంపటమైనదియు, గౌరనీల కాంతితో కూడినదియు అయిన శ్రీయుగళాన్ని అనుసరించు!

**అంగాదంగాదనంగాకులిత పులకితాత్ గౌరరోచిస్తరంగాః**
**ప్రోత్తుంగాః ప్రోచ్ఛలంతః సకలమపి జగన్మండలం ప్లావయంతి**
**శ్రీరాధాయా విధాయాత్మన ఉరుమధురాభీక్షయైవాత్యధీనమ్**
**శ్యామేందుం నిత్యవృందావన రతి విహతౌ యేఽద్భుతాంస్తాన్ స్మరామః 93**

అతిమధురమైన శ్రీరాధా కటాక్షవీక్షణ మాత్రం చేతనే శ్యామచంద్రుడు ఆమెకు అధీనుడు ఔతాడు. ప్రేమాతుర అయిన రాధాజీ యొక్క పులకితాంగముల నుండి ఉత్పన్నమయ్యే గౌరకాంతి తరంగాలు క్షణక్షణానికి పెరుగుతూ, నాలుగు దిక్కులలో వ్యాప్తి చెందుతూ ఉంటాయి. సమస్త జగత్తును ప్లావితం చేస్తున్న (తేలియాడిస్తున్న) ఆ నిత్య బృందావన రతి విహారము యొక్క అద్భుత వస్తు సమూహాన్ని (తరంగాదులను) మేము స్మరిస్తున్నాము.

**వృందావన నవకుంజే రసపుంజే ఖేలదాశ్చర్యమ్**
**తద్గౌర నీలమోహన కిశోరమిథునం స్మరాకులం స్మరత్ 94**

రసపుంజమైన బృందావన నవకుంజలలో ఆశ్చర్యభావంతో ప్రేమవివశమై క్రీడిస్తున్న ఆ గౌరనీలకాంతి స్వరూపులైన మోహన కిశోరయుగళాన్ని స్మరించు!

**శ్రీవృందావన తత్వం శ్రీరాధాకృష్ణయోస్తత్వమ్**
**నిజతత్వం చ సదా స్మర యత్రప్రకటితమస్తి గౌరచంద్రేణ 95**

శ్రీగౌరచంద్రుని (శ్రీరాధ) ద్వారా ప్రకటితం ఔతున్న శ్రీబృందావనతత్వాన్ని, శ్రీరాధాకృష్ణతత్వాన్ని, ఆత్మతత్వాన్ని నిరంతరం స్మరించు!

**కృష్ణానురాగ సాగర సారేష్వత్యంత చమత్కారమ్**
**విందత వృందాకానన కుంజకుటీ వృంద వందనాదేవ 96**

శ్రీబృందావనంలోని కుంజమందిరాలకు నమస్కారం చేసినంత మాత్రం చేతనే శ్రీకృష్ణానురాగసాగరం యొక్క సారభూతమైన అతిచమత్కారాన్ని పొందుతావు.

**భేదత్రయ రహితమస్తి బ్రహ్మ మహానంద సాంద్రం యత్**
**తత్ సవిశేష చమత్కృతితతిరిహ వృందావనే గతా కాష్ఠామ్ 97**

సజాతీయం, విజాతీయం అనే భేదంలేని మహానంద ఘన బ్రహ్మం అని దేనిని అంటారో అది శ్రీబృందావనంలో సవిశేష చమత్కారరాశి యొక్క పరాకాష్ఠగా లభిస్తున్నది.

**చిచ్ఛక్తి సింధుబంధురమద్వయమానందమద్భుతాకారమ్**
**తద్బిందుయుక్ చిదాత్మక స్మరతత్వం కుంజరోక్షితం సరసమ్ 98**

చిచ్ఛక్తి సముద్రంలోని బిందువువంటి జీవా! చిచ్ఛక్తి సాగరం యొక్క మనోహరం, అనుపమానం, అద్భుతం అయిన సరస కుంజరము (శ్రీశ్యాముని) చే ప్రేమజల సించితం ఔతున్న బృందావనతత్వాన్ని స్మరించు!

(బృందావనాన్ని శ్యామసుందరుడు అనే గజేంద్రుడు ప్రేమ అనే జలాలతో తడుపుతున్నాడు.)

**అపారావార కందర్ప నవకేళిరసాంబుధౌ**
**మగ్నం వృందావనే గౌరశ్యామధామ ద్వయం భజ 99**

శ్రీబృందావనంలో హద్దులులేని ప్రేమనవకేళీరస సముద్రంలో నిమగ్నులై ఉండు గౌరశ్యామ శ్రీయుగళాన్ని భజించు!

# మూడవ శతకము

స్వాంతర్భావ విరోధినీ వ్యవహృతిః సర్వాః శనైస్త్యజ్యతామ్
స్వాంతశ్చింతిత తత్త్వమేవ సతతం సర్వత్ర సంధీయతామ్
తద్భావేక్షణతః సదా స్థిరచరేఽన్యాదృక్ తిరోభావ్యతామ్
వృందారణ్య విలాసినోర్నిశదివా దాస్యోత్సవే స్థీయతామ్ 1

నీ ఆంతరికభావమైన శ్రీకృష్ణదాస్యభావానికి వ్యతిరేకమైన వ్యవహారాలనన్నిటినీ మెలమెల్లగా త్యజించు! ఆంతర్యంలో చింతింపదగిన శ్రీరాధాకృష్ణతత్త్వాన్ని సదా సర్వత్ర అనుసంధానం చేసుకో! నిరంతరం ఆ భావమయ దృష్టితో స్థావర జంగమాదులను చూస్తూ, అన్యభావనలను వదలి, శ్రీబృందావన విలాసులైన శ్రీయుగళ కిశోరుల సేవలో అహర్నిశలు తత్పరుడివై ఉండు!

ప్రకృత్యంతఃతీర్త్వా ప్రవిశ వితతే బ్రహ్మమహసి
స్ఫురత్ పశ్యానైకాంతిక కలిత వైకుంఠభవనమ్
తదధ్యుచ్చాన్యుచ్చాన్యనుసర సుధామాన్యథ మహో
జ్జ్వలే వృందారణ్యే భ్రమ యది కిమప్యత్ర మిలతి 2

ప్రకృతి ఆవరణనుదాటి విస్తృతమైన బ్రహ్మజ్యోతిలో ప్రవేశించు! ఆపై ఏకాంత భక్తులు పొందే వైకుంఠధామాన్ని దర్శించు. దానికన్న పైనున్న ఉచ్చతర మనోహర ధామాలను అనుసరించు. ఇక ఒకానొక అనిర్వచనీయ వస్తువును పొందాలనే ఇచ్ఛ ఉంటే సర్వోపరి అయిన మహోజ్వల శ్రీబృందావనంలో పరిభ్రమించు!

అంగేంగేన లీలా జలనిధి రమితో మాధురీ వారిధీనా
మేకైకం తత్రకోటిః ప్రతిపదముదయత్యేతదాస్వాదమత్తః
శ్యామః స శ్రీకిశోరః ప్రతినిమిషమహో కోటికోటింవికారాన్
ధత్తే కందర్ప దర్పాత్పరమ రసనిధౌ కాననే రాధికాయాః 3

ఓహో! శ్రీశ్యామకిశోరుడు తనప్రత్యంగము నుండి అనంతమైన అనంగ లీలా సింధువును ఆనందిస్తున్నాడు. మాధుర్య సముద్రం యొక్క అడుగడుగున ప్రతి అంగాన్ని కోటింతలు అధికంగా ప్రకాశింపజేస్తున్నాడు. ఈ విధంగా ఆస్వాదిస్తూ ఉన్మత్తుడైన శ్రీశ్యాముడు శ్రీరాధ యొక్క పరమ రసనిధి రూపమైన బృందావనంలో అనంగకేళీ కారణంగా నిమిష నిమిషానికి కోటికోటి భావ ప్రకంపనలను పొందుతున్నాడు.

**వందే వృందావనగతమహం భక్తిభారావనమ్రో**
**ధన్యాగ్రణ్యం కృమిమపి న చాన్యత్ర సంస్థాన్ తృణాయ**
**మన్యే బ్రహ్మాదిక సురగణాన్ కిం బహూక్త్యా మమేయం**
**ప్రౌఢిర్గాఢా న ఖలు పరతో భాతి కృష్ణోఽపి పూర్ణః 4**

బృందావనంలోని పరమధన్యమైన క్రిమికి కూడా వినమ్రుడినై భక్తి పూర్వకంగా నమస్కరిస్తున్నాను. కాని అన్యత్ర నివసించేవారు బ్రహ్మాది దేవతలైనా సరే, గడ్డిపరకతో కూడ సమానంకాదు; మరి అధికులు అని అనగలమా! ఇది నా ప్రౌఢమైన మాట! ఎందుకంటే బృందావనాన్ని వీడితే శ్రీకృష్ణుడు కూడ పూర్ణరూపంతో ప్రకాశించలేడు.

**వృందారణ్యే చిదచిదఖిలజ్యోతిరాచ్ఛాద కాంతి**
**స్వచ్ఛానంతచ్ఛవి రససుధా సీధునిష్యందిని త్వమ్**
**సర్వానందా స్మృతికర మహాప్రేమ సౌఖ్యైరగాధే**
**రాధాకృష్ణానవధి విహ్వతౌ సంవస త్యక్త సర్వః 5**

శ్రీబృందావనం వైకుంఠాది అప్రాకృతిక ధామాలను, ప్రాకృతికమైన దైవీధామాలను అన్నిటినీ ఆచ్ఛాదించి (కప్పి) ఉండే జ్యోతిస్స్వరూపం! ఉజ్వలమైన, అనంత కాంతి స్వరూపమైన రసామృతాన్ని ప్రవహింపజేస్తూ; ఇతరమైన అన్ని

ఆనందాలను మరిపిస్తుంది. ఆ శ్రీధామంలో శ్రీరాధాకృష్ణులు మహాప్రేమ సుఖవివశులై అగాధమైన అనన్యవిహారం చేస్తూ ఉంటారు. అట్టి శ్రీబృందావనంలో అన్నిటినీ త్యజించి, నివసించు!

**సర్వాశ్చర్యముదేతి యత్ర సతతం కందర్పలీలామయమ్**
**గౌరశ్యామ మహా మనోహరమహో ద్వంద్వం కిశోరాకృతి**
**యత్స్వాంతః ప్రతివీథి కల్పిత మృజా గంధాంబుసేకం కదా**
**భ్రాజన్మంజు నికుంజ పుంజమచలో వృందావనం సంశ్రయే 6**

శ్రీబృందావనంలో కందర్పలీలామయమైన, ఆశ్చర్యకరమైన గౌరశ్యామ మహామనోహర కిశోరమూర్తులు నిరంతరం విరాజమానులై ఉంటారు. అక్కడ ప్రతి వీథిలోను మార్జనం (శుభ్రం) చేస్తూ సుగంధపూర్ణమైన జలాలు విరజిమ్మబడుతూ ఉంటాయి; మంజులమైన కుంజనికుంజలు చమక్ చమక్‌మని ప్రకాశిస్తూ ఉంటాయి. అట్టి శ్రీబృందావనంలో ఎప్పుడు నేను శాశ్వతంగా నివసిస్తాను!

**నిత్యక్రీడామయతను తనుక్షౌమమానీల పీతమ్**
**విభ్రజ్జాంబునద మరకత జ్యోతిరాశ్చర్యనీలమ్**
**నానానర్మ ప్రహసన మహాకౌతుకైర్యత్ర నంద**
**త్యానందాబ్ధి ద్వయమిహ రతిం విందవృందావనాంతః 7**

శ్రీబృందావనంలో నిత్యక్రీడా పరాయణులై; సూక్ష్మము, సుందరము అయిన నీలపీత వర్ణదుస్తులను ధరించి; సువర్ణ,మరకత మణికాంతితో జ్యోతిస్స్వరూపులైన శ్రీరాధాకృష్ణులు విరాజిల్లుతున్నారు. వారు ఆశ్చర్యమయమైన లీలలతోడి ఆనందసాగరంలో అనేక ప్రకారాలుగా హాసపరిహాసాలతోను, మహాకౌతుక వినోదంతోను విహరిస్తూ ఆనందిస్తున్నారు. అట్టి బృందావనం పట్ల ప్రీతితో ఉండు!

**నిత్యవ్యంజన్మధుర మధురాశ్చర్య కైశోరవేషమ్**
**నిత్యాఽ న్యోన్య ప్రకట సుషమా మాధురీ సన్నివేశమ్**
**నిత్యోద్వర్ధ్వి ప్రతినవ మిథః ప్రేమనిత్యాంగ సంగమ్**
**నిత్యం వృందావనభువి భజే గౌరనీలం ద్విధామ 8**

శ్రీయుగళ కిశోరులు నిరంతరం మధురాతి మధురమైన, ఆశ్చర్యపూర్ణమైన కైశోర స్వరూపులై ఉంటారు. నిరంతరం ఒకరిశోభా మాధుర్యాల పట్ల మరొకరు ఆకర్షితులై ఉంటారు. నిత్యనూతనమైన అంగసంగం చేత ఒకరిపట్ల మరొకరి ప్రేమ నిరంతరం వృద్ధి చెందుతూ ఉంటుంది. శ్రీబృందావన భూమిలో నేను నిరంతరం ఆ గౌరశ్యామయుగళాన్ని భజిస్తూ ఉంటాను.

**శ్రీగాంధర్వా రసిక చరణ ద్వంద్వ మాధ్వీక గంధా**
**దంధా నిత్యం మతిమధుకరీ శ్రీల వృందావనాంతః**
**యేషాం భ్రామ్యత్యతి రసభరాద్విహ్వలా తాదృశానామ్**
**పాదాంతే మే విలుఠతు ముహుర్భక్తి భావేన మూర్ధ్నా 9**

శ్రీరాధాకృష్ణుల చరణ మకరందం పట్ల విముగ్ధమై ఎవరి బుద్ధిరూప భ్రమరం నిరంతరం రసపూర్ణతచేత విహ్వలతను చెంది బృందావనంలోనే సంచరిస్తూ ఉంటుందో; అట్టి వ్యక్తి యొక్క చరణాలకు భక్తి పూర్వకంగా శిరసువంచి మాటిమాటికీ నమస్కరిస్తాను.

**స్వచ్ఛ ప్రోజ్జ్వల దివ్యవాస కుసుమాద్యాపూర్ణ సంశీతల**
**చ్ఛాయాభాజి తలే నవక్షితిరుహాం సంక్రీడ సుప్తాసికమ్**
**కుంజే కుంజే ఉదారకేళి కుసుమోల్లోచాస్తరే పానకా**
**ద్యాఢ్యే యస్య తదద్భుతం ద్వయమహస్తత్ పశ్య వృందావనే 10**

శ్రీ బృందావనంలోని స్వచ్ఛము, పరమోజ్జ్వలము అయిన వస్త్రరూప కుసుమాదుల చేత పరిపూర్ణమై, శీతలఛాయను ఇస్తున్న నవనవవృక్షాల నీడలో

క్రీడించిన సుందర శ్రీయుగళం నిద్రావస్థలో విరాజమానమై ఉన్నది. శ్రీధామంలోని కుసుమరూప చంద్రకిరణాలతో ఆచ్ఛాదింపబడి, మకరంద ధారలతో విలసిల్లుతున్న కుంజ నికుంజలలో కేళీ పరాయణులైన శ్రీయుగళ కిశోరులు విరాజిల్లుతున్నారు. ఆ శ్రీబృందావనంలో జ్యోతిర్మయులైన శ్రీయుగళ కిశోరులను దర్శించు!

**త్రైగుణ్యాతీత పూర్ణోజ్జ్వల విమల మహాకామబీజాత్మ దివ్య**
**జ్యోతిః స్వానంద సింధౌ కిమపి సుమధురం ద్వీపమాశ్చర్యమస్తి**
**తస్మిన్ వృందావనం తత్రహసి రసభరైర్మంజులా కుంజవాటీ**
**కాచిత్తత్రాతిభావాత్ భజ సురతినిధీ రాధికా కృష్ణచంద్రౌ 11**

త్రిగుణాలకు అతీతంగా అత్యంత ఉజ్వలము, శుద్ధము, మహాకామబీజ స్వరూపము అయిన దివ్యజ్యోతి యొక్క స్వానంద సాగరంలో ఒకానొక అతిమధుర ఆశ్చర్యకరమైన ద్వీపం ఉన్నది. అందులో శ్రీబృందావనం స్థితమై ఉన్నది. ఆ బృందావనంలోని ఏకాంత రహస్యస్థానంలో రసపూర్ణమైన ఒకానొక మనోహర కుంజవాటిక విద్యమానమై ఉన్నది. అక్కడ సురతినిధియైన శ్రీరాధా కృష్ణచంద్రులను అత్యంత భావపూర్ణంగా భజించు!

**దృష్ట్వా దృష్ట్వా రాధికాకృష్ణయోస్తద్దివ్యం రూపం దివ్యకందర్పకేళిమ్**
**శ్రుత్వా శ్రుత్వా శీతల పీయూషవాణీం వృందారణ్యే కిం రసాబ్ధి విగాహే 12**

శ్రీరాధాకృష్ణుల దివ్యరూపాన్ని, వారి దివ్య అనంగకేళిని దర్శిస్తూ దర్శిస్తూ; వారి చల్లని అమృతమయ వాక్కులను వింటూ వింటూ ఈ బృందావనంలో నేను కూడ రస సాగరంలో మునిగి తేలుతానా!

**బ్రహ్మజ్యోతిః పూర్ణమానందసాంద్రం రాధాకృష్ణాకారమాశ్చర్య సీమ**
**శుద్ధ స్వాద్య ప్రీతిశక్తేర్నిధానం వృందారణ్యే యో భజేత్ సోఽతిధన్యః 13**

శ్రీరాధాకృష్ణులు బ్రహ్మజ్యోతి పూర్ణులు, ఆనందఘన స్వరూపులు, ఆశ్చర్యానికి అవధి! విశుద్ధము, ఆస్వాదన యోగ్యము అయిన వారి ప్రేమశక్తికి బీజ స్వరూపమైన బృందావనంలో తపస్సు చేసే మహానుభావుడు అతిధన్యుడు!

**నవం నవమహో దధద్వపురపూర్వ కైశోరకమ్**
**నవం నవమహో వహద్వహల మన్మథాదంబరమ్**
**నవం నవమహో దుహత్సుఖమహోబ్ధిమాలీదృశామ్**
**దృశాహమపి కిం పివామ్యభయ ధామ వృందావనే 14**

అహో! శ్రీయుగళకిశోరులు నవనవాయమానమైన అపూర్వ కైశోర స్వరూపులు! వారి అనేక విధాలైన నవనవ ప్రేమరీతిని ప్రకటిస్తూ ఉంటారు. సఖియల నేత్రాలకు నిత్యనూతనమైన సుఖసముద్రాన్ని అనుగ్రహిస్తూ ఉండే అభయ ప్రదాతలైన ఆ యుగళ కిశోరులను బృందావనంలో నేను కూడ ఈ నేత్రాలతో దర్శించగలనా!

**ప్రభో మదనమోహన! త్వమతి చారు వృందాటవీ**
**నికుంజ భవనే మయా దయిత! కర్హి సేవిష్యసే ?**
**ప్రసూన శయనం గతః స రభసం మమాత్మేశ్వరీ**
**సహాయ రుమన్మథ క్షుభితమూర్తిరుద్యత్ స్మితః 15**

హే ప్రభూ! మదనమోహనా! ప్రియతమా! మనోహరమైన బృందావన నికుంజ భవనంలో పుష్పశయ్యపై నాప్రాణేశ్వరి శ్రీరాధతో ప్రసన్నచిత్తంతో అధివసించి; ప్రేమాతిశయం చేత వ్యాకులుడివై, మృదుమధురమందహాసం చేస్తున్న నిన్ను ఎప్పుడు సేవించుకొనగలను ?

**క్షణాచ్ఛరదుపాగమం క్షణత ఏవ వర్షాగమమ్**
**క్షణాత్ సురభివైభవం క్షణత ఏవచాన్యర్తుమత్**
**సదా జనిత కౌతుకం కిమపి రాధికా కృష్ణయోః**
**స్మర ప్రతిపదోల్లసద్రసమయం హి వృందావనమ్ 16**

శ్రీబృందావనంలో ఒక క్షణంలో శరత్కాలం, మరొకక్షణంలో వర్షం, క్షణంలో వసంతఋతుశోభ, ఇంకొక క్షణంలో మరొకఋతువు ఏర్పడుతూ ఉంటాయి. ఈ విథంగా నిరంతరం శ్రీరాధాకృష్ణులకు అనిర్వచనీయమైన కుతూహలాన్ని కలిగిస్తూ, అణువణువున రసమయమైన ఆనందాన్ని ఇచ్చే శ్రీబృందావనాన్నే స్మరించు!

**విలసత్ కదంబమూలా లంబీ సంవీత పీత చారుపటః**
**రాధాం విలోక్య మురళీం క్వణయన్ వృందావనే హరిర్జయతి 17**

కదంబ వృక్షమూలాన్ని ఆనుకొని పీతాంబరధారియైన శ్యామసుందరుడు శ్రీరాధను దర్శిస్తూ, దర్శిస్తూ వంశీగానం చేస్తూ ఉంటాడు. శ్రీబృందావనంలోని అట్టి శ్రీహరికి జయమగునుగాక!

**కాళిందీ పులిన వనే మోహన నవకుంజమందిర ద్వారి**
**సహ రాధయోపవిష్టం సరస సఖీజుష్టమాశ్రయే కృష్ణమ్ 18**

కాళిందీ నదీ తీరంలోని వనంలో, మోహన నవకుంజ మందిరంలో శ్రీరాధా సమేతుడై కూర్చుండి, రసవతులైన సఖీమణులతో సేవింపబడుతున్న శ్రీకృష్ణుడిని ఆశ్రయిస్తున్నాను.

**తదనంగ కేళిరంగాన్నర్మ వినిర్మాయ మండిత ప్రతిభమ్**
**గౌరశ్యామ సునాగర కిశోర మిథునం భజామః కుంజేషు 19**

కుంజ నికుంజలలో అనంగకేళీవశులై పరిహాస వాక్య రచనలో చతురశిరోమణులైన గౌరశ్యామవర్ణ శ్రీయుగళకిశోరులను నేను భజిస్తున్నాను.

**మిథోఽనంగ క్రీడా రసజలనిధోరూర్మి నివహైః**
**ప్రియద్వంద్వేత్యానందోలిత వపుషి తీవ్రస్మర మదే**
**న శక్తాః శ్రీవృందావన భువి సువేశాదికరణే**
**బలాదప్యానందం కిమపి రసయంత్యః ప్రజహసుః 20**

బృందావనంలో శ్రీయుగళం పరస్పరం ప్రేమకేళీ రససాగర తరంగాలలో తేలియాడుతూ, అత్యంత ప్రేమోన్మత్తులై ఉన్నారు. అట్టి స్థితిలో ఉన్న యుగళ కిశోరులకు చెదరిన వేషభూషాదులను సఖీమణులు బలవంతంగానైనా తిరిగి అలంకరించలేకపోయారు. సఖియలు ఒకానొక అనిర్వచనీయమైన ఆనందాన్ని ఆస్వాదిస్తూ చిరునవ్వులతో ఉండిపోయారు.

**శ్రీవృందావన వైభవం భవ విరించాద్యైర్మనాగప్యహో**
**దుర్జేయం పరమోజ్వలన్మద రసోదార శ్రియామాకరమ్**
**శ్రీరాధామురలీ మనోహర మహాశ్చర్యాతి సమ్మోహనమ్**
**శ్రీమూర్తిచ్ఛవి కేళి కౌతుక భరైశ్చాశ్చర్యమంతః స్మర 21**

ఓహో! శ్రీబృందావన వైభవాన్ని శివ, బ్రహ్మాదులు కూడ తెలిసికొనలేరు. ఆ ధామం పరమోజ్వల, ఆనందమయ, శ్రేష్ఠరస మహాసంపదకు నిధి! అది శ్రీరాధా మాధవులను కూడ మహాఆశ్చర్యభావ సమ్మోహితులను చేస్తుంది. శ్రీమూర్తి యొక్క కాంతి, కేళి, కౌతుకాదుల ఆధిక్యంలో కూడ ఆశ్చర్యజనకమైనది. అట్టి శ్రీబృందావనాన్ని మనసులో స్మరించు!

**వృందాకానన! కాననస్య పరమా శోభా పరాతః పరా**
**నంద! త్వద్గుణ వృందమేవ మధురం యేనానిశం గీయతే**
**హా వృందావన! కోటిజీవనమపి త్వత్తోఽతి తుచ్ఛం యది**
**జ్ఞాతం తర్హి కిమస్తి యత్తృణ కవచ్ఛక్యేత నోపేక్షితుమ్ 22**

హే బృందావనమా! నీ వనశోభ సర్వోత్కృష్టమైనది. హే పరానందమా! నీ మధురగుణాలను అహర్నిశలు గానం చేసే వ్యక్తి నీ ముందు కోటి జీవనాలు కూడ అతితుచ్ఛమని గ్రహిస్తాడు. ఇక అతనికి ఈ లోకంలో కావలసినది ఏముంటుంది ? ఏ వస్తువునైనా గడ్డిపరకతో సమానమని ఉపేక్ష వహించదా!

**శ్రీవృందావన మండలే యది శిరః శ్రీరాధికా కృష్ణయోః**
**సత్ప్రేమైక రసాత్మనోః పదతలే న్యస్యాభయే స్థీయతే**
**తర్హ్యాస్తే మమ లోకతో న హి భయం నో ధర్మతో నో దురం**
**తాధివ్యాధిశతాత్ కిమన్యదఖిలాధీశాచ్చ మే నో భయమ్ 23**

శ్రీబృందావన మండలంలో ఏకైక సత్ప్రేమ రసస్వరూపులైన శ్రీరాధాకృష్ణుల అభయాత్మక చరణ కమలములపై శిరసునుంచి స్థితిని పొందగలిగితే లోకభయం, ధర్మ భయం, భయానకమైన శతాధిక ఆధివ్యాధుల భయం ఉండదు. అంతేకాదు, బ్రహ్మాండ నాయకుని వలన కూడ నాకు ఏమీ భయం లేదు.

**శ్రీరాధా మురళీధరాతి మధుర శ్రీపాణి పాదాంబుజ**
**స్పర్శోజ్జృంభిత పూర్ణ హర్షజలధావత్యంత మగ్నాంతరాః**
**సౌభాగ్యం రమయాపి మృగ్యమతులం సంప్రాప్తవత్యో మహా**
**భాగానాం శిరసి స్థితా వ్రతతయో నందంతి వృందావనే 24**

శ్రీరాధా మాధవుల అతిమధురమైన కర, చరణ కమల స్పర్శతో ప్రఫుల్లమై, మనసును పూర్ణ ఆనందసాగరంలో నిమగ్నం చేసి, స్వయంగా లక్ష్మీదేవి ఏసాటిలేని సౌభాగ్యాన్ని కోరుకుంటుందో దానిని సమ్యక్ప్రకారంగా పొంది; మహాభాగ్యశాలురికి శిరోమణియైన లతలు శ్రీబృందావనంలో ఆనందిస్తున్నాయి. (సాక్షాత్తు లక్ష్మీదేవి కోరుకొనెడి సాటిలేని సౌభాగ్యాన్ని బృందావన లతలు పొంది, మహాభాగ్యశాలురకు కూడ శిరోమణిగా విరాజిల్లుతున్నవని భావం!)

**పుష్పత్పుష్ప ఫలాది సంపదఖిలాశ్చర్యం మహా మాధురీ**
**పూరం దూర నిరస్త దుఃఖదురితాదుద్వర్ధ్వమానచ్ఛవి**
**సాంద్రానంద సుధార్ణవోదిత మహాద్వీపేందు వృందావనే**
**వృందం సుందర శాఖినామనుదినం వందే మునీంద్రైర్నుతమ్ 25**

శ్రీబృందావనం ఆనందఘన సాగరం నుండి ఉదయించిన చంద్రసమానమైన మహాద్వీపం! అందులో వికసించిన పుష్పఫలాదులను కలిగినవి, అందరికీ ఆశ్చర్యం కలిగించే మహామాధుర్యపూర్ణమైనవి, దుఃఖపాపాదులను దూరం చేయునట్టివి, నిరంతరం అధికమౌతున్న కాంతిని కలిగినవి, మునీంద్ర బృందాలచే స్తుతింపబడునవి అయిన వృక్షాలకు ప్రతిదినం నమస్కరిస్తున్నాను.

(బృందావనంలోని వృక్షాలు ఆనందఘన పూర్ణమైన దివ్యతేజోమూర్తులని భావం!)

**పుష్పశ్రేణి వికాసహాస యుతయా గుచ్ఛోరువక్షోజయా**
**సంశ్లిష్టాః పులకాలి మండితలతా వధ్వాప్యహో సత్తమాః**
**కృష్ణధ్యానరసాన్ముహుః పులకినో మాధ్వీకధారాస్రవో**
**నాత్మానంచ పరంచ జానత ఇమే వృందాటవీ శాఖినః 26**

ఓహో! పుష్పముల వికాసరూపమైన మందహాసంతోను, పుష్పగుచ్ఛ రూపమైన వక్షోజాలతోను, పులకరింతల రూపమైన సఖియలతోను పరివేష్టితమైన లతఅనెడు వధువు శోభిస్తున్నది. అట్టి లతావధువుచే బృందావనంలోని వృక్షరాజం కౌగిలించుకొనబడి శ్రీకృష్ణ ధ్యానరసంలో మాటిమాటికి పులకరిస్తున్నది. మకరంద ధారలను స్రవించటం అనే మిషతో అశ్రుధారలను ప్రవహింపజేస్తున్న బృందావన వృక్షరాజాన్ని మించినది ఏదీ లేదు. (బృందావనంలోని లతలను, వృక్షాలను శ్రీసరస్వతీ పాదులు ఇట ఆలంకారికశైలితో స్తుతిస్తున్నారు.)

**యేషామాదాయ దివ్యం కుసుమ కిసలయం తౌ మిథః ప్రేమమూర్తీ**
**గౌరశ్యామౌ కిశోరావతి చతురతమౌ వేణిచూడాది కృత్వా**
**పౌష్పం నిర్మాయగేహం శయనమథ ఫలం ప్రాశ్య సీధూని పీత్వా**
**కుర్వాతే దివ్యకేళిం త ఉరుతరువరా భాంతి వృందావనీయాః 27**

ప్రేమమూర్తులు, అతిచతురులు అయిన గౌరశ్యామయుగళ కిశోరులు దివ్య పుష్పాలతోను, పల్లవాలతోను పరస్పరం వేణీ అలంకారం చేసుకుంటున్నారు. పుష్పగృహాన్ని, పుష్పశయ్యాదికాన్ని రచిస్తున్నారు. ఫలాలను భుజిస్తూ, మకరందాన్ని సేవిస్తూ వారు దివ్యకేళిలో మగ్నులు ఔతున్నారు. శ్రీశ్యామాశ్యాములు (ఆ విధంగా) బృందావనంలోని ఆ మహావృక్షరాజ శోభను ఆస్వాదిస్తున్నారు.

**యత్పుష్పం ఘ్రాతవంతః సకృదపి పవనం వా స్పృశంతః స్వరూపమ్**
**లోకం వా లోకయంతః కమపి నతికృతః కర్హిచిత్ యద్దిశేఽపి**
**యన్నామాప్యేకవారం శుభమభిదధతః కీటకాదౌ చ మృత్వా**
**ప్రాప్స్యంత్యేవాంజసా తన్మునివరమహితం ధామ యే కేచిదేవ 28**

ఎవరైనా తమ జీవితకాలంలో ఒక్కసారైనా బృందావనంలోని పూవులను వాసన చూచినా, అక్కడి వాయుస్పర్శను పొందినా, బృందావన స్వరూపాన్ని కాని లేదా అక్కడి వ్యక్తిని కాని దర్శించినా, మంగళమయమైన బృందావన మధురనామాన్ని ఒక్కసారైనా ఉచ్చరించినా – అట్టివారు కీటకాదులుగా శరీరాన్ని త్యజించినప్పటికీ శ్రేష్ఠులైన మునిజనులచే నమస్కృతులను అందుకుంటున్న శ్రీబృందావనధామాన్ని వెంటనే పొందుతారు. ఇందులో సందేహం లేదు.

**యత్రైవ ప్రకటం కిశోరమిథునం తద్గౌరనీలచ్ఛవి**
**శ్రీశస్యాపి విమోహనం స్మరకలా రంగైక రమ్యాకృతి**
**సర్వానంద కదంబకోపరి చమత్కారం మహాదుర్లభమ్**
**కంచిత్ ప్రేమరసం స్రవత్తదఖిలం క్షిప్త్వైహి వృందావనమ్ 29**

శ్రీబృందావనంలో లక్ష్మీదేవిని, బ్రహ్మాదిదేవతలను కూడ విమోహితులను చేయగల; స్మరకళామోహనమూర్తులైన గౌర శ్యామ యుగళకిశోరులు విరాజమానులై ఉన్నారు. అక్కడ సర్వానందరాశికన్నను అధిక చమత్కారి అయినదియు, మహాదుర్లభమైనదియునైన ఒకానొక అనిర్వచనీయ ప్రేమరసం ప్రవహిస్తున్నది. సర్వస్వాన్ని త్యజించి, అట్టి శ్రీబృందావనానికి రమ్ము!

**బ్రహ్మానందమయస్య నిర్మలతమస్యాంతర్మహా జ్యోతిషో**
**జ్యోతిర్భాగవతం చకాస్తి కిమపి స్వానంద సారోజ్జ్వలమ్**
**తస్యాప్యద్భుత మంతరంతరసమోర్ధ్వాశ్చర్య మాధుర్య భూః**
**వృందారణ్యమిహా ద్వయం భజ సఖే! తద్గౌరనీలం మహః 30**

నిర్మలతమమైన, బ్రహ్మానందమయమైన మహాజ్యోతి యొక్క మధ్యలో స్వానంద సారోజ్వలమైన ఒకానొక భగవజ్జ్యోతి ప్రకాశిస్తున్నది. దానికి మధ్యభాగమున అద్భుతము, అతులనీయమునైన శ్రీబృందావనము అనెడు మాధుర్యభూమి ఉన్నది. ఓ సఖా! అట్టి బృందావనంలో గౌరశ్యామ కాంతి స్వరూపులైన శ్రీయుగళాన్ని భజించు!

**యదంగరుచిభిర్మహా ప్రణయ మాధురీ వీచిభిః**
**విచిత్రమవలోకయన్ కనక చంపక స్ఫూర్తిభిః**
**విముహ్యతి పదే పదే హరిరపూర్వ వృందావనే**
**కిశోరమిదమేవ మే స్ఫురతు ధామ రాధాభిధమ్ 31**

శ్రీరాధ మహాప్రణయ మాధురీ తరంగాలతో కూడి, స్వర్ణచంపకం వంటి దేదీప్యమాన దేహకాంతితో వెలుగుతూ ఉన్నది. ఆ విచిత్రరీతిని చూచిన శ్రీహరి శ్రీబృందావనంలోని అణువణువుపట్ల విమోహితుడైనాడు. శ్రీరాధానామకమైన ఆ కిశోరమూర్తి నా హృదయంలో స్ఫురిస్తూ ఉండునుగాక! ఇదే నా ప్రార్థన!

**ఆశ్చర్యాశ్చర్య నిత్యప్రవహదతి మహామాధురీసారరూప**
**శ్రీకేళి ప్రేమ వైదగ్ధ్యతుల తరుణిమారంభ సౌభాగ్యపూరౌ**
**తౌ గౌర శ్యామవర్ణౌ సహజరతికళాలోలలోలౌ కిశోరౌ**
**శ్రీవృందారణ్య కుంజావలిషు సులలితైకాంతరత్యా స్మరామి 32**

శ్రీయుగళ కిశోరులు అత్యాశ్చర్యమయము, అతిమహామాధురీ సారమునైన విశిష్టరూపముతో; శోభతోను, సౌందర్యముతోను కూడిన కేళి, ప్రేమ విదగ్ధత, నిరుపమానమైన నూత్నయౌవనములతోడి సౌభాగ్యరీతిని ధరించి విరాజమానులైనారు. వారు సహజమైన రతికళా ఆవేశము వలన అత్యంత చంచలతను పొందినారు. శ్రీబృందావన కుంజలలో లలితమైన ఏకాంతరతిలో ఉన్న అట్టి గౌరశ్యామ శ్రీయుగళ కిశోరులను స్మరిస్తున్నాను.

**అసమోర్ధ్వ మహాశ్చర్య రూప లావణ్య సేవధీ**
**సదోత్తరంగ ప్రోత్తుంగ మహానంగ రసాంబుధీ 33**

**మిథః ప్రేమాతివైక్లవ్యాత్ తృట్యర్ధేఽ ప్యవియోజినౌ**
**సదోత్పులక సర్వాంగౌ సదా గద్గద భాషిణౌ 34**

తులలేని మహాశ్చర్య రూపలావణ్య సాగరము వంటి, ఉత్తుంగ తరంగాలతో ఆకులం ఔతూ ఉండే మహాప్రేమసముద్రము వంటి శ్రీయుగళ కిశోరులు పరస్పరం అతిశయించిన ప్రేమ వ్యాకులతవలన అర్ధత్రుటి కాలము కూడ ఒకరి నుండి మరొకరు విరహమును పొందుటను సహింపజాలకుండిరి. వారి సర్వాంగముల నుండి నిరంతరం పులకలు ఏర్పడుచుండ, సదా గద్గద భాషణమును చేయుచుండిరి.

**అనుక్షణ మదావిష్టౌ న విదంతౌ చ కించన**
**కార్యమాణౌ సఖీవృందైర్భోజనాచ్ఛాదనాదికమ్ 35**

శ్రీరాధాకృష్ణులు ప్రతిక్షణం ప్రేమావిష్టులైయుండుట వలన వారికి ఇతరం ఏదీ తెలియటంలేదు. భోజనం చేయటం, వస్త్రధారణ మొదలైన కార్యములు కూడ సఖియల ద్వారా నిర్వహింపబడుతున్నవి.

**నిర్మర్యాద వివర్థిష్ణు మహానంద మహోన్మదౌ**
**గౌర శ్యామ కిశోరౌ తౌ నిత్యాఽన్యోన్యాంగ సంగినౌ 36**

**అనంగైక రసోదారే శ్రీవృందావన ధామని**
**యాపయంతౌ దివానిశం కేవలానంగ కేలిభిః 37**

నిరంతరం వృద్ధి చెందుతున్న మహానందం చేత మహా ఉన్మద స్థితిలో ఉంటున్న శ్రీయుగళ కిశోరులు క్షణం కూడ విడువక ఏకాత్ములై వెలుగొందుతున్నారు. వారు ప్రేమరసైక ఉత్సవపూర్ణులై శ్రీబృందావన ధామంలో కేవలం ప్రేమకేళీవశులై రాత్రింబవళ్లు గడుపుతున్నారు.

**ఘుత్కారయంతౌ భజతాం సర్వానంద రసోన్నతీః**
**యో భజేన్నిత్యమేకేన భావేన తమహం భజే 38**

శ్రీరాధాకృష్ణుల భజనల ద్వారా రసానందస్థితిని పొందాలని భావించేవారిని నేను పట్టించుకొనను. ఎవరు నిరంతరం శ్రీయుగళాన్ని ఏకాంత భావంతో భజిస్తారో వారికి నమస్కరిస్తాను.

**త్రైగుణ్యాతీతపూర్ణోజ్జ్వల విమల మహాకామరాజాత్మ దివ్య**
**జ్యోతిః స్వానందసింధూత్థిత మధురతర ద్వీప వృందావనాంతః**
**శ్రీరాధాకృష్ణ తీవ్ర ప్రణయ రసభరోదగ్ర రోమాంచ పుంజాః**
**కుంజాలిష్వాత్మనాథద్వయ పరిచరణవ్యగ్ర గోపాలబాలాః 39**

త్రిగుణాతీతమై, పూర్ణోజ్వల విమలమైన మహాకామరాజ స్వరూపమై వెలుగొందు ఒక దివ్యజ్యోతి! ఆ జ్యోతి యొక్క స్వానంద సాగరము నుండి

ప్రకటితమైన మధురతర ద్వీపము శ్రీబృందావనము! అందలి కుంజలలో శ్రీరాధాకృష్ణుల పట్ల కల తీవ్రప్రేమరసం చేత పులకిత శరీరులై గోపబాలికలు తమ ప్రియతమ నాథుడైన శ్రీయుగళ కిశోరుని సేవలో లగ్నమైనారు.

**కాంచీ మంజీర కేయూరక వలయఘటా రత్నతాటంక రమ్యాః**
**శ్రీమన్నాసాగ్రలోలన్మణి కనక లసన్మౌక్తికాశ్చిత్ర శాటీః**
**సుశ్రోణీశ్చారు మధ్యా రుచిర కుచతటీః కుంచుకోద్భాసి హారా**
**లోలద్వేణ్యగ్రగుచ్ఛాః స్మర కనకరుచీర్దాసికా రాధికాయాః 40**

వడ్డాణం, నూపురాలు, కంకణాలు, రత్నజటితమైన కర్ణాభరణాలు మున్నగు వానితో సుశోభితులై; సుందరమైన నాసికాగ్రమున మణిజటిత, సువర్ణయుక్తమైన ముత్యములు కదలాడుచుండ; విచిత్రమైన వస్త్రములను ధరించి; కటి ప్రదేశము సుందరమైయుండ, మెరయుచున్న హారముల కాంతులతో, వేణిపై పూగుత్తులు వేలాడుచుండ శ్రీరాధాదాసీమణులు వెలుగొందుచున్నారు. స్వర్ణవర్ణ కాంతి విశిష్టులైన అట్టి శ్రీరాధా దాసీమణులను స్మరింపుము.

**త్రిభంగీముత్తుంగీకృత రసతరంగైర్నవ నవో**
**న్మదానంగే నీలోజ్జ్వల ఘననిభాంగే దధదహో**
**లసద్బర్హోత్తంసీ మణిమయ వతంసీ వ్రజకులా**
**బలా నీవిస్రంసీ స్ఫురతు మమ వంశీముఖ హరిః 41**

ఓహో! అతడు ఉచ్చరస తరంగమయమై, నిత్యనూతనమైన ఉన్మాదాన్ని కలిగించగల అనంగ క్రీడలో చంచలుడై ఉంటాడు. ఉజ్జ్వలమేఘ సదృశమైన దేహకాంతితో త్రిభంగియై నిలచి ఉంటాడు. నెమలి పింఛ కిరీటాన్ని ధరించి, మణిమయములైన కుండలములను ధరించిన అతడు వ్రజబాలికల కొంగులను లాగుతూ ఉంటాడు. వంశీధరుడైన ఆ శ్రీహరి నా హృదయములో స్ఫురించు చుండునుగాక!

**రాధాకృష్ణానంగతృష్ణా మహోబ్ధిం నిర్మర్యాదం వర్ధయన్నిత్యమేవ**
**సాంద్రానందాపార సర్వోర్ధ్వపార శ్రీమద్బృందాకాననం ప్రీణనం నః 42**

శ్రీబృందావనం శ్రీరాధాకృష్ణుల ప్రేమతృష్ణ అనెడు మహాసాగరాన్ని నిరంతరం అవధులు లేకుండ వృద్ధి పరుస్తు ఉంటుంది. ఆనందఘనరాశి యొక్క అపార, సర్వోత్తమ, సౌందర్య, సౌభాగ్యాలతో కూడియున్న ఆ శ్రీబృందావనమే మాకు ప్రీతిని కలిగించు ధామము!

**కేకాభిర్ముఖరీకృతాఖిల దిశో నృత్యంతహో కేకిన**
**శ్చూతానాం విటపే కుహూరితి ముహుః కూజంత్యహో కోకిలాః**
**గాయంతి ప్రతిపుష్పవల్లి మధురం భృంగాంగనాః సర్వతః**
**ప్రోన్మీలంతి విచిత్ర దివ్యకుసుమామోదాశ్చ వృందావనే 43**

ఓహో! శ్రీబృందావనంలో నెమలి తన కేకీ ధ్వనితో దశదిశలను ధ్వనింపజేస్తూ నృత్యం చేస్తున్నది. కోకిలలు మామిడి చెట్లపై నుండి మాటిమాటికి కుహు కుహూరవం చేస్తున్నాయి. విచిత్రము, దివ్యమునైన పూవుల సుగంధం నాలుగు దిక్కులను పరిమళభరితం చేస్తున్నది.

**ముక్తిర్యాతి యతో బహిర్బహిరహో సమ్మార్జనీ ఘాతత**
**స్త్రస్తాస్తా వర సిద్ధయో విదధతే కాక్వాది యత్సేవితుమ్**
**యన్నామ్నైవ విదూరగాపి విలయం మాయాపి యాయాదహో**
**తద్బృందావనమత్యచింత్య మహిమా దేహాంతమాశ్రీయతామ్ 44**

శ్రీబృందావనం అచింత్యమైన మహిమ కలది. అచట సమ్మార్జనం చేత ముక్తి కూడ దూరదూరంగా నెట్టివేయబడుతుంది. ఆ ధామాన్ని సేవింపగోరిన అష్టసిద్ధులు వినయంగా ప్రార్థించటానికి కూడ భయభీతం ఔతాయి. ఓహో! ఆ నామాన్ని విన్నంత మాత్రం చేత మాయ దూరం అవటమో, నాశనమైపోవటమో జరుగుతుంది. అట్టి మహిమ కల శ్రీబృందావనాన్ని దేహాన్ని త్యజించేవరకు ఆశ్రయించు!

**అహో వృందారణ్యం ప్రతిపద వినిస్యంది పరమో**
**న్మద ప్రేమానందామృత జలధి లోభాకులయతి**
**రమేశ బ్రహ్మాదీనథ భగవతః పార్షదవరా**
**నతో ధీరా నీరాంజలిమపి నిపీయాత్ర వసత 45**

ఓహో! శ్రీబృందావనంలోని అణువణువుకూడ పరమోన్మాదాన్ని ఉత్పన్నం చేయగల ప్రేమానంద సాగరాన్ని ప్రవహింపజేస్తున్నది. లక్ష్మీదేవిని, శివ బ్రహ్మాదులను, భగవంతుని శ్రేష్ఠ పార్షదులను కూడ లాలాయితులను చేస్తున్నది. కనుక ఓ ధీర పురుషుడా! దోసెడు నీరు తాగి అయినా సరే, శ్రీబృందావనంలో నివసించు.

**త్వయా కంఠం పీతం యది పరమ పీయూషమపి కిమ్**
**తతో యద్యుర్వశ్యాః స్తనయుగళమాశ్లేషి కిమతః**
**యది బ్రహ్మానందామృతమపి సమాస్వాది కిమతో**
**యతస్థుత్కృత్యేదం వ్యసృజదపి వృందావన తృణమ్ 46**

నీవు కంఠం వరకు అమృతాన్ని తాగినా కూడ దాని వలన ఏమిటి ? ఒక వేళ ఊర్వశిని కౌగిలించుకున్నావా, అయితే ఏమిటి ? ఒకవేళ బ్రహ్మానందామృతాన్ని బాగా ఆస్వాదించావనుకో, అయినా దాని వలన ఫలం ఏమిటి ? ఎందుకంటె శ్రీబృందావనంలోని తృణం (గడ్డి పరక) కూడ ఈ సమస్త వస్తువులను తృణీకరిస్తుంది.

అంటే బృందావనంలోని తృణం ముందు బ్రహ్మానందంతో సహా అన్నీ తక్కువే అని భావం!

**న తాపః సాధూనామకృతిషు తథా సాధుకృతిషు**
**ప్రకంపః కాలాహేరపి న హి న వా దేహదలనే**
**ప్రహర్షో న బ్రహ్మాద్యధిక విభవే నాపి పరమా**
**మృత బ్రహ్మానందే సమధిగత వృందావన భువః 47**

ఎవరు బృందావనంలో నివసించే భాగ్యాన్ని పొందుతారో వారికి సత్కర్మలు చేసినా, చేయకపోయినా ఎటువంటి దుఃఖమూ లేదు. కాలసర్పం వలన శరీరం నశించినా (మరణించినా) ఎట్టి భయమూలేదు. బ్రహ్మాదులకన్న అధిక సంపత్తిని పొందినా, పరమామృత బ్రహ్మానందాన్ని పొందినా కూడ వారికి ఎటువంటి ఆనందమూ కలుగదు.

అంటే అన్నిటికన్న బృందావనంలో నివసించటమే మహాభాగ్యం అని అర్థం!

**అలమలమతిఘోరానర్థకారీంద్రియాణా**
**మతిశయ పరితోషై ర్దుష్కరైర్దుస్తరైశ్చ**
**విదధదివసశోకో యేన కేనాపి దేహస్థితి**
**మధివస వృందారణ్యమేకాంత రత్యా 48**

అతి ఘోర అనర్థాలకు కారణమైన ఇంద్రియాలకు దుష్కరం, దుస్తరం అయిన ఉపాయాలతో సంతృప్తి కలిగించాలి అనుకోవటం వలన ఇప్పుడు ఏమీ ప్రయోజనం లేదు. దేహయాత్రను నడుపుకొనటానికి ఏదో ఒక ఉపాయాన్ని అవలంబించి; దీనుడివై, ఏకాంత భావంతో శ్రీబృందావనంలో నివసించు!

**లుఠన్ రాసస్థల్యాం నిరవధి పఠన్ కృష్ణ చరితమ్**
**రటన్ హా కృష్ణేతి ప్రతిపదమటంశ్చాపి పరితః**
**త్రుటన్నానా గ్రంథిః స్ఫుటదమల భావోఽ శ్రు నివహైః**
**నటన్ గాయన్ బృందావనమతి మహాన్ పంకిలయతి 49**

ఏ వ్యక్తి నిరంతరం రాసస్థలిలోనే ఉంటాడో, శ్రీకృష్ణుని చరిత్రను పఠిస్తూ ఉంటాడో, 'హా కృష్ణా' అంటూ ఉంటాడో, శ్రీబృందావనంలోని సమస్త ప్రదేశాలలోను పరిభ్రమిస్తూ ఉంటాడో అట్టి వ్యక్తికి అవిద్య, కామ, కర్మాది గ్రంథులన్నీ నాశనమై; విశుద్ధభావస్ఫూర్తి కలుగుతుంది. భాగ్యశాలియైన ఆ మహాపురుషుడు నృత్యం

చేస్తూ, సంకీర్తన చేస్తూ తన ప్రేమాశ్రుధారలతో శ్రీబృందావనాన్ని తడిపివేస్తూ ఉంటాడు.

**ఉద్దామః కామ ఏవేతరరసలవక స్పర్శమాత్రాసహిష్ణు**
**నిత్యం వర్ధిష్ణురత్యుచ్ఛలిత రసమహాంభోధి నిత్యం చ యత్ర**
**యత్కించిజ్జంగమం స్థాస్ను చ పరమ మహాశ్చర్య నానా సమృధ్యా**
**శశ్వద్వృధ్యా స్వయంచానిశముదితమిదం భాతు వృందావనం మే 50**

శ్రీబృందావనం ఉత్కటమైన ప్రేమస్వరూపం! అన్య రసముల కొద్దిపాటి స్పర్శను కూడ అది సహింపలేదు. ఆధామంలో నిత్యవర్ధనశీలమైన ప్రీతిరీతి చేత ఉచ్ఛలితమైన రసమహాసాగరం నిరంతరం ప్రవహిస్తూ ఉంటుంది. అచటి స్థావర జంగమములైన సమస్త వస్తువులు పరమాశ్చర్యమయమైన సమృద్ధితో నిరంతరం వృద్ధి చెందుతూ అహర్నిశలు ప్రకాశిస్తూ ఉంటాయి. అట్టి ఆ శ్రీబృందావనం నా హృదయంలో వెలుగునుగాక!

**తథా పరమపావనం భువి చకాస్తి వృందావనమ్**
**యథా హరిరసే మనః స్వయమనంకుశే ధావతి**
**పరంతు యది తద్గత స్థిర చరేషు నో కాయ వాజ్**
**మనోభిరపరాధితా భవతి బాధితా తత్వధీః 51**

ఏ విధంగా హరిరసంలో మనసు స్వయంగా పవిత్రీకృతం ఔతున్నదో అదే విధంగా పరమపావనమైన శ్రీబృందావనం భూమిపై ప్రకాశిస్తున్నది. ఒకవేళ శ్రీబృందావనంలోని స్థావర జంగమాత్మక వస్తువుల పట్ల మనోవాక్కాయములతో అపరాధం చేసినట్లయితే తత్వబుద్ధి బాధింపబడకుండును గాక! (అపరాధం చేస్తే తత్వబుద్ధి నశిస్తుంది, అపుడు శ్రీ బృందావన ప్రకాశం అనుభవంలోకి రాదు).

బృందావనం పట్ల ఎంత జాగరూకులమై ప్రవర్తించాలో శ్రీ సరస్వతీ పాదులు ఇక్కడ సూచిస్తున్నారు.

**మగ్నం శ్రీరాధికా శ్రీమురళిధర మహాప్రేమ సింధౌ నిమగ్నమ్**
**తద్గౌరశ్యామ గాత్రచ్ఛవిమయ జలధౌ ప్రోంచితావార పారే**
**శోభామాధుర్య పూర్ణార్ణవ బుడితమహో మత్తమేతన్మమాంతః**
**శ్రీవృందారణ్యమేవ స్ఫురతు న కలితం మాయయాఽవిద్యయా చ 52**

ఓహో! శ్రీరాధాకృష్ణుల మహాప్రేమ సముద్రంలో మునిగి, ఆ గౌరశ్యామ మూర్తుల ఎల్లలులేని కాంతిమయసాగరంలో నిమగ్నమై, వారి శోభామాధుర్య సింధువులో మునిగి మత్తిల్లిన శ్రీబృందావనంలో మాయకు, అవిద్యకు తావు లేదు అని నా అంతః కరణంలో స్ఫురిస్తున్నది.

**వృందావనమనువిందామ్యహమపి దేహం శ్వశూకరాదీనామ్**
**న పునః పరత్ర సచ్చిత్సుఖ మయమపి దుర్లభం దేవైః 53**

శ్రీబృందావనంలో కుక్క, పంది శరీరాలనైనా ధరిస్తాను. కాని ఇతర ప్రదేశంలో దేవతలకు కూడా దుర్లభమైన సచ్చిదానందమయ శరీరాన్ని కూడ నేను కోరుకొనను.

**శ్రీవృందావన మధ్యే బహుదుఃఖేనాపి యాతు జన్మైతత్**
**లోకోత్తర సుఖసంపత్యాపి న చాన్యత్ర మే నిమిషః 54**

శ్రీబృందావనంలో అత్యంత దుఃఖాలతోనైనా సరే జన్మిస్తాను. కాని అన్య ప్రదేశాలలో అలౌకిక సుఖసంపత్తులు ఉన్నా నిమిషకాలం ఉండాలని కూడ కోరుకోను.

**కరతల కలిత కపోలో గలదశ్రులోచనః కృష్ణ కృష్ణేతి**
**విలపన్ రహసి కదా స్యాం వృందారణ్యేఽత్యకించనో ధన్యః 55**

అరచేతిలో చెంపను చేర్చుకొని, అశ్రుపూర్ణనేత్రాలతో 'కృష్ణ', 'కృష్ణ' అని విలపిస్తూ; శ్రీబృందావనంలోని ఏకాంత ప్రదేశంలో అతిదీనభావంతో ఉండి ఎప్పుడు ధన్యుడిని ఔతానో కదా!

**మానాపమానకోటిభిరక్షుభితాత్మా సమస్త నిరపేక్షః**
**వృందావన భువి రాధానాగరమారాధయే కదా ముదితః 56**

కోటి కోటి మానావమానాలు కలిగినా క్షుభితుడిని కాకుండ, దేనిని కూడ అపేక్షింపక ఎప్పుడు శ్రీబృందావనంలో శ్రీరాధాకృష్ణులను ఆనందపూర్వకంగా ఆరాధిస్తానో కదా!

**వృందావనైక శరణస్త్యక్తశ్రుతి లోకవర్త్మ సంచరణః**
**భావాత్ హరిచరణాంతర పరిచరణాద్వ్యాకులః కదా ను స్యామ్ 57**

అహో! శ్రీబృందావనాన్ని మాత్రమే శరణు చెంది; వేదమార్గాన్ని, లౌకికమైన సమస్త ఆచరణలను త్యజినిచి ఎప్పుడు నేను భావ పూర్వకంగా శ్రీహరి చరణాలకు మానసీసేవ చేయటంలో వ్యాకులడను ఔతానే కదా!

**ఇహ న సుఖం న సుఖమరే క్వాపి వృథా న పత మోహజాలేఽస్మిన్**
**అనుదినం పరమానంద వృందావనం హి సమాశ్రయాద్యైవ 58**

ఈలోకంలో సుకం లేదు. ఓయీ! ఎక్కడా సుఖం లేదు. వృథాగా ఈ మోహజాలంలో పడిపోకు! ఇప్పుడే పరమానందమయమైన శ్రీబృందావనాన్ని సమ్యక్ప్రకారంగా ఆశ్రయించు!

**స్త్రీ పుత్ర దేహ గేహ ద్రవిణాదౌ మైవ విశ్వసీర్మూఢ**
**క్షణమపి నైవ విచారయ చారయ వృందారణ్యముఖం చరణౌ 59**

ఓ మూర్ఖుడా! భార్యాపుత్రులు, దేహము, గృహము, సంపద మొదలైన వాటిని నమ్మకు! ఒక్క క్షణమైనా ఆలోచింపక, బృందావనం వైపుకి నడువుము!

**రాధాకృష్ణ విలాస రంజిత లతా సద్మాలి పద్మాకర**
**శ్రీకాళింది తటీ పటీర విపినాద్యద్రీంద్ర సత్కందరమ్**
**జీవాతుర్మమ నిత్యసౌభగ చమత్కారైక ధారాకరమ్**
**నిత్యానంకుశ వర్ధమాన పరమాశ్చర్యర్ధి వృందావనమ్ 60**

శ్రీబృందావనం శ్రీరాధాకృష్ణుల విలాసం చేత రంజితమైన లతాగృహాలతోను, సరస్సులతోను, యమునాతీరంలో స్థితమైన చందన వనాదికంతోను, గిరిరాజు యొక్క సుందర గుహలతోను సుశోభితమై ఉన్నది. ఆధామం సౌభాగ్యానికి ఏకమాత్ర స్థానమై, చమత్కారాన్ని వర్షిస్తూ ఉంటుంది. నిరంతరం స్వతంత్రరూపం చేత వర్ధన శీలమై, పరమాశ్చర్యకర సమృద్ధిచేత పూర్ణమైన అట్టి బృందావనం నా జీవన ఔషధము!

**శరీరం శ్రీవృందావన భువి సదా స్థాపయ మనః**
**సదా పార్శ్వే వృందావన రసికయోర్వ్యస్య భజనే**
**వచస్తత్కేళీనామనవరత గానే రమయ తత్**
**కథా పీయూషాదౌ శ్రవణ యుగళం ప్రీతి వికలమ్ 61**

శరీరాన్ని నిత్యం బృందావనంలో నిలుపుకో, మనసును బృందావన రసికయుగళమైన శ్రీరాధాకృష్ణుల సన్నిధిలో భజనలో లగ్నం చేయి, నీ వాక్కును వారి లీలాగానంలో నిరంతరం ప్రయోగించు, ప్రేమతో వ్యాకులడవై నీ చెవులను వారి కథామృతంతో తృప్తిపరచు!

**ప్రసీద శ్రీవృందావన! వితను మాం స్వైకతృణకమ్**
**యదంఘ్రిస్పర్శాత్యుత్సవమనుభవేత్త్వయ్యుదితయోః**
**తయోర్గౌర శ్యామాద్భుత రసికయూనోర్నవ నవ**
**స్మరోత్కంఠాభాజోర్నిభృత వనవీథ్యాం విహరతోః 62**

హే బృందావనమా! ఒక్క తృణమాత్రమును దయతో నాకు దానం చేయి. ఆ తృణం (గడ్డిపరక) నీయందు విరాజమానమై, నవనవ కామోత్కంఠతో కూడిన నిర్జన వనమార్గంలో విహరించే అద్భుత రసికయుగళం యొక్క చరణకమల సుఖస్పర్శను అనుభవిస్తూ ఉంటుంది.

**న కాళిందీమిందీవర కమల కల్హార కుముదా**
**దిభిర్నిత్యోత్ఫుల్లైర్మధుప కుల ఝంకార మధురైః**
**సహాలి శ్రీరాధా మురళిధర కేళిప్రణయినీ**
**మపశ్యన్ యో వృందావన పరిసరే జీవతి స కిమ్ ? 63**

నీలోత్పల, కమల, కల్హార, కుముదిని మొదలైన పుష్పాలతో ప్రఫుల్లితమై; భ్రమరాల గుంజారవంతో మధురమైన శ్రీబృందావనంలో సఖియలతోకూడి శ్రీరాధాకృష్ణులు క్రీడిస్తూ ఉంటారు. అట్టి బృందావన పరిసరాలలో ఉండి కూడ ఏవ్యక్తి అయినా శ్రీయుగళాన్ని దర్శించకుండ జీవిస్తే ఏమి లాభం ? అంటే అతని జన్మ వృథా అని అర్థం!

**వృందారణ్యమిలత్కళిందతనయాం వందేఽరవిందేన తామ్**
**నానా రత్నమయేన నిత్యరుచిరామానంద సింధు సుతామ్**
**రమ్యాం చాన్య విచిత్ర దివ్యకుసుమైర్గమ్యాం న సమ్యక్ త్రయీ**
**మౌళీనామపి మత్తషట్పద ఖగశ్రేణీ సుకోలాహలామ్ 64**

శ్రీబృందావనంలోని యమునాజీ అనేక విధాలైన రత్నమయ కమలాలతో మనోహరంగా ఉంటుంది. ఆనందసముద్రాన్ని ప్రవహింపజేస్తూ ఉంటుంది. చిత్రవిచిత్ర దివ్యకుసుమాలతో శోభిస్తూ ఉంటుంది. వేదత్రయశిరోమణి కూడ సమ్యక్ప్రకారంగా దాని మహిమను ఎరుగలేదు. మత్తిల్లిన మధుకరాలతో, వివిధ పక్షుల కోలాహలంతో ధ్వనిస్తూ ఉండే అట్టి యమునమ్మకు నమస్కరిస్తున్నాను.

**శ్రీవృందావన వాహినీ తరణిజా స్వానంద సందోహ వాః**
**పూరా రత్నఘటామయ ద్వయతటా సామోత్తరంగ ధ్వనిః**
**ఆవర్తాయిత మృగ్గణం విదధతీ హంసైశ్చ కారండవై**
**ర్ధాత్యూహైరథ సారసాదిభిరపి ధ్యేయా హరేః ప్రేయసీ 65**

శ్రీబృందావనంలో ప్రవహిస్తున్న శ్రీయమునాజీ స్వానందరాశిరూపమైన జల ప్రవాహంతో యుక్తమై ఉన్నది. ఆ నదీ తీరములు రెండును రత్నమయములు. ఉవ్వెత్తున ఎగసిపడుతున్న తరంగాల ధ్వని సామవేదము యొక్క గాన స్వరూపం! ఆ సుడులలో పడిపోయిన పక్షులను కూడ అది రక్షిస్తుంది. హంస, కారండవ (పక్షి విశేషం), దాత్యూహ (పక్షివిశేషం), సారసాది పక్షులు అందులో విహరిస్తూ ఉంటాయి. శ్రీహరికి ప్రియమైన అట్టి యమునమ్మను ధ్యానించటం యోగ్యమైనది.

**జలక్రీడా కాలే కనక కమలిన్యేక విపినే**
**నిలీనా శ్రీరాధా యదధికమలం చుంబతి హరౌ**
**స్వవక్త్రాబ్జ భ్రాంత్యా హసితమథ నాలం స్థగయితుమ్**
**హసిత్వా కాంతేనాధ్రియత హసితాలీ పరికరా 66**

జలక్రీడా సమయంలో శ్రీరాధ ఒక స్వర్ణకమల వనంలో దాగినది. శ్రీరాధా సుందర ముఖకమలం అనే భ్రమతో శ్రీహరి ప్రతికమలాన్ని ముద్దిడుకొనసాగాడు. అది చూచి శ్రీరాధ నవ్వుచుండ; అచటి పరికరములు, సఖియలు కూడ నవ్వసాగిరి. అపుడు శ్రీశ్యామసుందరుడు నవ్వుతూ, నవ్వుతూ ప్రియతమయైన శ్రీరాధను పట్టుకొనినాడు.

**విదూరం సిందూరం గతమపి విలేపాంజనమభూత్**
**స్రజోఽత్రుట్యన్ముక్తావలిరపి దృశోర్ద్వంద్వమరుణమ్**
**విహారైః కాళింద్యంభసి యదపి వృందావన వనే**
**తథాప్యాసీద్రాధా హరివపుషి కాఽప్యేకసుషమా 67**

శ్రీబృందావనంలో యమునా నదీజలాలలో విహారం చేస్తూ, చేస్తూ శ్రీరాధాజీ యొక్క సిందూరం కరగిపోయినా అంజనం (కాటుక) సిందూరంగా నిలచింది. ముత్యాలహారంలోని ముత్యాలు పగిలిపోయినా, శ్రీయుగళం యొక్క

నేత్రాల అరుణిమ ఆస్థానంలో నిలచింది. ఈ విధంగా భూషణాదికం ఛిన్నాభిన్నమైనా శ్రీహరి వక్షస్థలంపై శ్రీరాధ ఒకానొక అనిర్వచనీయ శోభతో విరాజమానం అయింది.

**సించన్నుచ్చైః స్వయం శ్రీవ్రజనృపతిసుతో వల్లభా స్వప్రియాలీ**
**వృందైః సంభూయ తత్సేచనభరమసహం మన్యమానః స మగ్నః**
**స్ఫీత శ్రోణ్యూరు జంఘా చరణయుగపరామర్శలబ్ధాతి హర్షః**
**కాళింద్యామిందుకోటిచ్ఛవి బహుహసితో దూర ఉన్మజ్జ్య రేజే 68**

శ్రీవ్రజరాజనందనుడైన శ్యామసుందరుడు జోరుగా జలాలను విరజిమ్ముతుంటే శ్రీరాధ, ఆమె సఖియలు తిరిగి యమునా జలాలను ఆతనిపైకి ఎగసిపడునట్లు చేయసాగిరి. అది సహింపలేక శ్యామసుందరుడు నీటిలో దాగికొనినాడు. రాధాజీ యొక్క నితంబములు, విశాలమైన జంఘులు, చరణయుగళ స్పర్శను పొంది ప్రసన్నుడై; కోటి చంద్రుల కాంతిని కూడ తిరస్కరించు చిరునవ్వుతో యమునా జలాల నుండి వెలుపలికి వచ్చిన శ్యామసుందరుడు సుశోభితుడైనాడు.

**రాధాకృష్ణావతిరతి రసౌత్క్యేన మగ్నౌ సహైవ**
**కాళింద్యాప్రాకృత నిజజలే దేశ ఆస్తీర్ణ పద్మే**
**దీర్ఘం కాలం సురతసమరావేశతస్తౌ యదాస్తామ్**
**చక్రుః ప్రాణద్వయ విచయనం కాతరాస్తర్హి సఖ్యః 69**

అతిశయించిన రతిరస ఉత్కంఠ చేత శ్రీరాధాకృష్ణులు అప్రాకృతిక నిజ జలములతో కూడిన యమునా నదిలో విహారమగ్నులైనారు. ప్రేమ సమరావేశం చేత ఎక్కువ సమయం వారు వ్యతీతులై ఉండటంతో కాతరులైన సఖీమణులు తమ ప్రాణప్రియతములైన యుగళ కిశోరులకై వెదుకసాగారు.

**మిథః కమలకైరవాద్యుదిత హాసమంగే క్షిపన్**
**ముఖేన దృశి ముద్రణాయుజి కృతాంబు గండూషకమ్**
**సముక్ష్య జితకాశితత్ క్వచన మగ్నముత్థాపయత్**
**ద్వయం తరణిజాంభసి స్ఫురతి గౌరనీలం మహః 70**

ఒకసారి నవ్వులతో కమల, కైరవాది పుష్పాలను ఒకరిపై ఒకరు విసరివేసుకుంటూ; నిమీలితనేత్రాలతో ఒకరిపై మరొకరు జలవర్షాన్ని కురిపించుకుంటూ, ఒకరు నీటిలో దాగి ఉంటే రెండవవారు వారిని బయటకి తీసికొని వస్తూ – ఈ విధంగా గౌరశ్యామవర్ణంలో ఉన్న రెండు జ్యోతులు (శ్రీరాధాకృష్ణులు) యమునా జలాలలో ప్రకాశిస్తూ లీలా విస్తారం చేస్తున్నారు.

**హైమాద్యంబుజ కోరకాది సలిలం పీయూష సారైక్షవ**
**ద్రాక్షాక్షీర రసాదిమత్తటయుగం నానామణీ నిర్మితమ్**
**ఖేలద్దివ్య సురత్న మీననికరాస్ఫాలేన చిత్రాయితమ్**
**నానారత్న విచిత్ర తీర్థ విలసత్సోపానమత్యద్భుతమ్ 71**

జలములలో స్వర్ణవర్ణంలో ఉన్న పద్మాలు, మొగ్గలు మొదలైనవి శోభిస్తున్నాయి. అనేక విధములైన మణి, రత్నాలతో చేయబడిన రెండు తీరములు అమృతసారమువలె ఉన్మత్తం చేసే ద్రాక్షాదుల క్షీరరసాదులతో తడిసి ఉన్నాయి. క్రీడామయమైన దివ్యసుందర మీనముల త్రుళ్లింతలతో ఆశ్చర్యజనకమై ఉన్నది. అనేక రత్నములతో విచిత్ర ఘట్టములు ఏర్పరచబడినాయి. అందులో అత్యద్భుతమైన సోపానములు శోభిస్తున్నాయి.

**నానాశ్చర్య సుపుష్పిత ద్రుమలతా కుంజైర్మహా మంజులమ్**
**కర్పూరోజ్వలబాలుకం చ పులినం విస్తార సత్సౌరభమ్**
**తీరే తీర ఇతస్తతః స చకితోన్మీలన్ మృగీ యూథకమ్**
**దివ్యానేక కదంబ చంపక వనామోదః ప్రసృప్తోఽభితః 72**

శ్రీయమునాజీ అనేక ప్రకారములైన, ఆశ్చర్యకరమైన సుందర పుష్పాలతోను, వృక్షలతలతోను కూడిన కుంజలతో మనోహరంగా ఉన్నది. తీరములో కర్పూరం వలె ఉజ్వలమైన ఇసుక శోభిస్తూ, నలుదెసల సౌరభాన్ని వ్యాపింపజేస్తున్నది. తీరతీరాలలో చకితమైన లేడిపిల్లలు అటూ ఇటూ పరుగులు తీస్తున్నాయి. నాలుగు దిక్కులలో దివ్యమైన కదంబ, చంపక వృక్షముల సుగంధం పరిమళిస్తున్నది.

**అత్యుచ్చైః ప్రసరత్ పరాగ పటలం ప్రోడ్డీయమానద్విజమ్**
**వాతోన్మాదమితస్తతోఽతి మధురోదారాంతరీయోజ్జ్వలమ్**
**యస్యా గాధమగాధమంతరుదయత్ కుంజాంబు సా రాధికా**
**కృష్ణానంద వివర్ధినీ బహుసుఖం కృష్ణా ప్రపుష్ణాతు వః** **73**

శ్రీయమునా తీరంలో పైపైకి ప్రసరిస్తున్న పుష్పపరాగ ధూళితో కలసి పక్షి సమూహాలు పైపైకి ఎగురుతున్నాయి. వాయువుచే అలలు ముందు వెనుకలకు ఊగుతూ ఉండటం వలన మధుర, ఉదార, ఉజ్వల వస్త్రములను ధరించినట్లు ప్రతీతం ఔతున్నాయి. ఆ అగాధ జలాలలో తీరంలోని కుంజలు ప్రతిబింబిస్తున్నాయి. శ్రీరాధాకృష్ణుల ఆనందాన్ని వృద్ధి చేసే అట్టి యమునమ్మ మిమ్ము ఎంతో సుఖపూర్వకంగా పాలించునుగాక! రక్షించునుగాక!

**కూజద్భిః కలహంస సారసకులైః కారండవైర్మండితమ్**
**సమ్ప్రీణన్నవ పుండరీక నికరామోదేన దిఙ్మండలమ్**
**కల్హారోత్పల పంకజాదిక వనే భృంగీభిరంగీకృతమ్**
**గీతం మత్తమధువ్రతైః సహ మనాక్ కర్ణే జగన్మోహనమ్** **74**

శ్రీబృందావనం కలహంసల, సారసముల, కారండవ పక్షుల ధ్వనులతో శోభిస్తున్నది. నవ నవ కమలముల సౌరభంతో దశదిశలు పరిమళిస్తున్నాయి. కల్హార, కలువ, కమలములతో కూడిన వనంలో భ్రమరాలు మత్తిల్లిన మధుకరాలతో కలసి జగత్తును మోహింపజేసే మధుర సంగీతాన్ని ఆలపిస్తున్నాయి.

**శ్రీమద్బృందావనేఽస్మిన్ కతి కతి ను సరః సింధు వాపీ తడాకా**
**రాధాకృష్ణాంగరాగాంచిత మధురజలా దివ్యదివ్యా న సంతి**
**ఆశ్చర్యాః కేళిసారాః కతి కతి న మణిస్వర్ణభూభృత్కిశోరాః**
**ప్రోజ్జృంభంతే న భాసః క్షితిషు కతి మహామోద మేదస్వినీషు 75**

ఈ శ్రీబృందావనంలో శ్రీరాధాకృష్ణుల అంగరాగంతో తడిసి మధురజలాలతో పూర్ణమైన ఎన్నెన్ని దివ్యాతి దివ్యమైన సరోవరాలు, నదులు, బావులు, పుష్కరిణులు లేవు ? (అంటే అనేకం ఉన్నాయి అని అర్థం!) ఆశ్చర్యకర విలాసంతో యోగ్యమై మణిమయ, స్వర్ణమయములైన చిన్నచిన్న పర్వతాలు ఎన్నెన్ని విరాజమానం కాలేదు ? (ఉన్నాయి అని అర్థం). మహానందరూపమైన, సారవంతమైన ఈ భూమిపై అంతట ఎన్నెన్ని జ్యోతులు ప్రకాశించటం లేదు ? (అంటే బృందావనం జ్యోతిస్వరూపమని భావం!)

**ప్రేమాంధం పశు పక్షి భూరుహ లతా కుంజాద్రి సత్కందరా**
**వాపీ కూప తడాగ సింధు సరసీ రత్నస్థలీ వేదిభిః**
**కాలింద్యాః పులినేన తత్త్వ సకలేనాశేష వృందావనమ్**
**రాధా మాధవ రూపమోహితమహం ధ్యాయామి సచ్చిద్ఘనమ్ 76**

పశువులు, పక్షులు, వృక్షలతలు, కుంజనికుంజలు, గుహలు, బావులు, నేల బావులు, తటాకములు, నదులు, సరోవరాలు, రత్నస్థలీ వేదికలు మున్నగు వానితో కూడిన యమునానది; ఆ తీరం, ఇంకా అక్కడ ఉన్న సమస్తమూ శ్రీరాధా మాధవుల రూపంపట్ల మోహితమై, ప్రేమతో కనులు మూతపడి ఉన్నాయి. సచ్చిద్ఘనమైన అట్టి బృందావనాన్ని నేను ధ్యానిస్తున్నాను.

**అభ్యంగం వసనాంతరాణ్యభిషవం కించచ్చ తీర్థక్రియామ్**
**సంభుక్తిం వరగంధమాల్యవిలసత్తాంబూల పర్ణగ్రహమ్**
**సంగీతానుభవం సహైవ శయనం శ్యామేన సంవాహనమ్**
**శ్రీసఖ్యా పదయోః స్మర వ్రజవధూత్తంసస్య వృందావనే** **77**

శ్రీరాధకు సఖీమణులు చేసే తైలమర్దన సేవ, అభ్యంగన స్నానం, తీర్థ క్రియాదికం, భోజనం, సుగంధ పూర్ణమైన మధుర తాంబూల సేవ, సంగీత సేవ, శ్యామసుందరునితో కలసి శయనించిన వ్రజవధూ శిరోమణి శ్రీరాధా చరణాలకు చేసే సంవాహనసేవ – బృందావనంలో ప్రకటితమయ్యే ఇటువంటి లీలలను స్మరించు!

**మోహిన్యామపి నాస్తి మేఽద్భుతమతిః కా పార్వతీ కోర్వశీ**
**కా వాన్యా వరవర్ణినీ రతియుతా యచ్చేటికాంగచ్ఛటామ్**
**ఏకామప్యనుపశ్యతో హృది మహాసమ్మోహన శ్యామల**
**స్వాంతాత్యంత విమోహినీ స్ఫురతు మే వృందావనాధీశ్వరీ** **78**

ఎవరి దాసీమణి యొక్క శరీర కాంతిని ఒక్కమారు చూచినంతనే పార్వతి, ఊర్వశి, ఇంకా ఎంతో అందమైన సౌందర్యవతులను అటుంచి; స్వయంగా మోహిని కూడ నా బుద్ధికి ఆశ్చర్యం కలిగించలేదో ఆ రాధాజీ మహా సమ్మోహనకరుడైన శ్రీశ్యామ సుందరుని మనసును కూడ మోహితం చేస్తుంది. శ్రీబృందావనేశ్వరియైన ఆ శ్రీరాధ నా హృదయంలో స్ఫురించునుగాక! (అంటే శ్రీరాధా దాసీమణి యొక్క సౌందర్య కాంతియే అంత అద్భుతమైయుండ, ఇక శ్రీరాధా దివ్యసౌందర్యకాంతి ఎంత వర్ణనాతీతమో ఇట స్పష్టమగుచున్నది.)

**శ్రీరాధా చరణచ్ఛటాంబుధి ఘనం తద్భక్తిభావోదయత్**
**రోమాంచం తత ఏవ శిక్షితమభివ్యంజత్ సుసంగీతకమ్**
**చిత్రం తత్ప్రియ తత్ప్రసాద వసనాలంకార హారస్రజమ్**
**శ్రీవృందా విపినే కదాన్వనుభవామ్యాత్మేష్ట తత్వం వరమ్** **79**

సముద్రఘన కాంతి వంటి కాంతి కలిగినవి శ్రీరాధా చరణకమలాలు! ఆ దేవి యందు భక్తి, భావోదయం కలగటం వలన పులకితుడనై, ఆమె నేర్పిన సుందర సంగీత విద్యను ప్రకటిస్తూ; ఆమెకు ప్రియతముడైన శ్యామసుందరుని స్మరిస్తూ ఆ దేవి యొక్క ప్రసాద, వస్త్ర, అలంకార, హార, మాలాదులను ధరించి ఎప్పుడు నేను నా అభీష్టవస్తువును (రాధాజీని) బృందావనంలో అనుభవంలో తెలుసుకుంటాను ?

**స్నిగ్ధ స్వర్ణ సుగౌర సుందరవపుర్లావణ్య వన్యాకృతా**
**ద్వైతం నూతన యౌవన ప్రతిపదాశ్చర్యాంగభంగీశతమ్**
**శ్యామేందు ప్రథమానురాగ వహలోర్మీభిర్మహాందోలితమ్**
**శ్రీవృందావన కుంజ వీథిషు కదా దివ్యం తదీక్షే మహః 80**

స్నిగ్ధ, సువర్ణవర్ణ, గౌరకాంతులతో కూడిన సుందరమైన దేహాన్ని ధరించినది; అద్వయ భావాన్ని పొంది, మూర్తిమంతమైన లావణ్యమయ యౌవనం యొక్క అణువణువునందు ఆశ్చర్యపూర్ణమైన శతానేక అంగభంగిమల ప్రకాశాన్ని ప్రకటించునది; కృష్ణచంద్రుని నూతనానురాగరూప తరంగాలతో అధికంగా చంచలించునది అయిన ఆ దివ్యజ్యోతిని (శ్రీరాధను) బృందావన కుంజవీథులలో నేను ఎప్పుడు దర్శించుకుంటాను ?

**ఏకం వీక్ష్య జిహ్యేతి యస్య కబరీమన్యన్ముఖం మోహనమ్**
**కించిత్ వక్షసిజౌ దృశౌ కిమపి యద్దంతాధరం కించన**
**కించిత్ యద్ద్యుతి మంజరీరితి మహాశ్చర్యం నికుంజోదరే**
**శ్యామోరఃస్థలభూషణం స్ఫురతు మే తద్ధేమ గౌరం మహః 81**

ఒకానొకరి (శ్రీశ్యామసుందరుని) కేశరాశిని చూచి ఒకానొక రెండవవారు (శ్రీరాధ) సిగ్గిలుతున్నారు. ఒకరి మనోహర ముఖమును చూచి మరొకరు

లజ్జితులౌతున్నారు. అట్లే ఒకరి స్తనయుగళం, మరొకరి నేత్రయుగళం; ఒకరి అధరం, రెండవ వారి కాంతి చూచుకుంటూ సిగ్గుపడుతున్నారు. ఈ విధంగా నికుంజలో శ్రీశ్యామసుందరుని అంకస్థలికి భూషణ స్వరూపమైన మహాశ్చర్యమయ హేమగౌరాంగి శ్రీరాధ నా హృదయంలో స్ఫురించునుగాక!

**వ్యంజత్ కైశోరమంగం కనకరుచి నవానంగభంగీ తరంగమ్**
**నిత్యాశ్చర్యైక శోభా ప్రసరమతి మహాప్రేమ వైవశ్య ముగ్ధమ్**
**దివ్య స్రగ్వస్త్ర భూషాద్యహహ సుభగయత్ స్వీయ లక్ష్మ్యా దధత్త**
**చ్చిత్రీభూతాలివృందం మిలతు నిజధనం ధామ వృందావనాంతః 82**

శ్రీరాధా అంగాంగములు నిత్యకైశోర శోభతో ఉంటాయి. స్వర్ణవర్ణ కాంతితోను, అనంగుని వలె చంచలత్వంతోను, నిత్యం ఆశ్చర్యకరమైన శోభావృద్ధితోను ఆదేవి ప్రకాశిస్తూ ఉంటుంది. మహాప్రేమ వివశత్వంతో మనసును హరిస్తుంది. ఓహో! తన శోభతో దివ్య మాల, వస్త్ర, భూషణాదికాన్ని అత్యంత సౌభాగ్యవంతంగా చేస్తుంది; సఖీమణులను చిత్రిత ప్రతిమలుగా చేస్తుంది. నా సర్వస్వమైన ఆ రాధాజీ శ్రీబృందావన ధామంలో దర్శనం ఇవ్వాలి. అదే నా ప్రార్థన!

**నవరసిక కిశోరే నూతన ప్రేమపూరే**
**నవరసమయ వృందారణ్య వీథి విహారే**
**నవనవ పురుశోభా మాధురీణాం ధురీణే**
**కనకమరకతాభే జ్యోతిషీ మే హృది స్తామ్ 83**

నవనవ ప్రేమ ప్రవాహాన్ని ప్రవహింపజేయునది, నవరసమయమైన బృందావన వీథిలో విహరించునది; నిత్య నవీనమైన, మహాశ్చర్యమయమైన శోభామాధుర్యరాశి అయినట్టిది; స్వర్ణ, మరకత, మణిమయ కాంతివంటి కాంతి

కలది అయిన జ్యోతిర్మయ నవరసిక శ్రీయుగళం నా హృదయంలో వసించును గాక!

**బహువిరచిత వేశస్యోరు దేశే నివేశ్య**
**స్ఫుట పులకమజస్రం చుంబతః శ్లిష్యతశ్చ**
**నను కథమపి తల్పే న్యస్యతోఽఙ్గం ప్రియాయాః**
**పరిచర చరణాబ్జం రాధికా నాగరస్య 84**

బహువిధ వేషధారియైన శ్రీరాధానాగరుడు (శ్రీశ్యామ సుందరుడు) ప్రియాజీని ఒకానొక విధానంలో శయ్యపై పరుండజేస్తూ, ఊరుస్పర్శచేత రోమాంచితుడై; ముద్దుగొని, కౌగిలించుకుంటున్నాడు. ఆ శ్రీయుగళ చరణ కమలాలను సేవించు!

**వ్రతతి భవనమధ్యే గంధ తాంబూల మాల్యైః**
**అతిమృదుల విలేపైః సాధు సంవీజనేన**
**తదతి మదనముగ్ధం ధామయుగ్మం కిశోరమ్**
**పరిచర హృది గౌరశ్యామలం దాస్యలాస్యః 85**

అత్యంతము అనంగముగ్ధులైన గౌరశ్యామ యుగళకిశోరులు లతాగృహంలో విరాజమానులైనారు. వారిని గంధ, తాంబూల, మాలాదికాన్ని అర్పించటం; అతి మృదులమైన విలేపనాదులు, ఉత్తమ వింజామరలతో వీచటం మున్నగువానితో దాస్యరసమగ్నవై సేవించు!

**కైశోరాద్భుత రూపభంగిమధురైరంగైరనంగాత్మకమ్**
**కుర్వత్ విశ్వమతి ప్రముగ్ధ మురలీవక్త్రేణ నిత్యాద్భుతమ్**
**సించత్ కోమల కాంచనద్రవరుచాం వీచీభిరాశాదశ**
**ప్రేమోత్కంఠ్యభరేణ తద్భజ మనః శ్రీధామ వృందావనమ్ 86**

ఓ మనసా! ఎవరు (శ్రీబృందావనం) కిశోర అవస్థలోని అద్భుత రూప భంగిమతో, మాధుర్య, మనోహర, మురళీ వదనం (శ్రీశ్యామసుందరుని)తో విశ్వాన్ని నిరంతరం అద్భుత ప్రేమమయం చేస్తున్నారో; ఏ ధామం (శ్రీరాధ) తప్తకాంచన కాంతి తరంగాలతో దశదిశలను తడిపివేస్తున్నదో ఆ శ్రీబృందావనాన్ని ప్రేమోత్కంఠ పూర్వకంగా భజించు!

**అయం బృహదధీశ్వరో న గణితావతారోఽప్యసౌ**
**శ్రితో యదుపురీమయం మధుపురీం చ దివ్యాకృతిః**
**వ్రజేచ మధుపురీ వనవరే న గో గోపికా**
**సుహృద్భిరహరన్మనో మమ తు రాధికా కుంజగః 87**

ఆ బృందావన చంద్రుడు అగణిత అవతారాలలో మహాధీశ్వరుడైన అవతారి అయినా; దివ్యమూర్తిధారణ చేసి ద్వారకలోను, మధురలోను ఉన్నా నా మనసు వాని యందు రమించటం లేదు. మధురాపురి యొక్క శ్రేష్ఠవనమైన వ్రజంలో గోవులు, గోపికలు, సఖాగణంతో ఆయన సంచరిస్తున్నా అప్పుడు కూడ నా మనసుకు ఆనందం కలగటం లేదు. కాని శ్రీశ్యామసుందరుడు శ్రీరాధా నికుంజకు వెళ్లినప్పుడు మాత్రమే నా మనసు హరింపబడుతున్నది.

**కామాత్మజ్యోతిరేకం సువిమల విమలం ప్రోజ్జ్వల ప్రోజ్జ్వలం య**
**న్మాధుర్యాపార సింధోరపి మధురతరం మాదకం మాదకానామ్**
**పారావారాతి శూన్యం సకలసుఖ చమత్కార విస్మారకం త**
**న్మధ్యే వృందావనం తద్ర్వతతి గృహగతౌ పశ్య ముగ్ధౌ కిశోరౌ 88**

శ్రీబృందావనం ఏకమాత్ర కామాత్మక జ్యోతి ప్రకాశం! ఆ ధామం విమలమునకు విమలము, ప్రోజ్వలత (గొప్ప ఉజ్వలత)కు ప్రోజ్వలతరం, మహామాధుర్య సాగరానికన్న మధురతరము, ఉన్మత్తతకు ఉన్మత్తతను కలిగించునది,

హద్దులు లేనిది, సమస్త సుఖాల చమత్కారాన్ని మరపించునది! అట్టి బృందావన లతాగృహంలో విరాజమానులైన పరమ మనోహర శ్రీయుగళ కిశోరులను దర్శించు!

**మధుర మధుర పూర్ణ ప్రేమ పీయూష సింధోః**
**ఘనమిదమతిరమ్యం భాతి వృందావనాఖ్యమ్**
**తదధి లలిత గౌర శ్యామ ధామ స్మరామః**
**స్మర వివశ కిశోర ద్వంద్వమానందకందమ్ 89**

మధురాతి మధురము, ఘనీభూతమైన పూర్ణ ప్రేమామృత స్వరూపము, అతి రమణీయము అయిన శ్రీబృందావన ధామం ప్రకాశిస్తున్నది. అందు ప్రేమవివశులు, ఆనందస్వరూపులు, లలిత గౌరశ్యాములు అయిన శ్రీయుగళ కిశోరులను స్మరిస్తున్నాము.

**ఆత్మేశ్వరీ పరమ గూఢతరేంగితజ్ఞం**
**తత్తత్ప్రియ ప్రణయ లౌల్యభర స్వభావమ్**
**స్వాత్మైకపక్షరచనా చరణ ప్రవీణం**
**వృందావనే స్మర నిజం స్మరఖేల తత్వమ్ 90**

శ్రీబృందావనంలో ఆత్మేశ్వరి యొక్క పరమ నిగూఢ భావాన్ని ఎరుగునది, ప్రియాప్రియతముల ప్రణయ స్వభావాన్ని ఎరిగిన సఖియల మాట ప్రకారం చేయటంలో చాతుర్యం కలిగినది అయిన నిజప్రేమలీలా పరాయణ తత్వాన్ని (స్వరూపాన్ని) స్మరించు!

**ఉత్ఫుల్ల ద్రుమవల్లిమంజులతరంసింజత్ షడంఘ్రిజ్జ్వలన్**
**నానారత్నమయస్థలీతతి లసచ్ఛ్రీపుంజ కుంజావలి**
**నృత్యన్మత్త మయూరబృందమభితః పక్షీంద్ర కోలాహలమ్**
**రాధాకృష్ణ విహారకౌతుకమయం ధ్యాయామి వృందావనమ్ 91**

శ్రీబృందావనం వికసించిన పుష్పలతల శోభతో రమణీయంగా ఉన్నది. భ్రమర సమూహాలు గుంజారవం చేస్తున్నాయి. జాజ్వల్యమానంగా ప్రకాశిస్తున్న రత్నమయ ప్రదేశాలతో అలంకృతమై ఉన్నది. సుందరమైన అనేక కుంజలతో భూషితమై ఉన్నది. మత్తమయూరాలు అటు ఇటు తిరుగుతూ నృత్యం చేస్తున్నాయి. పక్షిరాజు కోలాహలంగా తిరుగుతున్నాడు. శ్రీరాధాకృష్ణుల నిరంతర కుతూహల పూర్ణవిహారంతో పరిపూర్ణమైన అట్టి బృందావనాన్ని ధ్యానిస్తున్నాను.

**తత్కాళిందీ విపుల పులినం సా చ వృందావన శ్రీః**
**సా సుచ్ఛాయా నిబిడ నిబిడా శ్రీకదంబ ద్రుమాణామ్**
**సా వైదగ్ధీమయ నవవయః శ్రీసఖీమండలీ తే**
**గౌరశ్యామే రసిక మహసీ కస్య నో మోహనాయ ? 92**

ఆ యమునా నదీ విశాల తీరం, ఆ బృందావన శోభ, ఆ సుందర కదంబ వృక్షాల చల్లని నీడ, విదగ్ధతా పూర్ణమైన ఆ శోభామయ సఖీబృందం, ఆ గౌర శ్యామ రసిక యుగళ కిశోరులు ఎవరి మనసును మోహింపజేయరు ? అంటే అందరి మనసులను మోహింపజేస్తారని భావం!

**ప్రత్యంగం దివ్యవాసః ప్రసరతి మధురాశ్చాతి నిర్భాంతి భాసః**
**ప్రేమ్ణో నానా వికారాః ప్రతిపదమధికో మాధురీణాం ప్రవాహః**
**సౌందర్యాంభోధిభూమా నిరవధిరతి వర్ధిష్ణు కందర్ప లౌల్యమ్**
**వృందారణ్యేశయోర్యే హృది దధతి పదం తాన్నమో భూరిభాగాన్ 93**

శ్రీరాధాకృష్ణుల ప్రత్యంగం నుండి దివ్యసుగంధం వ్యాపిస్తున్నది. మధురాతి మధుర ప్రభ (కాంతి) ప్రకాశిస్తున్నది. వారి అణువణువు నుండి నానా ప్రకారములైన ప్రేమ, మాధుర్యముల ప్రవాహం వృద్ధి చెందుతున్నది. సౌందర్య సాగరం పరాకాష్ఠ స్థితిలో ఉండి, నిరంతరం ప్రేమను పెంపు చేసే అనంగ

చాంచల్యం ప్రకటితం ఔతున్నది. బృందావనాధీశులైన ఇట్టి శ్రీయుగళ చరణ కమలములను హృదయంలో ధరించిన భాగ్యవంతులకు నమస్కరిస్తున్నాను.

**గౌర శ్యామ సునాగర దివ్యకిశోర ద్వయం సదా యత్ర**
**నవ నవకేళి విలాసైర్విహరతి వృందావనం తదేవ భజ 94**

ఎక్కడ గౌర శ్యాములు, చతుర శిరోమణులు అయిన దివ్యయుగళ కిశోరులు నిరంతరం నవనవకేళీ విలాస విహారం చేస్తూ ఉంటారో ఆ శ్రీబృందావన ధామమునే భజించు!

**వృందావనమివ వృందావనమతి మధురం తదేవ వందేఽహమ్**
**రాధాకృష్ణావివ తౌ రాధాకృష్ణౌ సదా రతౌ యత్ర 95**

ఎక్కడ శ్రీరాధాకృష్ణుల వంటి వారే అయిన సాటిలేని శ్రీరాధాకృష్ణులు ఆసక్తులై నిరంతరం క్రీడిస్తూ ఉంటారో ఆ అతిమధుర శ్రీబృందావనం వంటి శ్రీబృందావనానికి నేను నమస్కరిస్తున్నాను.

(బహుశః పై ధామంలోని శ్రీరాధాకృష్ణులే వచ్చి, పై ధామంలోని బృందావనం వంటి భౌమ బృందావనంలో విహరిస్తూ ఉన్నారని కవి భావం అయి ఉండవచ్చు).

**జ్యోతిః కించన జాజ్వలీతి పరమం మాయాగుణేభ్యః పరమ్**
**సాంద్రానందమనంత పారమమలం విద్యారహస్యం మహత్**
**ఆద్యప్రేమరసాత్మికాంచ సుచమత్కారాం మహామాధురీ**
**ధారాం విభ్రదుదేతి ధామ పరమభ్రాజిష్ణు వృందావనమ్ 96**

మాయను కల్పించే త్రిగుణాలకు దూరంగా ఒకానొక అనిర్వచనీయమైన పరంజ్యోతి ప్రకాశిస్తున్నది. ఆ జ్యోతి గాఢానందాత్మక, అపార, అమల,

విద్యారహస్యముల చేత మహత్పూర్ణమైనది. ఆ పరంజ్యోతికి పైన ఆద్యప్రేమయైన దివ్యశృంగార రసాత్మకము, చమత్కార పూర్ణమైన పరమ మాధుర్యయుక్తము, పరమ కాంతిమయము అయిన శ్రీధామ బృందావనము విరాజమానమై ఉన్నది.

**తత్రాశ్చర్యఫల ప్రసూన భరితైరాశ్చర్య ఖేలత్ఖగ**
**వ్రాతానాం పరితో మహాకలకలైః కర్ణామృతౌఘోపమైః**
**మాధ్వీమత్త మధువ్రతావలికలధ్వానై ర్మనోహారిభిః**
**దివ్యానేక లతామహీరుహగణైః కృష్ణ ప్రియైర్మండితే 97**

ఆశ్చర్యకరమైన ఫలాలతోను, పూవులతోను పూర్ణమై; ఆశ్చర్యమయ క్రీడా పరాయణమైన పక్షుల అమృతతుల్య కలకలధ్వనులతో ధ్వనిస్తూ; మకరంద పానంతో మత్తిల్లిన భ్రమరాల మనోహర మృదుల ధ్వనితో కూడి; శ్రీకృష్ణునకు ప్రియమైన దివ్యాతిదివ్య వృక్షలతలతో అలంకృతమై – (అట్టి శ్రీబృందావనము అని సరస్వతీ పాదుల భావం).

**శ్రీకృష్ణప్రియ దివ్యగంధ తులసీ భేదైరనంతై స్తథా**
**సంతానైర్హరి చందనైరగణితైః కల్పద్రుమాణాం వనైః**
**దివ్యానేక సుపారిజాత విపినైర్మందార వృందైరపి**
**భ్రాజిష్ణౌ హరివల్లభైశ్చ బహుశో నీపైః కదంబైర్వృతే 98**

శ్రీకృష్ణునకు ప్రియమైన అనంతానంత, దివ్యసుగంధంతో కూడిన తులసి వృక్షాలతో; అనేకమైన పక్షిసమూహాలతో; గంధం చెట్లు, కల్పవృక్షాలతో కూడిన వనాలతో; దివ్యాతి దివ్యమైన సుందర పారిజాత, మందార వృక్షాలతో; హరివల్లభతో; వేప, కదంబాది వృక్షాలతో అలంకృతమై – (అట్టి బృందావనం అని భావం).

**తత్తత్కాంచనహైర మారకత సద్వైదూర్య వర్య స్థలీ**
**రంగే మత్త శిఖండి మండల మహానందస్ఫురత్తాండవే**
**నానా చిత్ర మృగీగణైః సచకితాలోకేన చేతోహరైః**
**శోభాం విభ్రతి సర్వతః ప్రసృమరానంతచ్ఛటా సౌరభే 99**

స్వర్ణ, వజ్ర, ఇంద్రకాంతాదులు, వైదూర్యమణులతో తయారు చేసిన సుందర రంగమంచెల (అలంకరించిన ఎత్తైన మంచెల)తోను; మత్తమయూరాల మహానందజనకమైన తాండవ నృత్యంతోను; జింక సమూహాల చకిత దృష్టులతోను; అన్ని దిక్కులను పరిమళ భరితం చేస్తున్న సుగంధ ద్రవ్యాలతోను శోభిస్తున్న – (బృందావనం అని భావం).

**కల్హారోత్పల పుండరీక కుముదాద్యాశ్చర్య పుష్ప శ్రియా**
**మాద్యచ్చిత్ర విహంగయూథ రచితాత్యానంద కోలాహలైః**
**దివ్యానేక సరిత్సరోభి రసకృచ్ఛీరాధికా కృష్ణయోః**
**ఆశ్చర్యైః కలకేలిభిః సుమధురే తత్ప్రేమసారాత్మభిః 100**

కల్హార, కమల, పుండరీక, కుముదాది ఆశ్చర్యమయమైన పూవులతో శోభిస్తున్న కారణంగా మత్తిల్లిన విచిత్రమైన పక్షుల ఆనంద కోలాహలంతో ధ్వనిస్తున్నట్టి; దివ్యాతి దివ్యమైన అనేకనదీ సరోవరాలతో కూడినట్టి; శ్రీరాధా కృష్ణుల ప్రేమ సారాత్మకమైన అత్యాశ్చర్య రసమయ కేళీ విలాసాదులతో మధురమైనట్టి – (శ్రీబృందావనం అని భావం).

97వ శ్లోకం నుండి 100వ శ్లోకం వరకు శ్రీసరస్వతీ పాదులు శ్రీబృందావన దర్శనం చేస్తూ భావవివశులై శ్రీబృందావన వర్ణన చేసినట్లు తోస్తున్నది. ఏమంటే వాక్యం పూర్తి కాకుండగనే తరువాతి శ్లోకం మొదలుపెట్టటం జరిగింది.

**జాతీ కానన యూథికా వన నవప్రోత్ఫుల్ల మల్లీవనైః**
**వాసంతీ నవకేతకీవన నవశ్రీమాలతీ కాననైః**
**జీవంతీవన ఝింటికా నవలసచ్ఛేఫాలికా కాననైః**
**ఉన్మీలన్నవ మాలికా నవవనైః సువర్ణయూథీవనైః 101**

జాతివనం, యూథికావనం, నవప్రఫుల్ల మల్లికా వనాలు, వాసంతీ వనం, కేతకీవనం, సౌందర్య పూర్ణములైన మాలతీ వనాలు, యావంత్యావనం, ఝింటీవనం, నవశోభిత శేఫాలికావనం, వికసిత నవమల్లికావనాలు, సువర్ణవర్ణ రంజితములైన అనేక వనాలతో శోభిస్తున్న -

**పున్నాగైః కరవీరకైర్మరువకైః సత్కర్ణికారైర్లసత్**
**కుంజైః కుందవనైరశోక వకులైర్భూచంపకై శ్చంపకైః**
**ఆమ్లానైః స్థల పంకజైర్దమనకైర్దివ్యైః శిరీషద్రుమైః**
**సర్వర్తు ప్రవికాశిభిర్నవ నవామోదైర్మనో హారిణి 102**

పున్నాగ, కరవీర, మరువక, కర్ణికార, మనోహర కుంజ, కుందవన, అశోక, వకుళ, భూమి చంపక, చంపక, మామిడి, స్థల పద్మ, దమనక, దివ్యాతిదివ్య శిరీష వృక్షాదులతోను; అన్ని ఋతువులలోను వికసించే నవనవ సుగంధ పుష్పాలతో కూడిన వృక్షాలతోను మనోహరమైన -

**కల్హారోత్పల పద్మకైరవముఖాసంఖ్య ప్రసూనైః స్ఫుటై**
**ర్హంసైః సారస చక్రవాక మిథునైః కారవండవాద్యైః ఖగైః**
**అత్యానంద మదోరు ఖేలన కలధ్వానైర్మహా రమ్యయా**
**భృంగీయూథశతైర్భ్రమద్భిరభితో గుంజద్భిరా మంజులే 103**

కల్హార, ఉత్పల, పద్మ, కైరవ (ఒక రకమైన లిల్లీపూవు) మొదలైన వికసిత పుష్పాల సుగంధంతోను; హంస, సారస, చక్రవాక, కారండవాది పక్షుల ఆనందోన్మత్త

క్రీడల వలన పుట్టిన కలకలధ్వనిచే రమణీయమై; అటు ఇటు ఎగురుతున్న శతానేక భ్రమరాల గుంజారవంతో మంజులమైన –

**ఆశ్చర్యైర్హరి రాధికా విహరిణైః కందర్పదర్పోద్ధురైః**
**శుద్ధశ్యామరసప్రవాహలహరీ విస్ఫూర్జదావర్తయా**
**పీయూషాధిక మాధురీభరధురీణా స్వాద్య శీతాంభసా**
**కాలింద్యా వరరత్నబద్ధతటయా క్రోడీకృతే దివ్యయా** **104**

ఆశ్చర్యజనకమై, కామునిదర్పాన్ని అణచిన శ్రీరాధాకృష్ణుల అనేక విహారములతో కూడినట్టి; విశుద్ధ శృంగార రసప్రవాహ తరంగాలతోను, సుడులతోను కూడినట్టి; అమృతం కంటె అధిక మాధుర్యం, ఆస్వాదనా యోగ్యము అయిన శీతల జలములతో పూర్ణమైనట్టి; శ్రేష్ఠమైన రత్నాలతో పొదగబడిన తీరములు కలిగినట్టి దివ్యయమునా నదీ అంకస్థలిపై శోభిస్తున్న –

**ఆశ్చర్యైర్మణి పర్వతైరతి మహాశోభాఢ్య సత్కందరైః**
**చిజ్జ్యోత్స్నామృత నిర్ఝరైః కనకరత్నాంభః సరిచ్ఛోభితైః**
**ప్రత్యగ్రాద్భుత వల్లిమండప వరైరాశ్చర్య రత్నద్రుమైః**
**నానారత్నమయ స్ఫురత్ఖగ మృగైరన్యాద్భుతైః శోభితే** **105**

ఆశ్చర్యకరమైన మణిమయ పర్వతాలు, మహాశోభాపూర్ణమైన గుహలు, అమృతమయమైన దివ్యకిరణ ప్రవాహాలు, స్వర్ణరత్నమయ జలాలతోకూడిన నదుల శోభ, నవ నవాద్భుత లతాగృహాలు, ఆశ్చర్యజనకమైన రత్నమయ వృక్షాలు, నానా రత్నమయ పశుపక్ష్యాదులు, ఇంకా ఇటువంటి అన్యాన్య అద్భుత వస్తువులతో శోభిస్తున్న –

**ఉన్మీలత్తదుపత్యకోదిత రహోవల్లీ గృహైర్భూషితే**
**భ్రాజన్మోహన పుష్పవాటిక ఉరుశ్రీమత్ స్థలీచిత్రితే**
**ప్రోన్మీలద్రస పుంజరంజిత మహాకుంజావలీ మంజులే**
**శ్రీశ్యామేన సహాలి తద్దయితయా క్లప్తే చ దివ్యే వనే 106**

ప్రకాశవంతమైన పర్వతమూలములో ఉన్న నిర్జన లతాగృహాలతో భూషితమైన; దీప్తమనోహర పుష్ప వాటికలతోను, అనేక శోభామయ ప్రదేశాలతోను చిత్రమైన; ఉజ్జ్వలమైన రసములతో రంజితమైన; అనేకమైన మహాకుంజలతో మనోహరమైన; సఖియలు, శ్రీశ్యామసుందరుడు, ఆతని ప్రియతమయైన శ్రీరాధాజీలకు అంగీకృతమైన ఆ దివ్యవనములో (శ్రీబృందావనంలో) –

**నానా దివ్యవిచిత్ర వర్ణతనుభిర్దివ్యాంగ రాగస్రగా**
**కల్పైర్దివ్య కిశోర మోహనవయః శోభాచమత్కారిభిః**
**దివ్యానేక కళాతి కౌశల కృతానందైర్నిజ ప్రేయసోః**
**ప్రేమాంధైః పరిమండితేఽతి లలితే రాధా సఖీమండలైః 107**

దివ్యమైన నానా విచిత్ర వర్ణములు కల దేహములతోను; దివ్య అంగ రాగ మాల్యాదులతోను; దివ్యమైన, మనోహరమైన కిశోర వయసు యొక్క శోభాచమత్కారంతోను; అనేక విధములైన దివ్యవిద్యల యందలి నేర్పరితనం వలన కలిగిన ఆనందంతోను; తమ ప్రియమైన శ్రీరాధాకృష్ణుల యందలి ప్రేమతోను విముగ్ధమైన శ్రీరాధా సఖీబృందము చేత శోభిస్తున్న, (ఆ శ్రీబృందావనంలో.... ఇంకా) అతి లలితమైన –

**చారు శ్రోణిభరైర్వలీత్రయవలత్ క్షామోదరైర్మోహనా**
**కార శ్రీస్తనయుగ్మ కంచుక లసన్ముక్తావలీ మండితైః**
**తాటంకద్యుతిదీప్తగండ ముకురైః శ్రీనాసికాగ్ర స్ఫురత్**
**రత్నస్వర్ణ నిబద్ధ మౌక్తికవరైః కాంత్యా జగన్మోహనైః 108**

శ్రీరాధా సఖియల కటి ప్రదేశం అత్యంత సుందరంగా ఉన్నది. మూడు రేఖలతో కూడిన ఉదరం పలుచనై ఉన్నది. మోహనమైన సుందర వక్షస్థలంపై ధరించిన కంచుకముపై ముత్యములు శోభిస్తున్నాయి. కర్ణకుండలాల తళతళలు వారి చెంపలను ప్రకాశితం చేస్తున్నాయి. సుందరమైన నాసికాగ్రభాగాన స్వర్ణరత్న జటితమై అందమైన ముత్యం ఊగుతున్నది. సఖియల కాంతి జగన్మోహనమై వెలుగుతున్నది.

**ప్రేష్ఠద్వంద్వ మహాప్రసాద వసనాకల్ప స్రగాదుజ్జ్వలైః**
**తప్త స్వర్ణ సుగౌర మోహన తనుజ్యోతిర్జగత్పూరకైః**
**రాధాకృష్ణ పదారవింద పరమప్రేమైక జీవాతుభిః**
**తత్తద్దివ్య నిజాధికార కలయా ప్రాణద్వయ ప్రీణనైః 109**

తమ ప్రియతమమైన యుగళ కిశోరుల మహాప్రసాద, వస్త్ర, రూప, మాల్యాదులను ధరించి సఖియలు ఉజ్వలంగా ప్రకాశిస్తున్నారు. తప్త సువర్ణమువలె గౌరమోహన శరీర కాంతితో జగత్తును పరిపూర్ణం చేస్తున్నారు. శ్రీరాధాకృష్ణుల పదారవిందముల పట్ల పరమప్రేమయే వారికి ఏకమాత్ర జీవనాధారం! సఖీమణులు తమతమ అధికృత విద్యలతో ప్రాణప్రియ యుగళమునకు ప్రీతి కలిగిస్తూ ఉంటారు.

శ్రీప్రబోధానంద సరస్వతీపాదులు బృందావన మహాద్భుత సౌందర్యాన్ని దర్శిస్తూ భావవివశులై బృందావన మహిమామృతాన్ని అందించారు. అందులోను ఈ మూడవ శతకంలోని 97వ శ్లోకం నుండి 107వ శ్లోకం వరకు ఆ మహాత్ముడు చేసిన వర్ణన, ఒక శ్లోకంలోని భావం పూర్తికాకముందే తరువాతి శ్లోకాన్ని ఆరంభించటంలోని వారి భావస్థితి భావుకులను ముగ్ధులను చేస్తున్నది.

శ్రీ సరస్వతీ పాదులు తమ గురుదేవులు ఆదేశాన్ని అనుసరించి మాన్ సరోవరానికి వెళ్లారు. ఎట్టి పరిస్థితులలోను ఆ రాత్రి అక్కడి నుండి వెనుకకు రావద్దని గురుదేవుల ఆజ్ఞ! ఆ రాత్రి ఉరుములు, మెరుపులతో పెద్దవాన, పెనుగాలి, క్రూరమృగాల అరుపులతో వాతావరణం భయంకరంగా ఉన్నది. అయినా శ్రీసరస్వతీ పాదులు భయపడక దృఢచిత్తులై ధ్యానమగ్నులైనారు. అమ్మ అనుగ్రహించింది. క్షణాలలో వాతావరణం అంతా దివ్య శోభతో వెలిగిపోయింది. మృదుమధురమైన వాయు స్పర్శ, రససుగంధ పరిమళంతో దివ్యబృందావన శ్రీసాక్షాత్కారం ఆ మహాత్మునికి లభించింది. శ్రీరాధాగోవిందుల భావదర్శన భాగ్యం కూడ పొంది ఉంటారు. కనుకనే ఒక శతకాన్ని మించి మరొక శతకం భావపూర్ణంగా ప్రకాశిస్తున్నది. ఆ మహాత్ముడు అత్యంత భావావిష్టులై ఈ మూడవ శతకంలోని చివరి శ్లోకాలలో ఒక శ్లోక భావం పూర్తి కాకముందే మరొక శ్లోక భావంలోకి వెళ్లి ఉంటారు.

శ్రీ బృందా మహనీయ మహాత్ములకు నమస్సులు!

శ్రీ సరస్వతీపాదులు శ్రీరాధా సఖీమణుల దివ్యవర్ణనతోనే నాల్గవ శతకాన్ని ఆరంభించారు.

# నాల్గవ శతకము

**కూజన్నూపుర కాంచిదామ లలితైః పాదాంగులీయైః స్ఫురత్**
**శ్రీపాదాంగద శోభితైర్వరమణీ కేయూర చూడాగణైః**
**శ్రీమత్పీన నితంబదోలిత శిఖా సద్గుచ్ఛ వేణీలతా**
**మూలావేష్టిత ఫుల్లమల్లి విపులస్రగ్విభ్రమత్ షట్పదైః** 1

మ్రోగుతున్న నూపురాలతోను, వడ్డాణాల కాంతితోను శ్రీరాధా సఖియల పాదాంగుళులు (కాలివేళ్లు) అతి మనోహరంగా ఉన్నాయి. వారు మణిమయమైన కేయూరాలతోపాటు సుందరమైన నూపురాల శోభతో విభూషితులై ఉన్నారు. సుందరమైన వారి నితంబ ప్రదేశంపై పూగుత్తులతో బద్ధమైన కేశరాశి లతారూపంగా ఊగుతున్నది. వికసించిన మల్లెలమాలపై భ్రమరాలు చరిస్తున్నాయి.

**విభ్రాజద్వరకంబుకంఠపదకైః శ్రీహస్తరక్తాంబుజ**
**స్ఫూర్జద్రత్నమయాంగులీయ రుచిభిః కైశోర నిత్యోదయైః**
**వైదగ్ధీపరపారగైరతి మహాసంగీత విద్యామయైః**
**శ్రీరాధానుచరీగణైః శ్రుతిశిరో దూరాతి దూరేహితైః** 2

శ్రీరాధా దాసీమణులు మూడు రేఖలతో సుందరమైన శంఖము వంటి మెడలలో హారాలను ధరించినారు. వారి శ్రీహస్తము ఎర్రని కమలము వలె ఉన్నది. వారియందు రత్నమయములైన ఉంగరముల కాంతి ప్రకాశిస్తున్నది. వారు నిత్య కిశోరావస్థలో వెలుగొందుతున్నారు. నైపుణ్యంలో పరాకాష్ఠ స్థితిని పొంది, మహా సంగీత వేత్తలైన శ్రీరాధా దాసీమణులను గురించి వేదవేదాంగాలు అణుమాత్రమైనా గ్రహించలేవు.

(అంటే శ్రీరాధా అనుచరీమండలి వేదాతీతమని అర్థం.)

**సర్వాభీర కిశోర సుందర వధూ దుష్ప్రాప పాదాంబుజ**
**చ్ఛాయైః సర్వవిదగ్ధతానిధి లసద్దాసీగణైః సేవ్యయా**
**తద్ద్వంద్వ ప్రణయోత్థసాంద్ర పులక శ్రీమత్సఖీమండలైః**
**కామావేశ సదా ముదాకులతయా రాత్రిం దివం లాల్యయా 3**

గోపబాలకుల యొక్క సుందర వధూమణులైన గోపికలకు ఎవరి చరణకమల ఛాయా (నీడ) దర్శనం కూడ దుర్లభమో అట్టి సర్వనైపుణ్య నిధులైన దాసీ మణులచేత శ్రీరాధ సేవింపబడుతున్నది. (దాసీమణుల చరణముల నీడను దర్శించటం కూడ అంత దుర్లభమైతే వారిచే సేవింపబడుతున్న రాధాజీ ఇంకెంత అందరాని దేవియో అని భావం!) ఆ యుగళ కిశోరుల యందు కల ప్రణయం చేత పులకితులై శోభిస్తున్న సఖీమణులు ప్రేమభావావేశ మహానందంతో వ్యాకులత్వాన్ని పొందిన రాధాజీని రాత్రింబవళ్లు సేవిస్తున్నారు.

మొదటి మూడు శ్లోకాలలో శ్రీరాధా సఖియల, దాసీమణుల వేదాతీతమైన మహోన్నత స్థితిని, దివ్యసౌందర్యాన్ని వర్ణించిన ఆ మహాత్ముడు ఇక రాధాజీ పేరును చెప్పకనే తమ వర్ణనతో ఆదేవిని స్ఫురింపజేస్తున్నారు.

**స్వాలీ స్వప్రియ కింకరీగణ లసత్తారావలీ మధ్యతః**
**స్ఫూర్జత్సౌభగ సాంద్రచంద్రకలయేవాత్యద్భుత జ్యోతిషా**
**ఏకైకాంగ తరంగితాద్భుత మహాగౌరచ్ఛటైకాంబుధే**
**ర్వీచీభిః స్వరసోత్సవాత్మభిరహో సంప్లావితాశేషయా 4**

(శ్రీరాధ) తన సఖీమణులు, దాసీమణులు అనెడు తారాగణముల మధ్య అత్యద్భుత కాంతితో సౌభాగ్యఘన పూర్ణ కళలతో వెలిగెడు చంద్రునివలె ప్రకాశిస్తున్నది. ఓహో! (ఆ దేవి) తన ప్రత్యంగము నుండి ఎగసిపడుతున్న మహాద్భుత గౌర కాంతులకు ఏకమాత్ర సాగరమై, తన రసాత్మక తరంగాలతో జగత్తునంతటిని పరిపూర్ణంగా తేలియాడిస్తున్నది.

**కైశోరాంకురకోమలాంగవలనా మాధుర్య విస్మాపక**
**స్నిగ్ధ స్వర్ణ సుగౌర సుందరరుచి ప్రేమోర్మి పూర్ణాశయా**
**సంపూర్ణాతి విశుద్ధ మాదక మహాస్వాద్యైక రత్యాత్మనా**
**కుర్వంత్యా పశుపక్షి భూరుహ లతాదీనాం ముహుర్మోహనమ్ 5**

కిశోరావస్థ యొక్క ప్రారంభంలోని కోమలమైన అంగముల మాధుర్యం వలన విస్మయం కలిగిస్తున్న స్నిగ్ధ, స్వర్ణ, కాంతిమయ ప్రేమతరంగాలతో (రాధాజీ) దిశలను పరిపూర్ణం చేస్తున్నది. సంపూర్ణము, విశుద్ధము, ఉన్మత్తతను కలిగించునది, ఆస్వాదన యోగ్యమైనది అయిన శృంగార స్వరూపముతో పశు, పక్షి, వృక్ష, లతాదికమును కూడ పునః పునః (మళ్లీ మళ్లీ) మోహితం చేస్తున్నది.

**శ్రీగౌర్యాది సమస్త దివ్య వనితా రూపైక విప్రున్మహా**
**రూపైకాంబుధి కోటి కోటి సుచమత్కారాకరాంగ శ్రియా**
**దివ్యానేక విచిత్ర మన్మథకలా చాతుర్య సీమాంతయా**
**శ్యామప్రేమ రసాన్ముహుర్ముహు రతిప్రోదంచి రోమాంచయా 6**

లక్ష్మీదేవి, గౌరీదేవి ఆదిగా కల సమస్త దివ్యనారీమణుల రూపం ఎవరి మహారూపసాగరంలోని ఒక్కబిందువుతో సమానమో ఆ రూపసాగరం (శ్రీరాధ) కోటి కోటి గుణముల కన్న అధికమైన, చమత్కారంతో కూడిన శ్రీఅంగసౌందర్యాన్ని కలిగి ఉన్నది. ఆమె అనేకానేకమైన దివ్య విచిత్ర ప్రేమకళాచాతుర్యానికి హద్దు! శ్యామసుందరుని యొక్క ప్రేమ రసంలో మునిగి ఆమె మాటిమాటికి రోమాంచిత ఔతూ ఉంటుంది.

**కాంచీనూపుర హార కంకణమణీ తాటంక చూడావలీ**
**కేయూరావలి ముద్రికా ప్రవిలసన్నాసాగ్ర సన్ముక్తయా**
**శ్రీమత్పీన నితంబ దోలిత మహావేణ్యగ్ర సద్గుచ్ఛయా**
**సీమంతోజ్జ్వల రత్నయా సుకుసుమ శ్రీవేణి మూలస్రజా 7**

(శ్రీరాధ) వడ్డాణం, నూపురాలు, కంకణాలు, మణిమయ కుండలాలు, కేయూరాలు, ఉంగరాలు మొదలైన ఆభరణాలతో భూషితయై ఉన్నది. నాసికాగ్ర భాగాన ఉన్న ముత్యం ఊగుతున్నది. నితంబముల (పిరుదుల) పై పూవులతో అలంకృతమైన పెద్ద జడ ఊగుతున్నది. పాపిటి యందున్న ఉజ్వల రత్నం శోభిస్తున్నది. వేణీ మూలములో సుగంధ పూర్ణమైన పూమాల ఉన్నది.

**సిందూరోజ్జ్వల విందు సుందరదల స్వర్ణేందు భాల శ్రియా**
**భ్రూభంగీభిరనంగ కోటిమతి మర్యాదాం సృజంత్యా ముహుః**
**ఖేలల్లోచనఖంజరీట కలయా స్తబ్ధీకృత ప్రేయసో**
**లీలాలోల కటాక్ష కామవిశిఖైర్మూర్ఛాం దదత్యా ముహుః 8**

ఫాలస్థలంపై ఉజ్జ్వలము, సుందరము అయిన సిందూరం స్వర్ణచంద్రునివలె ప్రకాశిస్తున్నది. మాటిమాటికి కటాక్షవీక్షణాల నుండి అనంతకోటి అనంగులను (మన్మథులను) సృష్టిస్తున్నది. చంచలిస్తున్న చూపులతో ఖంజన పక్షుల కళావిద్యపై ఆధిక్యాన్ని కలిగి ఉన్నది. లీలా విలోలమైన చంచల కటాక్షములు అనెడు కామ బాణాలతో స్తబ్ధుడైన ప్రియతముని పునః పునః మోహితుని చేస్తున్నది.

**సవ్రీడస్మిత చంద్రికాంకుర చమత్కారైర్మనశ్చోరయం**
**త్యాలాపైశ్చ సుశీతలామృత రసస్యందాధిక స్వాదుభిః**
**ద్యోతద్దాడిమపుష్పరోచిరధరా మర్యాద మాధుర్యయా**
**లావణ్యామృత పూర్ణచారు చిబుక శ్యామైక బిందు శ్రియా 9**

సిగ్గుతో కూడిన మృదుమధుర మందహాసము అనెడు చంద్రికల ప్రకాశంతోను, శీతలమైన అమృతరస బిందువుల కన్న మిక్కిలి మధురమైన మాటలతోను మనసును హరిస్తున్నది. ప్రకాశవంతమైన దానిమ్మ పూవు వంటి కాంతిగల అధరాల యొక్క సాటిలేని మాధుర్యంతో భూషితయై ఉన్నది.

లావణ్యామృత పూర్ణమైన చక్కని గడ్డముపై ఉన్న ఒక నల్లని చుక్క (దృష్టిచుక్క)తో పరమ శోభాయమానంగా ఉన్నది. అట్టి వారు ఎవరో –

**స్నిగ్ధ స్నిగ్ధ సుకోమలాయత మహాలావణ్య వన్యామయ**
**స్ఫూర్జత్స్వర్ణ వినిర్మితైక ముకురోన్మీలత్కపోల త్విషా**
**విభ్రత్యాతి సుపక్వదాడిమ లసద్బీజావలీ సుందర**
**శ్రీమన్మౌక్తిక దంత పంక్తి మతులాం తాంబూల కల్మాంకితామ్ 10**

అతి స్నిగ్ధము, కోమలము, విశాలము, మహాలావణ్యమయము అయిన కపోలముల (చెక్కిళ్ల) శోభ స్వర్ణజటితమైన అద్దంలో ప్రతిబింబిస్తూ ప్రకాశిస్తున్నది. ముత్యముల వలె సాటిలేని, అందమైన దంతపంక్తి తాంబూల సేవనం వలన పండిన దానిమ్మ గింజల వలె మిక్కిలి శోభిస్తున్నది –

(అట్టి రాధాజీ అని అన్వయించుకోవాలి.)

**శ్రీనాసా తిలపుష్ప శోభిత మణిస్వర్ణాక్త సన్మౌక్తయా**
**కందర్పాద్భుత హేమ తూణయుగళ శ్రీనాసికా శోభయా**
**తాంబూలైక రసాక్త రేఖ రసదప్రాణేశదంతక్షతా**
**లక్ష్య శ్యామిక మోహనాధర జవాపుష్పాతి శోణత్విషా 11**

తిల పుష్పము వలె సుందరమైన నాసికపై మణి, స్వర్ణ ఖచితమైన సుందర ముత్యము శోభిస్తున్నది. మన్మథుని అద్భుతమైన తూణయుగళము వంటి శ్రీనాసిక శోభిస్తున్నది. మోహనమైన అధరములు తాంబూలమును సేవించిన మాత్రమున ఏర్పడిన రసరేఖలచే రంజితమైన కారణమున ప్రాణేశ్వరుని దంతక్షతముల చిహ్నములు కూడ కానవచ్చుట లేదు. ఆ మోహనమైన పెదవులు జవా పుష్పము (కనకాంబరం రంగులో ఉండే ఒక విధమైన గులాబీ) కన్న కూడ అధికమైన ఎరుపుదనంతో శోభిస్తున్నాయి –

**నానారత్నవిరాజమాన పదకైర్గ్రైవేయకేణాద్భుతే**
**నాత్యంతోజ్జ్వల కంబుకంఠతటయా సత్కంఠికాగ్రైరపి**
**సౌందర్యాకర కుట్మలాకృతి రసశ్రీకూట వక్షోజయోః**
**సంవీతోజ్జ్వల కంచుకోపరి లసత్ హారావలీ రోచిషా** **12**

అనేక రత్నములతో కూర్చబడిన పతకాన్ని, అద్భుత కంఠహారాన్ని, మెరుస్తున్న ఒక కంఠాభరణాన్ని ధరించటం చేత శంఖమువలె మూడు రేఖలతో ఉన్న ఆమె కంఠము మిక్కిలి ఉజ్వలంగా ఉన్నది. సమస్త సౌందర్యానికి నిధియైన, మొగ్గల వలె ఉండి రసపూర్ణమైన శోభామయ వక్షోజములతో, కంచుకము (రవిక) పై మెరుస్తున్న హారముల శోభతో అతి మనోహరంగా ఉన్నది –

**లావణ్యోర్మివలీ విభంగ లలిత క్షామోదర శ్రీభృతా**
**శోభారాశి నితంబబింబ విలసద్దివ్యారుణ క్షౌమయా**
**సుస్నిగ్ధోజ్జ్వల దివ్యహేమ కదలీకాండోరు యుగ్మోజ్జ్వల**
**న్మాధుర్యైక రసచ్ఛటోర్మిరచిత ప్రేయశ్చమత్కారయా** **13**

లావణ్యతరంగాలతో కూడి, మూడు రేఖలను కలిగిన లలితమైన పలుచని ఉదరంతో మహాసౌందర్యంతో వెలుగుతున్నది. శోభాపూర్ణమైన నితంబములపై ఎర్రని దివ్యవస్త్రాలతో శోభిస్తున్నది. స్నిగ్ధమైన, ఉజ్వలమైన, దివ్యమైన, బంగారు అరటిస్తంభముల వంటి ఊరువుల యొక్క దేదీప్యమానమైన మధుర కాంతితరంగాలతో ప్రియతమునికి చమత్కారాన్ని కలిగిస్తున్నది –

**జ్యోతిః పుంజ సుజానుబింబ విలసజ్జంఘా మృణాల శ్రియా**
**నిర్మర్యాద పదాంబుజోదిత మహా మాధుర్య సౌందర్యయా**
**అంగేంగేஉద్భుత రూపసౌభగ మహామాధుర్య సుస్నిగ్ధతా**
**శ్యామ ప్రేమ వికార కాంతి సుచమత్కారాతిధారాపుషా** **14**

జ్యోతిర్మయమైన సుందర జానువుల (మోకాలి ప్రదేశం)తోను, అత్యంత సుందరమైన జంఘలు (తొడలు) అనెడు తామరతూడుల సౌందర్యముతోను వెలుగొందుతున్నది. పదకమలముల యొక్క హద్దులు లేని మహామాధుర్య సౌందర్యముతో శోభిస్తున్నది. ఆమె (శ్రీరాధ) ప్రత్యంగము అద్భుతమైన రూప, సౌభాగ్య, మహామాధుర్య, లావణ్యములతో నిండి ఉన్నది. శ్రీశ్యామసుందరునిలో ప్రేమవలన కలిగిన అనేక భావాలను చూచి అత్యంత కాంతితో కూడిన చమత్కార వర్షాన్ని కురిపిస్తున్నది.

**సర్వాంగీణ ముహుర్ముహుః పులకయా నిత్యోన్మద శ్యామలో**
**త్తుంగాభంగరతి ప్రసంగ ముదితానంగాలసాంగశ్రియా**
**కించిత్కించిదుదంచదాకులగిరా మాధుర్య ధారాకిరా**
**కుర్వంత్యాఽనవకాశి వేశకరణోఽప్యాలీకులం వ్యాకులమ్ 15**

ఆమె (శ్రీరాధ) సర్వాంగములలోను మాటిమాటికి పులకరింతలు కలుగుతున్నాయి. నిత్య ఉన్మదకారియైన శ్యామసుందరుని అత్యున్నతమైన, భంగములేని రతి ప్రసంగములతో ఆనందించిన ఆమె తన ప్రత్యంగము నుండి పుట్టిన ప్రేమాలసత (ప్రేమావేశము చేత కలిగిన అలసట) వలన మహా సుందరముగ ఉన్నది. మాధుర్యధారను వర్షిస్తూ; అనిర్వచనీయమైన, మహావ్యాకులతతో కూడిన మాటలతో వస్త్రాలంకరణ చేయు కార్యములో (అట్టి అసమయంలో) కూడ సఖియలకు వ్యాకులత్వం కలిగిస్తున్నది. (అమ్మ వ్యాకుల పాటును చూచి సఖియలు వ్యాకులత్వాన్ని పొందారని భావం) –

**తాంబూల వ్యంజనాదిభిర్మృదు మృదు ప్రేమ్ణాంఘ్రి సంవాహనైః**
**శ్యామాంగే నిహితాలసాంగలతయా దాసీభిరాసేవ్యయా**
**ప్రాణేశాననచంద్రగం మధుతథా తాంబూల సంచర్వితమ్**
**గృహ్ణత్యా స్వముఖేందుగం చ విహసంత్యాస్మై దదత్యా ముహుః 16**

శ్రీశ్యామ సుందరుని అంకస్థలిపై అలసిన తన శరీరము నుంచిన ఆమె (శ్రీరాధ) దాసీమణులతో తాంబూల, వింజామరాది సేవలను; ప్రేమతో మెలమెల్లగా వారు చేస్తున్న పాదసంవాహనాది సేవలను స్వీకరించింది. ప్రాణేశ్వరుడైన శ్రీశ్యామసుందరుని ముఖచంద్రుని నుండి మధురమైన చర్విత తాంబూలాన్ని మాటిమాటికి స్వయంగా గ్రహించింది. మృదుమధుర మందహాసంతో తన ముఖచంద్రుని నుండి మధురమైన చర్విత తాంబూలాన్ని ప్రియతమునికి పునః పునః ఇచ్చింది.

**కోఽపి శ్యామకిశోర చంద్ర ఉరుభిః కందర్ప లీలా కలా**
**చాతుర్యైరతి సౌభగోఽపి చ చమత్కారానపారాన్ దధత్**
**శ్రీరాధైక మహానురాగ విభవైర్లావణ్య మాధుర్యయోః**
**పూరైః సంతతదుర్మద స్మరవశః శ్రీరాధయా ఖేలతి 17**

ఒకానొక అనిర్వచనీయ శ్యామసుందరుడు అనేక విధాలైన స్మరలీలా కళా చాతుర్యంతో మిక్కిలి సౌభాగ్యశాలియై ఉండికూడ, అపార చమత్కారియైన శ్రీరాధ యొక్క మహానురాగంతో కూడిన లావణ్య, మాధుర్య ప్రవాహంలో దుర్మదమైన (దాటరానిదైన) ప్రేమకు వశీభూతుడై ఉంటాడు. ఆ రాధాజీతో క్రీడిస్తూ ఉంటాడు.

**తావేవాద్భుత దంపతీ నవనవానంగైక రంగాకులౌ**
**గౌరశ్యామల దివ్యమోహనతనూ కైశోర ఏవస్థితౌ**
**శ్రీవృందావనమండలేఽతి నిభృత శ్రీకుంజపుంజే ముహుః**
**ప్రేమోత్కంఠ్యభరాత్ స్మరామి పులకోద్భేదైః కదంబాయితౌ 18**

నవనవాయమైన ప్రేమవశత్వం చేత ఆతురులై, గౌరశ్యామ దివ్యమోహనాంగులు నిత్యకిశోరావస్థలో ఉంటారు. ఆ అద్భుత శ్రీయుగళం శ్రీబృందావనంలోని అతి నిభృత కుంజలలో మాటిమాటికి ప్రేమోత్కంఠత చేత పులకరించి కదంబాకృతిని ధరించారు.వారిని నేను స్మరిస్తున్నాను.

కదంబ వృక్షం గుండ్రని పూవులతో సంపూర్ణంగా వికసించి ఉన్నప్పుడు మనోహరంగా ఉంటుంది. ప్రేమోత్కంఠత చేత ప్రఫుల్లురై ఉన్న శ్రీరాధాగోవిందులను శ్రీసరస్వతీ పాదులు కదంబాకృతిగ ఉన్నట్లు దర్శించారు.

**తత్కైశోరకమద్భుతం పురుచమత్కారా చ సా శ్యామికా**
**తత్సౌందర్యమశేష మోహనమహో కందర్పలీలాశ్చతాః**
**భావాస్తే చ మహాద్భుతాశ్రుపులక స్తంభాదయః సాత్వికాః**
**సా రాధా వశతా చ చేతసి చమత్కుర్వంతు మే శ్రీహరేః 19**

ఓహో! అద్భుతమైన ఆ కిశోరావస్థ, చమత్కార పూర్ణయైన ఆ శ్యామాదేవి (శ్రీరాధ), అత్యంత మోహనమైన ఆ సౌందర్యం, ఆ లీలలు! ఆ మహాద్భుతమైన అశ్రువులు, పులకరింతలు, స్తంభాది భావాలు (శృంగారరసంలో కలిగే సాత్వికాది భావాలు), శ్రీహరి యొక్క శ్రీరాధా వశంవదత్వం - ఇవన్నీ నా మనసులో చమత్కారాన్ని కలిగిస్తున్నాయి. అదే ప్రార్థన!

**సా వృందావన మాధురీ మధురిమా స శ్రీనికుంజావలే**
**గౌరశ్యామ కిశోరయోరహహ సా కామాంధయోర్మాధురీ**
**మాధుర్యంచ మహాద్భుతం ఖలు తయోరన్యోన్య గోష్ఠీక్షణ**
**వ్యాజస్పర్శ సునర్మకేళి లహరీ వృందస్య భాయాన్మమ 20**

అహో! ఆ శ్రీబృందావన మాధుర్యం, ఆ నికుంజల మధురిమ! అహహా! ప్రేమమగ్నులైన ఆ గౌరశ్యామ శ్రీయుగళ కిశోరుల మాధురి! ఆ యిరువురి సంభాషణోత్సవం, ఏదో ఒక వంకతో ఒకరినొకరు స్పృశించుకొనటం, పరిహాసాదులు, అనేక లీలల మహాద్భుతమాధుర్యం - ఇవన్నీ నా చిత్తంలో స్ఫురించునుగాక! ఇదే ప్రార్థన చేస్తున్నాను.

**సర్వానంద కదంబ సార పరమాపారాంబుధౌ రాధికా**
**దాసీనామనునేతరి స్మరకలాపారం పరం గంతరి**
**నిత్యం ప్రాప్తరి కామవిప్లవదశాం శ్యామే కిశోరే మహా**
**శ్చర్యా కాపి రతిర్మమాస్తు సతతం వృందావనే వస్తరి 21**

ఎవరు ఆనందసారానికి అనంత సాగరమో, ఎవరు శ్రీరాధా దాసీమణుల ఎదుట అనునయ వాక్యాలు పలుకుతూ ఉంటారో, కామకళా విద్యలో ఎవరు పారంగతులో, ఎవరు నిరంతరం ప్రేమ యొక్క తీవ్రస్థితిని పొందుతూ ఉంటారో, శ్రీబృందావనంలో నిరంతరం విహరిస్తూ ఉండే ఆ శ్యామకిశోరుని యందు ఒకానొక అనిర్వచనీయమైన, ఆశ్చర్యమయమైన ప్రీతి నాకు కలుగునుగాక! అదే నా ప్రార్థన!

**శ్రీమద్బృందావనమివ వనం భాతి వృందావనాఖ్యమ్**
**రాధాకృష్ణౌ మధుర రసమాత్రాకృతీ యత్ర భాతః**
**రాధాకృష్ణావివ వరసఖీమండలం తద్ద్వయైక**
**న్యస్తప్రాణం తదుభయ రసేనాత్మవన్మోముదీతి 22**

శ్రీబృందావనం వంటి వనం శ్రీబృందావనం అనే పేరుతో శోభిస్తున్నది (అంటే బృందావనం వంటిది బృందావనమే అని అర్థం)! అక్కడ శ్రీరాధాకృష్ణుల వంటి ఏకమాత్ర మధుర రసాకృతులైన శ్రీరాధాకృష్ణులు నిరంతరం విరాజమానులై ఉన్నారు (అంటే రాధాకృష్ణుల వంటి వారు రాధాకృష్ణులే!). ఆ యుగళ కిశోరుల యందే ప్రాణాలు నిలుపుకొని,వారి ఆత్మస్వరూపులే అయిన సఖియలు శ్రీయుగళ రసంలో మునిగి నిరంతరం ఆనందాన్ని పొందుతున్నారు.

**వృందారణ్యం నిరధిక సమం ధామ సారం రసానామ్**
**రాధాకృష్ణౌ నిరధిక సమౌ శేఖరౌ సద్గతీ నః**
**క్రీడారంగం తదుభయ నిజప్రాణయోః పుష్ణతీ సా**
**వైదగ్ధీభిర్నిరధిక సమా మండలీ మోహినీ నామ్ 23**

శ్రీబృందావనం అనూర్ధ్వసమాన (దానితో సమానంకాని, అధికంకాని లేని) ధామం! సమస్త రసముల సారమైన, సర్వ శిరోమణియైన అనూర్ధ్వ సమాన శ్రీరాధాకృష్ణులే మాకు ఏకమాత్రగతి! తమ ప్రాణేశ్వరులైన శ్రీయుగళ కిశోరుల కేళీవేదికను అనూర్ధ్వ సమానులైన సఖియలు చతురతతో నిరంతరం పరిపుష్టం చేస్తూ ఉంటారు.

శ్రీబృందావనంతోను, శ్రీరాధాకృష్ణులతోను, శ్రీరాధా సఖీమణులతోను సమానులు కాని, అధికులుకాని లేరని తాత్పర్యం!

**అహో మౌఢ్యమహో మౌఢ్యమహో దుర్భాగ్యమీదృశమ్**
**మహానపి మహానందే యన్న వృందావనే రతః 24**

అహో మూర్ఖత్వం! అయ్యో అజ్ఞానం! హా ఎటువంటి దౌర్భాగ్యం! ఈ లోకంలో గొప్ప వ్యక్తినై ఉండికూడ మహానంద స్వరూపమైన ఈ శ్రీబృందావనముపై నాకు ప్రేమ కలగటం లేదు.

**అహో తాదృక్ మహానందకందం వృందావనం న చేత్**
**మహత్తమోఽపి శ్రయతే వాచ్యో నీచతమో హి సః 25**

అహో! మహత్తమ వ్యక్తి అయినా కూడ ఇటువంటి మహానందపూర్ణమైన శ్రీబృందావనాన్ని ఆశ్రయించకపోతే ఆ వ్యక్తిని నీచాతినీచుడు అనవలసి ఉంటుంది.

**సాంద్రానందరసే వృందావనేఽపి నానురజ్యతః**
**కిం వా మమ కరిష్యంతి జ్ఞాన భక్తి విరక్తయః 26**

ఆనందఘనరసమునకు మూలమైన శ్రీబృందావనమునందు కూడ నా చిత్తము అనురక్తము కాకపోతే ఇక జ్ఞాన, భక్తి, వైరాగ్యములు నాకు ఏమి చేస్తాయి ?

**ధిక్ ధిక్ మామపి సద్విద్యా కులశీల గుణోజ్జ్వలమ్**
**బృందావనరతి ప్రాణహీనో హి స్యాద్యతః శవః 27**

విద్వాంసుడు, కులీనుడు, శీలవంతుడు, గుణవంతుడు, రూపవంతుడు అయినా కూడ తృణీకరింపదగినవాడే, తృణీకరింపదగినవాడే! ఎందుకంటే శ్రీబృందావనం పట్ల ప్రేమ అనెడు ప్రాణం లేనివాడు శవమే!

**శోచ్య శోచ్యాతి శోచ్యోఽహం మహామూఢాతి మూఢధీః**
**హతాత్సర్వం పరిత్యజ్య యన్న వృందావనం శ్రయే 28**

మహా శోచనీయుని కంటె అతి శోచనీయుడిని నేను! మహామూర్ఖుని కంటె కూడ అతిమూర్ఖబుద్ధిని నేను! ఎందుకంటె వెంటనే సమస్తాన్ని త్యజించి, శ్రీబృందావనాన్ని ఆశ్రయించని వారు అంతే కదా!

**దూరే చైతన్యచరణాః కలిరావిరభూన్మహాన్**
**కృష్ణప్రేమా కథం ప్రాప్యో బినా వృందావనే రతిమ్ 29**

శ్రీకృష్ణచైతన్య మహాప్రభు చరణాలకు దూరంగా ఉంటే మహాకలియుగం వచ్చేసినట్లే! కనుక, బృందావనం పట్ల ప్రీతి లేకుండ శ్రీకృష్ణుని యందు ప్రేమ ఎలా ప్రాప్తిస్తుంది ?

**అహో! విట్సూకర ప్రాయోత్ఫుల్లదశపశుస్తతః**
**న మూఢః శ్రయతే వృందావనమానంద సాగరమ్ 30**

ఆనందసాగరమైన బృందావనాన్ని ఆశ్రయించని మూర్ఖుడు హో! మలిన పదార్థాలను భుజించే పంది, పశువుల వలె తనకు లభించినదే ఉత్ఫుల్లదశ (ఆనందస్థితి) అనుకుంటాడు.

**హాహా! వృందావనం త్యక్త్వా యదన్యత్కర్తుముత్సహే**
**జానన్నపి విషం భుంజే థుత్కృత్య పరమామృతమ్ 31**

హాహా! శ్రీబృందావనాన్ని త్యజించి, ఇతర కార్యములను చేయటానికి ఉత్సహించేవాడు తెలిసి తెలిసి పరమామృతాన్ని తృణీకరించి విషాన్నే భుజింపదలచిన వంటివాడు.

**యశోభిః పూరితా ఆశాః కృతం విశ్వానురంజనమ్**
**హా హంత దిఙ్మాత్రమపి నేక్షే వృందావనేశయోః 32**

ఎన్నెన్నో కీర్తి ప్రతిష్ఠలను దశదిశలలోను ఆర్జించి కూడ, లోకాన్ని ప్రసన్నం చేసుకొనటానికే చూస్తూ ఉంటారు. కాని, హా! శ్రీబృందావనాధీశులైన శ్రీయుగళ కిశోరులవైపు చూడనైనా చూడరు.

**కిం కరోమ్యహమున్మత్తో యత్కించిత్ప్రలపామ్యలమ్**
**జ్ఞాన భక్తి విరక్త్యాది వ్యర్థం వృందావనం వినా 33**

ఏమి చేయను ? నేను పిచ్చివాడినైనాను! ఏవేవో ప్రలాపాలు (మాటలు) ప్రలాపిస్తున్నాను. వాటి వలన ఏమి ప్రయోజనం ? శ్రీబృందావనాన్ని ఆశ్రయించని జ్ఞాన, భక్తి, వైరాగ్యాదులు అన్నీ వ్యర్థమే కదా!

అంటే బృందావనాన్ని, బృందావనేశ్వరిని ఆశ్రయించక; జ్ఞాన భక్తి వైరాగ్య పూర్వకంగా మాటాడే మాటలన్నీ వ్యర్థ ప్రలాపాలు అని అర్థం!

**చౌరోఽయం పతితోఽయమిత్యతి వదన్ సంతర్జయంస్తాడయన్**
**వధ్నన్ సర్వజనోఽప్యనాగసమిమం సర్వత్ర చోద్వేజయేత్**
**అంతః క్లేశమతీవ దుస్సహతరం ప్రాప్నోతి నానా విధైః**
**దుఃఖైర్వృత ఏవ చేత్తదపి మే దేహోఽస్తు వృందావనే 34**

ఎవరైనా నన్ను 'వాడు చోరుడు, పతితుడు' ఇత్యాది వాక్యాలతో దూషించినా; బెదిరించి, గర్జించి, బాగా కొట్టినా; బంధించినా; అందరూ నిరపరాధినైన నన్ను

అనేక విధాలుగా ఉద్విగ్నుడిని చేసినా; నాకు మిక్కిలి దుస్సహమైన మనఃక్లేశం కలిగించినా; ఇంకా అనేక ప్రకారాలైన దుఃఖాలతో పీడించినా – అయినా నాయీ శరీరం ఈ బృందావనంలోనే రాలిపోవునుగాక! ఇదే నా ప్రార్థన!

**ప్రేమానంద మహారసాబ్ధిసుఘనో వృందాటవీ చంద్రమా**
**ముఖ్యాం రాత్యమలాం రతిం నిరవధిం వృందావనాధీశ్వరీ**
**శ్రీవృందా విపినంచ తద్రసమయం తాదాత్మ్యభావాద్భుత**
**స్నేహావేశ సదోద్యదశ్రు పులకం శ్రీమత్సఖీ మండలమ్ 35**

ఘనీభూతమైన ప్రేమానంద మహారససాగరుడైన బృందావన చంద్రునికి (శ్యామసుందరునికి) బృందావనాధీశ్వరియైన శ్రీరాధ నిరంతరం అత్యంత పవిత్రమైన రతి (ప్రీతి)ని దానం చేస్తూ ఉంటుంది. శ్రీబృందావనం కూడ అట్టి రసాత్మకతతో కూడి ఉంటుంది. సౌందర్యమూర్తులైన సఖీమణులు కూడ తాదాత్మ్య భావం, అద్భుత స్నేహావేశాల కారణంగా అశ్రు, పులకాదులతో నిండి విరాజితులై ఉంటారు.

**కాలిందీపులినే సురద్రుమతలే శ్రీమల్లతా మండపే**
**సంసేవ్యం లలితోపహార నికరైర్దివ్యైః కిశోరీగణైః**
**గౌరశ్యామకిశోరధామ యుగళం తత్కర్హివృందావనే**
**తద్భావ స్ఫురదాకృతిః పరిచరామ్యాశ్చర్య లీలామయమ్ 36**

శ్రీబృందావనంలోని యమునా నదీ తీరంలో కల్పవృక్షం క్రింద సుందరమైన లతామండపం ఉన్నది. ఆ లతామండపంలో దివ్యకిశోరీమణులు సుందరమైన కానుకలతో ఆశ్చర్యపూర్ణము, లీలామయమునైన గౌరశ్యామ యుగళమును సేవిస్తున్నారు. తద్భావిత ఆకృతిని (అటువంటి భావాన్ని) పొంది శ్రీయుగళమునకు నిత్యము నేను ఎప్పుడు పరిచర్య చేస్తాను ?

**సింజన్మంజీరపాదా విపుల కటితట ప్రస్ఫురత్కాంచి దామా**
**మధ్యే క్షామా కిశోరీ కుచముకులయుగ ప్రోల్లసత్తారహారా**
**లోలద్వేణ్యగ్ర గుచ్ఛా కనకమణిలసచ్చారు నాసాగ్రముక్తా**
**చిత్రక్షౌమం వసానా మమ కనకరుచిర్భాతు రాధైక దాసీ 37**

శ్రీరాధా దాసీమణుల చరణ నూపరములు మ్రోగుతున్నాయి. విశాలమైన కటి ప్రదేశంపై వడ్డాణం శోభిస్తున్నది. నడుము సన్నగా ఉన్నది. వారు కిశోరావస్థలో ఉన్నారు. వక్షస్థలంపై ఉజ్వలమైన తారాహారం వ్రేలాడుతున్నది. జడకుచ్చుగా ఉన్న పూగుత్తి ఇటు అటు ఊగుతున్నది. సుందరమైన నాసికపై స్వర్ణమణి జటితమైన ముత్యము ప్రకాశిస్తున్నది. విచిత్రమైన చక్కని వస్త్రములను ధరించి ఉన్నారు. స్వర్ణవర్ణకాంతితో ఉన్న అట్టి శ్రీరాధాదాసీమణులు నా హృదయంలో స్ఫురింతురుగాక!

**యాం యాం రూపవతీం నవీనతరుణీం లావణ్యలీలా కలా**
**మాధుర్యైర్మని మోహనీమనురతాం భావోత్సవ వ్యంజినీమ్**
**తాం తాం వీక్ష్య స ధుత్కరోతి పరమాం దివ్యామపి స్ఫూర్తిమాన్**
**శ్రీరాధా పదకింకరీ పదనఖ ప్రాంతోఽపి యస్యాత్మని 38**

ఎవరి హృదయంలో శ్రీరాధా కింకరీమణుల పదనఖ ప్రాంతమైనా సరే (అంటే కేవలం పదనఖ ప్రాంతమైనా చాలు అని) స్ఫురిస్తుందో అట్టి రూపవతి, నవతరుణి - సౌందర్య, లీలామాధుర్యాలతో మునులను కూడ మోహితులను చేస్తూ, భావోత్సవాన్ని ప్రకాశింపజేయగల దివ్యస్వరూపాన్ని కలిగి ఉన్న స్త్రీని కూడ తృణీకరిస్తుంది.

(అంటే ఎంతో సౌందర్య, మాధుర్యాలను కలిగి, మునులను కూడ మోహింపజేసే దివ్యస్వరూపం కలిగి ఉన్న స్త్రీ అయినా శ్రీరాధా కింకరీ పదనఖ

కాంతిని హృదయంలో నిలుపుకున్న నారీమణికన్న తిరస్కరింపదగినదై ఉంటుంది అని భావం!)

**వృందారణ్యాధీశ్వరీ పాదపద్మజ్యోతిః సింధోరాద్యరత్యేకవృత్తేః**
**వ్యక్తం లీలారూపకైశోరకాద్యై స్తద్దాసీనాం వృందమీక్షేఽతి దివ్యమ్ 39**

శ్రీబృందావనాధీశ్వరీ చరణ కమల కాంతి సాగరము యొక్క శృంగారరస మూలకమైన లీల, రూప, కైశోరాదుల ద్వారా వ్యక్తమయ్యే అత్యంత దివ్యస్వరూపులైన శ్రీరాధా దాసీ బృందాన్ని దర్శించాలని కోరుకుంటున్నాను.

**ద్రుత కనక సుగౌరీమంగవల్లీం దధానామ్**
**నవ తరుణిమ లీలాకాంతి పూరైరపారామ్**
**విపుల జఘన ఖేలద్వేణిమాశ్చర్యరోచి**
**ర్నవ కనక మహీధ్రప్రేక్ష్య వక్షోజ లక్ష్మీమ్ 40**

తప్త కాంచనము వలె సుందరమైన గౌరవర్ణ దేహలతను ధరించినది; నవయౌవన భూషితయై అపారమైన లీలలతోను, కాంతితోను కూడినది; విశాలమైన ఊరువులపై ఊగుతున్న జడను కలిగి, ఆశ్చర్యమయకాంతితో వెలుగుచున్నది; సుమేరు పర్వతము ద్వారా మాత్రమే దర్శించుటకు యోగ్యమైన వక్షస్సంపదను కలిగినది అయిన – (శ్రీరాధ అని భావం).

(ఈ 40వ శ్లోకం నుండి 45వ శ్లోకం వరకు అన్వయం ఇలాగే ఉంటుంది).

**నవ నవ రససారాస్వాద సుస్మేర వక్త్రామ్**
**నవనవరసఖేలత్ ఖంజరీటాయతాక్షీమ్**
**రుచిరవలయ రాజీ దివ్యకేయూర రాజత్**
**సువలిత రుచిపూర్ణ స్నిగ్ధదోర్వల్లి యుగ్మమ్ 41**

నవనవరససారాన్ని ఆస్వాదించు నవ్వుముఖము కలదియు; నవనవరసములో క్రీడిస్తూ, ఖంజన పక్షుల వంటి విశాల నేత్రములు కలదియు; గుండ్రని, శోభాపూర్ణమైన బాహులతలకు ధరించిన సుందర కంకణములు, బాజూబందులతో విరాజమాన అయినదియు –

**శ్రవణతట విరాజద్దివ్య తాటంకరత్నామ్**
**రుచిర కనకరత్నోద్భాసి నాసాగ్రముక్తామ్**
**వివిధ కనకహార ప్రోల్లసత్కంబు కంఠీమ్**
**ఉరుమణిగణ విభ్రాజిష్ణు కేయూర చూడామ్ 42**

శ్రవణములకు (చెవులకు) ధరించిన దివ్యరత్నమయ కుండలములతో శోభించుచున్నదియు; నాసిక (ముక్కు)పై సుందరమైన స్వర్ణరత్నఖచిత ముత్యమును కలిగినదియు; శంఖమువంటి మెడలో అనేక విధములైన స్వర్ణహారముల మెరుపులతో ఒప్పుచున్నదియు; కేయూరములు (భుజాలకు పెట్టుకొను ఆభరణము), శిఖపై ధరించు అనేక మణిమాణిక్యములతోను ప్రకాశించుచున్న –

**రుచిరమణి విరాజన్ముద్రికాఢ్యాంగులీకామ్**
**ఉరుసిజ రుచిపూరాం చోలికామావహంతీమ్**
**పరమ రుచిర ముష్టిగ్రాహ్యమధ్యాం నితంబో**
**జ్జ్వల మణిమయ కాంచీం మంజు మంజీర పాదామ్ 43**

అంగుళులు (చేతివేళ్లు) సుందర మణిజటిత ఉంగరములతో శోభిస్తున్నవి. వక్షోజకాంతిచేత చోళీ (రవిక) భాసిస్తున్నది. కటి ప్రదేశం (నడుము) పరమ రమణీయమై, పిడికిలిలో ఇమిడిపోవునంత సన్నగా ఉన్నది. నితంబ ప్రదేశం ఉజ్జ్వలము, మణిమయమునైన వడ్డాణముతో అలంకృతమై ఉన్నది. చరణకమలాలు మనోహరమైన నూపురములతో భూషితమై ఉన్నవి.

**ముహురురసి దధానాం వీక్ష్య సవ్రీడహాసమ్**
**ప్రియమతి రసలోలం లీలయాత్తాంబరాంతమ్**
**ప్రతిపద నవరంగానంద మందస్మితోర్మి**
**స్తవకిత ముఖచంద్రాముల్లసద్రోమ హర్షామ్ 44**

లీలాక్రమంలో జారిన వస్త్రములను పైకి లాగుకొనుచు, అత్యంత రసచంచలుడైన ప్రియతముని చూచి లజ్జతో చిరునవ్వు నవ్వుచు, జారిన వస్త్రములను మాటిమాటికి వక్షస్థలముపై సర్దుకుంటున్నది. క్షణక్షణము నూతన ఆనందమయమైన మందహాస తరంగాలతో ముఖచంద్రబింబము ప్రఫుల్లమై ఉన్నది. ఉల్లాసంతో పులకితయై ఉన్నది.

**కిమపి కిమపి సఖ్యా భాషమాణాం సహాసమ్**
**కిమపి కిమపి దృష్టేశ్చాపలం ప్రోద్వహంతీమ్**
**కిమపి కిమపి లోలద్గాత్రవల్లీం కదాంతః**
**కిమపి కిమపి రాధాం సమ్యగారాధ్యయామి 45**

సఖీమణులు నవ్వుచు ఎవరితో అనిర్వచనీయమైన సంభాషణ చేయుచుందురో, ఎవరి నేత్రాలలో ఒకానొక అనిర్వచనీయ చాంచల్య ప్రకాశం వెలుగుచుండునో, ఎవరి దేహలత (రసములో, భావములో) అనిర్వచనీయ రీతిలో ఊగుచుండునో అట్టి శ్రీరాధాజీకి సమ్యక్ప్రకారంగా (చక్కని రీతితో) ఎప్పుడు నేను అనిర్వచనీయమైన ఆరాధన చేయుదునో కదా!

40వ శ్లోకము నుండి 45వ శ్లోకము వరకు శ్రీసరస్వతీ పాదులు ఒకానొక అనిర్వచనీయ స్థితిలో రాధాజీని దర్శించుచు ఆమహా సౌందర్యద్యుతిని వర్ణించినారు. ప్రేమపూర్ణమైన ఆ సౌందర్య ప్రవాహములో తేలియాడుచు ఆ మహాత్ముడు 'అట్టి ప్రేమ, ఇట్టి రసాత్మక సౌందర్యము' అనుట తప్ప ఆ తల్లి పేరును పల్కుటకు కూడ అశక్తులైనారు.

**వాగ్బాణాః ప్రపతంతు మర్మసు శతం పాదప్రహారాః శిరో**
**దేశే సంతు శతం శతం ధ్రువమనాహారాః శతం సంతువా**
**స్మారం స్మారమథాపి జీవనధనం తద్గౌరనీలం మహో**
**ద్వంద్వం సాంద్ర రసాబ్ధిమూర్తిముదితో వత్స్యామి వృందావనే 46**

హృదయాన్ని శతానేక వాగ్బాణాలతో బాధించినను, శిరస్సుపై వందలమారులు పాదప్రహారం చేసినను (తన్నినను), శతశత ఉపవాసములు చేయవలసివచ్చినను – అటువంటి సమయములో కూడ జీవనధన, గౌరనీల, రసఘన సాగరులైన శ్రీయుగళ కిశోరులను స్మరించుచు శ్రీబృందావనములో ఆనందముగ నివసింతును.

**భుక్తం జన్మని జన్మని ప్రియవధూ ప్రక్చందనాద్యం త్వయాఽ**
**హంకారస్తు న శాంత ఏవ సుయశో వహ్వార్జితం నాద్య తత్**
**అభ్యస్తా చ సమస్త శాస్త్ర వితతిర్మోహస్తు నాస్తం గత**
**స్తన్నిర్విద్య సమస్తతో భజ మహానందాయ వృందావనమ్ 47**

నీ ప్రియమైన భార్యకి జన్మజన్మలపాటు మాలాచందనాది భోగములను సమర్పించినను అహంకారము శాంతింపదు. గొప్ప యశస్సును పొందగోరి సమస్త శాస్త్రములను అభ్యాస, అధ్యయనములు చేసినను మోహము నశింపదు. కనుక సమస్త విషయముల పట్ల వైరాగ్యమును వహించి, మహానందమును పొందుటకై శ్రీబృందావనమును భజింపుము!

**సుక్షీణా ధమని తతోఽమృజవపుః కేశో జరత్కంథయా**
**కౌపీనేన చ చీరఖండక కృతే నాధ్యోఽతి సౌమ్యాకృతిః**
**తూష్ణీకః సకలాధమాధమ ఇవాత్యంతం విదూరే చరన్**
**శ్రీరాధా పదదాస్య లీన హృదయో వృందావనే స్యాం కృతీ 48**

శుష్కించిన శరీరముతో, జటలు కట్టిన కంఠ ప్రాంతముతో, మాసిన వస్త్రములతో కౌపీన ధారణము చేసి, అతిశాంత స్వభావముతో మౌనముగ నుండి, అధముల కన్న అధముని వలె మిక్కిలి దూరముగ చరించుచు; శ్రీరాధా చరణ సేవలో నిమగ్నమైన హృదయముతో శ్రీబృందావనములో కృతార్థుడనయ్యెదను! ఇదియే నా ప్రార్థన!

**కౌవేరీ ధనసంపదస్తి కిమతో వాచస్పతేర్వాగ్మితా**
**లబ్ధా కిం ను తతో మహేంద్ర భవనైశ్వర్యం స్థితం కిం తతః ?**
**కిం కందర్ప వపుః శ్రియాద్భుత తపోయోగాది సిద్ధ్యాచ కిమ్ ?**
**శ్రీవృందావన నామ ధామ విముఖే సర్వో విడంబో యతః 49**

కుబేరుని ధన సంపద అంతా లభించినా, దాని వలన ఏమి ఫలం ? బృహస్పతికి ఉన్నంత మాట నేర్పరితనం ఉన్నా దాని వలన ఏమిటి ? మహేంద్ర లోకం (స్వర్గం)లోని ఐశ్వర్యం అంతా వచ్చినా ఏమి లాభం ? మన్మథుని వంటి సుందర శరీరం ఉన్నా ఏమిటి ? తపస్సు, యోగాదుల సిద్ధి వలన ప్రయోజనం ఏమిటి ? ఎందుకంటే శ్రీబృందావన ధామం పట్ల విముఖంగా ఉన్న వ్యక్తికి ఇవన్నీ విడంబనా మాత్రమే!

అంటే కేవలం వేషమే తప్ప, ప్రయోజనం లేదు అని భావం!

**సదా ఖేలన్నిత్యస్మర తరల రాధా మధుపతి**
**స్ఫురద్విద్యా విద్యామయ సకలధామోపరి సదా**
**స్వమాధుర్యోజ్జ్వల్యాదిభిరితర సర్వాభి భవకృత్**
**భువి ప్రాప్తం వృందావమిదమహో కో న భజతే 50**

నిరంతరం ప్రేమచంచలత్వంతో వివశులై శ్రీరాధామాధవులు ఎక్కడ నిత్యక్రీడ సల్పుతూ ఉంటారో; ఏ ధామం సమస్తమైన విద్యామయ, అవిద్యామయ ధామములకు పైన ప్రకాశిస్తున్నదో; తన మాధుర్య, ఉజ్వల లక్షణములతో సమస్త

ధామాలను పరాజితం చేస్తున్నదో – ఓహో! అట్టి భౌమ బృందావనాన్ని ఎవరు భజింపకుందురు ? అనగా భజింతురు అని భావం!

**యత్ స్వాత్మప్రభ శుద్ధ చిద్రసఘనం యత్రాఖిలం తాదృశమ్**
**కృష్ణ ప్రేమ రసాబ్ధి మగ్నమఖిలం ఏయ్యంత దృగ్ దూరగమ్**
**తస్మిన్ భూ ప్రకటేఽ విచింత్య మహిమానంత్యేఽ త్ర వృందావనే**
**పశ్యేయుర్యది దూషణాని కుధియః కిం స్యాత్తతోఽ ంతర్దృశామ్ 51**

శ్రీభౌమ బృందావనం స్వయం ప్రకాశకమై, శుద్ధ చిద్రసాత్మకమై ఉంటుంది. అందులో స్థితమై ఉన్న స్థావర జంగమాదులు కూడ దాని వలె స్వయం ప్రకాశాన్ని, శుద్ధ చిద్రసాత్మకతను కలిగి కృష్ణప్రేమరససాగరంలో లీనమై ఉంటాయి. వేదాంతులకు దృష్టి గోచరం కాని (అందని) అట్టి అచింత్య మహిమాయుక్తమైన శ్రీబృందావనంలో మూర్ఖజనులు దోషాలను చూస్తే మాత్రం అంతర్దృష్టిగల వారికి ఏమి హాని ?

శ్రీబృందావనాన్ని దోషదృష్టితో చూచేవారికే హాని కలుగుతుంది తప్ప, అంతర్ముఖులై శ్రీబృందావన మహామహిమను దర్శిస్తూ ఉండే మహాత్ములకు ఎటువంటి నష్టమూ లేదు.

**సురూపేణానంతం మధురిమ భరేణాంతరహితం**
**రుచానంతం కృష్ణప్రణయ రసతోఽ ప్యంతర హితమ్**
**కృపౌదార్యానంతం నిజపరమహిమ్నాంతర హితమ్**
**తదానంతం భాగ్యం భజతియది వృందావనమిదమ్ 52**

శ్రీబృందావనం సౌందర్యంలో అనంతం, మాధుర్య పూర్ణతలో అనంతం, కాంతిని విస్తరింపజేయటంలో అనంతం, కృష్ణ ప్రీతి రసంలో కూడ అనంతం! కృప, ఔదార్యాలలో అనంతం, తన మహిమలో కూడ అనంతం! ఇట్టి శ్రీబృందావనాన్ని ఎవరు భజిస్తారో వారి భాగ్యం అనంతం!

**వీక్షే దివ్యాక్షి లక్షైః స్థిర చర సుషమాం సౌరభం ఘ్రాణలక్షైః**
**జిఘ్రామ్యాకర్ణయే చ శ్రవణ వితతిభిస్తవద్గుణానత్యుదారాన్**
**పత్కోట్యా త్వయ్యటేయం యది చ కర శిరః కోటిభిస్త్వాం నమేయమ్**
**నో తృప్తిర్మే తథాపి ప్రియతమ పరమానంద వృందావనాద్య 53**

హే ప్రియతమ పరమానందపూర్ణ శ్రీబృందావనమా! నేడు నేను లక్ష దివ్య నేత్రాలతో నీయందలి స్థావర జంగమముల శోభను దర్శించినా, లక్ష నాసికలతో నీ సుగంధాన్ని ఆస్వాదించినా, అనేక శ్రవణాలతో నీ అత్యంత ఉదార గుణావళిని విన్నా, కోట్ల పాదాలతో నీయందు చరించినా, కోటికోటి చేతులతోను, శిరస్సులతోను నీకు నమస్కరించినా – అయినా నాకు తృప్తి కలుగదు.

**కర్ణే శంకుః ప్రవేశ్య కిమపి యది శ్రుణోత్యేతదీయస్య దోషాన్**
**జిహ్వాచ్ఛేద్యా ప్రమాదాత్ యది వదతి సముత్పాట్యమక్షీక్షతే చేత్**
**ప్రాణాః సంత్యాగయోగ్యా యది మనసి తథా నిశ్చయస్తచ్ఛవాద్యాః**
**చాండాలీకృత్య వర్జ్యాః పరమతమ మిదం ధామ వృందావనం యత్ 54**

చెవి శ్రీబృందావనాన్ని గురించి దోషాలు విన్నట్లు అయితే దానిలో కొయ్యమేకును వేయటం మంచిది! జిహ్వ (నాలుక) పొరపాటున అయినా ధామాన్ని గూర్చి దోషాలను ఉచ్చరిస్తే దానిని కోసివేయటం ఉచితమైన పని! నేత్రాలు దోషాన్ని చూచినట్లు అయితే వాటిని పెరికి వేయాలి! ఒకవేళ మనసు దోషాలను నమ్మితే ప్రాణత్యాగం చేయటమే కర్తవ్యం! ఆ సమస్త ఇంద్రియాలు చండాలము వలె అస్పృశ్యములు, త్యజింపతగినవి. ఎందుకంటె ఆ శ్రీబృందావనం పరమమైనది, మహత్తమమైనది.

**న హి వృందావన విందామ్యహమిందావప్యమీ దృశీం సుఖతామ్**
**తుచ్ఛీకృత సురగణికా సుఖజనికా తే యతో రజఃకణికా 55**

హే శ్రీబృందావనమా! నేను చంద్రుని వలన కూడ ఇటువంటి సుఖాన్ని పొందలేదు. ఎందుకంటె ఒక్క నీ రజోకణం సైతం స్వర్గంలోని వేశ్యాజనులు ఇచ్చే సుఖాన్ని కూడ అతితుచ్ఛం అనిపింపజేస్తుంది.

**వృందారక నుత వృందా విపిన లతా శాఖి గుల్మానామ్**
**వృందారక ఇహ నందత మందా మందార కోటిభిః కిం వః ? 56**

ఓ బుద్ధిహీనుడా! దేవతలకు కూడ స్తుతింపతగిన బృందావన లతలు, వృక్షాలు, పొదలు మొదలైన వాని వలన చక్కగా ఆనందాన్ని పొందు! కోటికోటి మందార (కల్ప) వృక్షాల వలన నీకు ఏమి లాభం వస్తుంది ?

**శ్రీరాధా మురలీధర వరధన వృందావనే వరం కృమికః**
**భగవత్పార్షద ముఖ్యోఽ పృన్యత్రాఽ హం నచోత్సహే భవితుమ్ 57**

శ్రీరాధా మోహనుల పరమధనమైన ఈ బృందావనంలో క్షుద్రమైన కీటకాన్ని అయినా మంచిదే! కాని అన్యప్రదేశంలో (బృందావనం కాని చోట) భగవంతుని ముఖ్యపార్షదునిగా ఉండటంలో కూడ నాకు ఉత్సాహం (ఇష్టం) లేదు.

**వృందావన గుణవృందాన్యనిశమమందానురాగేణ**
**యో వర్ణయతి సమాకర్ణయతి హరిం సోఽ ధమర్ణయతి 58**

ఎవరు మిక్కిలి అనురాగంతో శ్రీబృందావన గుణాలను వర్ణిస్తూ ఉంటారో, వింటూ ఉంటారో అతడు శ్రీహరిని కూడ ఋణపడునట్లు చేస్తాడు.

**రాధాపతి రతిరంజిత నికుంజ భవనే వనే పరమే**
**శ్రీవృందావన నామ్ని ప్రణయప్రణయం సమస్తగుణ సీమ్ని 59**

సమస్త గుణములకు నిధియైన శ్రీబృందావన నామక శ్రేష్ఠ వనములో శ్రీరాధాపతి యొక్క రతి (ప్రీతి) చేత రంజితమైన నికుంజ భవనముపై అనురాగాన్ని కలిగి ఉండు!

**యది వృందావన విందామ్యపి తృణతాం తే వనాంతేషు**
**న తదా వికుంఠలక్ష్మీమపి కరమిలితాం నిభాలయే లలితామ్ 60**

హే బృందావనమా! నీ వనంలో తృణం (గడ్డిపరక) గానైనా ఉండగలిగితే, చేతిలో వైకుంఠ లక్ష్మి (మహా సంపద) వచ్చిపడినా కళ్లు తెరచి చూడను.

**సర్వదుఃఖదశా ఘోరా వరం వృందావనేఽస్తు మే**
**ప్రాకృతాఽప్రాకృతాఽశేష విభూతిరపి నాన్యతః 61**

శ్రీబృందావనంలో నాకు ఘోరతరమైన అధిక దుఃఖదశ ఉండునుగాక; అటువంటి స్థితిలో కూడ ఇతరత్ర లభించే ప్రాకృతిక, అప్రాకృతికమైన సమస్త ఐశ్వర్యాలను పొందాలని కోరుకోను. (బృందావనం కాని ఇతర ప్రదేశాలు ఎంత సంపదలతో తులతూగుతున్నా తనకు రుచింపదని భావం!)

**కుర్వత్యపి మహారౌద్రముపద్రవమనుక్షణమ్**
**భక్తిర్బృందాటవీ సత్వే తత్త్వేక్షాతః సదాఽస్తు మే 62**

శ్రీబృందావనంలోని ఏ ప్రాణి అయినా నాకు అనుక్షణం ఘోర ఉపద్రవాన్ని కలిగిస్తున్నా, అప్పుడు కూడ తత్వాన్ని దర్శిస్తూ, అక్కడి ప్రాణులన్నిటియందు నిరంతరం నాకు భక్తి కలుగునుగాక!

**సమస్త పురుషార్థానాం చింతామణయ ఏవ తే**
**శ్రీశాది మృగ్య సంస్పర్శా యే వృందావన ఖర్పరాః 63**

శ్రీబృందావనంలోని చోరుడు కూడ సర్వపురుషార్థముల స్వరూపమే, చింతామణి స్వరూపమే! లక్ష్మీదేవి, విష్ణువు మున్నగు దేవతలు కూడ వానిని స్పృశించాలని కోరుకుంటారు. (స్పృశించటం వలన ధన్యత్వం పొందుతారని భావం.)

**పశురేకః ఖగ ఏకస్తృణమేకం రేణురేకో వా**

**శ్యామ రసాద్భుత వన్యే వృందారణ్యే భవామ్యహం ధన్యః 64**

శ్యామరసమయమైన అద్భుతవనాలతో కూడిన శ్రీబృందావనంలో ఒక పశువుగా, ఒక పక్షిగా, ఒక గడ్డిపరకగా, కనీసం ఒక రజకణంగా ఉన్నా చాలు నేను కృతార్థుడిని ఔతాను.

**రాధామురళి మనోహర చరణ విలాసేన ధన్యాయామ్**

**వృందావన భువి మన్యే పరమపుమర్థో మనాగపి ప్రణయః 65**

శ్రీరాధా మురళీధరుల చరణ విలాసము చేత ధన్యమైన ఈ బృందావన భూమిపై కించిన్మాత్రపు ప్రీతిని కలిగి ఉన్నా, అదే పరమపురుషార్థమని తెలుసుకుంటాను.

**శ్రీవృందావిపినేఽతి కౌతుకభరాత్తౌ పర్యటంతౌ మహా**

**శ్చర్య శ్రోత్రరసాయనాతిమధురాన్యోఽన్య ప్రణాదోదయే**

**అన్యోన్యాధిక రమ్యవస్తు సుచమత్కారం సదా రాధికా**

**కృష్ణౌ ధ్యాయత పశ్య పశ్య శృణు శృణ్విత్యాదృతోక్తీ మిథః 66**

శ్రీయుగళ కిశోరులు అతికుతూహలంతో శ్రీబృందావనంలో సంచరిస్తున్నారు. మహాశ్చర్యకరంగా, వీనులవిందుగా, అతిమధురంగా పరస్పరం సుందరమైన మాటలను మాటాడుతున్నారు. ఒకరికి మరొకరు అత్యంత రమణీయమైన వస్తువుల చమత్కారాన్ని చూపించుకుంటూ; 'చూడుచూడు', 'వినువిను' అంటూ ప్రీతిపూర్వకంగా చెప్పుకుంటున్నారు. శ్రీరాధాకృష్ణుల ఇట్టి స్వరూపాన్ని నేను ధ్యానిస్తున్నాను.

**కృష్ణానురాగస్య పరం ప్రకర్షం తద్రూపశోభాద్యుతి భూమసీమ**

**శ్రీరాధికాయాః పరమాధికశ్రి శయామ వృందావనమేకధామ 67**

శ్రీకృష్ణానురాగం యొక్క పరమ పరాకాష్ఠ స్థితిని పొంది, ఆ రూప శోభాధికం చేత పరమకాంతియుక్తమై; శ్రీరాధికా పరమాధిక సౌందర్యంతో అలంకృతమైన శ్రీబృందావన ముఖ్యధామమునే నేను ఆశ్రయిస్తున్నాను.

**వృందాటవీమోహన కుంజపుంజే కలిందకన్యా పులినైక సీమ్ని**
**శ్రీరాధికా కృష్ణ పదారవింద దాస్యైక దాస్యే బలతాం మమాశా 68**

శ్రీయమునా తీరంలో, శ్రీబృందావనంలోని మోహినీ కుంజలలో వెలుగొందుతున్న శ్రీరాధాకృష్ణుల చరణ కమలముల పట్ల మాత్రమే దాస్యభావం నాలో వృద్ధి చెందుచుండునుగాక!

**సహైవ రాధా మురళీమనోహరౌ కందర్పలీలామయ దివ్యమూర్తికౌ**
**వృందాటవీ మంజుల కుంజ మండలే కస్యాస్తి నాశాఽ తి రసానుసేవితుమ్ 69**

శ్రీబృందావనంలోని మంజుల కుంజలలో అనంగలీలామయ దివ్యమూర్తులైన శ్రీరాధామురళీధరులకు ఒక్కసారి అయినా సేవ చేయాలనే పరమ రసమయ ఆశ ఎవరికి ఉండదు ? (అంటే ఆ ప్రేమ మూర్తులకు సేవ చేయాలనే ఆశ ఉంటుంది అని అర్థం.)

**ఆశాపి నాసాద్యత ఏవ రాధా పాదారవిందార్చన ఇందిరాద్యైః**
**అహం తు వృందావన! తే ప్రభావాద్భావానుబంధే స్పృహయాలురస్మి 70**

లక్ష్మీదేవి మున్నగు దేవతామూర్తులు కూడ శ్రీరాధా చరణ కమల సేవను గూర్చి ఆశించటానికి కూడ అశక్తులు! కాని, హే బృందావనమా! నేను నీ ప్రభావం వలన ఒకానొక భావయోగం చేత ప్రబలమైన ఇచ్ఛను కలిగి ఉన్నాను.

దేవతలకు కూడ దుర్లభమైన శ్రీరాధాచరణ సేవానురక్తి శ్రీబృందావన ప్రభావం వలన నిజభక్తుడికి కలుగుతుంది.

**విహాయ వృందావన మిందిరాదిభిః సుదుర్లభం కుత్ర విమూఢ యాసిరే**
**సర్వేశ్వరైశ్వర్యమథామృతం పరం సుదుర్లభాశ్చాత్ర మిలంతి భక్తయః 71**

ఓ మూఢుడా! లక్ష్మీదేవి మున్నగువారికి కూడ సుదుర్లభమైన ఈ శ్రీబృందావనాన్ని త్యజించి ఎక్కడికి వెళ్తున్నావు ? ఇక్కడ సర్వాధీశుని యొక్క ఐశ్వర్యం, పరమైన అమృతం, సుదుర్లభమైన భక్తి సమూహం కలసి ఉన్నవి.

**హరి హరి హరి రాధా భంగురానంగ రంగమ్**
**మధుర మధుర సాంద్రానంద సింధూత్తరంగమ్**
**క ఇహ విశతు వృందాకాననే కుంజ పుంజమ్**
**స్ఫురదురు నిజరూపాద్యంతరేణాంతరేఽపి ? 72**

హరిహరీ (ఆశ్చర్య సూచకం)! శ్రీరాధా మాధవుల నిత్యస్థాయీ శృంగారమయమైనది, మధురాతి మధురమైన ఉచ్చతరంగాలతో కూడినది అయిన శ్రీబృందావన కుంజల అంతర్భాగంలో బృందావనానికి చెందిన బహువిధములైన రూపాదికముల స్ఫూర్తిని పొందనైన పొందకుండ ఎవరైనా (బృందావనంలో) ప్రవేశించగలరా ? (ప్రవేశించలేరు).

**రాధాకృష్ణ విచిత్ర మన్మథకలానందాశ్చమత్కుర్వతే**
**యస్మిన్ సౌఖ్య చమత్కృతిః పరతరా యత్రత్యదీక్షాదితః**
**తద్ద్వంద్వే మమకారతోఽద్భుత తమాద్యస్యాద్భుతాను క్షణో**
**ల్లాసాః శ్రీవనరాజసీమ సుమహాభావం తమేవ స్తుమః 73**

ఎక్కడ శ్రీరాధాకృష్ణుల కామకళల ఆనందరాశి యొక్క చమత్కారం వర్తిల్లుచున్నదో, ఎక్కడ నివసించగోరి నిష్ఠా పూర్వక దీక్షాదులను పాటించటం వలన పరమ సుఖ చమత్కారం ప్రాప్తిస్తున్నదో, శ్రీయుగళ కిశోరుల యందు పరమాద్భుతమైన మమత కలగటం వలన ఎవరు ప్రతిక్షణము ఉల్లాసంతో ఉంటారో

అట్టి శ్రీబృందావన సీమలో నివసిస్తున్న మహా ఉదార పురుషులను నేను స్తుతిస్తున్నాను.

**కలింద తనయా తటీ స్ఫురదుదార వల్లీ కుటీ**
**విహారి రతిలంపటీ భవదనుక్షణం ధామ తత్**
**ద్వయం కనక చంపకం కువలయంచ నిందద్రుచా**
**సుచారు పరిచర్యయా మనసి తోషయేత్ స్వాత్మభూః 74**

శ్రీయుగళ కిశోరులు శ్రీయమునా తీరంలోని మనోహర లతాకుటీరంలో విహరిస్తూ, ప్రతిక్షణం రతిలంపటులై (ప్రేమ రస వివశులై) ఉన్నారు. వారు తమ కాంతి చేత స్వర్ణచంపకాన్ని, నీలికమలాన్ని కూడ తిరస్కరిస్తున్నారు. వారి మనసుకు సుందరమైన పరిచర్య చేయటం ద్వారా మనసిజుడు (మన్మథుడు) తుష్టిని కలిగించగలడు.

**స్మర స్మరవశం గతౌ కనక చంపకేందీవర**
**ద్యుతి నవకిశోరకౌ మధురధామ వృందావనే**
**యయోర్నయన వాగ్వపుర్విలసితైశ్చమత్కారిభిః**
**మహా మధురిమా కరైర్ముముహురేవ ధన్యాలయః 75**

ప్రేమకు వశీభూతులై; చంపక, నీలికమల కాంతిని కలిగి; మధురమైన శ్రీబృందావనంలో విరాజమానులైన శ్రీయుగళ కిశోరులను స్మరించు! వారి కన్నులు, మాటలు, దేహ విలాసాదుల వలన కలుగుతున్న చమత్కార పూర్ణమైన మహామాధుర్యంలో ధన్యులైన సఖీమణులు కూడ మూర్ఛితులు ఔతూ ఉంటారు.

**తీర్త్వా త్రైగుణ్య సింధుం జడ మలిన మహాదుఃఖసారం సమస్తమ్**
**సంతీర్య జ్యోతిరేకార్ణవమథ భగవల్లోక వృందాని పశ్య**
**ఆస్వాద్యా స్వాద్య తత్తత్సుఖమహహ జహద్యాహి వృందావనాఖ్యమ్**
**సర్వోర్ధ్వం ధామ తస్మిన్మృగయ రసమయీం రాధికా కుంజవాటీమ్ 76**

జడ, మలిన, మహాదుఃఖ సార సమస్తము, సత్వరజస్తమో గుణమయమునైన సముద్రము యొక్క పారమును దాటి; జ్యోతిర్మయమైన మహాసాగరాన్ని కూడ లంఘించి శ్రీభగవత్ ధామాలను దర్శించు! ఓహో! అక్కడి సుఖాన్ని ఆస్వాదించి, ఆస్వాదించి; సమస్త ధామాలకు ఉపరిస్థానంలో ఉన్న శ్రీబృందావన ధామంలో ప్రవేశించు! అక్కడ శ్రీరాధ యొక్క రసమయ కుంజవాటికను అన్వేషించు!

**నిరవధి హృది రాధాకృష్ణ కందర్పలీలా**
**వలిత లలిత కుంజం మంజు వృందావనాంతః**
**అధివస నిజనాథ ద్వంద్వ సేవాస్వజస్రమ్**
**చతుర చతుర బుద్ధిః ప్రేమ సౌఖ్యాద్భుతర్ధిః 77**

నీవు అత్యంత చతురమైన ప్రేమసుఖము యొక్క అద్భుత సంపత్తిని పొందాలనుకుంటే నిరంతరం హృదయంలో మనోహరమైన శ్రీబృందావనంలోని శ్రీరాధాకృష్ణుల అనంగ లీలాభూషితమైన సుందర కుంజలో వసిస్తూ; నీ స్వామి అయిన శ్రీయుగళకిశోరుల నిరంతర సేవా సుఖాన్ని ఆస్వాదించు!

**రాధాకృష్ణౌ నిత్య కందర్పతృష్ణౌ సంసేవంతే నిర్భర ప్రేమపూర్ణాః**
**ప్రేష్యాత్మానః కేఽపి తన్ముఖ్యసఖ్యా శ్రీమత్ వృందారణ్య కుంజోత్తమేషు 78**

గాఢ ప్రేమభక్తి పూర్ణ అయిన ఒకానొక మహాభాగ్యశాలి శ్రీయుగళ కిశోరుల ముఖ్య సఖితో కలసి శ్రీబృందావనంలోని ఉత్తమోత్తమ కుంజలలో నిత్య ప్రేమ తృష్ణావశులైన శ్రీరాధాకృష్ణులకు చక్కగా సేవ చేస్తున్నది.

**కిం విద్యా కుల శీల రూపవిభవైః కిం దాన యజ్ఞాదిభిః**
**కిం విఖ్యాతి శతైః కిముగ్ర తపసా కిం న్యాసయోగాది భిః**
**కిం తత్వానుభవేన విష్ణుభజనైః కిం తస్య వాత్యద్భుతే**
**యో వృందావన ఈశమోహన రసేఽప్యాసీన్న సర్వస్వధీః 79**

అత్యద్భుతమై, ఈశ్వరుని కూడ మోహితునిగ చేయజాలిన రసమయ బృందావనము నందు సర్వస్వ బుద్ధి (బృందావనమే నా సర్వస్వము అనే నిష్ఠ) ఎవరికి లేదో అట్టి వానికి విద్య, కుల, శీల, రూప, సంపదలతో ఏమి ప్రయోజనము ? దాన యజ్ఞాదికము వలన ఏమి లాభము ? యశస్సును, కీర్తిని ఎంతగానో పొందినా ఏమి ఫలము ? ఉగ్రతపస్సు, సన్యాసము, యోగాదికముల వలన ఏమి ప్రయోజనము ? అతనికి తత్వానుభవము ఉంటే మాత్రము ఏమిటి ? విష్ణుభజన వలన మాత్రము ఏమి ఫలము లభిస్తుంది ?

అంటే అత్యున్నతమైన శ్రీబృందావన నిష్ఠ లేనివానికి ఎన్ని ఉన్నా నిష్ప్రయోజనమే అని భావము!

**శ్రీవృందారణ్య! ధన్యోఽస్మ్యతి పరమ మహాత్వత్కృపా పాత్రితోఽస్మి**
**యతోఽహం యేన దత్తో విధిశుక సనకాద్యర్థనీయః స్వవాసః**
**గౌరశ్యామే మహామోహన వరమహసీ నిత్య కైశోర వేశే**
**నిత్యైకానంగరంగే అపి పరిచరితుం యన్మమాశాపి దత్తా 80**

హే శ్రీబృందావనమా! నేను ధన్యుడను! అత్యంతమైన నీ మహాకృపకు పాత్రుడనైనాను! ఎందుకంటె బ్రహ్మ, శుక, సనకాదులు కూడ దేనికై ప్రార్థిస్తూ ఉంటారో అట్టి నీ స్థానాన్ని నాకు నివాసంగా ఇచ్చావు. అంతేకాదు; నిత్య కిశోర రూపంతో భూషితులై, నిత్య ప్రేమైక పరాయణులైన గౌరశ్యామ మహామోహనులకు సేవ చేయగలగటము అనే ఆశను కూడ నాకు అనుగ్రహించావు!

**శ్రీవృందాటవి! కోటిమాతృ పరమస్నిగ్ధస్వభావే! రమే**
**శాద్యైర్నిత్య విచార్యమాణ పరమాశ్చర్య ప్రభావే! పదమ్**
**స్వంచేల్లోచన గోచరీకృతవతీ వాసంచ సర్వోత్తమైః**
**మృగ్యం దత్తవతీ తదా నిజజనే కిం వా విలంబాదిహ 81**

హే శ్రీబృందాటవీ! నీవు కోటి మంది మాతృమూర్తుల వలె పరమ స్నిగ్ధ స్వభావం కలిగిన దానవు! పరమాశ్చర్యకరమైన నీ ప్రభావాన్ని లక్ష్మి, శివుడు మున్నగు దేవతామూర్తులు నిరంతరం చింతిస్తూ ఉంటారు. నీవు నీ స్థానాన్ని దర్శనం చేయించగలిగి ఉండి, సర్వశ్రేష్ఠులైన వారు ఏ స్థానాన్ని అన్వేషిస్తూ ఉంటారో ఆ నివాసాన్ని కూడ ఈయగలిగి ఉండి, మరి నీ దాసులకు సేవను అనుగ్రహించటంలో ఎందుకు ఆలస్యం చేస్తున్నావు ?

**రాధాకృష్ణావనధిక సమౌ రూపలావణ్యలీలా**
**వైదగ్ధ్యాద్యైర్నిరవధి మిథోవర్ధి గాఢానురాగౌ**
**సాంద్రానందాంబుధి రస చమత్కార ధారాం వహంతౌ**
**వృందారణ్యే పరిచర ముదా నిత్యసత్తాప్రకాశౌ 82**

సరిసాటిలేని రూప, లావణ్య, లీలా విదగ్ధతలతో నిరంతరం ఒకరిపట్ల మరొకరు గాఢానురాగాన్ని పెంపొందించుకొనునట్టి; ఆనందఘన సాగరము యొక్క చమత్కారపూర్ణమైన రసధారను వర్షించునట్టి; నిత్య బృందావనములో విరాజమానులైనట్టి శ్రీరాధాకృష్ణులను ఆనందపూర్వకముగ సేవించు!

**అనంతైశ్చిజ్జ్యోత్స్నా రసజలధి పూరస్తత ఇతో**
**వహద్భిర్గోలోకావధి సకల సంప్లావన కరమ్**
**అహో సర్వస్యోపర్యతి విమల విస్తీర్ణమధుర**
**స్ఫురచ్చంద్రప్రాయం స్ఫురతి మమ వృందావనమిదమ్ 83**

అనంతమైన చిత్‌చంద్రికలతో కూడిన రససాగర ప్రవాహము ఇటు అటు ప్రవహిస్తూ, గోలోకము మొదలుకొని సమస్తలోకములను తడిపివేస్తున్నది. ఓహో! ఈ శ్రీబృందావనము అన్నిటి కన్న ఉపరి స్థానములో విరాజమానమై; అతి విమలము, విశాలమునైన మధుర చంద్రునివలె నాకు స్ఫురిస్తున్నది.

**ప్రలీనైవాత్యంతం త్రిగుణమయ మాయోదయ కథా**

**న రేజుః ఖద్యోతా ఇవ చ హరిలోకాః సుఖమయాః**

**కిమన్యత్ స్వాన్యత్ స్ఫూర్త్యఖిల సుఖభావాభి భవకృత్**

**స్వభాసా సర్వోచ్చైర్జ్వలతి నను వృందావనమిదమ్ 84**

త్రిగుణాత్మకమైన మాయచేత ఏర్పడిన జగత్తును గూర్చి చెప్పేది ఏమున్నది ? అది సర్వథా నశించిపోయింది! సుఖమయమైన విష్ణులోకము కూడ ఆకాశము (శూన్యము)వలె సుఖము లేనిదే, ఇంక ఏమి చెప్పాలి ? సమస్తములైన అన్యాన్యధామముల సుఖమయ భావాలను పరాజితము చేసిన శ్రీబృందావనము మాత్రమే తన కాంతి చేత అత్యంత దేదీప్యమానముగ వెలుగుచున్నది.

**యది హరిచరణ ప్రేమానంద కదంబం విడంబయతి**

**రాధా పదరసవన్యం వృందారణ్యం తదాన్యవార్తా కా ? 85**

శ్రీహరి చరణములపట్ల ప్రేమతో పూర్ణమైనది, శ్రీరాధా పద రసాభిషిక్తమైనది అయిన వనరాజ బృందావనమే తిరస్కరిస్తే ఇక ఎక్కడికి పోవాలి ?

**అపి మమ కోటి భవాంతే భవతు పరం తాదృశో దేహః**

**వృందావనమధివసతాముచ్ఛిష్టైక స్పృహో భవేద్యత్ర 86**

ఓహో! కోటిజన్మల తరువాత కూడ శ్రీబృందావాసుల ఉచ్ఛిష్ట ప్రసాదమును మాత్రమే కోరుకొనెడి దేహమే నాకు ప్రాప్తించాలి అనే స్పృహ ఉండాలి!

**హరిహరి ధిగస్తు మామిహ యదతి సుతుచ్ఛేషు లోకధర్మేషు**

**అస్వార్థేష్వతి సక్తో విహన్మి వృందావనేఽ ప్యహో వాసమ్ 87**

హరిహరీ! నాకు ధిక్కారమగునుగాక (తనకు తానే తిరస్కరించుకొనుట)! ఎందుకంటె అతి తుచ్ఛమైన, స్వార్థంతో కూడిన, వినాశనాన్ని కలిగించే లోకధర్మాల పట్ల అత్యంత ఆసక్తుడినై శ్రీబృందావన నివాసాన్నే నష్టపరచుకుంటున్నాను.

**ప్రాయశ్చిత్తమఘానాం మహదపరాధే పరం శరణమ్**

**సకల స్వధర్మ మౌళిః పుమర్థమౌళిశ్చ రాధికా విపినమ్ 88**

సమస్త పాపాలకు ప్రాయశ్చిత్త రూపమైనది, మహాపురుషుల పట్ల అపరాధాలు చేసినా శరణమునిచ్చునది, సమస్తమైన స్వధర్మాలకు శిరోమణి, పురుషార్థాలకు చూడామణి కేవలం శ్రీరాధా విపినమే (శ్రీబృందావనమే)!

**అపి తుచ్ఛ లోకరంజన మాసంజనమత్ర విడ్భాండే**

**ప్రియ! వృందావన జీవన! జనసంగం స్వార్థభంజనం ముంచ 89**

హే ప్రియా! బృందావన జీవనా! తుచ్ఛమైన లోకాన్ని రంజింప చేయవలెనను ప్రయత్నమును, మాలిన్యాలతో కూడిన శరీరము పట్ల ఆసక్తిని, స్వార్థమును (నీకు ప్రీతి అయిన దానిని) నాశనము చేయజూచు లోకుల సాంగత్యమును త్యజింపుము!

**వృందావన తృణగుల్మాద్యనిశం సచ్ఛిద్రసాత్మకం కలయన్**

**ప్రణమన్నతిభక్తిభరాద్య ఇహ వసేత్తం నమంత్యహో ధన్యాః 90**

శ్రీబృందావనములోని తృణగుల్మాదులను (గడ్డిపరక, పొదలు) సచ్చిదానంద ఘన రసస్వరూపముగ రాత్రింబవళ్లు దర్శిస్తూ, వానికి భక్తి పూర్వకముగ నిరంతరం ప్రణమిల్లుతూ, శ్రీబృందావనంలో నివసించే వారికి మహనీయులు కూడ నమస్కరిస్తారు.

**శ్రీరాధాయాః శింజన్మణినూపుర పాదవిన్యాసాన్**

**సప్రేమ తత్ర తత్ర స్మృత్యోదక్షా వసంతి తద్వనే ధన్యాః 91**

ఎక్కడెక్కడ శ్రీరాధాజీ యొక్క మణిమయ నూపురముల సవ్వడితో కూడిన చరణముల కదలికలు ధ్వనిస్తూ ఉంటాయో అక్కడక్కడ ప్రేమ పూర్వకముగ

స్మరిస్తూ, స్మరిస్తూ అశ్రుపూర్ణులై యుండు ధన్యులు మాత్రమే శ్రీబృందావనములో నివసింతురు.

**కృష్ణప్రేమ సుధారసాత్మ సకలం వృందావనం తద్గతమ్**
**సర్వం స్థాస్ను చరిష్ణు చిద్ఘనమథో రూపం తవాపీదృశమ్**
**తత్వం త్యక్త సమస్త వాహ్యకలనో నో లోకధర్మాదికే**
**ష్వాసక్తో వస రాధికా పదతలే నిత్యం స్వతత్వే స్థితః 92**

శ్రీబృందావనము శ్రీకృష్ణప్రేమసుధారసాత్మకము! అందలి సమస్తములైన స్థావర, జంగమములు కూడ చిద్ఘనములే! నీరూపము కూడ (ఈ ప్రకారముగ) చిద్ఘనమే! కనుక నీవు సమస్తమైన బహిర్ముఖ దృష్టిని త్యజించి, లౌకిక ధర్మముల పట్ల అనాసక్తుడవై, నిరంతరము నీ స్వరూపము (శ్రీరాధా దాసీ స్వరూపము) నందు స్థితుడవై శ్రీరాధా చరణ సన్నిధిలో వసింపుము!

**రాధా తత్ప్రియ చరణాంబుజ పరిచరణాతి సద్రసాంభోధౌ**
**మంక్త్వా విస్మృతదేహః కదా ను వృందావనే భవిష్యామి 93**

శ్రీరాధ, ఆదేవికి ప్రియతముడైన శ్రీశ్యామసుందరుల పాదపద్మముల యొక్క సేవారూపమైన అత్యున్నత రస సాగరము నందు నిమగ్నుడనై; దేహస్మృతిని మరచి నేను ఎప్పుడు శ్రీబృందావనములో నివసింతునో ?

**వృందారణ్య వసతయేహ్యధర్మకోటిః కుకర్మకోటిర్వా**
**భవతు సమస్తం సోఢ్వా సంసాధయితాస్మి కంచన స్వార్థమ్ 94**

శ్రీబృందావనములో నివసించుటకై కోటి అధర్మములే కాని, కోటి కుకర్మలే కాని అన్నిటినీ సహించి; అనిర్వచనీయమైన నా స్వార్థమును సాధించుకుంటాను. (స్వార్థము – తనకు ప్రీతిని కలిగించునది).

**అనంత స్వయంజ్యోతిరానంద దోహానసంతోల్లసత్ కృష్ణ రాధాను రాగాన్**
**అనంతేశ భూత్యా కృతాంజల్యుపేతాన్ సదా నౌమి వృందాటవీ సర్వభావాన్ 95**

శ్రీబృందావనము అనంతము, జ్యోతి పూర్ణమునైన ఆనందాన్ని అధికము చేయునట్టిది; అనంత భావములతో ఉల్లాసపూర్వకముగ శ్రీరాధాకృష్ణుల యందు అనురాగమును కలిగించునది; అనంతమైన ఐశ్వర్యములను తన అంజలి (అరచేతుల) యందు వహించియుండునది. అట్టి శ్రీబృందావనములోని సమస్త ప్రాణులకు నిత్యము నమస్కరిస్తున్నాను.

**అనంతేందు చిచ్చంద్రికా సింధు మగ్నా**
**ననంత స్వశోభా చమత్కార ధారాన్**
**అనంతానురాగైర్ద్వరేర్విహ్వాలాంగాన్**
**విహంగాదికాన్ నౌమి వృందావనస్థాన్ 96**

అనంత చంద్రుల దివ్య చంద్రికా సాగరములో మగ్నమైనట్టి, అనంత చమత్కారధారలతో శోభించుచున్నట్టి, శ్రీహరి పట్ల కల అనంత అనురాగముతో వ్యాకులమైన శరీరములు కలిగినట్టి శ్రీబృందావనములోని పశుపక్ష్యాదికములకు నేను నమస్కరిస్తున్నాను.

**దివ్యపుష్ప పల్లవాది రమ్యవల్లి శోభితే**
**ద్వారదేశ దివ్య పుష్పతోరణాది చిత్రితే**
**అంతరాలి కల్పితాతి దివ్య పుష్పతల్పకే**
**దివ్యరత్నదీపరాజి సర్వతో విరాజితే 97**

(శ్రీబృందావనము) దివ్య పుష్ప పల్లవాదులతోను, రమణీయమైన లతలతోను శోభితమై ఉన్నది. ద్వారప్రాంతము దివ్యపుష్పతోరణాదులతో అలంకృతమైనది. అంతర్భాగములో సఖియలు రచించిన దివ్య పుష్ప శయ్యతోను, సర్వత్ర దివ్యాతి దివ్య రత్నదీపములతోను విరాజమానమై ఉన్నది.

**దివ్య కావ్య నాటకాది పాఠశీల శారికా**
**కీరవృంద సుందరేఽతి మంజుకుంజ మందిరే**
**దివ్య భృంగ గుంజితేన రంజితేఽతి మోహనే**
**కోకిలాది కూజితేన పూజితేన గీతిభిః 98**

(శ్రీవనము) దివ్యకావ్య, నాటకాదులను పఠిస్తున్న శారికలు, చిలుకలు మున్నగు వానితో సుందరమైన కుంజ మందిరములతో శోభిస్తున్నది. దివ్య మధుకరముల గుంజారవముతో ధ్వనిస్తూ అత్యంత మోహనముగ ఉన్నది. కోకిలాదికములు చేయు కూజితములతోను, అనేకములైన సంగీత ధ్వనులతోను వెలుగొందుచున్నది.

**మంద మంద శీత శీత దివ్యగంధవాయునా**
**జాలరంధ్రరింగిణాంతరంగ భావ సేవితే**
**తత్తదిష్ట వస్తు వృంద సన్నివేశ లోభనే**
**గౌరనీల దంపతీ మనోజ విహ్వలౌ స్మర 99**

మృదుమధుర, శీతల, దివ్య సుగంధముతో కూడిన వాయు రంధ్రముల ద్వారా అంతరంగ భావముతో సేవ చేస్తూ; శ్రీయుగళమునకు ప్రియమైన వస్తువులతో అలంకృతమైన కారణము చేత లోభనీయమైన (మరి మరి చూడవలెనను లోభము) అతి మనోహర కుంజ మందిరములో ప్రేమ విహ్వలురైన గౌరనీల శ్రీయుగళ కిశోరులను స్మరింపుము!

**అదూరే శ్రీగోవర్ధన గిరివరాన్ మోహనమహో**
**మహః సింధుర్బిందూకృత సకల సచ్ఛ్రిదస రుచిః**
**సుధాసింధోః కోటీ మధురిమ ముధాకారి కణిక**
**స్తదంతః శ్రీవృందావన వనమహో మండనవనమ్ 100**

శ్రీగోవర్ధనగిరి సమీపాన మోహనమైన మహాసముద్రము ప్రవహిస్తున్నది. దాని సమీపములోని సమస్త సచ్చిదానందమయ జ్యోతి సమూహములు బిందు మాత్రమై గోచరిస్తున్నవి. ఆ మోహనమహాసముద్రములోని ఒక్క కణమాత్రమే సుధా సముద్రపు కోటి మాధుర్యములను కూడ హరిస్తున్నది. దాని అంతర్భాగములో శ్రీబృందావనమను మహాశోభామయ వనరాజము విరాజమానమై ఉన్నది.

**సర్వానంద రసైకవిందు పరమానందాంబుధి స్యందనమ్**
**సర్వాశ్చర్య వనం శ్రియోఽపి హృదయాక్షయాకర్షణ శ్రీభరమ్**
**శుద్ధానంద రసైకసార సుచమత్కారైక ధారాకరమ్**
**సౌరభ్యోజ్జ్వలతాచ్ఛతా మసృణతా మాధుర్యవత్తాద్భుతమ్ 101**

శ్రీబృందావనము తన ఒక్క బిందువులో సైతము సర్వానంద రసభరమైన ఒక మహా ఆనంద సముద్రమును ప్రవహింపజేస్తున్నది. సాక్షాత్తు లక్ష్మీదేవి హృదయానికి, నేత్రాలకు కూడ ఆకర్షణ కలిగించే సౌందర్యము చేత అలంకృతమై ఉన్నది. విశుద్ధానంద రసమునకు ఏకమాత్ర సారమై చమత్కార వర్షమును వర్షిస్తున్నది. సుగంధ, ఉజ్వల, స్వచ్ఛ, కోమల, మాధుర్యముల ఆధిక్యము చేత సర్వాశ్చర్యకరమై ఉన్నది. అట్టి శ్రీబృందావనము అద్భుతము!

**ప్రఫుల్ల దివ్యమల్లికా లవంగ జాతి యూథికా**
**కదంబ చంపకావలీ స్థలారవింద వీథిభిః**
**శిరీష కుంద కేతకీ కుసుంభ కింశుకాదిభిః**
**మనోజ్ఞ మాధవీలతాద్యనంత పుష్పవల్లిభిః 102**

బాగుగా వికసించిన దివ్య మల్లిక, లవంగ, జాతి, యూథిక, కదంబ పుష్పములు; అనేకములైన చంపక, స్థల పద్మ సమూహములు; శిరీష, కుంద, కేతకి, కేశూ మొదలైనవి; మనోహరమైన మాధవీలతాదిగా కల అనంత పుష్పలతా సమూహములు!

(అట్టి ప్రఫుల్ల దివ్యపుష్పాదికముతో మనోజ్ఞమైన బృందావనము అని భావము).

**ప్రియంగు నాగ కేశరైరశోక కర్ణికారకైః**
**స్ఫుటాతి ముక్త సప్తలా సువర్ణయూథికాదిభిః**
**విచిత్ర భేద ఝింటికా సుగంధబంధు జీవకై**
**ర్హయారి కుంజకాదిభిః ప్రఫుల్లితైర్విచిత్రితమ్ 103**

ప్రియంగ, నాగకేసర, అశోక, కర్ణికారాదులు; ప్రఫుల్లిత మాధవీలత, నవ మల్లిక, స్వర్ణ యూథికాదులు; విచిత్ర భేదములతో కూడిన ఝింటికాదులు, సుగంధిత బంధూక పుష్పములు; ప్రఫుల్లిత హయారి, కుంజకాది పుష్పమయ వృక్షములతో (శ్రీబృందావనము) అలంకృతమైనది.

**విచిత్ర పల్లవోద్గమైర్విచిత్ర పుష్ప సంభృతైః**
**విచిత్ర పత్ర మంజరీ విచిత్రగుచ్ఛజాలకైః**
**విచిత్ర సౌరభోదయై ర్విచిత్ర సీధు వర్షిభిః**
**విచిత్ర రోచిరుజ్జ్వలైః పరైశ్చ శాఖిభిర్వృతమ్ 104**

విచిత్రమైన పల్లవములతో కూడి; విచిత్ర పుష్పములతో నిండి; విచిత్ర పత్రములు, మంజరులు; విచిత్ర గుచ్ఛములతో కూడి; విచిత్ర సుగంధ పూర్ణమై; విచిత్ర మధు వర్షమును కురియుచు; విచిత్ర కాంతియుక్తమై – అట్టి ఉజ్వల వృక్షములతో (శ్రీబృందావనము) అలంకృతమైనది.

**రాధాకృష్ణ రహః కథానువదనాదాశ్చర్య మాధుర్యవత్**
**ధ్వానైః శ్రీశుక సారికా వ్యతికరైరానంద సర్వస్వదమ్**
**కర్ణాకర్ణి కుహూః కుహూరితి కలాలాపైర్వృతం కోకిలైః**
**నృత్యన్మత్త మయూరమన్య విహగైశ్చానంద కోలాహలమ్ 105**

(శ్రీబృందావనము) శ్రీరాధాకృష్ణుల రహస్యగాథలను ఆశ్చర్య, మాధుర్య పూర్ణముగ పఠిస్తున్న శుకశారికాదుల ఉచ్చైస్వరముతో మహానందమును ఇస్తున్నది. వీనుల విందుగ 'కుహు, కుహు' అను అవ్యక్తమధుర గానము చేయు కోకిలలతో శోభిస్తున్నది. నృత్యము చేస్తున్న మత్తమయూరముల, నానావిథ పక్షుల ఆనంద కోలాహలముతో ధ్వనిస్తున్నది.

**తన్మధ్యే నవమంజుకుంజ వలయం శోభావిభూత్యాఽసమా**
**నోర్ధ్వం దివ్యవిచిత్రరత్న లతికాద్యానంద పుష్పశ్రియా**
**అంతస్తల్పవరం వరోపకరణైరాఢ్యం సమంతాదధత్**
**రాధామాధవ భుక్త భోగ్యమఖిలానందైక సామ్రాజ్యభూః 106**

ఆ (బృందావన) మధ్యమున మనోహరమైన కుంజలు ఉన్నవి. అది శోభా సంపత్తితోను, దివ్యవిచిత్ర రత్న లతికాదికముల ఆనందమయ పుష్ప సంపత్తితోను సాటిలేనిదిగ ఉన్నది. అందు ఉత్తమోత్తమమైన ఉపకరణములతో అలంకృతమైన ఉత్కృష్ట శయ్య విద్యమానమైనది. నాలుగు దిక్కులలో శ్రీరాధామాధవుల భోజన, భోగ్య వస్తువులు శోభిస్తున్నవి. ఈ విథముగ సర్వత్ర కేవలము ఆనందసామ్రాజ్యమే ప్రతీతమై (వ్యాపించి) ఉన్నది.

**మధ్యే తాదృశ కుంజ మండలమహో కుండం మహామోహనమ్**
**సాంద్రానంద మహారసామృతభరైః స్వచ్ఛైః సదా సంభృతమ్**
**రత్నాబద్ధ చతుస్తటీ విలసితం సద్రత్న సోపాన వ**
**త్తీర్థం శ్రీతట సత్కదంబక తలచ్ఛాయా మణీ కుట్టిమమ్ 107**

అహో! ఈ విథముగ కుంజమండల మధ్యమున మహామనోహరమైన కుండము ఉన్నది. అది నిరంతరము ఆనందఘనమైన మహారసరూప నిర్మల జలములతో నిండి ఉంటుంది. ఆ కుండము యొక్క నాలుగు తీరములు రత్న

జటితమై ఉంటాయి. ఘాట్ కూడ ఉత్తమోత్తమమైన రత్నములచే పొదగబడిన సోపానములతో అలంకృతమై ఉంటుంది. దాని తీరములో, కదంబ వృక్ష ఛాయలో మణిమయమైన పీఠము శోభితమై ఉన్నది.

**గాధాగాధతయా తయోరతిముదం కుర్వత్పర ప్రేష్ఠయోః**
**నానా దివ్యరసోత్తమానవసరే వ్యంజత్తయోః ప్రీతయే**
**ఆశ్చర్యం కమలోత్పలాది కుతుకాయోన్మీలయన్మీలయన్**
**నానారత్నమయచ్ఛటాంబుధిజలం వ్యంజన్నికుంజాదికమ్ 108**

పరమ ప్రియతమ శ్రీకిశోరులను ఆనందింపజేయుటకై ఆ కుండములో కొన్ని చోట్ల లోతుగను, మరికొన్ని చోట్ల తక్కువగను జలములు ఏర్పడియున్నవి. వారి ప్రీతికై అక్కడక్కడ అనేక ప్రకారములుగ దివ్యరసము (త్రాగుటకు) విద్యమానమై ఉన్నది. వారి కుతూహలముననుసరించి ఆశ్చర్యజనకముగ కమలములు, కలువలు కూడ పునఃపునః (మళ్లీ మళ్లీ) వికసించుచు, ముకుళించుచు ఉన్నవి. అనేక రత్నముల కాంతిచ్ఛటలతో కూడిన జలములో నికుంజాదికము ప్రతిబింబించుచున్నది.

**నిర్మర్యాద మహాసుసౌరభ చమత్కారైర్వివర్ధిష్ణుభిః**
**మాధుర్యైశ్చ పదే పదేఽద్భుతతమై రోమ్ణాం ముహూర్హర్షణైః**
**నానా రత్నసరోజినీ కుముదినీ ముఖ్యైర్మహా సుందరమ్**
**కీర్ణం పుష్పచయైస్తటక్షితిరుహాం స్యందైర్మధూనామపి 109**

హద్దులు లేని మహాసుగంధ చమత్కారయుక్తమై, నిరంతర వర్ధన శీలమై, మాధుర్యపూర్ణమై, అడుగడుగునను మహాద్భుతముగ రోమాంచము (గగుర్పాటు)ను కలిగించు అనేకములైన రత్న పద్మ కుముదినీ ముఖ్య పుష్పములతో నిండి, మహాసుందరమై, తీరమునందలి వృక్షములను మధుధారలతో తడుపుచు; –

(తరువాతి శ్లోకములతో అన్వయము).

**మధ్యేవారి రతోత్కయోః రసికయోర్వ్యంజన్ నికుంజోత్తమమ్**
**యద్వారత్నమయాతి సుందర గృహం సర్వాలి విస్మాపకమ్**
**అంభః సంభవదేవవాథ పరితశ్చోర్ధ్వం తలే స్వచ్ఛసత్**
**రత్నక్షౌణి సమీహితోపకరణే దివ్య ప్రసూనాంతరే 110**

జలములలో క్రీడా పరాయణులైన రసికయుగళము యొక్క ఉత్తమ నికుంజము శోభిస్తున్నది. లేదా సఖీమండలిని కూడ విస్మితులను చేయు రత్నమయ సుందర గృహము శోభిస్తున్నది. అది జలముల నుండియే ఉత్పన్నమైనది. నాలుగు దిక్కులలోను పైన, క్రింద స్వచ్ఛమైన సుందర రత్నభూమిపై అభీష్ట వస్తువులు అలంకృతమైనవి. మధ్య భాగము కూడ దివ్య పుష్పములతో పూర్ణమై ఉన్నది.

**మహామణిమయోజ్జ్వలత్తట చతుష్టయేఽత్యుల్లసత్**
**విచిత్ర బహుమండనాద్భుత మహో లతామండపే**
**విచిత్ర బహుపంక్తిక స్ఫుట కదంబముఖ్యాద్భుత**
**చ్ఛటామృతమయ ద్రుమావలి సమృద్ధి శోభాద్భుతమ్ 111**

అహో! మహామణులతో కూడి ఉజ్వలమైన నాలుగు తీరములపైనున్న లతామండపము నందు విచిత్రమైన అలంకారములతో (ఆ కుండము) అత్యంత ఆశ్చర్యజనకముగ ఉన్నది. విచిత్రమైన అనేక వరుసలతో వికసించిన కదంబముల వలె అద్భుత కాంతులతో అమృతమయమైన వృక్షముల సమృద్ధితో అద్భుతముగ శోభిస్తున్నది.

**రాధాకృష్ణాపార కందర్పతృష్ణా సింధోర్వృద్ధిం తన్వదత్యంతమేవ**
**అత్యాశ్చర్యం కేలి వైదగ్ధ్య వృందం వృందారణ్యా నందినోః సందిశైతత్ 112**

(ఆ కుండము) శ్రీరాధాకృష్ణుల ప్రేమతృష్ణ అనెడు అపారసాగరమును అత్యంతము వృద్ధి చేస్తుంది. (హే కుండమా!) శ్రీబృందావన వినోదియైన యుగళ

కిశోరుల అత్యాశ్చర్యకరమైన కేళీవిదగ్ధతా సమూహమును నాకు కూడ చెప్పుము, చూపించుము! ఇదే నా ప్రార్థన!

**మధుర మధుర గుంజన్మంజు రోలంబ పుంజే**
**కనక కమలినీనాం కాననే యత్ర రాధా**
**ప్రియమధిగతవక్త్ర భ్రాంతికం పద్మచుంబే**
**ష్వపి నిజముఖ చుంబేనాశ్వసంతం జహాస 113**

శ్రీబృందావనములో మధుర మధురముగ గుంజారవము చేస్తున్న మనోహర భ్రమరములతో వ్యాపించిన స్వర్ణకమలముల వనము ఉన్నది. అందు శ్రీరాధాముఖ (కమల) మనుభ్రాంతితో ప్రియతముడు కమలమును ముద్దిడు కొనుచుండ, శ్రీరాధ తన ముఖచుంబనము నిచ్చుట ద్వారా ఊరట కలిగించి మందస్మితము చేసినది.

# ఐదవ శతకము

**కించిచ్చందన కోటిజిత్వరమహో కస్తూరికాకోటిజిత్**
**కించిత్కించిదుదార సౌరభమయం కర్పూర పూరాదపి**
**కించిత్కుంకుమ పంకరంకణా మహామోదం కిమప్యుల్లసత్**
**సౌరభ్యేణ వినిర్జితాగురు మహాపూర్వం కిమప్యుద్భవత్** **1**

ఓహో! ఈ బృందావనము యొక్క ఒకానొక ప్రదేశము కోటికోటి చందన వనములను పరాజితం చేస్తున్నది. ఒకానొక స్థలము కోటికోటి కస్తూరికారాశులను కూడ జయిస్తున్నది. ఒకానొక స్థానము కర్పూర ప్రవాహాన్ని మించి ఉత్తమ సుగంధయుక్తముగ ఉన్నది. మరొకటి కుంకుమ పంకమును లేపనం చేసినట్లు ఉండి, మహా ఆనందకరముగ ఉన్నది. మరికొన్ని స్థానములు అగరు అను సుగంధ ద్రవ్యాన్ని సిగ్గిలజేస్తూ మహాద్భుతము, అపూర్వము అయిన సుగంధాన్ని వ్యాపింపజేస్తున్నది.

అనగా బృందావనములోని ప్రత్యణువు చందన, కస్తూరి, కర్పూర, కుంకుమ, అగరు మున్నగు సుగంధ ద్రవ్యములన్నిటి కన్నను అపూర్వమైన సౌరభముతో నిండియున్నదని భావము!

**నానాపుష్పసువాస వృందమనిశం దివ్యం సమున్మీలయ**
**న్నానా పానకరూపతాం ప్రకటయన్నానా సుభక్ష్యోదయమ్**
**నానాసాంద్ర రసోల్లసత్ఫలభరం శ్రీరాధికామాధవ**
**క్రీడావేశవశాత్ త్రుటన్మణి సరస్రజ్ మేఖలాద్యైర్యుతమ్** **2**

శ్రీబృందావనములో రాత్రింబవళ్లు అనేక ప్రకారములైన పుష్పముల సుగంధము వ్యాపిస్తూ ఉంటుంది. అనేక విధములుగ మకరందము ప్రవహిస్తూ, అనేకములైన సుందర స్వాదుభోజ్యపదార్థములు లభ్యమానమై ఉంటాయి. మధుర

రస పూర్ణములైన అనేక ఫలాలతో కూడిన వృక్షములు శోభాయమానముగ ఉంటాయి. ఒకానొక ప్రదేశము శ్రీరాధామాధవుల క్రీడా సమయములో పగిలిన ముత్యాల హారాలతోను, మాలలతోను, మేఖలాదికముతోను శోభిస్తూ ఉంటుంది.

**అంతరీయగ సురత్నమండపే స్వీయకుండమనువార్షభానవీ**
**శ్యామలేన సహగాన కౌతుకం కుర్వతీ స్ఫురతు మే సఖీవృతా 3**

శ్రీరాధాకుండ సమీపాన, అంతరంగ సుందర రత్నమండపములో సఖీబృందముతో కలసి శ్రీభానుజ శ్యామసుందర సహితయై గాన కౌతుకాన్ని చూపిస్తున్నది. ఆ కాంతి నా హృదయంలో స్ఫురించునుగాక!

**సఖీభిః సంభూయ స్వకర కమల ద్వంద్వ కలితై**
**ర్జలైః సేకం రాధా బహు విదధతీ నాగరమణేః**
**సుధాపూర్ణాన్ వర్ణాన్నమిత వదనేందోరలమలమ్**
**జితో౽స్మీత్యాకర్ణ్యాహసదుపరతా యత్ర కిమితి 4**

శ్రీరాధాజీ సఖీమణులతో కలసి వెళ్లి, నాగరమణియైన శ్యామసుందరునిపై తన కర కమలాలతో జలాలను వెదజల్లసాగినది. అపుడు శ్రీశ్యామసుందరుడు తన ముఖచంద్రుని దాచుకొనుచు, "ఇక చాలు, ఇక చాలు! నేను ఓడిపోయానని అంగీకరిస్తున్నాను" అన్నాడు. ఆ అమృతమయ వచనాలను విని రాధాజీ నీటిని విరజిమ్మటాన్ని ఆపి, మధురముగా నవ్వినది.

**స్వల్పాతిమంజుల నికుంజ పరీత హ్రస్వైః**
**విస్తీర్ణశాఖి వరపుష్ప సుకల్పవృక్షైః**
**వీతే కదాపి కుసుమాభరణం విచిత్రా**
**యత్రాతతాన విహృతీ రసమూర్తియుగ్మమ్ 5**

కొలదియై, అతిమనోహరముగనున్న నికుంజములచేత పరివేష్టితమై; చిన్నవిగా ఉన్న, విస్తీర్ణముగా ఉన్న సుందర వృక్షముల పూవులతో సుసజ్జితమై (అలంకరింపబడి); కల్పవృక్షములతో భూషితమైన ఈ బృందావనములో పుష్ప భూషణములతో అలంకృతులైన రసమూర్తులు (శ్రీయుగళ కిశోరులు) చిత్ర విచిత్రముగ విహరించినారు.

**పరస్పర విలోచనాంచల చమత్కృతై సస్మితమ్**
**పరస్పరమురుచ్ఛలాత్ సపులకాంగక స్పర్శనైః**
**పరస్పర కథాసుధారససరిత ప్రవాహైః సదా**
**పరస్పర మహారతిర్జయతి రాధికా కృష్ణయోః 6**

శ్రీరాధాకృష్ణులు పరస్పర కటాక్షవీక్షణముల చమత్కారముతో మృదుమధుర మందహాసము చేయుచున్నారు. అనేకములైన నెపములతో పులకిత శరీరులై పరస్పరము స్పృశించుకొనుచున్నారు. పరస్పరము తమ కథామృతరస నదీ ప్రవాహములో తేలియాడుచున్నారు. ఇట్లు శ్రీరాధాకృష్ణుల పరస్పర మహారతి జయయుక్తమైనది.

**వ్యంజత్కైశోర దివ్య ద్రుతకనకనిభ శ్రీమదంగచ్ఛటౌఘైః**
**శశ్వన్నానా చమత్కారిభిరతిమధురానంగ భంగీ తరంగైః**
**శ్యామప్రేమ్ణో వికారైర్ఘన పులకతతీర్గద్గదోక్త్యశ్రు కంపై**
**రాలీర్విస్మాపయంతీ స్వరతి వనచరీః సైవ రాధేశ్వరీ మే 7**

శ్రీరాధాజీ తన కిశోరావస్థలోని దివ్య తప్త స్వర్ణకాంతి వంటి సుందర కాంతితోను; పునః పునః అనేక ప్రకారములుగా అతి చమత్కారపూర్ణమైన మధుర కామభంగీ తరంగాలతోను; శ్రీశ్యామసుందరుడు ప్రకటిస్తున్న ప్రేమరీతి వలన కలిగిన పులకరింతలు, గద్గద స్వరము, అశ్రువులు, కంపము మున్నగు వానితోను

స్వానంద పూర్ణులైన సఖీమణులను విస్మితులను చేస్తున్నది. శ్రీబృందావనములో విరాజమానయై ఉన్న అట్టి ఆ రాధాజీయే నా స్వామిని!

**వ్రజాద్యాతా వృందావనమతి మహాశ్చర్య మధుర**
**స్ఫురల్లీలా రూపచ్ఛవి సురత వైదగ్ధ్య లహరీ**
**స్వకుండస్థల్యాంతః శతశతగుణవ్యంజి సుషమా**
**చమత్కారాదిర్మే స్ఫురతు హృది రాధా సదయితా 8**

అత్యంత ఆశ్చర్యపూర్ణమైనది; మధుర స్ఫూర్తినిచ్చెడి లీల, రూప, సౌందర్య, వైదగ్ధ్యాదులతో కూడినది అయిన శ్రీరాధ వ్రజము నుండి శ్రీబృందావనానికి వచ్చినది. శ్రీరాధాకుండస్థలికి శతాధిక గుణ శోభను, చమత్కారాదులను ప్రకాశితము చేసినది. శ్రీశ్యామసుందరునితో కలసి ఆ రాధాజీ నాహృదయములో స్ఫురించునుగాక!

**శ్రీవృందావిపిన ప్రసారి పరమాశ్చర్యోల్లసత్సౌరభమ్**
**మాధుర్యామృత సింధు బంధుర మహాజ్యోతిస్తరంగాద్భుతమ్**
**నానా భూమిభిరుత్తరోత్తర చమత్కారాతిరేకం మమ**
**శ్రీరాధాద్భుత కేలికుండముదయైస్తుండం కదా మండయేత్ 9**

శ్రీబృందావనములోని పరమాశ్చర్యకర, ఉల్లాసమయ, సుగంధపూర్ణమైన శ్రీరాధాకుండము లేదా శ్రీరాధా కేళి వర్ణనము! అది మాధుర్యామృత సాగరము యొక్క మనోహరమైన, అద్భుతమైన మహాజ్యోతిర్మయ తరంగములతో కూడి ఉంటుంది. అనేక లోకములకు ఉత్తరోత్తర మహాచమత్కృతిని కలిగిస్తుంది. ఆ శ్రీరాధాకుండము లేదా శ్రీరాధాకేళి వర్ణనము నా ముఖతః ప్రకటితమై ఎప్పుడు నా శోభను పెంపొందింపజేస్తుంది ?

ఈ శ్లోకంలో శ్రీసరస్వతీపాదులు శ్రీరాధా కుండమునకు, శ్రీరాధకు అభేదాన్ని పాటించారు. అంటే ఏది శ్రీరాధా కేళీ లక్షణమో అది రాధాకుండమునకు కూడ వర్తిస్తుందని భావము!

**బృహద్వికచ కాంచనాంబురుహ కర్ణికాయాం స్థితౌ**
**తదీయ దళకేసరైరహహ యత్ర తో యుజ్యతః**
**పరస్పరమతిస్ఫురత్కనక నీలరత్నచ్ఛవీ**
**మహారసికదంపతీ కిమపి దోలితాంగౌ ముహుః 10**

శ్రీయుగళము బాగా వికసించిన స్వర్ణకమలమునందు విరాజమానమైనారు. ఓహో! ఆ స్వర్ణకమల కేసర దళములలో కలసిపోయి, పరస్పరము అత్యంత సుందరమైన స్వర్ణనీలమణికాంతిని ప్రకాశింపజేస్తూ ఆ మహా రసికమణులు తమ శ్రీఅంగములను మాటిమాటికి కదలిస్తూ ఉంటే – అప్పుడు అది ఎంత ఆశ్చర్యమయ శోభను కలిగిస్తుంది!

**అనంత హరిరాధికా మధురకేళివృందైః సదా**
**మహాద్భుతమహో మహారస చమత్కృతీనాం నిధిమ్**
**మహోజ్వలం మహాసుసౌరభతమం చ వృందావనే**
**స్మరోన్మద తదీశ్వరీదయిత దివ్యకుండం నుమః 11**

ఓహో! శ్రీరాధాకుండము దివ్యకుండము! శ్రీరాధాకృష్ణుల అనంత మధుర కేళీ సమూహము వలన ఆ కుండము నిరంతరం మహాద్భుతంగా ఉంటుంది. అది చమత్కారియైన మహారససముద్రము! మహోజ్వలము, మహాసుగంధ పూర్ణము! శ్రీబృందావనములో విరాజమానయైన, ప్రేమోన్మదయైన శ్రీరాధాజీకి ప్రియమైన అట్టి శ్రీరాధాకుండమును నేను స్తుతిస్తున్నాను.

**యద్వారి స్పృశతాం సతో రసమయీ కాఽప్యద్భుతా చేతసో**
**వృత్తిః సద్య ఉదేతి తత్ర విహరత్యానందమూర్తిద్వయమ్**
**శుద్ధానంగ రసైకలాస్య పరమోత్కర్షం సుగౌరోజ్జ్వల**
**శ్యామం కుండమిదం శ్రయేమ పరమం వృందాటవీ మండనమ్ 12**

ఆ జలస్పర్శచేత విశుద్ధమైన చిత్తములో ఒకానొక అద్భుత రసమయ వృత్తి ఆక్షణముననే ఉదయిస్తుంది. అది కేవలము విశుద్ధ అనంగ (ప్రేమ) రస ప్రవాహముతో శోభిస్తూ, సుందరమైన గౌర ఉజ్వల కాంతితో కూడి ఉంటుంది. ఆ ప్రవాహములో ఆనంద స్వరూపులైన శ్రీయుగళ కిశోరులు నిత్యవిహారం చేస్తూ ఉంటారు. కనుక, పరమరమణీయమైన శ్రీబృందావనానికి ఆభరణస్వరూపమైన శ్రీశ్యామకుండమునకు నేను శరణు చెందుతున్నాను.

**శ్రీగోవర్ధన మౌళిమండన మహారత్నోత్తమం రాధికా**
**కుండం మోహనపుండరీకనయన ప్రాణేశ్వరీ వల్లభమ్**
**ఘూర్ణన్మౌళి విలోల కుండలవరం తుండేందు బింబోల్లసత్**
**వంశం శంసతి యత్ర మాదక గుణాన్ రోమాంచితో మాధవః 13**

ఎక్కడ మాధవుడు పులకితుడై తలనూపుతూ, ఊగుతున్న కుండలములతో తన ముఖచంద్రకాంతితో నాలుగుదిశలను ప్రకాశింపజేస్తూ ఉంటాడో; ఎక్కడ తన వంశీతో ఉన్మాదనకారియైన గుణముల ఆలాపన చేస్తూ ఉంటాడో; ఏది కమలనయనయైన ప్రాణేశ్వరి శ్రీరాధకు, మోహనునకు అత్యంత ప్రియమైనదియో; ఏది శ్రీగోవర్ధనగిరికి ముకుటమణియైన మహారత్నమో అదియే శ్రీరాధాకుండము!

**శ్రీవృందావన శోభయాఽపి పరయాశ్లాఘ్యాం హరేర్వల్లభ**
**శ్రీగోవర్ధన శైలరాజశిరసాఽప్యత్యాదరేణానతామ్**
**రాధాకృష్ణ మహాద్భుత స్మరకళా మాధుర్య శోభాభరామ్**
**వల్లీ మండప మండలీం స్మర సఖే! శ్రీరాధికాకుండగామ్ 14**

ఓ సఖుడా! పరమోత్కృష్టమైన శ్రీబృందావన శోభచేత కూడ ప్రశంసనీయమైనది; శ్రీహరికి ప్రియమైన శ్రీగోవర్ధనగిరిరాజుచే కూడ ఆదర పూర్వకముగ నమస్కరింపబడునది; శ్రీరాధాకృష్ణుల ప్రేమకళల మాధుర్య శోభచేత పరిపూర్ణమైనది అయిన శ్రీరాధాకుండ స్థితలతామండప మండలిని స్మరించు!

**అసమోర్థ్వ స్మర వర్ధిని రాధాకుండే మహారసావిష్టౌ**
**గౌరశ్యామ కిశోరౌ స్మర తౌ రసవిహ్వలౌ సఖీవలయే 15**

అసమానమైన, ప్రేమవర్ధన శీలమైన శ్రీరాధాకుండము చెంత సఖీబృంద సహితముగ మహారసమగ్నులై, విహ్వలతను పొందిన గౌరశ్యామ యుగళ కిశోరులను స్మరించు!

**దివ్యానంత విచిత్ర వైభవ రసాన్మోహ్యద్వైకుంఠేశ్వరమ్**
**గాంధర్వా హృదయైకబంధు మధుర ప్రేమోన్మదాంధాఽఖిలమ్**
**విద్యానంద సుధైక సింధుపరతో జాజ్జ్వల్యమానం క్షితౌ**
**తద్బృందావనమప్రమేయ రసదం ప్రాప్యాఽన్యదీక్షేత కః ? 16**

శ్రీబృందావనం తన అనంత, విచిత్ర, వైభవ రసం చేత వైకుంఠపతిని కూడ మోహితునిగ చేస్తుంది. శ్రీరాధా హృదయబంధువైన శ్రీశ్యామసుందరుని మధుర ప్రేమతో సమస్తవస్తువులను ఉన్మత్తంగాను, ప్రేమాంధముగాను చేస్తుంది. ఇంకా, ఈ భూమిపై విద్యానందామృతము అనెడు ఏకమాత్ర సముద్రమునకు పరావధియై ఉజ్వలము, అప్రమేయ రసదాయకమునైనది బృందావనము! అట్టి బృందావనము ప్రాప్తించినపుడు ఎవరైనా అన్యవస్తువుల వైపు చూస్తారా ?

**రూపాణి వ్రజభీరుసీమ భగవత్ ప్రేష్ఠైర్నిషేవ్యాణి తే**
**ముక్తైశ్చారువిధాని సంతు పరమానందాత్మవృందావన!**
**శ్రీరాధా మురళీమనోహర రసోదారే తు రూపే మహా**
**మాధుర్యాంతిమ సీమని స్మృతిపథం యాతేఽపి ధన్యస్త్వహమ్ 17**

హే పరమానంద స్వరూప శ్రీబృందావనమా! అనేకములైన నీ మనోహర రూపములు ముక్తుల నుండి వ్రజ గోపీమణుల వరకు భగవత్ప్రియ భక్తులచే సేవింపబడుతున్నవి. కాని, శ్రీరాధా మాధవుల మహామాధుర్యపు చరమసీమను పొంది, ఎవరు రసమయమైన అత్యుత్కృష్టరూపంతో ఉంటారో వారి స్మృతి కలిగినంత మాత్రం చేతనే నేను ధన్యుడినౌతాను!

**రాధాకృష్ణసుగానశిక్షణపరా గాయంతి యత్రోన్మదా**
**నానాశ్చర్యవిధం రసాల శిఖరాణ్యారుహ్య పుంస్కోకిలాః**
**యన్నృత్యాని చ వీక్ష్య శిఖినో నృత్యంతి చిత్రం వృధు**
**స్తద్గోష్ఠీం శుక సారికాయదధి తద్ధ్యాయామి వృందావనమ్ 18**

శ్రీబృందావనములో మామిడి వృక్షముల శాఖలపై కూర్చుండి పుంస్కోకిలలు (మగ కోకిలలు) శ్రీరాధాకృష్ణులకు సంబంధించిన సుందరగాన శిక్షణలో లగ్నమై, ఉన్మత్తతను పొంది అనేకవిధములుగ ఆశ్చర్యకరమైన గానమును చేస్తున్నవి. అక్కడి నృత్యకళలను చూచి మయూరములు విచిత్రరీతిలో నృత్యము చేస్తున్నవి. శుక, సారికలు అచటి గోష్ఠిని అనుకరించి అనుసరిస్తున్నవి. అట్టి శ్రీబృందావనమును నేను ధ్యానిస్తున్నాను.

**సంగీతోత్సవరంగి కోకిల గణం నాట్యోల్లసద్బర్హి సత్**
**భృంగీఝంకృత దివ్యవాదమధురం స్ఫూర్జల్లతా మండపమ్**
**రాధాకృష్ణ నిషేవణాతి రసవత్‌దాసీజనాపేక్షితా**
**ర్థాపూరి ద్రుమవల్లివృందముదియాత్ వృందావనం సుందరమ్ 19**

శ్రీబృందావనము సంగీతోత్సవంలో నిమగ్నమైన కోకిలల (ధ్వనుల)తో ధ్వనిస్తున్నది, నృత్య పరాయణమైన నెమళ్లతో ఉల్లాసంగా ఉన్నది, సుందర మధుకరముల దివ్యమధుర ధ్వనితో ప్రతిధ్వనిస్తున్నది. ఆ శ్రీధామము

లతామండపములతో శోభిస్తున్నది. ఇంకను, శ్రీరాధాకృష్ణుల సేవాపరాయణలైన సఖీబృందముల వాంఛిత ప్రయోజనాన్ని చక్కగా నెరవేర్చగల వృక్ష, లతలతో శోభిస్తున్నది. అట్టి సుందర బృందావనము నా హృదయములో స్ఫురించునుగాక!

**అపారావారాత్మప్రభ విమల చిజ్జ్యోతిరమృతాం**
**బుధిద్వీపే వృందావనమతుల రోచిః స్మర సఖే!**
**కదంబానాం వాటీ పరివృతమనంతద్రుమలతా**
**నికుంజైర్మంజు శ్రీరసికయుగ సర్వస్వ నిలయమ్ 20**

ఓ సఖా! పారావారములేని, స్వయం ప్రకాశకమైన, విమల చిజ్జ్యోతిర్మయమైన, అమృత సింధు ద్వీపములో సాటిలేని కాంతితో వెలుగుతున్న శ్రీబృందావనాన్ని స్మరించు! ఆ శ్రీబృందావనము అనంతమైన కదంబ వాటికలతో పరివేష్టితమై ఉన్నది, అనంతమైన వృక్షలతా నికుంజలతో శోభిస్తున్నది. అంతేకాక, అది శ్రీరసిక యుగళ కిశోరులకు సర్వస్వమైన నివాస స్థానము!

**నమో నిత్యం వృందావనతరులతాభ్యః కరుణయా**
**కిరంతీభ్యః సర్వానపి చ పురుషార్థాన్ సకృదపి**
**విలోకాత్ సంస్పర్శాచ్ఛ్రవణకథనాచ్చ స్మరణతో**
**విభాంతీభ్యః పావే ప్రకృతిరససారాత్మ మహసః 21**

ఎవరిని ఒక్కసారి స్పృశించినంత మాత్రమున, ఎవరి కథను ఒక్కసారి విన్నంత, చెప్పినంత, స్మరించినంత మాత్రముననే కరుణతో చతుర్విధ పురుషార్థములను అనుగ్రహిస్తుందో; ఎవరు ప్రకృతి రససారాత్మకమైన జ్యోతికన్న ఉపరిస్థానములో విరాజమానమై ఉన్నారో; శ్రీబృందావనమునందలి అట్టి తరులతాదులకు నేను నిత్యము నమస్కరిస్తాను!

**అతిస్వచ్ఛేఽత్యంతోజ్జ్వల ఉరువిధోద్యత్పరిమళే**

**పరాగాణాం పుంజైః శ్రుతనవమరందైశ్చ సుభగే**

**సుశాఖాద్యైర్నీరంధిత ఉపరి వృందావనభువ**

**స్తలే రాధాకృష్ణాంఘ్రిణి రసమయ స్నిగ్ధ మధురే 22**

అతిస్వచ్ఛము, అత్యంత ఉజ్వలము, బహువిధములైన సుగంధములచే సువాసితము; పరాగ పుంజముల నుండి, వృక్షముల నుండి స్రవిస్తున్న నవ మకరందముల చేత శ్రీబృందావనము శోభాయమానముగ ఉన్నది. ఆ భూమి పైనున్న సుందరమైన వృక్షశాఖలు దట్టమైన మేఘములను క్రిందికి దింపినట్లు ఉన్నవి. క్రింది ప్రదేశము రసమయము, స్నిగ్ధము, మధురమునై ఉన్నది. అక్కడ శ్రీరాధాకృష్ణుల శ్రీచరణములు విహారము చేస్తున్నవి.

**యత్ర శ్రీరాధికా తద్రసవివశ సదానందయోః సర్వకాల**

**స్థేమా ప్రేమామృతాబ్ధిః పరమరసచమత్కార సీమాఽస్తి యత్ర**

**యత్రైవాశ్చర్యసీమా యదధి పరతరో దివ్యసౌభాగ్య సీమా**

**శ్రీవృందారణ్యనామాజయతి భగవతః సర్వధామాతిధామా 23**

ఎక్కడ రసవివశ, సదానంద స్వరూప అయిన శ్రీరాధ సర్వదా స్థిరమైన ప్రేమామృత సముద్రము వలె విరాజమానయై ఉంటుందో; ఎక్కడ పరమరస చమత్కారానికి హద్దు ఉంటుందో; ఎక్కడ ఆశ్చర్యానికి, దివ్యసౌభాగ్యానికి అవధి సర్వాతిశాయియై ఉంటుందో; సమస్తభగవద్ధామములకు శిరోమణియైన ఆ శ్రీబృందావన నామక ధామమునకు జయమగునుగాక!

**పంచార్థాన్ ప్రేమభక్త్యంతాన్ విచిన్వంతి బుధా ముధా**

**కృతార్థాః కిల తిష్ఠంతి వృందారణ్య తృణాశ్రితాః 24**

పండితులు ప్రేమభక్తి పర్యంతము పంచపురుషార్థములను వృథాగా అన్వేషిస్తున్నారు. వారు కనుక బృందావనము యొక్క తృణమాత్రాన్ని ఆశ్రయించి ఉంటే కృతార్థులై ఉండెడివారు.

**జీవన్నేవ మృతప్రాయో దేహాదౌ నిరహం మమ**
**కదా ప్రేమరసస్యందే వృందే వృందావనే స్థితిమ్ 25**

జీవించి ఉండి కూడ మరణించిన వాని వలె దేహాదులన్నిట 'అహం, మమ' అనే భావాన్ని త్యజించి, ప్రేమరసాన్ని వర్షించే శ్రీబృందావనంలో నేను ఎప్పుడు నివసిస్తానో!

**పునంతి బ్రహ్మరుద్రాదీన్ యేషాం చరణ రేణవః**
**సర్వభావేన మే సేవ్యాస్తే వృందావన వాసినః 26**

ఎవరి చరణ రజము బ్రహ్మరుద్రాదులను కూడ పవిత్రం చేస్తుందో ఆ బృందావనవాసి సర్వభావములతో నాకు సేవింపతగినవాడు!

**శ్రీరాధా కానన స్పర్శాచ్ఛుద్ధ చిద్రస మూర్తయః**
**అప్యమీ స్వపరాదృశ్యా నమస్యాః శ్రీశుకాదిభిః 27**

శ్రీరాధా వనమును (శ్రీబృందావనమును) స్పృశించినవారు శుద్ధ చిద్రసమూర్తులు ఔతారు. వారి యందు తన, పర అనే భావం అదృశ్యం ఔతుంది. కనుక వారికి శ్రీశుకాది మహాత్ములు కూడ నమస్కరిస్తారు.

**సాపరాధాశ్చే యే రాధాపదమాధాయ చేతసి**
**వసంతి వృందావిపినేఽనన్యాన్ ధన్యాన్ నమామి తాన్ 28**

ఒకరు అపరాధి అయినా కూడ, మనసులో శ్రీరాధా పదపద్మములను ధరించి శ్రీబృందావనములో నివసిస్తూ ఉంటే అట్టి మహాభాగ్యశాలురైన భక్తులకు నేను నమస్కరిస్తాను.

**తద్భ్రూభంగ మహానంగ తృష్ణ కృష్ణ ముహుః స్తుతమ్**

**వృందావనేశ్వరీ దాస్య లాస్య మేవాభిలష్యతే 29**

శ్రీరాధాజీ యొక్క భ్రూభంగ మాత్రము చేత ప్రేమాతురుడైన శ్రీకృష్ణుడే ఆమెను మాటిమాటికి ప్రశంసిస్తూ ఉంటాడు. నేను ఆ శ్రీబృందావనేశ్వరీ దాస్య లాస్యమునే అభిలషిస్తున్నాను.

**మధురమధుర కేళిం కుర్వదుద్వేల కామాం**

**బుధి రసవరసింధు స్యంది వృందావనాంతః**

**ప్రతిపద సుషమేకాంభోధి మజ్జత్తను శ్రి**

**స్ఫురతు కిమపి గౌరశ్యామధామద్వయం నః 30**

మధుర మధుర కేళీ పరాయణులు, శ్రీబృందావనములో తరంగితం ఔతున్న ప్రేమ సముద్రపు రససాగరాన్ని ఉత్పన్నం చేసెడివారు, ప్రతిపదమునందలి శోభాసింధువులో మజ్జనము (తేలియాడుచు) చేయుచుండువారు అయిన ఒకానొక గౌర శ్యామ యుగళ కిశోరులు మా హృదయములో స్ఫురించునుగాక!

**అన్యోఽన్యం రూపశోభాలలిత రతికళాచాతురీ మాధురీణామ్**

**విభ్రాణావాలివృంద ప్రతిపదసుచమత్కారకారి ప్రవాహాన్**

**గౌరశ్యామో కిశోరౌ మిథ ఉదిత మహానంగరంగైక రమ్యా**

**వుద్యద్రోమాంచ పుంజౌ స్మరతి సరసధీః కోఽపి వృందావనాంతః 31**

అణువణువునను సఖీమణుల చమత్కారముతో నిండి పరస్పరము రూప, శోభా, లలిత, రతికళా చాతుర్య, మాధుర్యాదులను ప్రవహింపజేయుచు; ఒకరిపై మరొకరిలో ఉదయిస్తున్న మహాప్రీతిరీతికి వశులై, అత్యంత రమణీయ, పులకిత శరీరులైన శ్రీగౌరశ్యామ యుగళ కిశోరులు శ్రీబృందావనములో విరాజమానులైనారు.

**అనంత సుషమానిధిః స్ఫురదపార మాధుర్యభూ**
**రనంతమతి చంద్రికానిధిరనంత సౌభాగ్యభూః**
**అనంత భగవద్రసోత్తమ రహస్యమూలస్థలీ**
**మదీహితమనంత యత్విదమనంత వృందావనమ్ 32**

శ్రీబృందావనము అనంత సుషమా (శోభా) సముద్రము, అనంత మాధుర్యభూమి, అనంత చిత్ చంద్రికా సాగరము, అనంత సౌభాగ్యభూమి, అనంత భగవద్రస సర్వశ్రేష్ఠ రహస్యమునకు మూల స్థానము! అట్టి అనంత శ్రీబృందావనము నా సమస్త చేష్టలకు అనంతత్వమును ఇచ్చునుగాక! అనగా, నేను అనంతభావముతో శ్రీబృందావనమును ఆస్వాదింతునుగాక!

**యేషాం మన్మథ కౌతుకోత్తరలయోః శ్రీరాధికా కృష్ణయోః**
**స్వచ్ఛోదారతల స్థలీ మిలితయోరానంద మగ్నాత్మనామ్**
**ఆసారా నిపతంతి దివ్యమధునో దివ్యైః ప్రసూనైః ఫలై**
**రాకీర్యేత మహీ ఖగైః కలకలం త్యక్త్వాఽ చలైః స్థీయతే 33**

ఆనందరస మగ్న చిత్తులై కల్పవృక్షముల క్రింద స్వచ్ఛము విశాలమునైన ప్రదేశములలో కలసికొని అనంగ కౌతుకముచే చంచలురైన శ్రీరాధాకృష్ణులు విరాజిల్లుచున్నారు. అట దివ్యమకరంద ధారను వర్షిస్తున్న దివ్యపుష్పములతో, ఫలములతో భూమి ఆచ్ఛాదితమైనది (కప్పి వేయబడినది). పక్షులు కలకల రవములను విడచి, చలింపక నిలచిపోయినవి.

**మహామధుర గుల్మక ద్రుమలతా మహామాధురీ**
**ధురీణ ధరణీతలం సుమధురాలపత్సన్మృగమ్**
**మహామధురతాధురోద్ధురసవః సరిద్భూధరమ్**
**మహామధుర భావదం మధురిమైవ వృందావనమ్ 34**

శ్రీబృందావనము మహా మధురమైన వృక్ష, గుల్మ (పొద), లతాదులతో మహామాధుర్యముతో భూషితమైన ధామము! ఆ నేల మధురమైన భ్రమరముల, పక్షుల, మృగముల ధ్వనులతో ప్రతిధ్వనిస్తూ ఉంటుంది. అచటి సరస్సులు, నదులు, పర్వతములు మహామాధుర్యమునకు సారస్వరూపములు! మహామధురమైన భావదానము చేయగల ఆ శ్రీబృందావనము సాక్షాత్తు మాధుర్యరూపముగ ప్రకటితమైనది.

**దివ్యానంత రసాత్మక ప్రియఫలైః పుష్పైశ్చ దివ్యామితా**
**మోదైర్దివ్యపరాగ దివ్యమధుభిర్దివ్యైః ఖగానాం కులైః**
**దివ్యైః పల్లవ కోరకాదిభిరపి శ్రీరాధికా కృష్ణయోః**
**సంతోషం సముపార్జయామి తరవో భూత్వాఽపి వృందావనే 35**

దివ్యాతిదివ్యము, అనంత రసమయమునైన పూవులతోను, ఫలములతోను శోభిస్తూ; దివ్యమైన అపరిమిత సుగంధముతోను, దివ్యపరాగముతోను, దివ్య మకరందముతోను, పక్షులతోను వ్యాపించి; దివ్యమైన చిగుళ్లతోను, మొగ్గలు మున్నగు వానితోను భూషితుడినై ఈ బృందావనములో అనేక వృక్షముల శరీరములను ధరించి కూడ శ్రీరాధాకృష్ణులకు సంతోషము కలిగిస్తాను.

శ్రీబృందావనములోని అణువణువు శ్రీరాధాకృష్ణులను ఏవిధంగా సేవిస్తున్నదో దర్శించిన శ్రీసరస్వతీ పాదులు తన్మయులైనారు. శ్రీధామములోని తరులతాదులు, పూవులు, ఫలాలు, పక్షులు మున్నగువానితో కూడిన వృక్షముల రూపాన్ని ధరించి శ్రీయుగళమును సేవించి ధన్యతను పొందవలెనను ఆకాంక్షను వారు ఇట ప్రకటించినారు.

**ఆమూలద్రుమజాతి విస్తృతమహా సుస్నిగ్ధశాఖావతామ్**
**వృక్షాణామతి దివ్యపుష్పఫల సంభారైర్మనోహారిణామ్**
**ఆరుహ్య ద్వయమేవ కౌతుకభరాత్తద్గౌర నీలం మహః**
**శాఖాయత్ర చినోతి ఖేలతి తదేవాఽధ్యేమి వృందావనమ్ 36**

శ్రీబృందావనంలోని అత్యంత దివ్య పుష్ప ఫలాదులతో మనసును హరిస్తూ, విశాలమైన పారిజాతాది మహాసుందర స్నిగ్ధ శాఖలతో కూడిన వృక్షములపై ఆరోహిస్తూ (ఎక్కుతూ) గౌరశ్యామ శ్రీయుగళ కిశోరులు కుతూహలంతో పల్లవ పుష్పాదులను కోస్తూ, ఆడుతూ ఆనందిస్తున్నారు. అట్టి శ్రీబృందావనమును సమ్యక్ప్రకారముగ నేను ధ్యానిస్తున్నాను.

**యా రాధాయా వరతను నటేత్యుక్తిమాత్రేణ నృత్యేత్**
**గాయేత్యుక్తా మధుకరరుతైర్విజ్ఞగానం తనోతి**
**క్రందేత్యుక్త్వా విసృజతి మధూత్ఫుల్లితా స్యాద్వసేతి**
**ప్రోక్తాశ్లిష్య ద్రుమమితి గిరా సస్వజే ఘృష్టగుచ్ఛా 37**

బృందావనములోని ఒక లతను 'హే వరాంగిణీ! నాట్యం చేయి' అనే రాధాజీ యొక్క ఉక్తి (మాట) మాత్రం చేతనే నృత్యని చేయనారంభిస్తుంది, 'పాట పాడు' అంటూనే భ్రమరఝంకారము వలె మనోహరంగా గానం చేస్తుంది, 'క్రందనం (వర్షించటం) చేయి' అంటూనే మధువును వర్షిస్తుంది, 'చిరునవ్వు నవ్వు' అనే వాక్యం వింటూనే సంపూర్ణంగా వికసిస్తుంది, 'వృక్షాన్ని ఆలింగనం చేసుకో' అనే మాటను వింటూనే పులకితగుచ్ఛముగనై వృక్షాన్ని కౌగిలించుకుంటుంది–

**మత్ప్రాణేశం నమ నిగదితేత్యాపతత్యేవ భూమా**
**వి‌త్థం తత్తద్వచనవశగా స్యామహం కాపి వల్లీ**
**శ్రీరాధాయాః స్వకరవిహిత స్వంబుసేకాది పుష్టా**
**వృందారణ్యే ముదిత హరిణా దత్తకాంతా వరాశీ 38**

'నా ప్రాణేశ్వరునికి ప్రణామం చేయి' – ఆ వాక్యం వింటూనే ఒక లత భూమిపై వాలిపోతుంది. ఈ విధంగా శ్రీరాధా ఆజ్ఞానువర్తినినై నేను శ్రీబృందావనంలోని ఒకానొక లతనౌతాను. ఆ లతను శ్రీరాధ తన కరకమలములతో

జలసించితం చేయటం (తడపటం) ద్వారా పుష్టిని పొందుతాను. శ్రీహరి సంతుష్టుడై 'నాదానివి కమ్ము' అంటూ శ్రేష్ఠమైన ఆశీర్వాదాన్ని ఇస్తాడు.

**యా శ్రీర్నంద పుష్పభద్రప్రముఖే యా వాథనైః శ్రేయసే**
**తత్కోటి ప్రగుణ శ్రియాతి మధురం దేదీప్తి వృందావనమ్**
**కేలి శ్రీమదనంత చిత్రసురసం శ్రీరాధికా మాధవౌ**
**నిత్యం వేదశిరోऽ తి దూరపదవీం యద్వైభవం గాయతః 39**

నందనవనము, పుష్పభద్ర మున్నగు వనముల సౌందర్యము ముక్తిపదము నందలి వైభవము కన్నను కోటిరెట్లు అధిక సౌందర్యముతోను, వైభవముతోను వెలుగొందుచు అతి మధురమైన శ్రీబృందావన కాంతిని విస్తరింపజేస్తూ ఉంటుంది. కేళీ సౌందర్యయుక్తము, అనంత వైచిత్రీ రస యుక్తమునై వేదశిరోమణిగణమునకు కూడ అందరాని (ఎరుగలేని) మహిమను కలిగిన ఈ బృందావన వైభవమును శ్రీరాధా మాధవులు నిత్యము గానము చేయుచుందురు.

**యే నైః శ్రేయసమాశ్రితాస్తులసికాద్యామోద సమ్మోదినో**
**యే మత్సౌరభ పారిజాత కుసుమైర్యే నందినో నందనే**
**యేచాన్యేషు వనేషు సంతి ముదితాః పుష్పంధయానాంగణా**
**స్తే యత్రాభిపతంతి నిత్యమమితాస్తాం నౌమి వృందాటవీమ్ 40**

ఏ సమస్తభ్రమరములు ముక్తిపదములో స్థితమై ఉంటాయో, తులసిమున్నగు వాని యొక్క సుగంధాన్ని ఆనందంగా ఆస్వాదిస్తూ ఉంటాయో, నందన వనములోని మహాసుగంధపూర్ణమైన పారిజాతాది కుసుమముల పట్ల ఆనందలోభంతో ఉంటాయో, అన్యవనములలో కూడ ఆనందాన్ని పొందుతూ ఉంటాయో ఆ సమస్త భ్రమర సమూహములు నిత్యము బృందావనములో ముగ్ధత్వాన్ని పొంది ఉండిపోతాయి. అట్టి బృందావనానికి నేను నమస్కరిస్తున్నాను.

**ధన్యేఽస్మిన్ ధరణీతలే తను భృతాం దాతుం మహోచ్చం పదమ్**
**ప్రాదుర్భూతమతి ప్రభూత మధురానందాబ్ధి వృందావనమ్**
**యే సంసార మహాఽవటే నిపతితా యేసర్వసంత్యాగినో**
**యే ముక్తాశ్చ య ఈశ్వరాః సకృదపి ప్రేక్ష్యైవ ముహ్యంత్యహో 41**

ఓహో! ఈ ధన్యభూమిపై ఉన్న జీవులకు మహోన్నత పదమును ఇచ్చుటకై మధురమహానంద సాగరమైన శ్రీబృందావనము ఆవిర్భవించినది. సంసార రూపమైన పెద్ద అగాధములో పడియున్నవారు, సర్వాన్ని త్యజించినవారు, ముక్తులు, ఈశ్వరుడు – ఎవరైనా కూడ శ్రీబృందావనాన్ని ఒక్కమారు దర్శిస్తే చాలు, ముగ్ధులు ఔతారు!

**యేఽత్యంత విషయావిష్ట బ్రహ్మనిష్ఠాశ్చ యే మతాః**
**ప్రేక్ష్యానందేన మూర్ఛంతి సకృత్ వృందావన శ్రియమ్ 42**

లౌకిక విషయాదులలో మిక్కిలి ప్రీతితో ఉన్నవారైనా, బ్రహ్మనిష్ఠులైనవారైనా కూడ కేవలం ఒక్కమారు శ్రీబృందావన శోభను దర్శిస్తే ఆనందంతో మూర్ఛిల్లుతారు.

**శ్రీమద్బృందావనస్యైవ ప్రభావోఽయం మహాద్భుతః**
**యత్ స్వసంబంధగంధేఽపి బంధకృద్రససింధుదః 43**

శ్రీబృందావనము అద్భుత ప్రభావము కలది. ఎవరైనా తనతో లేశమాత్రపు సంబంధాన్ని కలిగి ఉన్నా, అట్టి వారికి రససముద్రాన్ని ప్రదానం చేయటానికి చిరబంధనంలో బద్ధులై ఉండునట్లు చేస్తుంది.

**వృందావనస్య మహిమా న హి మాదృశగోచరః**
**బబంధ స్వగుణైర్దివ్యైర్యచ్ఛ్రీమత్పురుషోత్తమమ్ 44**

శ్రీబృందావన మహిమ మావంటి వారికి గోచరింపదు. ఎందుకంటే, అది తన దివ్యగుణాలతో శ్రీపురుషోత్తముని కూడ వశీకృతునిగ చేసుకున్నది.

(శ్రీబృందావన మహిమను క్షణక్షణం దర్శిస్తూ అందించిన శ్రీసరస్వతీ పాదులే 'మావంటి వారికి గోచరింపదు' అంటే, ఇక ఆ మహామహిమాతిశయం ఊహించటానికైనా సాధ్యమా!)

**అత్యున్మద మహాప్రేమ రససారైః సుసంభృతమ్**
**ఆత్మవత్ స్వీయ సకలం భజ వృందావనం వనమ్ 45**

అత్యంత ఉన్మద మహాప్రేమరస సారముచే అలంకృతమై, సమస్త వస్తువులను తనవలె వ్యవహరించు శ్రీబృందావన నామక వనమును భజించు!

**ధనపుత్ర కళత్రాది మమతా మమ తాపదా**
**ఇతి త్యక్త్వాఖిలం వృందావనమేవ చ మే వరమ్ 46**

ధన, పుత్ర, కళత్రాదుల యందు నాకు మమత ఉన్నది. అది తాపం కలిగిస్తున్నది. కనుక, వానినన్నిటినీ త్యజించి, శ్రీబృందావనమే నాకు సర్వశ్రేష్ఠమగునుగాక!

**మహాసహాని దుఃఖాని సుఖాన్యున్మాదకాని వా**
**వృందావన దృఢప్రీతిం నాలం చాలయితుం హి మామ్ 47**

మహా అసహనీయమైన దుఃఖరాశి, ఉన్మత్తతను కలిగించే అనేక సుఖములు కూడ శ్రీబృందావనము పట్ల నాకు గల దృఢ ప్రీతిని చలింపజేయచాలవు.

**శ్రీమద్బృందాటవీ కుంజపుంజే నిత్యవిహారిణౌ**
**గౌరశ్యామ మహాశ్చర్య కిశోరౌ మమ జీవనౌ 48**

శ్రీబృందావన నికుంజలలో నిత్యవిహారము చేయుచుండు గౌరశ్యామాత్మక, మహాశ్చర్యమయ శ్రీయుగళ కిశోరులే నా జీవనము!

**మంద ప్రజ్ఞాస్తఏవాత్ర మంద భాగ్యాస్తఏవ హి**

**యే వృందావనమాశ్రిత్య రాధాకృష్ణౌ న భేజిరే 49**

శ్రీబృందావనములో ఉండి కూడ శ్రీరాధాకృష్ణులను భజించనివాడు మందబుద్ధి, మందభాగ్యుడు!

**ఇదం మహచ్ఛోచనం మే మహాంశ్చ బత విస్మయః**

**న యద్బృందావనస్థోఽపి రాధాకృష్ణౌ భజేద్రసాత్ 50**

శ్రీబృందావనంలో ఉంటూ కూడ లోకులు ప్రేమపూర్వకంగా శ్రీరాధాకృష్ణులను సేవించకపోవటం నాకు చాలా విచారాన్ని, చాలా ఆశ్చర్యాన్ని కలిగిస్తున్నది.

**లోకచింతా న నో ధర్మచింతా న దేహగా**

**శ్రీమద్బృందావనే రాధాకృష్ణ భావభృతో మమ 51**

శ్రీబృందావనంలో శ్రీరాధాకృష్ణుల భావములో ఉన్న నాకు లోక చింత కాని, ధర్మ చింత కాని, దేహాదుల పట్ల చింతకాని లేదు.

**యే నిత్యా నిర్వికారా నిరతిశయగుణా నిష్ప్రపంచ స్వభావా**

**నిర్దోషా నిత్యముక్తా నిగమగణసముద్గీత దివ్యానుభావాః**

**ఆనందాపార సంవిద్రసఘనవపుషః కృష్ణభావైకమగ్నాః**

**తాన్ వందే శ్రీలవృందావన తరునికరాన్ సర్వసర్వార్థదాతౄన్ 52**

శ్రీబృందావనమునందలి వృక్షసమూహము నిత్యమైనది, నిర్వికారమైనది, సాటిలేని గుణములు కలది, అప్రాకృత స్వభావము కలది! అది నిర్దోషము, నిత్యముక్తము! వాని దివ్యానుభావములను వేదములు నిత్యము ఉచ్చైస్వరముతో గానము చేస్తూ ఉంటాయి. ఆనంద, అపార జ్ఞాన, రసఘన స్వరూపముతో ఉన్న ఆ వృక్షములు కృష్ణభావైక మగ్నములై, నిఖిల జగత్తులకు సమస్త పురుషార్థములను

ఇచ్చుటకు సమర్థములై ఉన్నవి. శ్రీబృందావనములోని అట్టి వృక్షరాజములకు నమస్కరిస్తున్నాను.

**దివ్యానేక విచిత్ర పుష్పఫలభారానమ్ర శాఖాన్ మహా**
**విస్తీర్ణాన్ పరమోచ్ఛ్రితాన్ ఖగకులైః సంరావ కోలాహలాన్**
**నీరంధ్రాన్ దళపల్లవైస్తత ఇతో మత్తాలి మాలాకులాన్**
**వందే స్యంది మరంద సాంద్ర సుసుధాన్ వృందాటవీ శాఖినః 53**

దివ్యాతి దివ్యమైన అనేక విచిత్ర పుష్పఫలముల భారముతో వంగినవి; అత్యంత విస్తృతముగను, ఎత్తుగాను ఉన్నవి; పక్షుల కోలాహలముతో ప్రతిధ్వనిస్తున్నవి; పత్రములు, పల్లవములతో రంధ్రరహితముగా ఉన్నవి; నాలుగు దిక్కులలోను భ్రమరముల గుంజారవమును కలిగినవి; ఉత్కృష్టమైన రసఘన సుధారాశిని వర్షించునవి అయిన శ్రీబృందావన వృక్షములకు నమస్కరిస్తున్నాను.

**ఊర్ధ్వప్రేక్షణ మోహనాక్షివదనం శ్రీరాధికా తర్జనీ**
**ముత్తోల్యామృత భాషితేన తలగా సందర్శయేన్మోహినీ**
**యేషాం దివ్యఫలాని నాగరవరః సంపాతయేత్సాదరమ్**
**స్వామిన్యేవమవాచినోతి భజ తాన్ వృందావన శాఖినః 54**

మోహిని శ్రీరాధ ఆ వృక్షాల క్రింద కూర్చుండి, చూపుడు వేలిని పైకెత్తి, అమృతమయమైన వాక్యవిన్యాసం చేస్తూ; శ్రీశ్యామసుందరుడిని తన మోహనమైన నేత్రాలతో పైకి చూస్తూ అపూర్వఛవితో, ముఖచంద్రుని చూపించింది. (అంటే వృక్షాలకు ఫలించిన ఫలాలను చూపుడు వేలితో చూపిస్తూ, అవి కోసి ఇమ్మని అమృతమయమైన వాక్యాలతో తెలిపింది). నాగరవరుడైన శ్రీశ్యామసుందరుడు ఆవిధంగానే దివ్య ఫలాలను కోసి క్రిందికి పడవేస్తుంటే, ఆ ఫలాలనన్నిటినీ శ్రీరాధ సేకరించింది. శ్రీబృందావనంలోని అట్టి వృక్షబృందాలను భజించు!

**మహాజ్యోతీరూపాః ప్రతిపద మహానంద మధురా**
**మహాతుంగా శాఖావితతిషు మహావిస్తృతియుతాః**
**మహార్థాన్ వర్షంతో నిరవధి మహాపుష్ప ఫలినో**
**మహీయాంసో వృందావిపిన తరవో భాంతి మహతామ్ 55**

మహాజ్యోతి స్వరూపము కలదియు; అణువణువునను మహానందపూర్ణమైన మధుర మహోన్నత విస్తార శాఖలను కలిగినదియు; ధర్మార్థకామమోక్షములను, ప్రేమాదులను వర్షించునదియునైన మహామహిత శ్రీబృందావనమునందలి వృక్షము శోభించుచున్నది.

**శ్రీమద్బృందావన విటపినః సచ్చిదానంద సాంద్రా**
**శ్చంద్రాదిత్య ప్రముఖ నిఖిల జ్యోతిరేకాణు భాసః**
**శాఖా పత్రాదిభిరవిమితాః సర్వదివ్యర్తుసేవ్యాః**
**సర్వోత్తాపచ్ఛిదుర శిశిరచ్ఛాయయాఢ్యా జయంతి 56**

శ్రీబృందావనమునందలి వృక్షరాజము సచ్చిదానంద ఘన స్వరూపము! చంద్రసూర్యాది సమస్త జ్యోతి సమూహములు ఆజ్యోతి యొక్క ఒక్క కణము మాత్రమే! (లేదా, అవన్నియు ఈ జ్యోతి కణము చేత ప్రకాశిస్తున్నాయి). శ్రీబృందావన వృక్షరాజములు ఎల్లలులేని శాఖలతో, పత్రాదులతోకూడి, సమస్త దివ్య ఋతువులతోను సేవింపబడుతున్నాయి. అవి సమస్త తాపములను పోగొడుతూ, చల్లని నీడను అనుగ్రహిస్తూ సర్వోత్కర్షంగా విరాజమానమై ఉన్నవి.

**ఏతా వల్లీవితతయ ఉరుస్నేహ విక్లిన్నచిత్తాః**
**శ్రీమద్బృందావనభువి మహాభూతయో మాతృభూతః**
**ఆశ్రీయంతే హరిహరి బహిర్వస్తు బుద్ధిం విధూయ**
**యైర్ధీమద్భిః సతతమిహ వాఽముత్ర వా తే కృతార్థాః 57**

హరిహరీ! శ్రీబృందావనములోని మహాప్రభావము కలవి, తల్లివలె అతిశయించిన స్నేహార్ద్రచిత్తము కలవి అయిన లతలయందు బాహ్యవస్తు బుద్ధిని త్యజించి, ఏ బుద్ధిమంతుడు వానిని నిరంతరము ఆశ్రయిస్తాడో అతడు ఈ లోకంలోను, పరలోకంలోను కూడ కృతార్థతను పొందుతాడు.

**కైవల్యాద్యఖిలార్థ ధుత్కృతి కృతః కేచిన్మహాబుద్ధయో**
**యోగీంద్రాః ఖగరూపతాముపగతా నందంతి యచ్ఛాఖిషు**
**సమ్యక్రస్ఫురితైశ్చ యుక్తినివహైః సర్వార్థ తత్సాధనా**
**త్యంతోచ్ఛేద కృదుచ్ఛకైః కలకలాస్తాం నౌమి వృందాటవీమ్ 58**

కైవల్యాది సమస్త పురుషార్థములను తిరస్కరించి, కొందరు మహా బుద్ధిమంతులు, యోగీంద్రులు పక్షిరూపములను ధరించి శ్రీబృందావనములోని వృక్షశాఖలపై ఆనందమును పొందుతున్నారు. ఇంకా; సమ్యగ్రూపముతో, ప్రస్ఫుటం ఔతున్న యుక్తితో ధర్మార్థకామ మోక్షములు మున్నగు సమస్త పురుషార్థములను, ఆయా సాధనలను అన్ని విధములుగా నశింపజేసే కలకల ధ్వనులను ఉచ్చైస్వరముతో చేస్తున్నారు. అట్టి బృందావనమునకు నమస్కరిస్తున్నాను.

**శ్రీవృందావనమవనీ ప్రకటం ప్రకృతేః పరాత్పరం సురసమ్**
**రాధామాధవ నిత్యాక్రీడం సంత్యజ్య సర్వమాశ్రయత 59**

పృథివిపై ప్రకటితమైన అప్రాకృతము, పరాత్పరము, రసమయమునైనట్టిది; శ్రీరాధామాధవుల నిత్యక్రీడావనమైనట్టిది శ్రీబృందావనము! సమస్తమును త్యజించి, అట్టి బృందావనమును ఆశ్రయింపుము!

**వృందారణ్యమగణ్య ప్రభావమనుభావయన్మహాభావమ్**
**గౌరశ్యామల దంపత్యవిచల కందర్పకేలి భజేత్ 60**

అగణిత ప్రభావశీలమై, మహాభావము యొక్క అనుభవాన్ని అనుగ్రహించగల శ్రీగౌరశ్యామ యుగళ కిశోరుల అవిచల అనంగకేళీ స్థలియైన శ్రీబృందావనమును భజింపుము!

**అత్యవేశేంద్రియమపి మాం సకల విధాతోఽపి సంశోచ్యమ్**
**అంగీకరోతి రాధాకేళివనం చేన్మహాకృతార్థోఽస్మి 61**

ఇంద్రియాలకు అతిగా వశీభూతుడనై, అన్ని విధములుగా శోచనీయ స్థితిలో ఉన్న నన్ను శ్రీరాధాకేళివనం (బృందావనం) అంగీకరించినట్లయితే నేను మహాకృతార్థుడిని ఔతాను!

(మహాత్ముడైన శ్రీసరస్వతీపాదులు ఇంద్రియాలకు వశీభూతులైన వారి స్థితిని తమకు ఆపాదించుకొని చెప్పుచున్నారు).

**ఆస్తాం దుర్మతికోటిర్దుశ్చేష్టా కోటిరప్యాస్తామ్**
**పరిభూతికోటిరస్తు శ్రీవృందారణ్యమాఽస్తు తే విరహః 62**

కోటి కోటి దుర్బుద్ధులు కలుగనీ, కోటికోటి దుశ్చేష్టలు రానీ, కోటి కోటి అవమానాలు కలుగనీ; ఐనప్పటికీ హే బృందావనమా! నాకు నీ విరహము (ఎడబాటు) మాత్రము ఎన్నటికీ రాకూడదు. ఇదే నా ప్రార్థన!

**స్త్రీనామ్ని దుష్టనరకే విమ్మూత్రశ్లేష్మ పూయాద్యైః**
**పూర్ణేగతేఽపి కర్ణే స్వవాంతవన్నివస రాధికారామే 63**

మల, మూత్ర, శ్లేష్మ, జలాదులతో నిండియున్న స్త్రీనామక దుష్టనరక విషయాన్ని విన్నా దానిని త్యజించి; శ్రీరాధా ఉపవనమైన బృందావనంలో నివసించు!

**హరిరతి వృందావనరతి వివేక విరతీశ్చ దురముక్తిరతి**

**స్త్రీ రూపా హరిమాయా తదుపరమాయాతి దూరతోऽ పాయః 64**

స్త్రీ రూపమైన హరిమాయ హరిభక్తిని, బృందావన ప్రీతిని, వివేక వైరాగ్యాదులను దూరంగా నెట్టివేస్తుంది. దాని నుండి తప్పించుకొను ఉపాయం దానికి దూరంగా ఉండటమే!

**ఉన్మత్తమేవ కురుతే యోషిద్దృష్ట్యైవ దుష్టమదిరేవ**

**అతి వనవసతిరశక్యా హా వృందారణ్య కిన్ను మే భవితా ? 65**

స్త్రీ జాతి దర్శనమే దుష్టమదిర (సారాయి)తో సమానంగా ఉన్మత్తం చేస్తుంది. హా శ్రీబృందావనమా! నాకు ఉపాయం ఏది ?

**అతి దుర్వారా ఇంద్రియవైరిణ ఆమర్దయంతి సతతం మామ్**

**బధ్వా బధ్వాత్యార్తిదకారాయాం హా హరే పరిత్రాహి 66**

నాకు అత్యంతము బాధను కలిగించే కారాగారములో బంధించవలెనని అత్యంతము సహింపరాని ఇంద్రియములు అనెడి శత్రువులు నిరంతరము పీడిస్తున్నవి. హా హరీ! నన్ను రక్షించు!

**కందర్ప సవిష విశిఖైర్నిరవధి మమ దహ్యమానస్య**

**వృందావనేऽ పి నివసన్ హరి హరి నహి నిర్వృణోమి కిం కుర్వే ?67**

మన్మథుని విషపూరితమైన బాణముల చేత నిరంతరము నేను దహింపబడుతున్నాను. హా! హా! బృందావనములో నివసిస్తున్నా కూడ నాకు శాంతిలేదు. ఏమి చేయను ?

**తరుణీతనువిద్భాండం హృదయం విదుషామపీహ మాదయతి**

**తచ్ఛ్రవణ దర్శనాద్యై రహితో వృందావనం తథ్యాయస్వ 68**

స్త్రీశరీరరూపమాలిన్యము విద్వాంసుల హృదయాన్ని కూడ ఉన్మత్తం చేస్తుంది. కనుక వారిని చూడటం, వారిని గురించి వినటం అనేవి లేకుండ, బృందావనాన్ని ధ్యానించు!

**ప్రజ్వాలయతి సమస్తం దేహం కామాగ్నినా ప్రమోహయతి**
**దృష్ట్యైవ చ నవతరుణీ కుతస్తర్హి స్వార్థసిద్ధిం ప్రత్యాశా ? 69**

నవతరుణి వలన కలిగిన కామాగ్ని సర్వాంగాలనూ జ్వలింపజేస్తుంది. దృష్టిపాతం చేతకూడ మోహాన్ని కలిగిస్తుంది. ఇక, స్వార్థసిద్ధి పట్ల ఆశ ఎక్కడ ఉంటుంది ?

(స్వార్థ సిద్ధి అంటే మంచిని కలిగించే బృందావన వాసము అని ఉద్దేశం).

**కామక్రోధాత్యంధో లోభవశోఽహం వసామి రాధాయాః**
**కేలివనే పరమిచ్ఛుర్భావమహో నాస్తి మే లజ్జా 70**

ఓహో! కామ, క్రోధాలతో నేను అతి అంధుడనై ఉన్నాను. లోభానికి వశీభూతుడనైనాను. శ్రీరాధాకేళి వనములో నివసిస్తున్నాను. ఇంకా, పరమ శ్రేష్ఠ భావాన్ని పొందాలని కోరుకుంటున్నాను. నాకు సిగ్గయినా కలగటం లేదే!

(శ్రీబృందావనంలో ఉంటూ, శ్రేష్ఠభావాన్ని పొందాలని కోరుకుంటూ కూడ కామక్రోధలోభాదులకు వశమై ఉన్నందుకు సిగ్గిలుతున్నారని భావం).

**కామాది గాఢమూఢో లిప్సురహం నిగమగూఢ సద్భావమ్**
**వృందారణ్య ఉషిత్వా తత్కరుణైకైవ తత్ర మే శరణమ్ 71**

నేను కామాదుల పట్ల ప్రగాఢంగా మోహితుడినై ఉన్నాను. కాని, వేదాలలో నిగూఢంగా ఉన్న సద్భావాన్ని పొందాలనే ఇచ్ఛతో ఉన్నాను. కనుక శ్రీబృందావనంలో నివసిస్తూ, శ్రీధామం యొక్క కరుణయే ఏకమాత్రపు శరణమని ఆశ్రయిస్తున్నాను.

**కృత్వా పాణితలే కపోలమసకృన్నేత్రాంభసాం ధారయా**
**ధౌతం హా మురళీధరేతి కరుణం కుర్వన్ ముహుః క్రందనమ్**
**ఆసీనో విజనే క్వచిత్తరుతలే వృందావనాంతః కదా**
**వత్స్యామ్యేకరసాశ్రయః శిథిలితి ప్రాణస్థితి వ్యాపృతిః 72**

అరచేతిలో చెక్కిలిని చేర్చి, నిరంతర అశ్రుధారలతో 'హామురళీధరా' అని పిలుస్తూ, మాటిమాటికీ ఆక్రందిస్తూ, బృందావనంలోని ఒక నిర్జన వృక్షం క్రింద కూర్చుండి, దివ్యశృంగార రసాన్ని ఆశ్రయించి, ప్రాణరక్షణకై ఎట్టి ప్రయత్నమును కూడ చేయక, ఎప్పుడు నేను బృందావనంలో నివసిస్తాను ?

**యో వ్యాఘ్రీరివ యోషితా విషమివ స్వాదూన్నమర్థం మహా**
**నర్థప్రాయమసాధులోకమిలనం సర్వార్థ విభ్రంశవత్**
**కించిన్మాత్ర పరిగ్రహం గ్రహమివ స్వాత్మేంద్రియం శత్రువత్**
**మన్యేత ప్రణయీ హరౌ స హి వసేత్సాధ్వత్ర వృందావనే 73**

శ్రీహరి ప్రీతికై స్త్రీ జాతిని ఆడుపులి వలెను, స్వాదిష్ట భోజనమును విషముతో సమానముగను, ధనమును మహా అనర్థముగను, అసాధువులైన లోకులను సర్వనాశనకారులుగను, ఎవరి నుండియైన కించిన్మాత్రమును పరిగ్రహించుట కూడ గ్రహము వలెను, తన ఇంద్రియములను శత్రుసమానముగను ఎరిగినవాడు – అతడే శ్రీబృందావనములో ఉత్తమ రూపముతో నివసింపగలడు!

**కామిన్యాలోకమాత్రాత్ క ఇహ న విసృజేల్లోక లజ్జాది సర్వమ్**
**తత్సక్తం శాస్త్రగుర్వాదికమహహ కిమప్యత్ర రోద్ధుం న శక్తమ్**
**తస్మాత్ కామప్రదాహైర్యది మరణభయం దుస్సహో వా స్వగర్వా**
**వర్వాపీడాద్యభావం తదనుభవ హఠాత్ ప్రోహ్య వృందావనేంగమ్ 74**

ఈ లోకంలో స్త్రీ దర్శనమాత్రం చేతనే లోకలజ్జాదికమును త్యాగం చేయకుండ ఎవరు ఉంటారు ? (అంటే సిగ్గు శరం అన్నిటినీ వదలి వేస్తారు). ఓహో! శాస్త్రములు, గురువు మొదలైనవారు కూడ స్త్రీయందు ఆసక్తిగల పురుషుడిని ఏవిథంగాను ఆపలేరు. కనుక, కామాగ్ని వలన మరణ భయం కలుగుతున్నదా, ఆత్మ నిందను సహింపలేకపోతున్నావా! అయితే ఈ శరీరాన్ని బలవంతంగా శ్రీబృందావనములో పడవేసి, మయూర ఫించధారియైన శ్రీకృష్ణుని ఆద్యమధుర (దివ్యశృంగార) భావాన్ని అనుభవించు!

**యోషిత్సూచక శబ్దతోఽపి మదనోమామంధబుద్ధిం కరో**
**త్యేష క్రోధ ఉపైతి చాంధ తమసీ కుర్వన్ సమస్తా దిశః**
**లోభః క్షోభయతే మనో నిరవధి శ్రీధామ్ని వృందావనే**
**నాశస్తన్న ఘటిష్యతే ధ్రువమతో జహ్యామిహాంగం హఠాత్ 75**

'స్త్రీ' సూచక శబ్ద మాత్రం చేతనే కామం నన్ను అంధబుద్ధిని చేస్తున్నది (కామాంధుడిని ఔతున్నాను). ఈ క్రోధం సమస్త దిక్కులను అంధకారమయం చేస్తున్నది. ఇంకా, లోభం నిరంతరం మనసును క్షోభింపజేస్తున్నది. హా! శ్రీధామ బృందావనంలోనైనా ఇవి నశిస్తాయా! కనుక, బలపూర్వకంగా ఈ శరీరాన్ని అక్కడ పడవేయటమే చేయతగినది!

**సర్వోపేక్షామయ బలదయః శృంఖలాభంగ దక్షో**
**రక్షో వీక్ష్యే న్మృతవదవలామాత్రమక్షోభ చిత్తః**
**సర్వాధ్వం స్వాశనముపనయన్ దేహరక్షోపయోగి**
**క్షౌణీవత్ స్యామహహ సహనః కర్హి వృందావనేఽహమ్ 76**

హా! బల, దయాదులతో సమస్తము పట్ల ఉపేక్షా బుద్ధితో ఉండి; మాయా శృంఖలముల (సంకెళ్ల) దెబ్బలను భంగము చేయుటలో దక్షుడినై; రాక్షసుని చూచి మృతునివలె అయినట్లు స్త్రీ దర్శనము చేసినంతనే మృతుని వలెనై;

క్షోభరహితమైన మనసుతో అన్ని ప్రదేశములలోను శరీరరక్షణకు అవసరమైనంత అన్నాదులనే స్వీకరిస్తూ; భూమాత వలె సహనశీలుడినై ఎప్పుడు నేను శ్రీబృందావనంలో నివసింపగలను ?

(అంటే బృందానివాస భాగ్యము కలుగవలెనన్న ఇట్టి లక్షణములు ఉండవలెనని భావము).

**గాయన్ రాధామురళిధరయోః సుందరం కేలిబృందమ్**
**విందన్నంతస్తదనుభవానంద నిష్పంద భావమ్**
**నిందన్ భోగానహహ సకలాన్ హా ప్రియ శ్యామలేతి**
**క్రందన్నుచ్చైః పరమ వికలః కర్హి వృందావనే స్యామ్ 77**

శ్రీరాధా మురళీధరుల సుందర కేళీవిలాసాలను గానం చేస్తూ చేస్తూ, హృదయంలో ఆ అనుభవానందము వలన కలిగిన నిష్పంద భావాన్ని పొంది, సమస్తమైన భోగవిలాసాదులను నిందిస్తూ (తిరస్కరిస్తూ), "హా ప్రియ శ్యామ్" అని ఉచ్చైస్వరంతో రోదిస్తూ ఎప్పుడు ఈ బృందావనంలో పరమ వికలుడినై నేను నివసిస్తాను!

**మహాపతితపావనం భవమహాహిభీతావనమ్**
**సమస్త నిజసంగతస్వముఖ చిద్ఘనీ భావనమ్**
**మహామునివరైః సదావిహితభావనం జీవన్**
**మమైకమిహ రాధికారమణధామ వృందావనమ్ 78**

మహాపతితపావనమైనది; భవరూపమహాసర్పము వలన భయభీతులైన వారిని రక్షించునది; తన సమస్త సౌహార్ద్రతను (సహృదయతను) ప్రయోగింపదలచి, తన వైపుకి ఉన్ముఖులగునట్లు చిద్ఘనభావమునందు భావితులు అగునట్లు చేయునది; మహామునుల నిత్యధ్యానమునకు విషయమైనది; నాకు ఏకమాత్ర జీవనభూతమైనది శ్రీరాధికారమణుని ధామమైన శ్రీబృందావనము మాత్రమే!

**నిత్యం రత్యుత్సుకాంతః కరణమతి రసాసక్తితః సన్నభావమ్**
**కాంతాం హస్తే గృహీత్వా ముహురురు పులకం గూఢ కుంజేషు యాంతమ్**
**శ్రీమద్బృందావనాంతః సతతమధివసన్ కంచన శ్యామలాంగమ్**
**రాధైక ప్రాణమాత్మన్యనుసర లలితాద్యాత్మభావం కిశోరమ్ 79**

నిత్యము రతిరసమునందు ఉత్సుక చిత్తుడై ఉండువాడు, ప్రీతిరీతిపట్ల ఆశతో వ్యాకులుడైనవాడు, ప్రియతమ హస్తమును పట్టుకొని మాటిమాటికి పులకితుడై నిగూఢ కుంజలలో ప్రవేశించువాడు, శ్రీరాధకు మహాప్రాణస్వరూపుడు, లలితాది సఖీబృందమునకు ఆత్మస్వరూపుడునైన ఒకానొక శ్యామకిశోరుడిని బృందావనములో నిరంతరం ఉంటూ; ఆత్మస్వరూపదేహంతో అనుసరించు!

**వీథ్యాం వీథ్యాం భ్రమదతిరసాదున్మదానంగ లోలమ్**
**రోలంబానాం పథి పథి ఘటాః క్షిప్యదంగే పతంతీః**
**సంఘట్యాంగం ముహురతి హసత్ హేలయాఽ యోన్యమంగే**
**వృందారణ్యే నివస భజ తద్గౌరనీలం ద్విధామ 80**

అతిశయ రసవివశులై అన్ని వీథులలోను తిరుగుచుండువారు, ఉన్మత్తతను కలిగించెడి ఆనందమునకై చంచలించువారు, మార్గములో మాటిమాటికి పైన వాలుతున్న భ్రమరములను దూరముగ నెట్టివేయువారు, మాటిమాటికి హాస్యయుక్తమైన హావభావాలతో ఒకరిపై ఒకరు వాలుచుండువారు, గౌరనీల శ్రీయుగళ కిశోరులునైన శ్రీరాధా కృష్ణులను భజిస్తూ బృందావనంలో నివసించు!

**తం నైవాత్ర కృతాకృతే వితపతస్తం నైవ మాయాస్పృశే**
**త్తం సర్వేపిగుణా భజంతి మహతాం కాంక్షంతి తం సంపదః**
**తం సర్వేస్తువతే విరించి ప్రముఖాస్తం రాధికామాధవౌ**
**స్వాసన్నైకతమం ముదాగణయతో వృందావనం యః శ్రితః 81**

ఎవరు శ్రీబృందావనాన్ని ఆశ్రయిస్తారో అట్టి వారిని కర్మ, అకర్మ బాధింపవు, మాయ స్పృశింపదు, సమస్త మహాగుణరాశి ఆతనిని భజిస్తుంది. సమస్త సంపదలు ఆతనిని వరిస్తాయి. బ్రహ్మాది దేవతలు ఆతనిని స్తుతిస్తారు. శ్రీరాధామాధవులు ఆనంద పూర్వకంగా ఆతనిని తమ అనుచరులలో అత్యుత్తమునిగ గణిస్తారు.

**సాంద్రానంద సుధామయైర్దశదిశః శీతచ్ఛటామండలైః**
**సించద్భిః ఫలపుష్పపల్లవదలాద్యాభార వల్లీ ద్రుమైః**
**కృష్ణప్రేమ రసాకులైః ఖగకులైరానంద కోలాహలై**
**రమ్యం రత్నమయ స్థలీ విలసితం ధ్యాయామి వృందావనమ్ 82**

శ్రీబృందావనం దశదిశలలోను సాంద్రానందామృతమయమైన శీతల కాంతులను విస్తరింపజేస్తుంది. ఫల, పుష్ప, పల్లవ, పత్రాదుల భారంతో వంగి ఉన్న లతలు, వృక్షాలతో శోభాయమానంగా ఉంటుంది. కృష్ణప్రేమరసం చేత ఆకులమై ఆనంద కోలాహలంగా ఉన్న పక్షులతో రమణీయంగా విలసిల్లుతూ ఉంటుంది. రత్నస్థలి చేత భూషితమైన అట్టి శ్రీబృందావనాన్ని నేను ధ్యానిస్తున్నాను.

**యత్త్రైగుణ్యమయే సముజ్జ్వలమథ ప్రద్యోతి విద్యామయే**
**సర్వస్యోపరిజాజ్వలీతి మధురాశ్చర్యేణ యజ్జ్యోతిషా**
**శ్రీవృందావనమప్రమేయ మధుర శ్రీమత్సమస్తం సదా**
**రాధాకృష్ణ విచిత్ర కేళివలితం తన్మే మనో గాహతే 83**

శ్రీబృందావనం త్రిగుణాత్మకమైన జగత్తులో సముజ్వలంగా వెలుగుతూ, విద్యామయ జగత్తులో కూడ దేదీప్యమానంగా ప్రకాశిస్తూ, మధుర ఆశ్చర్యమయ జ్యోతిగా అన్నిటికీ పైన వెలుగుతున్నది. అప్రమేయమైన శోభతో సమస్త ద్రవ్యములచే నిరంతరం పరిపూర్ణమై ఉన్నది. శ్రీరాధాకృష్ణుల విచిత్ర కేళీ విలాసం చేత వలితమైన (చుట్టివేయబడిన) అట్టి బృందావనమునందే నా మనసు రమిస్తున్నది.

**యద్దివ్యైః సకలర్తుభిః సుమధురైరాసేవితం యల్లతా**
**వీరుద్భూరుహ గుల్మకాదిభిరనాద్యంతైర్ఘనం చిద్ఘనైః**
**యద్దివ్యాంబుసరః సరిన్మణిగిరి శ్రీరత్నవల్లీ గృహైః**
**దివ్యైర్యచ్చ విచిత్రవత్ ఖగమృగైస్తత్ పశ్య వృందావనమ్ 84**

శ్రీబృందావనం సమస్తములైన దివ్యాతి దివ్య మధుర ఋతువులచే సేవింపబడుతూ ఉంటుంది. అనాదియైన, ఆనంద చిద్ఘనమైన విస్తృత లతలు, పొదలు మున్నగు వానితో పూర్ణమై ఉంటుంది. దివ్యజలపూర్ణములైన సరోవరాలు, నదులు, మణిమయ పర్వతాలు, శ్రీరత్నలతా గృహాలతోను శోభిస్తూ ఉంటుంది. దివ్యమైన పక్షులు, మృగములయందు విచిత్రతను కలిగి ఉంటుంది. అట్టి శ్రీబృందావనమును దర్శించుము!

**శ్రీవృందావనమేవ పావనతమం విజ్ఞానముఖ్యాఖిలాత్**
**శ్రీవృందావనమేవ సాధనతమం సర్వార్థలబ్ధౌ హఠాత్**
**శ్రీవృందావనమేవ సాధ్యపరమోత్కర్షైక విశ్రామభూః**
**శ్రీవృందావనాత్మకోటి పరమప్రేష్ఠం న సేవేత కః 85**

శ్రీబృందావనమే సమస్తముఖ్య విజ్ఞానములకన్న పావనతమమైనది. శ్రీబృందావనమే ధర్మార్థకామమోక్షములను అనాయాసముగ ప్రాపింపజేయగల మహాసాధనము! శ్రీబృందావనమే సర్వోత్కృష్టమైన సాధ్యవస్తువులకు ఏకమాత్ర అధిష్ఠానము! కోటి ప్రాణములతో సమానమైన, పరమ ప్రియతమమైన అట్టి శ్రీబృందావనమును ఎవరు సేవింపకుందురు ?

అనగా అందరును సేవింతురని భావము!

**యా ప్రాచీన భవౌఘ సంచిత మహా దుర్వాసనాచ్ఛేదినీ**
**యా శ్రీశ ద్రుహిణాది దుర్గమ మహామాధుర్య సంవేదినీ**
**యాత్మానన్యజనాపరాధ వితతేర్మాతేవ నో వేదినీ**
**సా రాధాపదమోదినీ విజయతే వృందాటవీ మోహినీ 86**

శ్రీబృందావనము అనేక జన్మలుగా సంచితమైన దుర్వాసనలను నశింపజేయునది. లక్ష్మి, నారాయణ, బ్రహ్మాది దేవతలకు దుర్గమమైన మహామాధుర్యాన్ని తెలుపగలిగినది, తల్లివలె తన అనన్యభక్తుల అపరాధములను క్షమించునది. మనోహరమైన అట్టి శ్రీబృందావనము శ్రీరాధాచరణ కమలములను హృదయములో ధరించి ఆనందమును పొందుచున్నది. ఆ ధామమునకు జయమగునుగాక!

**ఔజ్జ్వల్యస్య పరావధిర్మధురిమైకాంత ప్రకర్షో మహా**
**నందౌఘాంత్య చమత్కృతిర్హరి కృపా స్నేహాది పూర్ణోదయః**
**సర్వాశ్చర్య కదంబమౌళిరచల శ్రీరాధికా మాధవో**
**త్తుంగానంగ రసోత్సవం విజయతే వృందావనం మోహనమ్ 87**

ఉజ్వల రసమునకు పరావధి, మాధుర్యము యొక్క అధిక ఆనందములకు పరమ చమత్కృతి, హరి కృపా స్నేహాదులకు పూర్ణోదయము వంటిది, సర్వాశ్చర్య శిరోమణి, అవిచలమైన సౌందర్యపూర్ణమైన శ్రీరాధామాధవుల ఉత్తుంగ అనంగ రసోత్సవమును ప్రదానము చేయునది అయిన ఈ మనోహర బృందావనమునకు జయమగునుగాక!

**తీర్త్వా మాయామయాబ్ధిం తర కిమపి పరబ్రహ్మ చిజ్జ్యోతిరబ్ధిమ్**
**స్వాదం స్వాదం తతః సంతర నర! భగవజ్జ్యోతిరానంద సింధుమ్**
**సంప్రాప్య ప్రేమసారోజ్వల విమలరసాంభోధిమస్యైవ దివ్య**
**ద్వీపేఽద్యాశ్చర్య వృందాటవి కురు లలితే ప్రాణమేవోపహారమ్ 88**

ఓ మానవా! మాయామయ సముద్రపు పారమునుదాటి, ఒకానొక అనిర్వచనీయమైన పరబ్రహ్మ చిజ్జ్యోతిని ఆస్వాదించు. తరువాత, భగవజ్జ్యోతి అనెడు ఆనంద సముద్రమును దాటు! ఈ భగవదానంద సముద్రమునందే

రమ్య, ఆశ్చర్య, శ్రీవిమల రససాగరాన్ని పొంది, అక్కడ ప్రాణాలను ఉపహారము (కానుక)గా సమర్పించు!

**స్థూలం సూక్ష్మం కారణం తత్తురీయం శ్రీవైకుంఠం కృష్ణపూర్యో వ్రజంచ**
**త్యక్త్వా సర్వానర్థ జాతార్థజాతం వృందారణ్యం పశ్య భావాగ్రదృష్ట్యా 89**

స్థూల, సూక్ష్మ, కారణ, తురీయ, శ్రీవైకుంఠధామములను; శ్రీకృష్ణుని పురములైన ద్వారక మధురాదులను, వ్రజలోకములను; ఇంకను సర్వానర్థ విషయములను త్యజించి భావప్రవణదృష్టితో శ్రీబృందావనాన్ని దర్శించు!

**శ్రీవందావన వాస విఘ్నజనకాన్యారుధ్యఖాన్యంతరే**
**పశ్యన్నావస శుద్ధచిద్రసఘనం తద్ధామ సమ్మోహనమ్**
**కాంక్షన్ నిత్యమిహైవ మంక్షు వపుషః పాతం మహామంగళమ్**
**దూరే భోగకథా ప్రయత్నమపి చ ప్రాణస్థితౌ సంత్యజన్ 90**

శ్రీబృందావనంలో విఘ్నాలు కలిగించే ఇంద్రియాలను ఆంతర్యంలో నిరోధిస్తూ, ఈ సమ్మోహనకరధామపు శుద్ధ చిద్రసఘన వివేచనను చేస్తూ, ఇక్కడ మహామంగళకారియైన మృత్యువునకై వ్యాకులమైన ప్రాణాలతో నిత్యమూ కాంక్షిస్తూ, ప్రాణ రక్షణకై నిమిత్తమాత్రపు ప్రయత్నాలను కూడ త్యజించి, ఈ శ్రీబృందావనంలో సమ్యక్ రూపంతో నివసించు!

**దివ్యానంతస్ఫుటిత కుసుమామోద మత్తాలిమాలా**
**ఝుంకారేణ ప్రతిపద మహానంద మాధ్వీకవృష్ట్యా**
**ఉడ్డీయానైర్దిశి దిశి మహారమ్యరాగైః పరాగై**
**ర్వృందే వృందావిపిన ఉదితం దివ్యశాఖీంద్రవృందమ్ 91**

దివ్యాతి దివ్యమైన, అనంతముగా ప్రస్ఫుటితమైన పుష్పముల సుగంధముతోను; మత్తభ్రమరముల ఝుంకారముతోను; అణువణువునను వర్షిస్తున్న

మహానంద సుధారసముతోను; దశదిశలలోను వ్యాపిస్తున్న మహారమణీయ పరాగముతోను అత్యంతముగ శోభిస్తున్న శ్రీబృందావన దివ్య వృక్షరాజములకు నేను నమస్కరిస్తున్నాను.

**దివ్యానంతాద్భుత తమ మహారమ్య జాతి ద్రువల్లీః**
**దివ్యాశేషర్త్వనుగమ మహాసత్ఫలోరు ప్రసూనాః**
**రాధాకృష్ణ ప్రణయ పరమాశ్చిద్ఘనాః కామరూపా**
**వృందారణ్యే సకల పురుషార్థాత్యుదారాః స్మరామి 92**

దివ్యము, అనంతము, మహారమణీయము, అనేక ప్రకారములునైన అచటి వృక్షలతా సమూహములు దివ్యములైన సమస్త ఋతువులలోను అత్యుత్తమ మహాఫలములను, అనేక పుష్పములను అనుగ్రహిస్తాయి. అవి శ్రీరాధాకృష్ణులకు ప్రధానముగా ప్రీతిపాత్రములు! చిద్ఘన రూపములైన ఆ వృక్షలతాదులు తమ ఇచ్ఛననుసరించి కామరూపధారణ చేస్తాయి. సమస్త పురుషార్థములను ఉదారముగా దానము చేయగల అట్టి శ్రీబృందావన వృక్షవల్లీ సమూహములను స్మరిస్తున్నాను.

**నానారత్నమయైర్విలక్షణ ఫలైర్నానా ప్రసూనోద్గమైః**
**నానాపల్లవ పత్ర గుచ్ఛ కలికా వృందాదిభిః సుందరైః**
**నానాశ్చర్య విసారి సౌరభ భరైరానంద ఖేలారుతైః**
**నానాశ్చర్యఖగైర్మనో మమ హృతం వృందాటవీ శాఖిభిః 93**

శ్రీబృందావన వృక్షరాజములు అనేక ప్రకారములైన విలక్షణ ఫలములతోను, నానావిధ పుష్పముల వికాసముతోను, నానావిధములైన సుందర పల్లవగుచ్ఛములతోను, మొగ్గలతోను శోభిస్తున్నవి. ఇంకను నానా ప్రకారములుగా ఆశ్చర్యకరముగా ఇటునటు ప్రసరిస్తున్న సౌరభముతోను, ఆనందముచే క్రీడామత్తమై

కోలాహలధ్వనులు చేస్తున్న నానావిధ ఆశ్చర్యమయ పక్షిసమూహములతోను వెలుగొందుతున్నవి. అట్టి బృందావన వృక్షరాజములు నా మనసును హరిస్తున్నవి.

**నానారత్నమయోరు శాఖిరుచిరై ర్నానామణి పక్షిభిః**
**నానారత్నమయ ప్రసూన నిచయై రత్నామృతాంగైః ఫలైః**
**నానారత్న సుధామరందలహరీ నిస్స్యందిభిః శాఖిభిః**
**నానారత్నమయ స్థలీషు లసితైర్దేదీప్తి వృందావనమ్ 94**

అనేక విధ రత్నమయ వృక్షములతో శోభిస్తూ, నానా మణిమయ పక్షులతో భూషితమై, నానా విధరత్నమయ పుష్పాలతో అలంకృతమై, అనేక రత్నమయ అమృత ఫలాలతో ఉల్లసితమై; నానారత్నమయ సుధాతరంగములను వర్షించు నానావిధ వృక్షములతోను, నానారత్నమయ ప్రదేశములతోను శోభితమైన శ్రీబృందావనము దేదీప్యమానముగ వెలుగుచున్నది.

**సఖి! తరుణ తమాలః కశ్చిదస్మిన్నికుంజే**
**వరకనకలతావత్ కౌతుకాత్ పర్యరంభి**
**అహహ స తు బలాన్మే పశ్య నాకారి కింవా**
**కథమివ కుటిలా మే ప్రత్యయం యాంతు సఖ్యః ? 95**

హే సఖీ! ఈ నికుంజలో ఏదో ఒక తరుణ తమాల వృక్షము నాకంటె శ్రేష్ఠమైన కనకలత వలె కౌగిలించుకొనగలదా! ఓహో! చూడు! వాడు నాకు ఏమి చేయలేదు ? (అంటే అన్నీ చేశాడని అర్థం). కానీ నా కుటిలసఖి ఈ సందర్భములో ఎలా విశ్వసిస్తుంది ?

ఈ శ్లోకం నుండి 99వ శ్లోకం వరకు ప్రణయిని శ్రీరాధ తనకు, శ్యామసుందరునకు నడుమగల దివ్యప్రణయమును పరోక్షరీతిలో ప్రస్తావించుచున్నది.

**అన్యానన్యాన్ కేశబంధ ప్రకారాన్ అన్యానన్యాన్ పత్రభంగీ విభేదాన్**
**అన్యా అన్యా మాల్యవస్త్రాది భూషాః కుర్వన్నాస్తే రాత్ర్యహస్త్వత్ సఖా మే 96**

నీసఖుడు దివ్యరాత్రియందు బహువిథములుగా నాకు కేశబంధనాదికము చేస్తాడు. బహువిథములైన పత్రభంగీ రచన చేస్తాడు. అనేక ప్రకారములైన భావాలతో మాల్య, వస్త్రాది భూషా రచన చేయలేదా ఏమి ? (చేశాడని అర్థం).

**నిత్యం సమ్ముఖ సమ్ముఖం ముఖవిధుం ధత్తేఽనిమిషేక్షణో**
**నిత్యం సన్ముఖమేవ పశ్యతి మయైవాజస్ర గోష్ఠీ పరః**
**ఆద్యాయైవ శయీత మాం హృది మయైవా వర్తయేత్ పార్శ్వకమ్**
**సఖ్యుస్తే సఖి సర్వనాగరమణేః ప్రీతిః కథం వర్ణ్యతామ్ 97**

అతడు నిత్యము నా ముఖ సమ్ముఖములో తన ముఖచంద్రుని నిల్పి, అనిమిషముగా (కన్నులనార్పక) చూస్తూ ఉంటాడు. నిత్యము కేవలము నాతోనే అనంతమైన ఇష్టాగోష్ఠి చేస్తూ ఉంటాడు. నా హృదయముపై శయినిస్తాడు. హా సఖీ! సర్వ నాగరమణియైన నీ సఖుని ప్రీతిని ఏవిథముగా వర్ణింపగలను!

**ప్రియసఖీ! మమ వృత్తం పృచ్ఛ మా భాగ్యమీదృక్**
**క్వ ను మమ కథమేయం త్వయ్యహం తాన్ విలాసాన్**
**ధృతవతి కరమేవ శ్యామలే క్వాస కాహమ్**
**కిమివ చ కరకోఽసౌ కిం వృథాన్న స్మరామి 98**

హే ప్రియసఖీ! నా వృత్తాంతము ఏమిటి అని అడుగకు, హా! నా భాగ్యము ఇట్లున్నది! ఆతని అనంత విలాసాదుల కథను నీకు ఏమని, ఎలా చెప్పగలను ? శ్యామసుందరుడు కేవలము నా చేతిని పట్టుకున్నంత మాత్రం చేతనే నేను ఏమైపోతానో, ఎవరినో! (స్పర్శ మాత్రం చేత కలిగెడి వివశత్వమును రాధాజీ తెలుపుచున్నది). నాకు ఏదీ స్మృతిలో లేదు.

**వేణీం గుంఫతి దివ్యపుష్ప నిచయైః సీమంత సీమన్యహో!**
**సిందూరం నిదధాతి కజ్జలమయీం నిర్మాతి రేఖాం దృశోః**
**దివ్యం వాసయతే దుకూలమసకృత్తాంబూలమత్యాశయేత్**
**ఇత్థం భూతరతిః సఖా తవ న మాం తల్పే నిధత్తేంకతః 99**

అహో! నీ సఖుడు దివ్యపుష్పాలతో నాకు వేణీగుంథనం (కేశాలను ముడుచుట) చేస్తాడు. పాపిటిలో సిందూరం నిలుపుతాడు. కన్నులకు కాటుక రేఖలను తీర్చుతాడు. దివ్యాతి దివ్యమైన వస్త్రాలను ధరింపజేస్తాడు. పదే పదే తాంబూలాన్ని స్వీకరింపజేస్తాడు. ఈ విథంగా ప్రేమవివశుడైన అతడు నా ఒడిలో నుండి, శయ్యపై నుండి క్రిందికి దిగి వెళ్లడు.

**దూరే చైతన్యచరణాః కలిరావిరభూన్మహాన్**
**కృష్ణప్రేమా కథం ప్రాప్యో వినా వృందావనే రతిమ్ 100**

శ్రీకృష్ణ చైతన్య మహాప్రభువు దూరంగా వెళ్ళిపోయారు. (సిద్ధి పొందారు). మహాకలియుగం వచ్చేసింది. శ్రీబృందావన ప్రీతి లేకుండ కృష్ణప్రేమ ఎలా ప్రాప్తిస్తుంది ?

శ్రీసరస్వతీ పాదులు తమ గురుస్మరణతో ఈ శతకాన్ని సమాప్తం చేశారు.



శ్రీ రాధామహాలక్ష్మి అమ్మ

శ్రీరాధే

# శ్రీబృందావన మహిమ

రసైక స్వరూపులైన శ్రీరాధాగోవిందుల నిత్యలీలాస్థలి శ్రీమద్బృందావనము! రాధాజీకి రెండవ రూపముగ ప్రస్తుతింపబడుతున్న శ్రీధామము శ్రీలీలలన్నిటికి 'దివ్యవేదిక'! భూమిపై ప్రకటితమైన భౌమ బృందావనమును భావబృందావనమునకు 'ఛాయ'గా మహాత్ములు స్తుతించినారు.

భావబృందావనము, మనోబృందావనము, భౌమబృందావనము అని శ్రీధామము మూడంతస్థులుగ వెలుగుచున్నదని రసిక మహాత్ములు వక్కాణించినారు. భావరాజ్ఞియైన శ్రీరాధ ఈ మూడు అంతస్థులలోను కృష్ణ సహితయై ఆడుచు, తనకే అంకితమైన రసికజనులకు దర్శనానుభూతిని అనుగ్రహించుచున్నది, ఆటపాటలతో అలరించుచున్నది.

శ్రీప్రబోధానందసరస్వతీ ప్రణీతమైన "శ్రీబృందావన మహిమామృతము" అను ఈ దివ్య గ్రంథమునకు బృందావనేశ్వరియైన శ్రీరాధయే నాయిక! భూతల పుణ్యము పండి శ్రీశ్యామాశ్యాములు భువిపై అవతరించినారు. సహజ సంయోగాత్మకమైన వారి దివ్య శృంగారకేళి శ్రీబృందావన మహిమను అమృతమయము చేసినది. 'న సమ్యక్ త్రయీ మౌళీనామపి" – వేదత్రయ శిరోమణి కూడ తన్మహిమను సమ్యక్ప్రకారముగ ఎరుగలేదు.

**జయతు జయతు శ్రీబృందావనధామ్!**